ఈనాడు

కరీంనగర్ 16-2-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 187
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ముందే పరార్

జనవరిలోనే దేశం దాటేసిన నీరవ్ మోదీ

- హైదరాబాద్ సహా 17 చోట్ల ఈడీ సోదాలు
- రూ.5100 కోట్ల విలువైన ఆభరణాలు సీజ్

వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ... విదేశీ వాణిజ్యం పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంకుకు ఎకాఎకి రూ.11,400 కోట్ల మేర మోసగించిన తీరు పెను దుమారం రేపుతోంది. దిల్లీ, ముంబయి, హైదరాబాద్ సహా అనేక నగరాల్లో ఈడీ సోదాలు చేపట్టి బంగారం, వజ్రాభరణాలు, స్థిరాస్తులు సహా రూ.5000 కోట్ల మేర ఆస్తుల్ని జప్తు చేసింది. తొలి ఫిర్యాదు అందేలోగానే నీరవ్ దేశం నుంచి తప్పించుకొన్నారు. ఎన్నో తనిఖీ వ్యవస్థలు ఉండగా అనేక ఏళ్లుగా వాటి కళ్లుగప్పి ఇంత పెద్ద మోసానికి పాల్పడడమంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థ ప్రక్షాళనకు తాము చేపట్టిన చర్యల వల్లనే మోసం బయటపడిందని ప్రభుత్వం వాదిస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి మొత్తాన్ని పీఎన్‌బీ ఇతర బ్యాంకులకు చెల్లించి తీరాల్సిందేనని ఆర్‌బీఐ తేల్చిచెప్పింది. ఈ తరహా కుంభకోణాలు ఇతర బ్యాంకుల్లోనూ వెలుగు చూసే అవకాశం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు 2, 5 పేజీల్లో

మోసం గురూ!

దేశ బ్యాంకింగ్ రంగ పునాదుల్లో ప్రకంపనలు సృష్టించిన పీఎన్‌బీ కుంభకోణం రూ.11,400 కోట్లకు చేరే వరకూ పొక్కలేదుగానీ.. కేవలం ఇద్దరు ఉద్యోగులు ప్రధాన కంప్యూటర్ వ్యవస్థ కన్నుగప్పి.. ఓ చిన్న అంతరాన్ని దుర్వినియోగం చేయటమే దీనికి మూలమని తెలిస్తే అవాక్కవుతాం!

1 మొదలు 'ఎల్‌ఓయూ'తో!

వ్యాపారులు దేశదేశాల్లో తమ కొనుగోళ్లకు తేలికగా చెల్లింపులు చేసుకునేందుకు బ్యాంకులు 'లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్' పేరుతో భరోసా పత్రాలు ఇస్తాయి. ఇలా ఒక బ్యాంకు ఇచ్చిన ఈ పత్రాన్ని ఆధారంగా చేసుకుని.. ఇతర బ్యాంకులు, బ్రాంచిలు చెల్లింపులు చేసేస్తాయి. తర్వాత వారికి సదరు బ్యాంకు ఆ డబ్బును సర్దుబాటు చేస్తుంది.




నీరవ్ మోదీ తదితరుల కంపెనీలు ముంబయిలోని ఒక పీఎన్‌బీ బ్రాంచి నుంచి ఇలా ఎల్‌ఓయూ పత్రాలు సంపాదించాయి.

2 కన్నుగప్పే కొనుగోళ్లు

విదేశాల్లో భారీగా ముడి వజ్రాలు, ముత్యాల కొనుగోళ్లు చేసి... పీఎన్‌బీ ఇచ్చిన ఆ ఎల్‌ఓయూ చూపించటం ద్వారా అక్కడి భారతీయ బ్యాంకులకు చెందిన 30 బ్రాంచీల నుంచి విక్రయదారులకు భారీగా చెల్లింపులు చేయించేశారు. ఈ తంతు 2011 నుంచే జరిగిపోతోంది!

3 అవి దొంగ ఎల్‌ఓయూలే!

సాధారణంగా బ్యాంకులు ఆయా కంపెనీల రుణ చెల్లింపు సామర్థ్యాన్ని ఆధారంగా చేసుకుని లేదా అంత మొత్తాన్నీ తమ వద్ద జమ చేయించుకుని.. అప్పుడు ఈ ఎల్‌ఓయూలు ఇస్తాయి. అయితే తాజా కుంభకోణంలో పీఎన్‌బీ ఉద్యోగులు అలాంటి జాగ్రత్తలేమీ లేకుండానే ఎల్‌ఓయూలు జారీ చేసేశారు.



4 వ్యవస్థను దారి తప్పించారు

బ్యాంకుకు సంబంధించిన ప్రతి లావాదేవీ 'కోర్ బ్యాంకింగ్ సిస్టమ్' ద్వారానే జరుగుతుంది. కానీ పీఎన్‌బీ సిబ్బంది దాని కన్నుగప్పి.. కేవలం కోడ్‌ల ఆధారంగా లావాదేవీలు పూర్తిచేసే 'స్విఫ్ట్' నెట్‌వర్క్‌ను దుర్వినియోగం చేస్తూ చెల్లింపులు చేసేశారు. దీంతో ఈ లావాదేవీలు అసలు బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికే రాలేదు.


మొత్తం కుంభకోణం **11,400** కోట్లు



డగ్లస్ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

అమెరికాలో గర్జించిన ఉన్మాదం

- పాఠశాలలో కాల్పులు జరిపిన మాజీ విద్యార్థి
- 17 మంది దుర్మరణం
- భారత సంతతి విద్యార్థి సహా 15 మందికి గాయాలు



కాల్పులు జరిపిన నిందితుడు నికోలస్ క్రూజ్

అమెరికాలో ఉన్మాద తుపాకీ మరోసారి గర్జించింది. ఫ్లోరిడా రాష్ట్రంలోని ఒక పాఠశాల నుంచి ఉద్వాసనకు గురైన ఒక మాజీ విద్యార్థి.. సెమీ ఆటోమేటిక్ అసాల్ట్ తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపి, 17 మందిని బలితీసుకున్నాడు. ఈ పైశాచిక చర్యలో దాదాపు 15 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భారత సంతతికి చెందిన ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. 15లో

అవే వాదనలు

- నదీ బోర్డుల పరిధి నిర్ణయంపై ఏపీ పట్టు
- వాటా తేలకుండా ఒప్పుకోబోం..
- నాలుగు రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకోవాలి: తెలంగాణ
- పరిధి గుర్తించాల్సిన అవసరముందన్న కేంద్ర జలవనరులశాఖ
- దిల్లీలో పలు అంశాలపై చర్చ
- అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి యోచన



ఈనాడు–హైదరాబాద్, దిల్లీ

కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్ణయించడంపై కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ నిర్వహించిన సమావేశంలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తమ పరిధేంటో తెలియకుండా బోర్డులు సమర్థంగా పని చేయడం సాధ్యంకాదని కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ, పరిధిని నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, కృష్ణాలో తమ వాటా ఎంతో తేలకుండా, ప్రాజెక్టుల వారీ కేటాయింపులు లేకుండా బోర్డుల పరిధిని గుర్తించడానికి అంగీకరించబోమని తెలంగాణ స్పష్టం చేసింది. బోర్డు పరిధిని గుర్తించాల్సిన అవసరముందని కేంద్రజలవనరుల శాఖ కార్యదర్శి స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనికి తాము అంగీకరించబోమని, పరిధిని (మిగతా 2లో)



గురువారం దిల్లీలో కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీని కలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్

ఎయిమ్స్‌కు నిధులిస్తాం

- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ హామీ
- వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలని సీఎం విజ్ఞప్తి
- నేడు రాజ్‌నాథ్‌తో భేటీ
- ఖరారుకాని ప్రధాని అపాయింట్‌మెంట్

ఈనాడు – దిల్లీ

తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుకు నిధులిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణలో ఎయిమ్స్ ఆవశ్యకత గురించి గురువారం కేంద్రమంత్రికి కేసీఆర్ వివరించారు. రాష్ట్రానికి ఎయిమ్స్, ఐఐఎంలను మంజూరు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేశారు. స్మృతి ఇరానీ మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఐఐఎం విషయమై హామీ ఇచ్చారనీ, వెంటనే దానిని మంజూరు చేయాలని కోరారు. తెలంగాణలోని పాత తొమ్మిది జిల్లాలను వెనుకబడినవిగా గుర్తించి.. 2014-15లో రూ.450 కోట్లు; 2015-16లో రూ.450 కోట్లు; 2016-17లో రూ.450 కోట్లు విడుదలచేశారనీ... 2017-18కి సంబంధించిన రూ.450 కోట్లను ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రాన్ని అందజేసి, త్వరగా నిధులను విడుదల చేయాలని కోరారు. తెరాస లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులతో కలిసి జైట్లీతో కేసీఆర్ భేటీ అయ్యారు. అనంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ- తెలంగాణలో పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు ప్రవేశపెట్టిన పథకాలను జైట్లీ అభినందించారన్నారు. ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని 3.5% కొనసాగించాలని ఆయనను కోరినట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం కేసీఆర్ భేటీ కానున్నట్లు సమాచారం. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని తెరాస వర్గాలు పేర్కొన్నాయి.

మీ అభిమానినయ్యా: అరవింద్ సుబ్రహ్మణ్యం: కేంద్ర మంత్రి జైట్లీ దగ్గరకు వెళ్తున్న సమయంలో సీఎం కేసీఆర్‌కు కేంద్ర ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం (మిగతా 2లో)

అభినందనలేనా.. ఆర్థికసాయమేదీ?

- 11 ప్రాజెక్టులకు రూ.వేయి కోట్లు ఇవ్వండి
- దేవాదులకు రూ.450 కోట్లు, బీమాకు రూ.35 కోట్లు ఇవ్వాలి
- పీఎంకేఎస్‌వై సమావేశంలో మంత్రి హరీశ్‌రావు - 6లో

నరబలే

క్యాబ్‌డ్రైవర్ రాజశేఖర్ దంపతుల ఘాతుకం

- సికింద్రాబాద్ బోయిగూడలో శిశువు అపహరణ
- మూసీలో మొండెం పడేసి తలతో క్షుద్రపూజలు
- డీఎన్ఏ నివేదిక ఆధారంగా వీడిన చిక్కుముడి



గతనెల 31న మాఘ పౌర్ణమి.. సంపూర్ణ చంద్ర గ్రహణం.. ఆరోజున చందమామ ప్రత్యేకంగా కనిపిస్తుందని.. ఒకేనెలలో వస్తున్న రెండో పౌర్ణమి కావడంతో 'బ్లూ మూన్' అంటారని, సాధారణంగా కంటే పెద్దగా కనిపించనున్నందున 'బ్లడ్ మూన్' అని పిలుస్తారని, ఇలాంటి ఖగోళ అద్భుతం 150 ఏళ్లకు ఒకసారి మాత్రమే ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు తేల్చడంతో ఎంతోమంది ఔత్సాహికులు దానిని చూడడానికి సన్నాహాలు చేసుకున్నారు. హైదరాబాద్ చిలుకానగర్‌లోని ఓ కిరాతకుడు మాత్రం తన మూఢ నమ్మకాలతో ఆ రాత్రిని నరబలికి ముహూర్తంగా పెట్టుకున్నాడు. అమ్మ పక్కలో పడుకున్న ఓ పసిగుడ్డును ఎత్తుకొచ్చి కిరాతకంగా తల నరికేశాడు.. నగరంలో సంచలనం సృష్టించిన ఈ సంఘటన పోలీసు దర్యాప్తుతో కొలిక్కి వచ్చింది.

- పూర్తి వివరాలు 2లో

ఇదీ సంగతి!



భారత్‌తో శతాబ్దాల అనుబంధం



రౌహానీకు స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి ఆర్పీ సింగ్. గవర్నర్ నరసింహన్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ

- హైదరాబాద్‌కు రావడం ఆనందంగా ఉంది
- ఇరాన్ అధ్యక్షుడు రౌహానీ

ఈనాడు, హైదరాబాద్: భారత్‌తో ఇరాన్‌కు శతాబ్దాల అనుబంధం ఉందని ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహానీ అన్నారు. భారత్ సహా ఇరుగుపొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగాలని ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఇరాన్ విప్లవంపై తమ దేశంలో ఉత్సవాలు జరుగుతున్న తరుణంలో భారత్, హైదరాబాద్‌ను సందర్శించడం ఎంతో (మిగతా 2లో)



విద్యుత్‌సౌధలో జరిగిన మహాధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

ఆంధ్రా ఉద్యోగుల్ని తీసుకోవద్దు

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా - 6లో

నేపాల్ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న ఓలీ



కాఠ్‌మాండూ: నేపాల్ ప్రధాన మంత్రి పదవిని కేపీ శర్మ ఓలీ రెండోసారి అధిష్ఠించారు. కాఠ్‌మాండూలోని రాష్ట్రపతి కార్యాలయంలో గురువారం ఓలీ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. రాష్ట్రపతి విద్యాదేవీ భండారీ ఆయనతో ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన చారిత్రక పార్లమెంటు ఎన్నికల్లో వామపక్ష కూటమి ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఓలీ నేతృత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(సీపీఎన్)-యూఎంఎల్, ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్-మావోయిస్టు సెంటర్ ఈ కూటమికి నేతృత్వం వహించాయి. ఓలీ ప్రమాణ స్వీకారానికి ముందు ప్రధాని పదవికి నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు శేర్‌బహాదుర్ రాజీనామా సమర్పించారు.

దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్ రమఫోసా ఎన్నిక

రాజీనామా చేసిన జాకబ్ జూమా



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్ రమఫోసా ఎన్నికయ్యారు. తీవ్ర రాజకీయ ఒత్తిళ్ల మధ్య జాకబ్ జూమా ఈ పదవికి బుధవారం రాత్రి రాజీనామా సమర్పించారు. దీంతో జాతీయ అసెంబ్లీలో గురువారం అధ్యక్ష ఎన్నిక జరిగింది. పార్లమెంటులో భారీ మెజార్టీ కలిగిన అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ.. రమఫోసాను పదవికి నామినేట్ చేసింది. వేరే అభ్యర్థులెవరూ లేకపోవడంతో.. ఎన్నిక ఏకగ్రీవంగానే జరిగింది. రమఫోసా మాజీ బడా వ్యాపారవేత్త. ఇటు ప్రతిపక్ష ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ సభ్యులు నిరసనగా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దేశ ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం కల్పించినందుకు కృతజ్ఞుడినై ఉంటానని ఎన్నిక అనంతరం రమఫోసా వ్యాఖ్యానించారు. ఏఎన్‌సీ నాయకత్వ ఒత్తిడికి తలొగ్గి రాజీనామా చేసిన జూమా.. పార్టీ నిర్ణయాన్ని మాత్రం తప్పుపట్టారు. తొమ్మిదేళ్లు అధ్యక్ష పదవిలో కొనసాగిన ఆయన.. బుధవారం టీవీ ప్రసంగంలో తన రాజీనామా ప్రకటనను చేశారు. ఇటు పార్టీకి తన సేవలు కొనసాగిస్తానని పేర్కొన్నారు. ప్రలోభాలకు గురై కొందరిని కీలక పదవుల్లో నియమించినట్లు, రూ.వేల కోట్ల అవినీతికి కారణమైనట్లు జూమా ఆరోపణలు ఎదుర్కొన్నారు. భారత నేపథ్యమున్న వివాదాస్పద గుప్తా సోదరులతో ఆయనకు సంబంధాలున్నాయని.. ప్రభుత్వాన్ని గుప్తా సోదరులు గుప్పిట్లోకి తీసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపణలున్నాయి. గుప్తా కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

జనవరిలోనే దేశం దాటేసిన నీరవ్ మోదీ

- సోదరుడు, భార్య, భాగస్వామితో కలిసి స్విట్జర్లాండ్‌కు పలాయనం!
- దావోస్ సదస్సులో ప్రధానితో కలిసి ఫోటో
- అనతికాలంలోనే కుబేరుడిగా ఎదిగిన వ్యాపారి
- ఎందరో ప్రముఖులు అతని ఖాతాదారులే
- హైదరాబాద్ సహా 17 చోట్ల ఈడీ సోదాలు
- రూ.5100 కోట్ల విలువైన ఆభరణాలు సీజ్
- పాస్‌పోర్టు రద్దు చేయాలని సిఫార్సు





దిల్లీలోని డిఫెన్స్‌కాలనీలో నీరవ్ మోదీకి చెందిన నగల దుకాణం ★ నీరవ్ మోదీ

దిల్లీ, ముంబయి: బ్యాంకును భారీస్థాయిలో మోసగించినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి, ఫోర్బ్స్ జాబితా కుబేరుడు నీరవ్ మోదీ ఈ ఏడాది జనవరి ఒకటో తేదీనే దేశం నుంచి జారుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో మొదట వెలుగు చూసిన రూ.280 కోట్ల మోసంపై జనవరి 29న సంబంధిత అధికారులు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి ఫిర్యాదు చేశారు. నీరవ్, అతని సోదరుడు నిశాల్ (బెల్జియం పౌరుడు) సరిగ్గా నూతన సంవత్సరం రోజునే విదేశాలకు వెళ్లిపోయారు. మోదీ భార్య అమీ (అమెరికా పౌరురాలు) జనవరి 6న, వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీ (గీతాంజలి ఆభరణ దుకాణాల భారతీయ భాగస్వామి) అదే నెల 4న వెళ్లిపోయారు. మొదటి ఎఫ్ఐఆర్ జనవరి 29న నమోదయ్యాక ఈ నలుగురిపైనా 'లుక్ అవుట్' సర్క్యులర్ జారీ అయింది. అప్పటికే వీరంతా దేశం దాటేశారు. నీరవ్ ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. జనవరి 23న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు (దావోస్)లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు బృంద చిత్రం దిగినవారిలో ఈ వ్యాపారి కూడా ఉండడం విశేషం.

ముంబయి, సూరత్, దిల్లీల్లో పత్రాల అన్వేషణ

నీరవ్ మోదీ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వర్గాలు గురువారం సోదాలు నిర్వహించి రూ.5,100 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, విలువైన రాళ్లు, స్థిరాస్తుల్ని సీజ్ చేశాయి. దిల్లీ, ముంబాయి, సూరత్, హైదరాబాద్‌ల్లోనూ కలిపి 17 స్థావరాలపై ఏకకాలంలో దాడులు చేసి, కొన్ని కీలక రికార్డులను, కంప్యూటర్లను ఈడీ స్వాధీనం చేసుకొంది. రూ.3.9 కోట్ల విలువైన ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను స్తంభింపజేసింది. తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఈడీ వెల్లడించింది. తెల్లవారుజాము నుంచే సోదాల ప్రక్రియ మొదలయింది. కుర్లాలోని నీరవ్ నివాసం, కాలా ఘోడా ప్రాంతంలోని ఆభరణాల దుకాణం, కంపెనీకి చెందిన మూడు ప్రాంగణాలు, సూరత్‌లోని కార్యాలయాలు, దిల్లీలోని షోరూంలలో సోదాలు నిర్వహించారు. నీరవ్‌తో పాటు అతని సోదరుడు నిశాల్, భార్య అమీ, వ్యాపార భాగస్వామి మెహుల్ చినూభాయ్ ఛోక్సీ, పీఎన్‌బీ విశ్రాంత అధికారి గోకుల్‌నాథ్ శెట్టి, ప్రస్తుత అధికారి మనోజ్‌కారాట్ తదితరుల నివాసాల్లోనూ ఈడీ సోదాలు జరిపింది. ఈ నెల మొదటివారంలో సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా 'అక్రమ నగదు చలామణీ నిరోధక చట్టం' (పీఎంఎల్ఏ) కింద ఈడీ కేసు నమోదు చేసింది. పీఎన్‌బీ ఇచ్చిన ఫిర్యాదునూ పరిశీలించింది. బ్యాంకును మోసగించి పొందిన డబ్బుతో అక్రమాస్తుల్ని, నల్లధనాన్ని కూడబెట్టారా అనేది ఈడీ శోధిస్తుంది. నీరవ్‌మోదీ, మరో ఆభరణాల కంపెనీ కలిసి రూ.11,400 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు పీఎన్‌బీ బుధవారం మరో రెండు ఫిర్యాదులు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదులను ఇలా ఎందుకు విభజించారనేదీ ఇప్పుడు ఆరా తీస్తున్నారు. మొదటి ఫిర్యాదుకే వీటిని జత చేయాలా, కొత్త కేసులు నమోదు చేయాలా అనేది పరిశీలిస్తున్నారు.

150 తప్పుడు ఎల్‌వోయూల జాబితా సీబీఐకి అందజేత

మోదీ తమను ఏయే 'లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్' (ఎల్‌వోయూ)ల ద్వారా మోసగించాడో తెలిపే జాబితాను పంజాబ్ నేషనల్ బ్యాంక్ వర్గాలు గురువారం సీబీఐకి అందజేశాయి. తమ అధికారుల సహకారంతోనే ఇదంతా జరిగిందని తెలిపాయి. దిగుమతులకు సంబంధించిన కొన్ని పత్రాలను నిందిత కంపెనీలు జనవరి 16న తీసుకువచ్చి, విదేశాల్లోని సరఫరాదారులకు చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఎల్‌వోయూలు జారీ చేయాల్సిందిగా కోరినప్పుడు బ్యాంకుకు మొదటిసారిగా అనుమానం వచ్చింది. ఎంత వెతికినా కంప్యూటర్ వ్యవస్థలో ఇలాంటి వివరాలు అంతకుముందు నమోదైన దాఖలాలే కనిపించలేదని ఎఫ్ఐఆర్ పేర్కొంది. దీంతో ఆ నెల 29న సీబీఐకి ఫిర్యాదు చేసి, రూ.280 కోట్ల అవకతవకలు జరిగినట్లు తెలిపింది. నీరవ్, ఛోక్సీల పాస్‌పోర్టులను రద్దు చేయాల్సిందిగా విదేశీ వ్యవహారాల శాఖకు సీబీఐ, ఈడీ వేర్వేరుగా సిఫార్సు చేశాయి. గత నెలలో జరిగిన సోదాల్లో పట్టుబడిన పత్రాలను తమతో పంచుకోవాల్సిందిగా ఆదాయపు పన్ను శాఖకూ ఈడీ లేఖ రాసింది.

ఎవరీ నీరవ్ మోదీ?

2013 నుంచి భారత్‌లో సంపన్న వ్యక్తుల్లో ఒకనిగా వినిపిస్తున్న పేరు వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ... ఈయన భారతీయ పౌరుడే అయినా భార్య, సోదరుడు మాత్రం విదేశాల్లో పౌరసత్వం తీసుకున్నారు. నీరవ్ పేరు- ఖరీదైన ఆభరణాల కొనుగోలుదారులకు చిరపరిచితం. లండన్, న్యూయార్క్, ముంబయిల్లో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో సొంత షోరూంలు ఇతనికి ఉన్నాయి. 2013లో ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో స్థానం లభించాక అతనిపై అనేక సంస్థల దృష్టి పడింది. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ అతని కార్యకలాపాలపై కన్నువేశాయి. ఒక సందర్భంలో రెవెన్యూ నిఘా డైరెక్టరేట్ సయితం అతన్ని పిలిపించి విచారించింది. ఎగుమతి, దిగుమతుల నిబంధనల్ని ఉల్లంఘించినట్లు అభియోగం మోపింది. పీఎన్‌బీ వ్యవహారంలో గత నెలలో ఒకటి, తాజాగా మరొకటి చొప్పున కేసులు దాఖలయ్యాయి. వీటిపై నీరవ్ స్పందన తెలియరాలేదు. మోదీ భారత్‌లోనే పుట్టినా బెల్జియంలో పెరిగాడు. నిజానికి సంగీత రంగంలో రాణించాలనేది అతని ఆశయం. ఆ రంగంపై ఎంతో అనురక్తి ఉన్నా మేనమామతో కలిసి వజ్రాల వ్యాపారంలో అడుగుపెట్టాడు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం చదువును మధ్యలోనే వదిలేసి ఆభరణాల అమ్మకాలు చేపట్టాడు. గీతాంజలి జ్యుయెల్లర్స్‌లో తొమ్మిదేళ్లు పనిచేశాక సొంత వ్యాపారం చేపట్టాడు. ఒక స్నేహితురాలికి చెవిపోగులు రూపొందించాక ఇక వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఏడాదిలోనే గోల్కొండ వజ్రాభరణ వేలం (క్రిస్టీ)లో పాల్గొని అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. హాలీవుడ్ నటి కేట్ విన్‌స్లెట్ (టైటానిక్ కథానాయిక) నుంచి అనేకమంది ఇతని వద్ద ఖాతాదారులే. ప్రముఖ వ్యాపారవేత్తల కుటుంబాలు అతనివద్దనే వజ్రాలు కొంటుంటాయి. ఈ వ్యాపారికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పఠనం ఇతని అభిరుచి. రోజూ డజను వరకు అంతర్జాతీయ పత్రికలతోపాటు ఇతర పుస్తకాలు, సాహిత్యం, కవిత్వం చదువుతుండడం తనకు అలవాటు అని గతంలో ఒక ముఖాముఖిలో వెల్లడించాడు. ప్రయాణాలన్నా మహా సరదా.

బాధ్యులందరిపైనా చర్యలు

పీఎన్‌బీ సీఎండీ

2011 నుంచి తమ బ్యాంకును మోసగించిన కేసులో బాధ్యులందరిపైనా చర్యలు తప్పవని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఎండీ సునీల్ మెహతా స్పష్టం చేశారు. గురువారం దిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.11,400 కోట్లను తిరిగి చెల్లించడంపై నీరవ్ స్పష్టమైన హామీలేవీ ఇవ్వలేదనీ, అస్పష్టంగా వచ్చిన కొన్ని ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయనీ చెప్పారు. నిందితుడు వ్యక్తిగతంగా బ్యాంకుకు రాలేదనీ, స్వయంగా వచ్చి చెల్లింపులు ఎలా చేసేదీ రాతపూర్వక ప్రణాళిక ఇవ్వాల్సిందిగా సూచించామనీ తెలిపారు. మొత్తాన్ని ఎలా రాబడతారనే ప్రశ్నకు సమాధానమిస్తూ... ఆస్తుల్ని స్తంభిపజేసే పనిలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఉందని చెప్పారు. మొత్తం వ్యవస్థను పునఃసమీక్షిస్తున్నట్లు తెలిపారు. లోపాలు బయటపడితే వాటిని సరిచేసుకుంటామన్నారు. ఒక్క శాఖలోనే అవ్యవహారం చోటు చేసుకొందనీ, ఇతర శాఖలన్నింటి లావాదేవీల్నీ పరిశీలించామనీ చెప్పారు. 'ప్రభుత్వం రోజువారీ ప్రాతిపదికన విషయాన్ని పరిశీలిస్తోంది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. ఆర్‌బీఐ నుంచి మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ఒకవేళ వారేమైనా ఆదేశాలిస్తే వాటిని పాటిస్తాం. ఒక బాధ్యతాయుతమైన బ్యాంకుగా పరిశుద్ధమైన బ్యాంకింగ్ సేవల్ని అందించేందుకు కట్టుబడి ఉన్నాం' అని వివరించారు. 2011లో మొదలైన మోసాన్ని తమంత తాముగానే గుర్తించి బయటపెట్టామని గుర్తుచేశారు.

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌తో శతాబ్దాల అనుబంధం

సంతోషంగా ఉందన్నారు. ఇస్లాం హింసను ప్రేరేపించే మతం కాదని.. అది శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వాలకు చిహ్నమన్నారు. మూడు రోజుల భారత పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం 21 మంది ప్రతినిధుల బృందంతో హైదరాబాద్ వచ్చిన ఆయనకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ నరసింహన్ ,కేంద్ర మంత్రి ఆర్.పి.సింగ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి అదర్ సిన్హా తదితరులు స్వాగతం పలికారు. రాత్రి ఆయన ముస్లిం ప్రముఖులు, ఉలేమాలు, విద్యావేత్తలతో సమావేశమయ్యారు. 'భారత్, ఇరాన్‌ల మధ్య శతాబ్దాలుగా చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలున్నాయి. ఎంతో మంది ఇరానీయులు భారత్, హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఇందులో గొప్ప కవులు, విద్యావేత్తలు, హస్తకళాకారులున్నారు. భారతీయులు, ఇరానీయుల మధ్య స్నేహ సంబంధాల కారణంగా భారతీయ సంస్కృతి మరింత సుసంపన్నమైంది. ఇరాన్ దేశం మహ్మద్ ప్రవక్త బోధనల అమలుతో పాటు పవిత్ర ఖురాన్ నిర్దేశించిన లక్ష్యాల సాధనను ప్రోత్సహిస్తున్న దేశం. మా దేశంలో విప్లవానికి ఇదే దోహదపడింది. అన్ని వర్గాలకు చెందిన ముస్లింలు తమ మధ్య విభేదాలను మాని ఒక్కటి కావాలన్నదే మా విధానం. షియాలు, సున్నీలు పరస్పరం సోదరులని మేం నమ్ముతున్నాం. ముస్లింలు మహ్మద్ ప్రవక్త బోధనలను ప్రపంచమంతా చాటాలి'అన్నారు. ఈ సమావేశంలో జామే నిజామియా ఉపకులపతి ముఫ్తిఖలీల్ అహ్మద్, మహదీపూర్ తదితర ప్రముఖులు మాట్లాడారు. సమావేశంలో శాసనమండలి విపక్ష నేత షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఇతర ప్రముఖులు, హైదరాబాద్‌తో పాటు బెంగులూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చిన షియా, సున్నీ ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు ప్రతి ఒక్కరితో కరచాలనం చేస్తూ అభినందనలు తెలిపారు. అంతకు ముందు ఆయన రాక సందర్భంగా బేగంపేట విమానాశ్రయం నుంచి తాజ్ కృష్ణా వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బేగంపేట-సికింద్రాబాద్ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది.

నేడు ఐక్యతపై ప్రసంగం: ఇరాన్ అధ్యక్షుడు తన హైదరాబాద్ పర్యటనలో రెండోరోజైన శుక్రవారం నగరంలోని కుతుబ్‌షాహీ సమాధులను సందర్శించి, మధ్యాహ్నం మక్కామసీదులో నమాజు చేస్తారు. సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి దిల్లీ వెళ్తారు. స్వాతంత్ర్యానంతరం మక్కామసీదును సందర్శించనున్న తొలి విదేశీ దేశాధినేత హసన్ రోహానీయే. మసీదులో ఆయనకు ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్వాగతం పలుకుతారు. మసీదులో 'ఐక్యత' అంశంపై ఇరాన్ అధికారిక భాష పర్షియన్‌లో సుమారు ఏడువేల మందినుద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. ఆయన ప్రసంగాన్ని ఉర్దూలో అనువదిస్తారు. కుతుబ్‌షాహీల కాలం నుంచి కూడా ఇరాన్‌తో హైదరాబాద్‌కు మంచి సంబంధాలున్నాయి. అందుకే ఇరాన్ తన కాన్సులేట్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది.

(మొదటి పేజీ తరువాయి)

అవే వాదనలు

గుర్తించాల్సి వస్తే బేసిన్‌లోని నాలుగు రాష్ట్రాలకు కలిపి చేయాలి తప్ప ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు మాత్రమే కాదని తెలంగాణ తరపున పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి పేర్కొన్నట్లు తెలిసింది. అపెక్స్ కౌన్సిల్ నిర్వహించి తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్యబోర్డుల పరిధిలోని సమస్యలపై గురువారం దిల్లీలో ప్రత్యేకంగా సమావేశం జరిగింది. జలవనరుల మంత్రిత్వశాఖ, జలసంఘం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ, కృష్ణా, గోదావరి బోర్డుల అధికారులు పాల్గొన్నారు. అంశాల వారీగా చర్చించారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం..

- బోర్డు పరిధి నిర్ణయించడంపై జలవనరుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి కుందూ మాట్లాడుతూ బచావత్ ట్రైబ్యునల్ మూడు రాష్ట్రాలకు 2,130 టీఎంసీలను పంపిణీ చేసిందని.. తెలంగాణ 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు వినియోగించుకొనేలా ఏర్పాటు జరిగిందని వివరించారు. 2015-16 నుంచి 2017-18 వరకు ఇదే పద్ధతి కొనసాగుతుందని పేర్కొనగా, 2017-18లో చిన్న నీటి వనరులు మినహాయించి ఆంధ్రప్రదేశ్ 66 శాతం, తెలంగాణ 34 శాతం వినియోగించుకొనేలా నిర్ణయించామని సమావేశానికి ఆహ్వానితునిగా వచ్చిన కృష్ణా బోర్డు మాజీ ఛైర్మన్ శ్రీవాత్సవ తెలిపారు. చిన్ననీటివనరుల వినియోగానికి సంబంధించి తెలంగాణ ఇచ్చిన వివరాలతో ఆంధ్రప్రదేశ్ ఏకీభవించలేదని, రెండుసార్లు చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకొన్నామన్నారు.
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధన 87 ప్రకారం బోర్డుల పరిధి ఉండాలని కుందూ సమావేశం దృష్టికి తెచ్చారు. పరిధి లేకపోవడంతో సమర్థంగా పని చేయలేకపోతున్నాయని, బోర్డుల పరిశీలనకు పంపకుండానే రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నాయని, నీటి కేటాయింపులు, భూసేకరణకు సంబంధించి జలవనరుల మంత్రిత్వశాఖ, జలసంఘం, బోర్డులను ప్రతివాదులుగా పేర్కొంటూ కోర్టుల్లో కేసులు వేస్తున్నారని, పార్లమెంటులో ప్రశ్నలు వస్తుండటంతో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ కార్యదర్శి ఎస్.పి.సింగ్ మాట్లాడుతూ బోర్డు పరిధి అవసరమని.. భాక్రానంగల్ ప్రకారమా లేక నర్మదా బోర్డు ప్రకారమా అన్నది నిర్ణయించాల్సి ఉందన్నారు.

మూడేళ్లయినా చర్యలు లేవు: తెలంగాణ

తెలంగాణ ఏర్పడిందే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి కేటాయింపులో జరిగిన అన్యాయం వల్ల అని, నీటిలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి కృష్ణా జలవివాద ట్రైబ్యునల్-2కు పంపాలని జలవనరుల మంత్రిత్వశాఖను కోరి మూడేళ్లయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలంగాణ సీఎస్ జోషి పేర్కొన్నారు. ఇది జరగకుండా పరిధి గుర్తించడానికి ఒప్పుకోబోమని ఆయన స్పష్టం చేశారు. బజాజ్ కమిటీ ఏర్పాటు చేసినా నివేదిక ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు నీరు రావడం లేదని, ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు ద్వారానూ పక్కబేసిన్‌కు 300 టీఎంసీలు తరలిస్తుందని పేర్కొన్నారు.

బోర్డు ఆదేశాల అమలులో జాప్యం: ఏపీ

ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ బోర్డు జారీ చేసే ఆదేశాల అమలులో జాప్యం జరుగుతుందని, బోర్డు పరిధిని గుర్తించాల్సిందేనని కోరారు. సాగర్ కుడి కాలువకు నీటి విడుదల ఆదేశాలు అమలు కాకపోవడం, ఎడమకాలువ కింద సరిహద్దులో కోటా మేరకు రాకపోవడం, కృష్ణాడెల్టాకు నీటి విడుదలలో జాప్యం తదితర అంశాలను ప్రస్తావించారు.

డీపీఆర్‌లు ఇవ్వడం లేదు

- గోదావరి బోర్డు ఛైర్మన్ సాహు మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు డీపీఆర్‌లు ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఒరిజనల్ ప్రతిపాదనలో చాలా మార్పులు జరిగాయని, ప్రతిపాదన ఒకదానికి ఉంటే నిర్మాణం ఇంకో రకంగా జరుగుతుందని, నీటి వినియోగం, ఆయకట్టు కూడా ఇంతేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గోదావరి నుంచి ఇతర బేసిన్లకు 500 టీఎంసీలు మళ్లించాలని ప్రతిపాదించిందని, కానీ ఎలాంటి వివరాలు బోర్డుకు అందచేయలేదని పేర్కొన్నారు.
- డీపీఆర్‌లు ముందుగానే ఇస్తే జలసంఘం కూడా త్వరగా అనుమతులు ఇస్తుందని కేంద్రకార్యదర్శి ఎస్.పి.సింగ్ పేర్కొన్నారు. ట్రైబ్యునల్ అవార్డు ఇచ్చిన తర్వాత దానిని గుర్తించడానికి కోర్టు కేసుల కారణంగా కనీసం ఐదేళ్లు పడుతుందన్నారు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, చిన్న నీటివనరులకున్న కేటాయింపుల ఆధారంగా పనిచేయడానికి అయినా బోర్డు పరిధిని గుర్తించాల్సిన అవసరం ఉందని, పూర్తి స్థాయి ఇంజినీర్లతో బోర్డు పని చేయాలని, కొత్తప్రాజెక్టుల డీపీఆర్‌లను సీబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదించాల్సి ఉందని పేర్కొన్నారు.
- తాము పరిధిని గుర్తించడాన్ని వ్యతిరేకించడం లేదని, కృష్ణా బేసిన్‌లోని నాలుగురాష్ట్రాలకు చేయాలని, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వచ్చేలోగా రెండు రాష్ట్రాలకు చేస్తామంటే తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని జోషి స్పష్టంచేశారు. అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌లు రెండు రాష్ట్రాలు అందజేయాలని కేంద్రకార్యదర్శి ఎస్.పి.సింగ్ కోరగా, అన్ని ప్రాజెక్టులు పాతవేనని, డీపీఆర్‌లు అందజేయాల్సిన అవసరం లేదని తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ పేర్కొన్నారు. మంత్రిత్వశాఖ, జలసంఘం, కృష్ణా, గోదావరి బోర్డుల ప్రతినిధులు మాత్రం అంగీకరించలేదు. రాష్ట్రాలు డీపీఆర్‌లు అందజేయాలని, బోర్డులు పరిశీలించి సీడబ్ల్యూసీకి, అపెక్స్ కౌన్సిల్‌కు పంపాల్సి ఉంటుందన్నారు.
- చిన్ననీటివనరులపై రెండు రాష్ట్రాల్లోనూ 40వేల చెరువుల చొప్పున ఉన్నా తెలంగాణకు ఉన్న 299 టీఎంసీలలో చిన్ననీటి వనరుల కింద 89 టీఎంసీ లున్నాయని, అదే ఆంధ్రకు ఉన్న 512 టీఎంసీలలో 22 టీఎంసీలు మాత్రమేనని తెలంగాణ సీఎస్ సమావేశం దృష్టికి తెచ్చారు. తెలంగాణ సాధారణ వర్షపాతం, ఎక్కువ వర్షపాతం ఉన్నప్పుడు చిన్న నీటి వనరుల కింద తక్కువ వినియోగం చూపించి మిగిలిన నీటిని శ్రీశైలం, సాగర్ నుంచి కోరుతుందని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు బోర్డుకు అన్ని వివరాలు అందజేయాలని, కొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వీటి కింద వినియోగాన్ని నిర్ధారించాలని నిర్ణయించారు.

శ్రీశైలం, సాగర్ గురించి ప్రత్యేక చర్చ

ఉమ్మడి రిజర్వాయర్లయిన శ్రీశైలం, సాగర్‌ల గురించి ప్రత్యేకంగా చర్చ జరిగింది. రెండు రాష్ట్రాలు అనుమతులు లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నాయని బోర్డులు ఫిర్యాదు చేశాయి. పాత ప్రాజెక్టులు, కొత్త ప్రాజెక్టులకు ఆపరేషన్ ప్రోటోకాల్ తయారు చేయాలని జలవనరుల మంత్రిత్వశాఖ సూచించగా, కేఆర్ఎంబీకి మాత్రమే ఇది సాధ్యంకాదని, నిపుణులు, రెండు రాష్ట్రాల సహకారం అవసరమని బోర్డు వర్గాలు పేర్కొన్నట్లు తెలిసింది. బజాజ్ కమిటీ ఉన్నట్లా లేక మూసేశారా అన్న తెలంగాణ సీఎస్ ప్రశ్నపై ఆంధ్రప్రదేశ్ సమాచారమిచ్చింది, తెలంగాణ ఇవ్వలేదు, ఇక కమిటీ ఏం చేస్తుందని జలవనరుల శాఖ కార్యదర్శి ప్రశ్నించారు. విభజన తర్వాత పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని కమిటీ తమ వాటా నిర్ణయించాల్సిందని తెలంగాణ సీఎస్ పేర్కొన్నారు. గోదావరి నీటిమళ్లింపులో వాటా అంశం రాగా, గోదావరి జలాలను పంపిణీ చేసే అధికారం కమిటీకి లేదని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాము పరిశీలిస్తామని జలవనరుల మంత్రిత్వశాఖ పేర్కొంది. గోదావరి జలాలపై కొత్త ట్రైబ్యునల్ అవసరమా లేదా అన్నదానిపై చర్చ జరిగింది.

- కాళేశ్వరం ప్రాజెక్టుకు భారీగా విద్యుత్తు అవసరమని, పోలవరం కాలువలు, ఎస్సారెస్పీ -2కు హైడ్రాలజీ అనుమతులులేకుండానే పనులు చేపట్టారని జలవనరులశాఖ కార్యదర్శి పేర్కొన్నారు. గోదావరిలో తమ ప్రయోజనాలను కాపాడాలని ఏ.పి.కార్యదర్శి కోరారు. దీనిపై త్వరలోనే నలుగురు ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటుచేస్తామని కేంద్రకార్యదర్శి తెలిపారు.
- టెలిమెట్రీలో పారదర్శకత లేదని, పోతిరెడ్డిపాడు ద్వారా ఎక్కువ నీటిని మళ్లించి తక్కువ నీటిని చూపిస్తున్నారని తెలంగాణ సీఎస్ ఫిర్యాదు చేశారు. గోదావరి -కావేరి అనుసంధానంపై తక్కువ సమయం పరిగణనలోకి తీసుకొని నీటి లభ్యత లెక్కగట్టారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఎయిమ్స్‌కు నిధులిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఎదురయ్యారు. తెలంగాణలో రైతులకు భరోసా ఇవ్వడానికి ఎకరాకు రూ.8 వేల పెట్టుబడి సాయం పథకం ఎంతో ఆకట్టుకుందని ప్రశంసించారు. ఈ పథకానికి తాను అభిమానిని అయ్యానని సీఎం కేసీఆర్‌తో అన్నారు. దీనిపై అధ్యయనం చేద్దామని అరుణ్ జైట్లీకి తాను చెప్పాననీ, పథకానికి సంబంధించిన పూర్తివివరాలు కావాలని కోరారు. సోమవారం హైదరాబాద్ వస్తున్నానని, కూలంకషంగా చర్చిద్దామన్నారు. శుక్రవారం దిల్లీలోని తన నివాసానికి రావాలనీ, మధ్యాహ్నం భోజనం చేస్తూ మాట్లాడుకుందామని అరవింద్ సుబ్రహ్మణ్యాన్ని సీఎం కేసీఆర్ ఆహ్వానించారు.

జోషి విందు: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి గురువారం రాత్రి ఏపీభవన్‌లో విందు ఇచ్చారు. సీఎస్‌గా నియమితులైన నేపథ్యంలో- కేంద్రంలో తన బ్యాచ్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులకు ఆయన దీనిని ఏర్పాటు చేశారు.

పాక్‌తో చర్చలా?

దిల్లీ: మనపై తుపాకులు ఎక్కుపెట్టే దేశాలతో చర్చలు జరపలేమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కశ్మీరులో రక్తపాతం ఆపడానికి పాక్‌తో చర్చలు అవసరమని జమ్ముకశ్మీరు సీఎం మెహబూబా ముఫ్తీ ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో వెంకయ్యనాయుడు ఈ విమర్శ చేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన గురువారం మాట్లాడారు.

గ్రహం అనుగ్రహం

16-2-2018 శుక్రవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర ఋతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: తె. 3-13 తదుపరి విదియ
ధనిష్ఠ నక్షత్రం: ఉ. 9-05 తదుపరి శతభిషం
అమృత ఘడియలు: తె. 3-14 నుంచి 4-58 వరకు
వర్జ్యం: సా. 4-51 నుంచి 6-35 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-47 నుంచి 9-32 వరకు
తిరిగి మ. 12-36 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-31; సూర్యాస్తమయం: సా.5-57

మతం పేరిట హింస సమర్థనీయం కాదు

దిల్లీ: మతం పేరిట హింసకు పాల్పడడాన్ని సమర్థించలేమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది. 2014లో పుణెలో ముస్లిం యువకుడిని ఒకరిని హిందూ రాష్ట్రసేన వ్యక్తులు చంపారు. నిందితులకు బొంబాయి హైకోర్టు బెయిలిచ్చింది. హతుడు ఒక మతానికి చెందిన వాడవడంతోనే హత్య జరిగిందన్న హైకోర్టు వ్యాఖ్యలను జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు తప్పుపట్టారు.

చిలుకానగర్ చిన్నారిది నరబలే!

ఈనాడు-హైదరాబాద్, న్యూస్‌టుడే-నాగోలు: అందరూ భయపడినదే నిజమైంది. ఉప్పల్ చిలుకానగర్‌లో మేడమీద చిన్నారి తల దొరికిన సంఘటన కేసు నరబలిగా తేలింది. ఆ ఇంట్లో దొరికిన రక్తపు మరకలు తలకు ఉన్న రక్తంతో సరిపోలడంతో కేసు చిక్కుముడి వీడింది. ఈ ప్రాంతానికి చెందిన కేరుకొండ రాజశేఖర్ గౌడ్ అనే క్యాబ్‌డ్రైవర్ తన భార్య శ్రీలత అనారోగ్యాన్ని నయం చేసేందుకు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు తేల్చారు. మొండెం లభించకపోవడం, చిన్నారి తల్లిదండ్రులెవరనేది తెలకపోవడంతో ఇంకా దర్యాప్తు మిగిలిఉన్నట్లు రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ గురువారం విలేకరులకు వెల్లడించారు. క్యాబ్ నడిపే రాజశేఖర్ భార్య నాలుగేళ్లుగా తరచూ అనారోగ్యానికి గురవుతోంది. దీనికితోడు వారిని అప్పులు వేధిస్తున్నాయి. రెండేళ్ల క్రితం మేడారం జాతరలో ఓ కోయదొరను కలవడంతో బాలికను నరబలి ఇస్తే దుష్టశక్తులు తొలగిపోతాయని సలహా ఇచ్చాడు. ఈ నేపథ్యంలోనే రాజశేఖర్ దంపతులు పాతబస్తీ ఘాంసీబజార్‌కు చెందిన సయ్యద్‌షా మహమూద్ ఖైసర్ పాషా, బోడుప్పల్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు శ్రీలత, సరితతోపాటు కీసర



నరబలి నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్

మండలం చీర్యాలకు చెందిన మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్‌ను సంప్రదించి క్షుద్రపూజలు నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో నరబలికి సిద్ధమయ్యారు.

చంద్రగ్రహణాన ముహూర్తం

సంపూర్ణ చంద్రగ్రహణాన్ని నరబలికి ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. గతనెల 31న రాత్రి 7-8 గంటల సమయంలో సికింద్రాబాద్ బోయిగూడ గుడిసెల వద్ద రాజశేఖర్ రెక్కీ నిర్వహించాడు. రహదారి పక్కనే తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న 3-6 నెలల బాలికను గుర్తించి ఇంటికి వచ్చాడు. తిరిగి కారు (ఏపీ20-టీవీ 1646)లో అర్ధరాత్రి దాటాక 1.30 గంటల ప్రాంతంలో చిన్నారిని అపహరించి నగర శివారులోని ప్రతాపసింగారం వద్ద మూసీనది సమీపానికి వెళ్లాడు. 2గంటల సమయంలో కత్తితో చిన్నారి మెడ కోసి మొండెం, కత్తిని నదీ ప్రవాహంలో పడేశాడు. రక్తస్రావం ఆగేందుకు అరగంటసేపు ఆగి తలను పాలిథిన్ సంచిలో ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో బలిపీఠంపై తలనుఉంచి దంపతులిద్దరూ నగ్నంగాక్షుద్రపూజలు నిర్వహించారు. సంపూర్ణ చంద్రగ్రహణం వీడే సమయంలో తలపై వెన్నెలతో పాటు తెల్లవారి సూర్యకిరణాలు ప్రసరిస్తేనే ఫలితం ఉంటుందని మాంత్రికులు చెప్పడంతో తలనుడాబాపై నైరుతిప్రాంతంలో ఉంచాడు. అనుమానం రాకుండా ఉండేందుకు యథావిధిగా ఉదయాన్నే కారులో మాదాపూర్ వెళ్లిపోయాడు. విషయం తెలియని రాజశేఖర్ అత్త వీరకొండ బాలలక్ష్మి దుస్తులు ఆరేసేందుకు డాబాపైకి వెళ్లి చిన్నారి తలను చూసి అరవడంతో దారుణం వెలుగుచూసింది.

డీఎన్ఏ సరిపోలడంతో నేరాంగీకారం

ఘటనాస్థలిలో లభించిన ఆధారాలు.. గతంలో రాజశేఖర్ పూజలు చేసిన ఆనవాళ్లుండటం.. కారులో తాయెత్తులు లభించడంతో అతడి కేంద్రంగానే దర్యాప్తు సాగింది. కానీ తనకే పాపం తెలియదని బుకాయించాడు. చిన్నారి అదృశ్యం కేసు నమోదు కాకపోవడంతో అసలు శిశువు ఆడా? మగా? తేల్చుకునేందుకు డీఎన్ఏ నివేదిక కోసం వేచిచూశారు. ఈనెల 9న రాజశేఖర్ ఇంట్లో మరోసారి సోదాలు చేసినప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో రక్తపుమరకలు కనిపించాయి. చిన్నారి మెడపై ఉన్న రక్తపు మరకలకు ఇంట్లోని మరకలు డీఎన్ఏ సరిపోలడంతో నేరంరుజువైంది. రాజశేఖర్ చరవాణిల్లో తాంత్రికపూజల గురించి జరిపిన సంభాషణల రికార్డుల్ని పదిలపరిచారు. నిందితులు చెబుతున్న విషయాల్లో వాస్తవమెంత తేల్చుకునేందుకు పోలీస్ కస్టడీకి తీసుకోనున్నారు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.4	30.0
కరీంనగర్	14.0	30.0
మెదక్	15.6	35.0
హన్మకొండ	17.5	32.0
హైదరాబాద్	17.7	31.6
నిజామాబాద్	18.0	31.0
రామగుండం	18.1	32.6
మహబూబ్‌నగర్	18.5	34.0

ఆర్మూర్‌లో కదం తొక్కిన కర్షకులు

- మద్దతుధర ప్రకటించి కొనుగోలు చేయాలంటూ ఎర్రజొన్న, పసుపు రైతుల ఆందోళన
- రాస్తారోకో, ర్యాలీ, ఆమరణ దీక్ష

ఆర్మూర్ - న్యూస్‌టుడే



గురువారం ఆర్మూర్‌లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు నిర్వహించిన ర్యాలీ

ఎర్రజొన్న, పసుపు పంటలకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లాలో కర్షకులు కదం తొక్కారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల రైతులు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టి 19 మంది ఆమరణ దీక్షకు కూర్చొన్నారు. గతంలో ఎర్రజొన్న బకాయిల కోసం రైతులు చేపట్టిన ఉద్యమం హింసాత్మకంగా మారిన నేపథ్యంలో గురువారం రైతులు తలపెట్టిన రైతు దీక్షకు పోలీసు అధికారులు అనుమతివ్వలేదు. రైతులు రోడ్డెక్కితే పరిస్థితి అదుపుతప్పే ప్రమాదముందని నిషేధాజ్ఞలు విధించారు. పెద్దఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇంటి వద్ద బారికేడ్లను ఏర్పాటుచేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు నిర్బంధాన్ని పట్టించుకోకుండా రైతులు పెద్దసంఖ్యలో ఆర్మూర్‌కు తరలొచ్చారు. మామిడిపల్లి చౌరస్తాలో జాతీయరహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఉద్యమంలో పాల్గొనడానికి వచ్చిన రాజకీయ నాయకులను గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ఉద్యమాన్ని రాజకీయం చేయొద్దని నాయకులకు సూచించారు. పంటలకు మద్దతుధర సాధన కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమంటూ మంథని గ్రామ రైతు ఏలేటి నవీన్‌రెడ్డి రహదారిపైనే ఆమరణ నిరాహారదీక్షకు కూర్చొన్నారు. మరో 18మంది రైతులు ఆయనతో పాటు ఆమరణ దీక్షకు కూర్చొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ఉద్యమించి పంటలకు గిట్టుబాటు ధర సాధించుకుంటామన్నారు. పసుపు పంటకు క్వింటాలుకు రూ.15 వేలు, ఎర్రజొన్న పంట క్వింటాలుకు రూ. 4,500ల ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లు ఆమోదించేదాకా ఆమరణదీక్ష ఆపబోమని వారు స్పష్టం చేశారు.

ఆదర్శ పాఠశాలల్లో వార్షిక ఇంక్రిమెంట్ అధికారం ప్రిన్సిపాళ్లకే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్ ఇచ్చే అధికారాన్ని తిరిగి ప్రిన్సిపాళ్లకే అప్పగిస్తూ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ అధికారాన్ని డీఈఓలకు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తూ మార్పు చేయాలని కోరాయి. ఈక్రమంలో తాజా ఉత్తర్వులను జారీ చేశారు. అయితే సెలవుల మంజూరును కూడా గతంలో మాదిరిగా ప్రిన్సిపాళ్లకే ఇవ్వాలని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.యాకమల్లు ఒక ప్రకటనలో కమిషనర్‌ను కోరారు.

6 గంటల్లో 2,501 మందికి రక్తపరీక్షలు!

ఖర్‌గోన్: ప్రేమికుల దినోత్సవాన.. 6 గంటల్లో 2,501 మందికి రక్తపరీక్షలు జరిపి మధ్యప్రదేశ్‌లోని ఓ స్వచ్ఛంద సంస్థ సరికొత్త రికార్డు సృష్టించింది. ఈమేరకు ఖర్‌గోన్ జిల్లా భీకన్‌గావ్‌కు చెందిన లక్ష్య పరివార్ సంస్థ- గతంలో కాలిఫోర్నియా (యూఎస్)లో నమోదైన రక్త పరీక్షల రికార్డు (6 గంటల్లో 1,460 మందికి)ను తిరగరాసి 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. మొత్తం ప్రక్రియను గోల్డెన్ బుక్ బృందం చిత్రీకరించింది. అనంతరం సంబంధిత ఆసియా విభాగం ప్రతినిధి స్వచ్ఛంద సంస్థకు ధ్రువపత్రాన్ని అందజేశారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఎర్రజొన్నల కొనుగోలు

- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2300 చెల్లిస్తామని ప్రకటన

హైదరాబాద్, న్యూస్‌టుడే: నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో ఎర్ర జొన్నలను సోమవారం నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మద్దతు ధర క్వింటాకు రూ.2300 చెల్లించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారన్నారు. కాంగ్రెస్ నేతల తప్పుడు సమాచారంతో రైతులు ఆందోళనకు గురికావద్దని.. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి మంత్రి పోచారం సచివాలయంలోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీ కవిత సహా నిజామాబాద్ జిల్లా తెరాస ఎమ్మెల్యేలు దిల్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించారని, ఎర్ర జొన్నలు క్వింటాకు రూ.2300 చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చెప్పారన్నారు. వాతావరణం అనుకూలించడంతో ఈసారి ఎర్ర జొన్న మంచి దిగుబడి వచ్చిందని, వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. పదేళ్లు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎర్రజొన్నకు కనీస మద్దతు ధర కోసం కేంద్రాన్ని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. రైతులను ఎప్పుడు ఎలా ఆదుకోవాలో రైతుబిడ్డ కేసీఆర్‌కు తెలుసన్నారు. ఎంపీ కవిత మాట్లాడుతూ... రైతుల సమస్యను వివరించగానే స్పందించిన సీఎంకు నిజామాబాద్ ప్రజాప్రతినిధుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రైతులపై 2007లో పోలీసు కాల్పులు జరిపించిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. ఆ పార్టీ నాయకుల కొంగ జపాన్ని అన్నదాతలు నమ్మొద్దని కోరారు. చివరి బస్తా వరకు ప్రభుత్వం ఎర్రజొన్న కొనుగోలు చేస్తుందన్నారు. దేశంలో రైతులు పండించిన ప్రతి పంటకు కనీస మద్దతు ధర చెల్లించాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

ఎన్‌టీఎస్‌ఈ జాతీయస్థాయి పరీక్షకు 118 మంది ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్ష(ఎన్‌టీఎస్‌ఈ)కు రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి పరీక్ష(రెండో దశ)కు తెలంగాణ నుంచి 118 మంది ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఫలితాలను తెలంగాణ పరీక్షల విభాగం bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచింది. మే 13న జరిగే జాతీయస్థాయి పరీక్షకు హాల్‌టికెట్లను ఏప్రిల్‌లో www.ncert.nic.in వెబ్‌సైట్ నుంచి పొందాలని సంచాలకుడు బి.సుధాకర్ సూచించారు.

తెలంగాణ వర్సిటీలకు ఆర్థిక చేయూత ఇవ్వండి

- యూజీసీ ఛైర్మన్‌కు ఎంపీ వినోద్‌కుమార్, పాపిరెడ్డి వినతి

ఈనాడు, హైదరాబాద్: ఉన్నత విద్యలో నాణ్యత పెంచేందుకు తాము చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు ఆర్థిక చేయూతనివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ పాపిరెడ్డి యూజీసీ ఛైర్మన్ డీపీ సింగ్‌ను కోరారు. కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు లింబాద్రి, వెంకట రమణ, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి సీతారామారావుతో కలిసి ఆయన గురువారం దిల్లీలో యూజీసీ ఛైర్మన్‌ను కలిశారు. వివిధ విశ్వవిద్యాలయాలకు 12వ ప్రణాళికాసంఘం నిధులు మంజూరు కాలేదని, వాటిని విడుదల చేయాలని పాపిరెడ్డి కోరారు. యూనివర్సిటీల్లోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



దిల్లీలో యూజీసీ ఛైర్మన్ డీపీ సింగ్‌ను కలిసిన ఎంపీ వినోద్‌కుమార్, పాపిరెడ్డి తదితరులు

ఇవీ సమస్యలు..

- రాష్ట్ర విభజన తర్వాత అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి యూజీసీ నుంచి నిధులు రావడంలేదు.
- కొత్త రాష్ట్రమైనందున వన్‌టైమ్ గ్రాంటు కింద తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలకు నిధులివ్వాలి.
- యూజీసీ నుంచి నిధులు పొందేందుకు కరీంనగర్‌లోని శాతవాహన వర్సిటీకి 2ఎఫ్, 12బీ హోదా ఇవ్వాలి
- తెలంగాణ విశ్వవిద్యాలయానికి 12వ ప్రణాళికాసంఘం నిధులు రూ.5 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాకతీయ విశ్వవిద్యాలయానిదీ అదే పరిస్థితి
- తెలంగాణ వర్సిటీకి మహిళా వసతిగృహం మంజూరు, కాకతీయ విశ్వవిద్యాలయంలోని బీఈడీ కోర్సుకు యూజీసీ గుర్తింపు ఇవ్వాలి.
- అయిదు వర్సిటీల్లో ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేసేందుకు రూ.50 కోట్లు అవసరం.
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఆన్‌లైన్ ప్రవేశాలను మరింత ఆధునికీకరించేందుకు సహకారం.
- విద్యార్థులకు తగిన సూచనలిచ్చే విభాగం ప్రారంభించడానికి మద్దతు.
- పరిశోధనల కోసం తెలంగాణ నాలెడ్జి అండ్ రిసెర్చ్ సెంటర్(టీకేఆర్‌సీ)ని నెలకొల్పడానికి ఆర్థిక సహకారం.



'నేను సైతం' కరపత్రాలను విడుదల చేస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ తదితరులు

రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గుముఖం

- డీజీపీ మహేందర్‌రెడ్డి
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచన

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: సీసీ కెమెరాల ఏర్పాటుతో మూడేళ్ల వ్యవధిలో రాష్ట్రంలో 40 శాతం మేర నేరాలు తగ్గుముఖం పట్టాయని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. నేరం చేస్తే శిక్ష తప్పదన్న భయం నేరస్థుల్లో కలుగజేసేందుకే సీసీ కెమెరాల ఏర్పాటును వేగవంతం చేశామన్నారు. 'నేను సైతం', కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దాతల సహకారంతో రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల ఠాణా పరిధిలోని గ్రామాల్లో రూ.52లక్షలతో ఏర్పాటు చేసిన 150 కెమెరాలను, కమాండ్ కంట్రోల్ గదిని గురువారం రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్‌తో కలిసి డీజీపీ ప్రారంభించారు. అనంతరం మాట్లడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు శాఖను బలోపేతం చేశారని అన్నారు. హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా మార్చడంతో పెట్టుబడులు పెరిగాయన్నారు. 100 మంది సిబ్బంది చేసే పనిని ఒక్క సీసీ కెమెరా చేస్తుందని.. ఆయా కాలనీల్లో, ఇళ్లలో ప్రజలు వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనిపై అవగాహన కల్పించేందుకే 'నేను సైతం' కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. సంయుక్త కమిషనర్ షానవాజ్ ఖాసీం, డీసీపీలు ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్వరావు, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంక్షేమ నిధి ఏర్పాటు

పర్యవేక్షణకు ట్రస్టు బోర్డు నియామకం.. ఉత్తర్వులు జారీ

ఈనాడు, హైదరాబాద్: వినియోగదారుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. దీనిని పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తుంది. నిధి నిర్వహణకు ట్రస్టు బోర్డును కూడా నియమించింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, వారిని చైతన్యవంతులను చేసేందుకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు ఈ నిధినుంచి ఆర్థిక చేయూతను అందచేస్తారు. వినియోగదారుల చైతన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటులో కేటాయించిన మొత్తంలో పది శాతాన్ని సంక్షేమ నిధికి మళ్లిస్తారు. ప్రభుత్వరంగ చమురు సంస్థలు, మిల్లర్లు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ పారిశ్రామికవేత్తలు ఇచ్చే విరాళాలతోపాటు వెనక్కి తీసుకోని సెక్యూరిటీ డిపాజిట్టును ఈ నిధికి మళ్లిస్తారు. పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థికశాఖ కార్యదర్శి, విద్యా, వాణిజ్య పన్నులు, రవాణా, పంచాయతీరాజ్ కమిషనర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పురపాలక శాఖల సంచాలకులు, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, వినియోగదారుల హక్కు పరిరక్షణ కమిషన్ నియమించే పది జిల్లాల అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఒకరు కమిటీలో సభ్యులుగా ఉంటారు. పౌరసరఫరాల శాఖలోని వినియోగదారుల వ్యవహారాల ఉప/సంయుక్త కమిషనర్ ట్రస్టుబోర్డు సభ్యకార్యదర్శిగా వ్యవహరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఈనాడు

నేర్వాల్సిన గుణపాఠాలు

చేను మేసిన అవినీతి కంచె బాగోతాల పరంపరలో సరికొత్త అంకమిది. ఇంటిదొంగల తోడ్పాటుతో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో పాతుకుపోయిన ఘరానా మోసం విస్తృతి చూడబోతే, కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థకు అందిన ఫిర్యాదు ప్రకారం- ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి సంబంధీకులు పీఎన్‌బీ ద్వితీయశ్రేణి అధికారులతో జట్టుకట్టి వివిధ బ్యాంకులకు రూ.11వేల కోట్లకుపైగా కుచ్చుటోపీ పెట్టిన వైనం దిగ్భ్రాంతపరుస్తోంది. 2016-17 సంవత్సరంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆర్జించిన లాభానికి ఇది ఎనిమిదింతలు. పారుబాకీల పద్దుతో ముఖం వేలాడేసిన బ్యాంకుల బ్యాలెన్స్‌షీట్లను తేటపరచే లక్ష్యంతో బాండ్ల రూపేణా పీఎన్‌బీకి కేంద్రం ఇవ్వజూపెట్టిన రూ.5473కోట్లకు రెండింతల పరిమాణంలో బహిర్గతమైన కుంభకోణానికి మూలం- అనధికారిక గ్యారంటీలు. వాటిని అడ్డుపెట్టుకుని దేశ, విదేశీ బ్యాంకుల్లో వేలకోట్ల రూపాయల రుణాలు రాబట్టిన మాయగాళ్ళు పీఎన్‌బీ ముంబయి శాఖలో కరెంటు అకౌంట్ ఖాతాతో నిర్వహిస్తూ కేంద్రీకృత బ్యాంకింగ్ వ్యవస్థ దృష్టి తమపై ప్రసరించకుండా జాగ్రత్తపడ్డారు. నకిలీబ్యాంకు గ్యారంటీలతో నిరవధికంగా ఎన్ని చోట్ల అప్పులు పుట్టించారో నిర్ధారణ అయితేతేగాని ఈ చేతివాటం బారీతనమెంతో స్పష్టం కాదు. రాశిలో ఇప్పటికే బ్యాంకులకు విజయ్‌మాల్యా ఎగవేసిన రూ.9000కోట్ల రుణాల్ని మించిపోయిన రికార్డు నీరవ్ బృందానిది దఖలుపడింది. అలా చేతులు మారిన సొమ్ము ఎక్కడికి ఎలా చేరిందో కూపీ తీసే పని ఒక కొలిక్కిరాక మునుపే- రూ.5000కోట్లకు పైగా నీరవ్ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తుచేయడం తాజా పరిణామం. లోగడ బ్యాంకర్లతో కుమ్మక్కై స్టాక్‌మార్కెట్ కుంభకోణానికి ఒడిగట్టిన హర్షద్ మెహతా నేరం, ఖాతాలో పైసా లేకుండా పే ఆర్డర్లతో బ్యాంకుల్ని బురిడీ కొట్టించిన కేతన్ పరేఖ్ చౌర్యం- ఇప్పుడు చిన్న గీతలైపోయాయి. గతానుభవాలనుంచి గుణపాఠాలు నేర్వడంలో వ్యవస్థాగత అలసత్వమే ఈ కుంభకోణానికి దారితీసింది!

రెండున్నర దశాబ్దాల క్రితం రూ.4900 కోట్ల మేర హర్షద్ మెహతా కుంభకోణం వెలుగు చూసింది. అప్పట్లో చెల్లింపుల నిమిత్తం పూచీకత్తులు, బ్యాంకర్ల రసీదులు వంటివేమీ లేకుండానే పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలనుంచి హర్షద్, అతగాడి సంబంధీకుల ఖాతాల్లోకి అక్రమ నిధులు ప్రవహించాయి. ఒకటిన్నర దశాబ్దాల నాడు మాధవ్‌పురా మర్కంటైల్ సహకార బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలతో కేతన్ పరేఖ్ సుమారు రూ.1200 కోట్ల దాకా బ్యాంకు ఆఫ్ ఇండియా తదితరాల్ని వంచించాడు. బ్యాంకు వ్యవస్థలో ఎక్కడా ఏవిధాల నమోదు కాకుండా నీరవ్ సంస్థల్లోకి రూ.280 కోట్ల మొత్తం వెళ్లేలా తప్పుడు గ్యారంటీలను సిబ్బంది సృష్టించినట్లు పక్షం రోజుల క్రితం కేసు నమోదైంది. అదే పద్ధతిలో అంతకు ఎన్నో రెట్ల మహావంచనకు ఆ ముఠాయే తెగబడిందన్న ప్రాసంగిక సాక్ష్యాధారాలు నిక్షిప్తపరుస్తున్నాయి. వాస్తవానికి 2011 సంవత్సరంనుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు ముంబయి శాఖలో ఈ తరహా అవకతవకలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న విశ్లేషణలు- బ్యాంకుల పనిపోకడలపై సరైన పర్యవేక్షణ కొరవడిందని చాటుతున్నాయి. బాకీల చెల్లింపు రికార్డు అధ్వానంగా ఉన్నవారికి, ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా ముద్రపడినవారికి సైతం ఉదారంగా రుణాలు ముట్టజెప్పే 'సంస్కృతి'ని ఇదివరలో కేంద్ర నిఘా సంఘం తూర్పారబట్టింది. సొంత ఆడిటర్లను నియమించుకోగల స్వేచ్ఛే విపరీత పారుబాకీల దుస్థితికి బ్యాంకుల్ని దిగజార్చినట్లు భారత చార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థ ఆ మధ్య తూర్పారబట్టింది. పూడ్చాల్సిన కంతలు ఎన్నో ఉన్నాయని మళ్లీ రుజువైన తరుణంలో, విద్యుక్త బాధ్యతల సమర్థ నిర్వహణకు రిజర్వు బ్యాంకు నిబద్ధం కావాలి!


ఖాతాల నిర్వహణలో దాపరికం తగదని ఇరవై ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వరంగ బ్యాంకులకు ఆర్‌బీఐ చేసిన దిశానిర్దేశం అరణ్యరోదనమైంది. పదిహేను ప్రభుత్వ రంగ బ్యాంకుల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల) పదిశాతానికి పైబడినా ఖాతా పుస్తకాల్లో ప్రస్ఫుటించకుండా అవి ముఖం చాటేస్తున్నాయన్న రిజర్వు బ్యాంకు హెచ్చరికల్ని యూపీఏ సర్కారు పెడచెవిన పెట్టింది. మౌలిక సదుపాయాలు, ఉక్కు, జౌళి, గనులు, విమానయాన తదితర రంగాల్లో రుణ సేకరణపై ఆర్‌బీఐ ప్రమాద ఘంటికలు మోగించినా పట్టించుకోని నాటి పాలకుల పాపం, నేడు బ్యాంకింగ్ వ్యవస్థనే కదిపేసే స్థాయికి చేరింది. మొండిబాకీల ఉత్పాతాన్ని దుస్సహమైందిగా భావిస్తున్న మోదీ ప్రభుత్వం ఆర్‌బీఐకి నిరుడు చట్టబద్ధ దన్ను సమకూర్చడం తెలిసిందే. అది కాలు కదిపి చేయి కూడదీసుకుని పారుబాకీల కథాకమామిషు తేల్చాల్సిందేనని గిరిగీశాక కదలిక మొదలైంది! పీఎన్‌బీ విలాపం బహిర్గతం కావడానికి ఒక్కరోజు ముందే, ఎగవేతదారుల్ని గాడిన పెట్టేందుకంటూ నూతన నిబంధనావళిని రిజర్వు బ్యాంకు వెల్లడించింది. రూ.2000 కోట్లు అంతకంటే ఎక్కువ రుణాల బకాయిలు అందకపోతే ఆరు నెలల్లోగా పరిష్కార ప్రణాళిక అమలు కావాలి లేదా దివాలా ప్రక్రియ పట్టాలకు ఎక్కాలని ఆర్‌బీఐ స్పష్టీకరిస్తోంది. ఏ ఖాతానైనా ఒక బ్యాంకు పారుబాకీ జాబితాలోకి చేరిస్తే, తక్కినవీ అలాగే చేయాలనడం వంటి సూచనల అమలుతోనే పరిస్థితి సాంతం కుదుటపడే అవకాశం లేదు. వ్యక్తులవైనా తీసుకున్న రుణాన్ని గడువులోగా తీర్చేయాలని ముక్కుపిండి అపరాధ రుసుము వసూలు చేస్తున్న బ్యాంకుల సిబ్బంది, ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు అన్నివిధాలా సహకరించే వాతావరణం రూపుమాసిపోవాలి. పారుబాకీలు, అధికార సిబ్బంది లోపాయికారీ సాయంతో పెచ్చరిల్లుతున్న అవకతవకలు- బ్యాంకింగ్ రంగంలో నిష్పూచీతనానికి నిలువెత్తు నిదర్శనలు. రకరకాల లోటుపాట్ల ఊబినుంచి భారత బ్యాంకింగ్ వ్యవస్థను బయటకు లాగి జవాబుదారీతనం మప్పే సమగ్ర సంస్కరణలు అత్యావశ్యకమనడంలో మరో మాట లేదు!

పల్లె ప్రగతికి సహకారమే చుక్కాని

సహకార స్ఫూర్తి పరిమళిస్తేనే పల్లెలు వికసిస్తాయి. గ్రామీణ భారతావనికి కొత్త జీవం పోయడంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) పాత్ర చిరస్మరణీయమైనది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 'ప్యాక్స్' పాలక వర్గాల అయిదేళ్ల పదవీకాలం ముగియడంతో వాటికి ఎన్నికలపై మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికైన పాలకవర్గాల కాలపరిమితి ఈ నెల 3న ముగిసింది. వాటికి ఈ నెలలోనే ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ, రెండు తెలుగు రాష్ట్రాలు మరో ఆరు నెలలపాటు పాలక వర్గాల పదవీ కాలాన్ని పొడిగించాయి. దీనివల్ల వ్యవసాయ సహకార సంఘాలు తీవ్రమైన సమస్యల్లో కూరుకుపోనున్నాయి. పాలక వర్గాల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి పొడిగింపు ఇవ్వరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లు, పైరవీలదే పైచేయి అవుతోంది. ఏదో రకంగా పదవీ కాలపరిమితిని పెంచుకునేందుకే పాలకవర్గాలు వెంపర్లాడుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పెత్తనం వదులుకోలేని పాలక వర్గాల నైజానికి ఇది నిదర్శనం. దేశవ్యాప్తంగా పాతనోట్ల రద్దు తరవాత సహకార సంఘాలు, సహకార బ్యాంకుల ఆర్థిక కార్యకలాపాలపై పలు ప్రాంతాల్లో అనుమానాలు విస్తరించాయి. ఆ నేపథ్యంలోనే నోట్ల మార్పిడి, డిపాజిట్ల సేకరణ వ్యవహారాలనుంచి వాటిని పక్కన పెడుతూ రిజర్వుబ్యాంకు ఉత్తర్వులు జారీ చేసింది. 'ప్యాక్స్' పనితీరులోని డొల్లతనాన్ని బయటపెట్టిన పరిణామమది. దేశవ్యాప్తంగా 12.11 కోట్లమంది రైతులు సభ్యులుగా ఉన్న 'ప్యాక్స్' సరైన బాటలో నడిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఎనలేని ప్రభావం కనబరుస్తాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కొన్ని సహకార సంఘాలు అక్కడి ప్రభుత్వాలను శాసించే స్థాయిలో ఉన్నాయి. భారత్‌లోనే కాదు- ప్రపంచవ్యాప్తంగా సహకార స్ఫూర్తి పరిఢవిల్లిన ప్రతిచోటా వ్యవసాయ, పాడి పరిశ్రమలు పురోగమించిన దాఖలాలున్నాయి. ఈ సంఘాల ప్రస్తుత పరిస్థితి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధ్వానంగా ఉంది. ఈ సమస్య తెలుగు రైతుల ప్రగతికి మోకాలడ్డుతోందనడం అతిశయోక్తి కాదు.

ముమ్మరిస్తున్న ఆర్థిక సమస్యలు

దేశంలో సహకార సంఘాల పతనానికి ఆర్థిక, రాజకీయ సమస్యలే కారణం. దేశవ్యాప్తంగా పేరుకు 12 కోట్ల మందికి పైగా రైతులు 'ప్యాక్స్'లో సభ్యులుగా ఉన్నట్లు లెక్కలున్నాయి. వాస్తవానికి వారిలో రుణం తీసుకున్నది కేవలం 41 శాతం(4.98 కోట్ల మంది) మాత్రమేనని తాజా వార్షిక నివేదికలో 'నాబార్డు' వెల్లడించింది. అనేక సంఘాల్లో పరస్పర సహకార, సమన్వయాలతో చేయూత అందించుకునే స్ఫూర్తి కొరవడింది. దేశం మొత్తమ్మీద 92,789 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 84,616 'ప్యాక్స్'కి సంబంధించినంతవరకే లెక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే 37,400 సంఘాలు ఇప్పటికే మూటకట్టుకున్న నష్టాలు అక్షరాలా రూ.4,378 కోట్లు. మిగిలిన సంఘాలు లాభాల్లో ఉన్నాయా అంటే, అదీ లేదు. సహకార సంఘాలు, సహకార గ్రామీణ బ్యాంకుల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్య అంశంగా ప్రభుత్వాలు చెబుతున్నాయి. వ్యవసాయం, పాడి రంగాల అభివృద్ధికి గ్రామాల స్థాయిలో సహకార సంఘాలు జీవనాడుల్లా ఉపయోగపడతాయి. దశాబ్దాలు గడిచేకొద్దీ వీటిలో ఎక్కువశాతం దీనావస్థకు చేరడమే తప్ప బాగుపడిన దాఖలాలు లేవు. తెలంగాణ ప్రభుత్వం అయిదువేల కోట్ల రూపాయల వ్యయంతో గొర్రెల పంపిణీ పథకం చేపట్టింది. కానీ ఏళ్ల తరబడి గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాలు తెలంగాణలో నీరసంగా ఉన్న విషయం ఇక్కడ గమనార్హం. పేద కుటుంబాల జీవనోపాధి నిమిత్తం ప్రభుత్వం ఇచ్చిన గొర్రెలను వారు రాత్రికి రాత్రే అమ్మేసుకుంటున్న దురవస్థ- సహకార సంఘాలు బలంగా ఉంటే దాపురించేది కాదు. చేపపిల్లల ఉచిత పంపిణీకి ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. మత్స్యకారుల సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్న దాఖలాలే లేవు. చెరువుల్లో పెరిగిన చేపలను ఈ సంఘాల పేరిట రాజకీయ నేతలు, వారి అనుచరులు అమ్మేసుకుంటూ అంతకంతకూ లబ్ధి పొందుతున్నారు. దేశంలో ఒక్కో పేద వర్గానికి ఒక్కో సహకార సంఘం ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. క్షేత్రస్థాయిలో వాటి పనితీరును పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని సాగుదారుల్లో సగానికి సగం కౌలురైతులే. వారికి బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదు. ఇలాంటి కౌలు రైతులు పది మందిని 'సంయుక్త భాగస్వామ్య సహకార సంఘం' (జేఎల్‌జీ) పేరిట బృందంగా ఏర్పరచి పంట రుణాలు ఇవ్వాలని 'నాబార్డు' దేశవ్యాప్తంగా బ్యాంకులన్నింటినీ కోరుతోంది. దేశంలో 2017 మార్చినాటికి ఏర్పాటైన జేఎల్‌జీలు 5.05 లక్షలే. తెలుగు రాష్ట్రాల్లో ఇవి పట్టుమని పది వేలైనా లేవు. సంఘాలుగా ఏర్పాటైనప్పటికీ ఈ కౌలు రైతులకు పూచీకత్తు లేదన్న కారణంతో బ్యాంకులు వారికి రుణాలు ఇవ్వడంలేదు. 'ప్యాక్స్' పటిష్ఠంగా పనిచేస్తే ఇలాంటివారికి ఆర్థిక సాయం అందించేందుకు, తద్వారా పంటల సాగుకు తోడ్పడేందుకు అవకాశం ఉంటుంది. 'ప్యాక్స్'కు నిధులిచ్చే 'జిల్లా కేంద్ర సహకార బ్యాంకు'(డీసీసీబీ)ల పనితీరూ చాలా ప్రాంతాల్లో అధ్వా



'ప్యాక్స్' తీరు మారాలి

నమే. ముందు చూపుతో వైద్యనాథన్ కమిటీ డీసీసీబీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తే- వాటి పాలకవర్గాలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ సహకార స్ఫూర్తిని మంటగలుపుతున్నాయి. పాతనోట్ల రద్దు సమయంలో కోట్లాది రూపాయలు ఈ బ్యాంకుల్లో జమ కావడమూ వివాదాస్పదంగా మారింది. రైతులు కోట్ల రూపాయల పాతనోట్లు తెచ్చి డీసీసీబీల్లో జమచేయగల స్థాయిలో బలంగా ఉన్నారని ఎవరైనా భావిస్తే అది హాస్యాస్పదమే! డీసీసీబీలు, రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకుల నష్టాలు కలిపి గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికే దాదాపు రూ.5,400 కోట్లకు చేరాయి. వీటిలో డీసీసీబీల వాటా రూ.4750 కోట్లు! పల్లె స్థాయిలో రైతులకు చేరువుగా ఉంటే ప్యాక్స్, దానిపైన జిల్లా స్థాయిలో డీసీసీబీ, వీటిపైన రాష్ట్రస్థాయిలో సహకార అపెక్స్ బ్యాంకు పనిచేస్తున్నాయి. ఈ మూడింటి మధ్య ఎక్కడా సమన్వయం లేదు. రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు డీసీసీబీలకు నిధులు సమకూర్చడమే తప్ప వాటి పనితీరును నియంత్రించే అధికారం లేక చేష్టలుదక్కి చూస్తోంది. ఇక డీసీసీబీ డిపాజిట్ల సేకరణ, రుణాల పంపిణీలో పాలకవర్గానిదే పూర్తి పెత్తనం! స్వార్థపరులైన నాయకగణాల కారణంగానే డీసీసీబీలు భ్రష్టుపడుతున్నాయి. వీటి నుంచి 'ప్యాక్స్'కు వెళ్లే నిధులు, అందే సాయమూ అంతంతమాత్రమే. 'ప్యాక్స్'ను సక్రమ మార్గాన నడిపించాల్సిన రాష్ట్ర సహకార శాఖ కార్యాలయాలు క్రియారహితంగా తయారయ్యాయి. ఏటికేడు వీటి రుణవితరణ తీరు నిరాశపరుస్తోంది. 2012-13లో రూ.6.07 లక్షల కోట్లను దేశవ్యాప్తంగా పంటరుణాలుగా ఇస్తే- అందులో సహకార బ్యాంకుల వాటా 18 శాతంగా ఉంది. అయిదేళ్ల వ్యవధిలో 2016-17నాటికి మొత్తం వితరణ సొమ్ము రూ.9.59 లక్షల కోట్లకు చేరింది. అందులో సహకార బ్యాంకుల వాటా 13 శాతానికి దిగజారింది. 'ప్యాక్స్', డీసీసీబీలు, సహకార బ్యాంకులు వంటివి రైతులకు దగ్గరగా, వారే సభ్యులుగా, పాలకవర్గాలుగా ఉంటాయి. ఇలాంటి వ్యవస్థలే రైతులకు రుణ వితరణలో వెనకబడితే ఇక వారికి వాణిజ్య బ్యాంకుల్లో ఎదురయ్యే పరిస్థితి ఏమిటి? అనేక సహకార సంఘాల్లో రుణాలివ్వడం, తీసుకోవడం అంతా పుస్తకాల్లో రాయడమే తప్ప వాస్తవంగా నగదు వసూలు, పంపిణీ ఉండటం లేదు. కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెస్తే ఇలాంటి అక్రమ బాగోతాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఆ దిశగా సంఘాలు చురుగ్గా కదలడమే లేదు.

సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాల పంపిణీ

సంవత్సరం	మొత్తం (రూ.కోట్లలో)
2012-13	1,11,293
2013-14	1,19,964
2014-15	1,38,469
2015-16	1,53,296
2016-17	1,22,651

దేశంలో 2015 నాటికి 'ప్యాక్స్' ముఖచిత్రం

సంఘాల సంఖ్య	92,789
మొత్తం సభ్యులు	12.11 కోట్లు
రుణం తీసుకున్నవారు	4.98 కోట్లు
సొంత నిధులు	రూ.21,765 కోట్లు
డిపాజిట్లు	రూ.84,616 కోట్లు
అప్పులు	రూ.99,980 కోట్లు
ఇచ్చిన రుణాలు	రూ.1,59,050 కోట్లు

(ఆధారం: 'నాబార్డు' నివేదిక-2015)

సంస్కరణలు తప్పనిసరి

ప్రపంచవ్యాప్తంగా సహకార సంఘాలవల్లే రైతులకు అత్యధిక మేలు జరుగుతోంది. పాల వ్యాపారంలో ప్రపంచ విపణిని శాసిస్తున్న న్యూజిలాండ్, భారత మార్కెట్‌ను నడిపిస్తున్న గుజరాత్ వంటి వాటికి పాడి రైతుల సహకార సంఘాలు పటిష్ఠ పునాదులు వేశాయి. అత్యంత అభివృద్ధి చెందిన నెదర్లాండ్స్, జర్మనీ, ఇటలీ వంటి దేశాల్లో సైతం రైతు సహకార సంఘాలు, బ్యాంకుల ద్వారానే వ్యవసాయం, పాడి రంగాలకు మెరుగైన సాయం అందుతోంది. ఉగాండా, రువాండా, సోమాలియా వంటి ఆఫ్రికా దేశాలూ రైతులను సహకార సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నాయి. ఈ సంఘాల ద్వారా అన్నదాతలకు విత్తనాలు, ఎరువులతోపాటు కీలకమైన సలహాలు అందజేస్తూ తమ దేశాలను నెమ్మదిగా ఆహార భద్రతవైపు నడిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సహకార సంఘాల పనితీరును మెరుగుపరచేందుకు ప్రభుత్వాలపరంగా మరింత శ్రద్ధ తీసుకోవాలి. సహకార రంగంలో పూర్తిస్థాయి సంస్కరణల తరవాతే 'ప్యాక్స్'కు ఎన్నికలు నిర్వహించాలన్నది తెలంగాణ ప్రభుత్వ ఆలోచనగా ప్రచారం జరుగుతోంది. అది కార్యరూపం దాలిస్తే మంచిదే. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ ప్రస్థానం 'ప్యాక్స్' ఎన్నికల ద్వారానే ఓ కుగ్రామంలో మొదలైంది. తెలంగాణ రాష్ట్ర సహకార మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి రాజకీయ జీవితం డీసీసీబీ ఛైర్మన్‌గానే ప్రారంభమైంది. మరోవంక ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రగతిని స్వయంగా సమీక్షిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం రాష్ట్రంలో సహకార సంఘాలను ఆన్‌లైన్ సహకారంతో, పారదర్శకంగా నిర్వహించేందుకు గట్టి కృషి చేయాలి. రైతులను బురిడీ కొట్టించే పాలకవర్గాలపై తక్షణం వేటు వేసి తప్పించేలా పక్కా నియంత్రణ వ్యవస్థలు ఉండాలి. 'ప్యాక్స్' పాలకవర్గంలో రైతులే కాకుండా సమాజంపై మంచి అవగాహన, సేవానిరతిగల ఒకరిద్దరు ఇతర వ్యక్తులకూ చోటు కల్పించాలి. ప్రతీ పైసాకు పాలకవర్గం మొత్తం జవాబుదారీగా ఉండాలి. ఏం చేసినా చెల్లుతుందన్న ధీమా నుంచి అక్రమ సొమ్ముతో కప్పు టీ తాగినా జైలుశిక్ష తప్పదన్న భయం పాలకవర్గాల్లో ఏర్పడాలి. సేవాభావం పుష్కలంగా ఉన్నవారికే సహకార సంఘాల పగ్గాలు దక్కేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. రైతులకు దగ్గరగా ఉంటూ వారికి ఉపయోగపడే 'ప్యాక్స్'వంటి వ్యవస్థలు పెళుసుబారిపోతున్నా పట్టించుకోని దురవస్థ మారాలి. అన్నదాతకు అవసరమైన ముడివనరులను చౌకధరకు, సులభంగా చేరవేయగలిగేలా 'ప్యాక్స్' వంటి వ్యవస్థలను పటిష్ఠంగా తీర్చిదిద్దాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పూర్తిగా ప్రక్షాళించాకనే వాటికి ఎన్నికలు నిర్వహించాలి. అప్పుడే సంస్కరణ స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని ఆ సంఘాలు రైతులకు కొండంత అండగా నిలువగలుగుతాయి!

- మంగమూరి శ్రీనివాస్

ముందుచూపే తగిన మందు

దేశంలో ప్రస్తుత పరిస్థితులు అనేక రుగ్మతలకు అంటు కడుతున్నాయి. ముఖ్యంగా అంటువ్యాధుల బెడద జనజీవితాల్ని అతలాకుతలం చేస్తోంది. వాటి నుంచి తప్పించుకొనే ప్రయత్నాలు సాగుతున్నప్పటికీ- కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు సగటు భారతీయుడికి నరకం చూపుతున్నాయి. ఆధునిక జీవన విధానంలోని మార్పుచేర్పులు, కుటుంబ స్థితిగతులు, తక్కువ శారీరక శ్రమ వంటివి ప్రత్యేకించి సాంక్రామికేతర వ్యాధులకు కారణమవుతున్నాయి. అవి విజృంభించడం వల్ల సమాజంలో అత్యంత ఆందోళనకర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అంటువ్యాధుల విషయానికి వస్తే- గాలి ద్వారా సోకేవి, దోమకాటు వల్ల సంక్రమించేవి, నీటి కాలుష్యంతో దాపురించేవి ఎన్నో ఉన్నాయి. మలేరియా, డెంగీ, ఫ్లూ, టైఫాయిడ్‌లతో పాటు పలు శ్వాసకోశ వ్యాధులు, క్షయ, అతిసారం కేసులు కొన్ని ప్రాంతాల్లో నేటికీ అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. అవి కాక దీర్ఘకాలం బాధించే క్యాన్సర్, గుండెపోటు, మధుమేహం, మూత్రపిండ వ్యాధులు సంక్షుభిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడం ప్రభుత్వాలకు పెను సవాలుగా మారుతోంది.

గతంలో 1990 ప్రాంతాల్లో సగటు ఆయుర్దాయం పురుషుల్లో 58.3 ఏళ్లు, మహిళల్లో 59.7 సంవత్సరాలుగా ఉండేది. అది 2016 నాటికి పురుషులకు సంబంధించి 66.9 ఏళ్లకు పెరిగింది. మహిళల పరంగా ఆయువు సగటున 70.3 సంవత్సరాలకు హెచ్చింది. వృద్ధాప్యంలో పలు దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వాటి ప్రభావ తీవ్రత స్త్రీ, పురుషుల జీవితాలపై గణనీయంగా ఉంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం- విశ్వవ్యాప్తంగా 68 శాతం మరణాలు సాంక్రామికేతర వ్యాధుల ఫలితంగానే సంభవిస్తున్నాయి. వాటిలో భారత్ వాటా 15 శాతం. ప్రతి నలుగురు భారతీయుల్లోనూ ఒకరు 70 ఏళ్లకన్నా ముందే అలాంటి వ్యాధులతో మరణిస్తున్నారని సంస్థ అధ్యయనంలో తేలింది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు శాతం, పట్టణ ప్రాంతాలవారిలో ఎనిమిది నుంచి పది శాతం ప్రజలు చిన్న వయసులోనే సాంక్రామికేతర వ్యాధులకు గురవుతున్నారు. ఆ పిన్నవయస్కుల మరణాల్ని 'ఉత్పాదక శక్తి వినియోగ కోణం'లో చూసినప్పుడు- జాతీయ ఆర్థికాభివృద్ధికి అవి విఘాతమే! అదీకాక, ప్రకృతి ప్రకోపాల కారణంగా మరణించేవారిలో యువత సంఖ్య ఎక్కువ. రోడ్డు ప్రమాద మృతుల్లోనూ వారే అధికంగా ఉంటున్నారు. ఈ స్థితికి తోడు, చిన్నవయసులోనే దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య పెరుగుతుండటం మరో పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. అనారోగ్యకరమైన చిరుతిళ్లకు పిల్లలు అలవాటుపడుతున్నారు. తగినంత శారీరక వ్యాయామం లేకపోవడం మరికొందరిపై ప్రభావం కనబరుస్తోంది. పలు రకాల ఒత్తిళ్లు దిక్కుతోచకుండా చేస్తున్నాయి. ధూమపానం వంటి అలవాట్లు యువకుల్ని అనారోగ్య పీడితులుగా మారుస్తున్నాయి. అధిక రక్తపోటు, ఊబకాయం వంటివీ జీవితాల్ని పరమ దుర్భర దశకు చేరుస్తున్నాయి.

వ్యాధులకు లోనైనవారు ఆ తరవాత సరైన చికిత్స చేయించుకోలేక మృత్యువుకు చేరువ అవుతున్నారు. వైద్యంపై తగి



సాంక్రామికేతర వ్యాధుల తీవ్రత

నంత అవగాహన లేక మరికొంతమంది అనేక విపత్కర పరిస్థితుల్లో చిక్కుకొంటున్నారు. అర్హత, అనుభవం కలిగిన వైద్యుల కొరతా బాధిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నాటువైద్యుల చికిత్సలు ప్రాణాంతకంగా తయారయ్యాయి. మూఢనమ్మకాల కారణంగా, చికిత్సల్ని మధ్యలోనే నిలిపివేయడం మరో సమస్య. వీటన్నింటి కారణంగా, సాంక్రామికేతర వ్యాధుల వల్ల మరణించేవారి సంఖ్య పెరుగుతోంది. అందరికీ ఒకే విధమైన బీమా పాలసీల వ్యవస్థ లేకపోవడం, ప్రభుత్వం కల్పించే ఉచిత వైద్యసేవలు ఎంతకీ విస్తృతం కాకపోవడం- మరికొన్ని సమస్యలు. ప్రాంతాల్ని, వాతావరణ మార్పుల్ని బట్టి వ్యాధులు ప్రబలుతుంటాయి. అలా చూసినప్పుడు బిహార్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అంటువ్యాధుల తీవ్రత ఎక్కువ. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, తమిళనాడు, గోవా వంటి ప్రాంతాల్లో సాంక్రామికేతర వ్యాధుల బెడద అధికంగా కనిపిస్తుంది. దేశంలో పలుచోట్ల ప్రజారోగ్య పర్యవేక్షణ విధానాలు సక్రమంగా లేవు. వ్యాధుల వివరాల నమోదు విధానంలోనూ జాతీయస్థాయిన ఏకరూపత లేదు. ఇటువంటి స్థితిలో ప్రభుత్వాలకు 1961 నాటి మొదలియార్ కమిటీ చేసిన ప్రధాన సూచనల్ని గుర్తుతెచ్చుకోవాల్సి ఉంటుంది. వాటి ప్రకారం, సాంక్రామికేతర వ్యాధుల బెడదపై దేశవ్యాప్తంగా శాస్త్రీయ అధ్యయనం సాగించాలి. ఆయా వ్యాధుల వల్ల సంభవిస్తున్న మరణాల్ని సమగ్రంగా విశ్లేషించాలి. వ్యాధి నిర్ధారణ పద్ధతులపై వైద్యశాఖ దృష్టి కేంద్రీకరించాలి. పల్స్ పోలియో తరహాలో ముమ్మరంగా కార్యక్రమాల్ని చేపట్టినప్పుడే, వ్యాధులు అదుపులోకి వస్తాయి. క్యాన్సర్ నియంత్రణకు సంబంధించి 1971 నుంచే జాతీయస్థాయి కార్యక్రమం ప్రారంభించారు. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో 2010 నుంచి విలీన విధానం అమలవుతోంది. క్యాన్సర్‌తో పాటు మధుమేహం, గుండెవ్యాధుల నివారణ కార్యక్రమాలకు ఇందులో భాగస్వామ్యం కల్పించారు. వీటితో పాటు- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్యశిబిరాల ద్వారా పలు సాంక్రామికేతర వ్యాధి నిర్ధారణ పరీక్షల్ని వేగవంతం చేయాలి. ఆయా వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించడం, జీవనశైలి విధానాల్లో రావాల్సిన మార్పులపై ప్రచారాలవల్ల కూడా ప్రభుత్వం ఆశించే ఫలితాలు లభిస్తాయి.

గుండెవ్యాధుల వల్ల మరణాలు 1990-2016 మధ్య కాలంలో 104 శాతం పెరిగాయి. అదే కాలవ్యవధిలో మధుమేహం కారణంగా మరణాల్లో నమోదైనవే 174 శాతానికి పైగా ఉన్నాయి. దేశంలో వ్యాధి సంబంధ మరణాల్లో 37 శాతం- పోషకాహార లోపం వల్ల సంభవిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అంటు, దీర్ఘకాలిక వ్యాధులూ అధిక శాతాల్లో నమోదవుతున్నాయి. వాయుకాలుష్యాన్ని నియంత్రించడం, జలకాలుష్యాన్ని అరికట్టడం, ఇతర చర్యల ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. సాంక్రామికేతర వ్యాధుల నియంత్రణకు తమిళనాడు, కేరళ, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాలు వివిధ పద్ధతులు అనుసరిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థల సేవల్ని సంపూర్ణ స్థాయిలో వినియోగించుకుంటున్నాయి. పాఠశాలల్లో 'విద్యార్థి ఆరోగ్య కార్డుల' పంపిణీ, సామాజిక ఆరోగ్య కార్యకర్తల నియామకాల వంటివీ దేశమంతటా అమలైనప్పుడు- ఆరోగ్య భద్రతకు భరోసా చేకూరుతుంది!

- డాక్టర్ పి.కృష్ణప్రశాంతి

ఈనాడు లేఖలు

అనుభవానికి ప్రాధాన్యం

'అందరికీ విద్య' లక్ష్యసాధనలో భాగంగా, ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇదే సందర్భంలో దూరవిద్యావిధానం విస్తృతికి తమ వంతు పాత్ర నిర్వర్తిస్తున్నాయి. కానీ, సాంకేతిక విద్యకు సంబంధించి అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నది వాటికి తెలియనిదేమీ కాదు. యంత్రవిద్య వంటి కోర్సులకు కార్యశాల అనుభవం ఎంతైనా అవసరం. అటువంటిదేమీ లేకుండానే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ కొందరు పట్టాలు పొంది, ఆ తరవాత పదోన్నతులకూ అర్హత సంపాదిస్తున్న వైనం ఎంతమాత్రం సముచితం కాదు. విద్యాసంస్థలకు వెళ్లి, ప్రయోగాలు నిర్వర్తించి, ఇంజినీరింగ్ పట్టాలు సాధించినవారికే సముచిత ప్రాధాన్యమివ్వాలి. క్షేత్రస్థాయి అనుభవం గడించినవారి ప్రతిభకే పట్టం కట్టాలి. ఇంజినీరింగ్ విద్యను కరస్పాండెన్స్ విధానంలో బోధించడం ద్వారా పట్టాల 'పంపిణీ'కి ఉబలాటపడుతున్న కొన్ని ఉన్నత విద్యాలయాల వ్యవహారం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. వీటన్నింటి దృష్ట్యా, ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత రెండు ప్రభుత్వాలపైనా ఉంది.

- తల్లాప్రగడ ప్రభాకర్, హైదరాబాద్

విద్యుత్ వాహనాలతో మేలు

వాహనాల సంఖ్యతో పాటు వాయుకాలుష్యం నానాటికీ పెరుగుతోంది. పర్యావరణ సమస్యలు చుట్టుముట్టి, జనజీవితం అత్యంత దుర్భరంగా మారుతోంది. ఈ పరిస్థితిని కొంతైనా నియంత్రించడంలో విద్యుత్ వాహనాలు ఉపయోగపడతాయి. వీటిని ప్రభుత్వాలు ఎంత త్వరగా, విరివిగా అందుబాటులోకి తెస్తే- ప్రజలకు అంత ప్రయోజనం ఉంటుంది. అందుకు అనువుగా అతుకుల గతుకుల రోడ్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలపై దృష్టి సారించాలి. బ్యాటరీ స్టేషన్ల స్థాపన వల్ల కలిగే మేలు గురించి విస్తృత ప్రచారం సాగించాలి.

- ఎ.రాజశేఖర్ గౌడ్, చౌట్‌పల్లి, నిజామాబాద్

వందనం

నమస్కరిస్తూ పూజ్యభావాన్ని వ్యక్తం చేయడం భారతీయుల సర్వసాధారణమైన గౌరవ సూచిక. దైవానికి, గురువులకు, ఇతర పెద్దలకు వందనం చేయడంలో భక్తిశ్రద్ధలు ప్రస్ఫుటమవుతాయి. దేవుడి సన్నిధిలో రెండు అరచేతులూ కలిపి నమస్సులు అర్పిస్తారు. తల, వీపు వంచి నమస్కరించడం అంటే- ఎదుటివారి పట్ల గౌరవాన్ని, నమ్రతను తెలియజేయడం! జ్ఞానద్రష్టలు, రుషితుల్యులు, అతిథుల వంటి వారికి అభివందనం మన ధర్మం, సంప్రదాయం.

ఒక సామాన్య ఆచారంలా, అలవాటుగా నమస్కరించడంలో నిర్మలత్వం కనిపించదు. మనసు నిండా గౌరవ భావం కలిగి, ఎదుటి వ్యక్తి అర్హతను గమనించి నమస్కరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

వేదకాలం నుంచే నమస్కార ఆచారం ఉందని 'హంసోపనిషత్తు' విపులీకరిస్తుంది. ఆగమ ఆచార సంబంధమైన విధుల్లోనే కాక- నిత్యం చేసే పూజలు, జప తపాలు, ధ్యాన క్రియల్ని సైతం నమస్కృతితో ప్రారంభించడం ఉత్కృష్టమైన సంప్రదాయం. ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేసేటప్పుడు, ప్రవచనాలు వినేటప్పుడు, పాలకుల్ని సందర్శించే సందర్భంలోనూ నమస్కారాలు సమర్పించాలని విజ్ఞుల మాట. ఇతరులతో కరచాలనం కన్నా, చేతులు జోడించి వందనం చేయడమే ఉత్తమం అంటారు.

నమస్కారమే మరింత సాన్నిహిత్యం కలిగిస్తుంది. భారతీయ సంప్రదాయంలో పాదాభివందనమూ ఆచరణీయమే. ఆలయ మూర్తుల్ని, జ్ఞానంలో పెద్దవారిని సందర్శించినప్పుడు చరణాలు తాకి పూజ్యభావాన్ని ప్రదర్శించాలి. దైవం, వ్యక్తి పట్ల మనసులో భక్తిప్రపత్తులు ఉంటే- సాష్టాంగ నమస్కృతి ఆచరించాలి. దేహంలోని ఎనిమిది భాగాల్ని, తలను భూమికి ఆనించి; రెండు చేతులూ మూర్తి వైపు చాచి, అరచేతులు కలిపి సాగిలపడటమే సాష్టాంగ నమస్కారం. ఆ క్రియలో ఆరాధనా భావం గోచరమవుతుంది. సంపూర్ణ సమర్పణకు అదొక చిహ్నం.

నమసు అంటే నడుము పై భాగాన్ని వంచడం. అకరం అనే శబ్దానికి అర్థం- భావ వ్యక్తీకరణ. వినమ్రతకు పవిత్ర సంకేతమే నమస్కారం. దీన్ని సంస్కృతంలో 'ప్రణామం' అంటారు. ప్రణవం అంటే, శ్వాస లేదా ప్రాణం. వేదకాలంలో యజ్ఞ (అగ్ని) కుండం నుంచి ఉద్భవించిన దేవతను ఉద్దేశించి యజ్ఞకర్త- 'నా శ్వాస సమర్పిస్తున్నాను' అని పలికేవాడంటుంది యజుర్వేదం. ప్రణవమే ప్రణామానికి మూలం. వెనిస్‌కు చెందిన నికొలో డీ కాంటి భారతదేశంలో విస్తృతంగా పర్యటించాడు. తెలుగు భాషలోని కొన్ని పదాలకు మూలాల్ని పేర్కొన్న ఆయన, ప్రణామానికి ప్రణవమే ప్రాతిపదికగా అభిప్రాయపడ్డాడు. ఉద్యోతనుడు ప్రాకృత భాషలో రచించిన 'కువలయ మాల'- నమః అంటే హృదయ సమర్పణ అని చెబుతోంది.

మన సంప్రదాయంలో వందనానికి లాక్షణిక ప్రాధాన్యమూ ఉంది. గౌరవ భావంతో రెండు అరచేతులు, వేళ్లను కలపడమే వందనం. ఆ కలయిక- అదృశ్య (కనిపించని) పదార్థాలు, దృశ్య వస్తువుల మేళవింపు అంటుంది 'యోగవాశిష్ఠం'. నమస్కరించడం అంటే ఆత్మ, పరమాత్మల అనుసంధానం. దీనివల్ల మనిషిలోని ఆత్మ చైతన్యమై, పారమార్థిక భావాలు కలుగుతాయి.

వందనాన్ని బౌద్ధ తత్వశాస్త్రం 'పావనమైన ముద్ర'గా అభివర్ణిస్తుంది. బుద్ధుడి కాలంలో 'సుంగము' అనే నాట్యప్రక్రియ బహుళ ప్రచారంలో ఉండేది. అందులో నమస్కార ముద్ర ఒక భాగమని బహుశా పన్నెండో శతాబ్దినాటి 'విశుద్ధ జ్ఞాన విలాసిని' గ్రంథ కథనం. పంచభూతాల్లోని భూమి, ఆకాశం కలయికను సూచించేందుకు నమస్కార ముద్రను వాడేవారట. కొరియాలో నేటికీ అది కనిపిస్తుంది.

నాట్యప్రక్రియలో నమస్కార ముద్రను చేర్చిన ఘనత బుద్ధుడికి దక్కుతుంది. అంతర్గతమైన ఇంద్రియాతీత భావం ప్రతిఫలించేలా ఆయనే మార్పు చేసినట్లు చెబుతారు. పతంజలి మహర్షి సూచించిన ఆసనాల్లోనూ 'నమస్కరించడం' ఓ ప్రధాన భాగం. ధ్యానంలోనే హృదయాన్ని, ఆత్మను ఏకోన్ముఖం చేయాలి. ఆ స్థితిలో నమస్కరిస్తే, మానవుడి అహం నశిస్తుందని పురాణ కథనం.

నిష్కల్మషమైన హృదయ సమర్పణమే ప్రణామం. దీనివల్ల దైవం, గురువుల వాత్సల్యం సాధకుడికి లభిస్తుంది. అతడి భావంలో, బాహ్యంలోనూ నిర్మలత్వం వెల్లివిరుస్తుంది!



అంతర్యామి

- అప్పరుసు రమాకాంతరావు

నిధులు కుమ్మరించి.. నీరసించి

నిండా మునిగిపోతున్న బ్యాంకులు ■ కుంభకోణాల చరిత్ర ఈనాటిది కాదు...

సాధారణ ఖాతాదారుడు బ్యాంకుకు వెళ్లి ఒక లక్ష రూపాయిలు అప్పు కావాలంటే, సవాలక్షా అడుగుతారు. లక్ష రుణానికి నాలుగైదు లక్షల విలువ చేసే ఆస్తిని తనఖా పెట్టమంటారు. రోజుల తరబడి తిప్పుతారు. ఏదైనా ఇబ్బంది ఎదురై ఒకటి, రెండు నెలల వాయిదాలు కట్టక పోతే పీకల మీదకు వచ్చి కూర్చుంటారు. కానీ అదే పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులకు, వ్యాపారవేత్తలకు చెందిన సంస్థలకు మాత్రం వందల, వేల కోట్ల రూపాయిలు ధార పోస్తున్నాయి మనదేశంలోని బ్యాంకులు. తాజాగా వెలుగులోకి వచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంకులోని రూ.11,000 కోట్ల కుంభకోణం ఈ కోవలోనిదే. ఎంత ఇస్తున్నామో, ఆ సొమ్ము తిరిగి వస్తుందో... రాదో తెలుసుకోకుండా, ఇష్టానుసారం సొమ్ము ఇచ్చేసి... తేడా వచ్చాక నాలిక కరుచుకుంది ఈ అగ్రశ్రేణి ప్రభుత్వ రంగ బ్యాంకు. ఇక ఇటువంటి బ్యాంకు కుంభకోణాలు మనదేశంలో కొత్తేమీ కాదు. ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే.... ప్రభుత్వ బ్యాంకు అయిన ఇండియన్ బ్యాంకు నుంచి నేటి పంజాబ్ నేషనల్ బ్యాంకు వరకూ ఎన్నో ఉదంతాలు కనిపిస్తాయి.

ఇండియన్ బ్యాంకు కుంభకోణం

1980- 90 ప్రాంతంలో ఇండియన్ బ్యాంకులో చోటుచేసుకున్న దాదాపు రూ.1500 కోట్ల కుంభకోణంలో ఆ బ్యాంకు సీఎండీ ఎం. గోపాలకృష్ణనే ప్రధాన సూత్రధారి. ఆయనకు రాజకీయంగా ఎంత పలుకుబడి ఉందంటే, ఇండియన్ బ్యాంకు సీఎండీగా ఆయనకు ఏడుసార్లు 'పొడిగింపు' లభించింది. తమిళనాడులోని టీఎంసీ, కాంగ్రెస్ నాయకులతో ఆయనకు బలమైన బంధం ఉందనేది బహిరంగా రహస్యమే. రాజకీయ నాయకులకు చెందిన ఊరూ పేరూ లేని కంపెనీలకు, బినామీ/ బోగస్ కంపెనీలకు భారీగా అప్పులిచ్చి బ్యాంకుకు కోలుకోలేని నష్టం చేసిన విషయం 1996లో వెలుగులోకి వచ్చింది. కానీ గోపాలకృష్ణన్‌పై చర్య తీసుకునే విషయంలో దర్యాప్తు సంస్థలు చాలాకాలం పాటు మీనమేషాలు లెక్కించాయి. దానికి కారణం అప్పట్లో అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు ఆయనకు అండగా నిలవటమే. చివరికి గోపాలకృష్ణన్ మీద, ఆ బ్యాంకులోని ఇతర అధికార్ల మీద దాదాపు 20 కేసులు నమోదయ్యాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే..., బ్యాంకు నుంచి అప్పులు తీసుకొని ఎగవేసిన ఏ ఒక్క రాజకీయ నాయకుడి మీదా కేసు లేకపోవటం. కానీ ఈ కుంభకోణం ఇండియన్ బ్యాంకు ప్రతిష్ఠను బాగా దెబ్బతీసింది.

గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు

1980 తర్వాత దేశంలో కొత్త తరం ప్రైవేటు రంగ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. మదుపరులను ఆకట్టుకునేందుకు అధిక లాభాలు చూపించాల్సిన అవసరం ఈ బ్యాంకులకు వచ్చింది. అలా కొత్తగా ఏర్పాటై, శరవేగంగా విస్తరించిన బ్యాంకుల్లో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు (జీటీబీ) ఒకటి. ఈ బ్యాంకు స్టాక్ బ్రోకర్, మదుపరి అయిన కేతన్ పరేఖ్ చేతుల్లో చిక్కుకొని పతనం అయింది. స్టాక్ మార్కెట్లో షేర్ల ధరలను కృత్రిమంగా పెంచేందుకు అవసరమైన నిధుల కోసం కేతన్ పరేఖ్ కొన్ని బ్యాంకుల మీద ఆధారపడవలసి వచ్చింది. కేతన్‌కు అలా సరైన తనఖా, పూచీకత్తు, వ్యాపార ప్రణాళిక లేకుండా రుణాలు ఇచ్చిన బ్యాంకుల్లో మాధవ్‌పురా కో-ఆపరేటివ్ బ్యాంకు, గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఉన్నాయి. అంతా సజావుగా ఉన్నంత కాలం ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు. ఎప్పుడైతే 2001లో స్టాక్‌మార్కెట్ కుప్పకూలిందో అప్పుడు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఇరకాటంలో పడింది. కేతన్ పరేఖ్ తీసుకున్న అప్పులు తిరిగిరాలేదు. డిపాజిటర్లకు సొమ్ము తిరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. 2003-04లో జీటీబీ రూ.272 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. నిరర్థక ఆస్తులు, ఆ బ్యాంకు ఇచ్చిన అప్పుల్లో 20 శాతానికి చేరుకున్నాయి. దీంతో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో, జీటీబీని విలీనం చేశారు.

బ్యాంక్ ఆఫ్ కరద్ (బీఓకే), మెట్రోపాలిటన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ (ఎంసీబీ)

పేరొందిన స్టాక్ మార్కెట్ స్కాంస్టర్ - హర్షద్ మెహతా వలలో చిక్కుకొని కుప్పకూలిన బ్యాంకులు ఇవి. ముంబాయి కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ బ్యాంకులను 1990 ప్రాంతంలో హర్షద్ మెహతా స్టాక్‌మార్కెట్లో తన చట్టవ్యతిరేక కార్యకలాపాల కోసం ఇష్టానుసారం వాడుకున్నారు. బ్యాంకుల వద్ద ఉండే ప్రభుత్వ సెక్యూరిటీల క్రయవిక్రయాల్లో మధ్యవర్తిగా మారి, అక్కడ లొసుగులను వాడుకొని బాంబే స్టాక్ మార్కెట్ సూచీలను, షేర్ల ధరలను ఇష్టానుసారం పెంచి సొమ్ము చేసుకున్నాడు. కానీ ఈ కుంభకోణం ఎక్కువ కాలం సాగలేదు. అది వెలుగు చూసిన తర్వాత కటకటాల పాలయ్యాడు. కానీ హర్షద్ మెహతా పుణ్యమా... అని రెండు బ్యాంకులు పూర్తిగా దివాలా తీయగా, పలు అగ్రశ్రేణి ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీగా నష్టపోయాయి.

పంజాబ్ నేషనల్ బ్యాంకు

పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ముంబాయి శాఖలో వెలుగులోకి వచ్చిన నీరవ్ మోదీ కుంభకోణమే ఇటీవల కాలంలో దేశంలో వెలుగులోకి వచ్చిన అతిపెద్ద బ్యాంకు కుంభకోణం. తన జ్యూవెల్లరీ కంపెనీల పేరుతో పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి 150 ఎల్ఓయూ (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)లు తీసుకొని వాటి ద్వారా రూ.11,400 కోట్ల మోసపూరిత లావాదేవీలు నిర్వహించి బ్యాంకుకు భారీగా నష్టం చేసిన నీరవ్ మోదీ కోసం ఇప్పుడు సీబీఐ అన్వేషణ సాగిస్తోంది.

ఇటీవలి ఉదంతాలు

- పలు బినామీ కంపెనీల పేరుతో ఖాతాలు తెరిచి ఆంధ్రా బ్యాంకును భారీగా మోసపుచ్చారనే ఆరోపణలపై ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ ఒకరిని, గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ డైరెక్టర్లు మరికొందరిని గత నెలలో అరెస్టు చేశారు.
- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పుణె జోన్ మాజీ అధిపతిని రూ.836 కోట్ల మోసం కేసులో గత ఏడాది జులైలో సీబీఐ అరెస్టు చేసింది. నిబంధనలను అతిక్రమించి ఒక సరకు రవాణా సేవల కంపెనీకి ఆయన ఫోర్జరీ పత్రాలతో ఆధారంగా రూ. 2,802 కోట్ల రుణం ఇచ్చినట్లు ప్రధాన ఆరోపణ.
- కెనరా బ్యాంకు, విజయా బ్యాంకుల నుంచి మోసపూరితంగా రూ.790 కోట్ల మేరకు అప్పు తీసుకొని ఆ సొమ్ము వేరే అవసరాలకు మళ్లించిన కేసులో మైనింగ్, విద్యుత్తు రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అభిజిత్ గ్రూపు డైరెక్టర్లను అరెస్టు చేశారు. దాదాపు 20 బ్యాంకుల నుంచి ఈ గ్రూపు సంస్థలు రూ.11,000 కోట్లకు పైగా అప్పులు తీసుకొని తిరిగి చెల్లించలేని స్థితికి చేరింది.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సారథ్యంలోని 25 బ్యాంకుల కన్సార్టియం నుంచి కోలకతాకు చెందిన శ్రీ గణేష్ జ్యూవెల్లరీ హౌస్ అనే సంస్థ అప్పులు తీసుకొని రూ.2,223 కోట్ల మేరకు నష్టం చేసినందుకు ఆ సంస్థ ప్రమోటర్ నీలేష్ పరేఖ్‌ను గత ఏడాది మే నెలలో అరెస్టు చేశారు.
- న్యూదిల్లీ లోని బ్యాంక్ ఆఫ్ బరోడా అశోక్ విహార్ శాఖలో 2016లో రూ 5 వేల కోట్ల విదేశీ మారకద్రవ్య బదిలీ కుంభకోణం వెలుగుచూసింది. ఈ ఉదంతంలో మనీష్ జైన్ అనే వ్యాపారిని, మరో నలుగురు మధ్యవర్తులను అరెస్టు చేశారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం



దిల్లీ చాణక్యపురిలోని నీరవ్ మోదీకి చెందిన నగల దుకాణంపై ప్రియాంక చోప్రా ప్రచార చిత్రాలు

నీరవ్‌పై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న ప్రియాంక చోప్రా

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మోసం వ్యవహారంలో నిందితుడు నీరవ్ మోదీపై ప్రముఖ బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. నీరవ్‌కు చెందిన వజ్రాభరణాల సంస్థకు ప్రపంచవ్యాప్త ప్రచారకర్త (గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్)గా గతంలో పనిచేసిన ఆమె.. ఒప్పందం మేరకు తనకు సంస్థ చెల్లింపులు చేయకుండా మోసగించిందని ఆరోపించారు. ఈమేరకు ఆమె వ్యాజ్యం వేసేందుకు సిద్ధమవుతున్నారు. పీఎన్‌బీ మోసం వ్యవహారం పట్ల ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా నీరవ్ మోసాలు బయటపడుతున్న నేపథ్యంలో.. కొందరు బాలీవుడ్, హాలీవుడ్ ప్రముఖులతో అతనికి ఉన్న సంబంధాలు కూడా వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి వ్యక్తుల ద్వారానే దశాబ్ద కాలంలో నీరవ్ తన సంస్థలకు ప్రముఖ గుర్తింపు తెచ్చుకోగలిగినట్లు తెలుస్తోంది.

బ్యాంకులకు రూ. వేల కోట్ల టోకరా

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు టోకరా వేసిన సూరత్ నగల వ్యాపారి నీరవ్ మోదీలాంటివారు మన దేశంలో ఇంకా కొందరు ఉన్నారు. వీరంతా రూ. వందల, వేల కోట్ల మేర బ్యాంకులను బురిడీ కొట్టించో, ఫెమా నిబంధనలను ఉల్లంఘించో, ఆదాయపు పన్ను ఎగ్గొట్టో విదేశీయులకు ఎగిరిపోయినవారే.



విజయ్‌మాల్యా: ఈ మద్యం వ్యాపారిపై మనదేశంలో ఎన్నో కేసులు నడుస్తున్నాయి. ఈయనగారి కంపెనీలు.. భారతీయ బ్యాంకులకు రూ.9000 కోట్లు ఎగవేశాయి. మార్చి 2016లో పలు బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆయన విదేశాలకు వెళ్లకుండా ఆదేశాలివ్వాలని అభ్యర్థించాయి. న్యాయస్థానం పూర్తిగా స్పందించేలోపే ఆయన లండన్ వెళ్లిపోయాడు. ప్రతివారం ఆయన ఖర్చులకు ఇచ్చే భత్యాలను సైతం యూకే న్యాయస్థానం మూడురెట్లు పెంచింది. గత ఏడాది అరెస్టు అయినా బెయిల్ మంజూరైంది. తన అరెస్టుపై స్పందించాలన్న విలేకరులతో...'భారత మీడియాలో ఎప్పుడూ ఉండే రచ్చే' అంటూ తేలిగ్గా కొట్టిపారేశాడీయన.



లలిత్‌మోదీ: కోచి ఐపీఎల్ బృందం గురించిన రహస్య సమాచారాన్ని 2010లో బట్టబయలు చేయడంతో ఇతనికి కష్టాలు ఆరంభమయ్యాయి. తన కుటుంబ భద్రతకు రక్షణ లేదంటూ ఇంగ్లాండ్‌కు పారిపోయాడు. 2011లో ఈయన పాస్‌పోర్టు రద్దు అయింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం-ఫెమాను ఉల్లంఘించాడని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బ్లూకార్నర్ ఇంటర్‌పోల్ నోటీసు జారీ చేసింది. ఈడీ నోటీసులు చెల్లవని పేర్కొంటూ లండన్‌లోని న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. లలిత్ మోదీ, బీసీసీఐ అధికారులు, ఇతర ప్రైవేటు సంస్థలు కలిపి రూ.2,148.3 కోట్ల మేర ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు పార్లమెంటరీ స్థాయీ సంఘానికి సమర్పించిన నివేదికలో ప్రభుత్వం వెల్లడించింది.



దీపక్ తల్వార్: కార్పొరేట్ కంపెనీలకు సలహాదారుగా పనిచేసిన దీపక్ తల్వార్ ప్రపంచవ్యాప్తంగా చక్రం తిప్పాడు. ఆదాయపు పన్ను(ఐటీ) ఎగవేయడంలో సలహాలిస్తూ, బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్స్‌లాంటి ప్రాంతాల నుంచి అనేక లావాదేవీలు జరిపాడు. యూపీఏ హయాంలో విమానయాన కంపెనీలకు అనేక మేళ్లు సాధించిపెట్టాడు. అతడి కుటుంబ సభ్యుల వ్యక్తిగత, కార్పొరేట్ బ్యాంకు ఖాతాల్లో వందల కోట్లు లావాదేవీలు నిర్వహించాడు. ఇతనిపై ఐటీశాఖ ఐదు ఫిర్యాదులు చేసింది. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. కుటుంబంతో సహా యూఏఈ పారిపోయాడు. ఆ దేశం విడిచి వెళ్లకుండా చేయడంలో మాత్రం భారత్ కృషి ఫలించింది. దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర లెక్కలు చూపని ఆదాయానికి సంబంధించి ఆయనపై ఐటీ విభాగం దర్యాప్తు చేపడుతోంది.



సంజయ్ భండారి: ఆయుధ వ్యాపారరంగంలో అత్యంత వివాదాస్పదుడు. 2016లో ఆదాయపు పన్నుశాఖ ఆయన ఇంట్లో జరిపిన దాడుల్లో మనదేశ రక్షణశాఖకు చెందిన రహస్య దస్త్రాలు బయటపడ్డాయి. రక్షణశాఖ కొనుగోళ్లు, ప్రతిపాదనలకు సంబంధించిన సమాచారం వాటిలో ఉంది. అధికార రహస్యాల చట్టం కింద దిల్లీలోని ఓ కోర్టు భండారిని నేరగాడిగా ప్రకటించింది. పన్ను ఎగవేత కేసుల్లోనూ అతడు నిందితుడు. భండారి మనదేశం విడిచి నేపాల్ గుండా విదేశాలకు పారిపోయినట్లు సమాచారం. భారత్ బయట ఆయన సమకూర్చుకున్న రూ.150 కోట్ల ఆస్తులకు పన్ను ఎగవేశారన్న ఆరోపణలు నమోదయ్యాయి.

చోక్సీ అక్రమాలపై 2016లోనే పీఎంఓకు ఫిర్యాదు

బెంగళూరు: పీఎన్‌బీని రూ.వేల కోట్ల మేర మోసగించిన కేసులో నిందితుడిగా ఉన్న మెహల్ చోక్సీ అక్రమాలను.. గతంలోనే ప్రధానమంత్రి కార్యాలయ అధికారుల దృష్టికి ఓ వ్యక్తి తీసుకువెళ్లారు. 2016 జులై 26న బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే ఆయన.. చోక్సీ, అతడు ఎండీగా ఉన్న గీతాంజలి జెమ్స్ సంస్థలపై ఫిర్యాదు చేస్తూ పీఎంఓకి లేఖ రాశారు. గీతాంజలి జెమ్స్ దేశవిదేశాల్లో డొల్ల సంస్థలను ఏర్పాటుచేసి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని తరలిస్తున్నట్లు ఆయన ఇందులో పేర్కొన్నారు. అక్రమాల సూత్రధారులు దేశం విడిచి పారిపోకముందే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. 'కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్' విజయ్ మాల్యా, 'సహారా గ్రూప్' సుబ్రతా రాయ్, 'సత్యం కంప్యూటర్స్' రామలింగరాజులు పాల్పడిన అక్రమాల తరహాలోనే.. ఇదీ పెద్ద కుంభకోణం కావొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలాంటివి చెల్లవ్ 'నీరవ్'!

- పీఎన్‌బీ కేసులో ఎంత పెద్దవారున్నా వదలబోం
- కాంగ్రెస్ హయాంలోనే కుంభకోణానికి బీజాలు
- కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యలు



దిల్లీ

వేల కోట్ల రూపాయల పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో పాత్ర ఉన్న వారు ఎంత పెద్దవారైనా దర్యాప్తు సంస్థలు వదిలిపెట్టబోవని భాజపా స్పష్టంచేసింది. ఈ కేసుపై కేంద్ర ప్రభుత్వంపైన, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపైన కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ఖండించింది. పీఎన్‌బీ వ్యవహారంలో విపక్షం విమర్శలను తిప్పికొట్టే బాధ్యతను కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు అప్పగించింది. ఆయన గురువారం ఇక్కడ విలేఖరుల సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ వ్యాఖ్యలను ఖండించారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీని.. 'చోటా మోదీ'గా కాంగ్రెస్ చేసిన విమర్శలపై ఆయన మండిపడ్డారు. ఇవి అభ్యంతరకర, బాధ్యతారాహిత్య వ్యాఖ్యలన్నారు. నీరవ్, మరో నిందితుడి వ్యవహారంపై అప్రమత్తం చేస్తూ బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ రాసిన లేఖపై ప్రధాన మంత్రి కార్యాలయం ఏం చర్యలు తీసుకుందన్న విలేఖరుల ప్రశ్నకు స్పందిస్తూ.. "దీనిపై వివిధ శాఖలు తీసుకున్న చర్యలను తర్వాత తెలియజేస్తాం'' అని చెప్పారు. ఈ మోసం 2011లో.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మొదలైందన్నారు. నీరవ్ వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీకి ఆ పార్టీ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. 2011-13 మధ్యకాలంలో చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ సంస్థ ఆదాయం రెట్టింపైందన్నారు. 2013లో ఆయన నిర్వహించిన ఒక కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వెళ్లారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ కుంభకోణాన్ని వెలికి తీశామని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి వెంట దావోస్ వెళ్లిన ప్రతినిధి బృందంలో నీరవ్ లేరని, ఆయన సొంతంగానే అక్కడికి వెళ్లారని చెప్పారు. గ్రూప్ ఫొటో కోసం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రతినిధి బృందంతో కలిసి వచ్చారని తెలిపారు. నీరవ్‌కు, ప్రధానికి మధ్య విడిగా ఎలాంటి సమావేశం జరగలేదన్నారు. "ఈ వ్యవహారంపై ఫొటో రాజకీయాలు చేయవద్దు. చోక్సీ వంటివారితో కాంగ్రెస్ నేతలు ఫొటోలు దిగారు. పగిలిపోయిన అద్దాల మేడల్లో ఉండేవారు మాపై రాళ్లు రువ్వరాదు. మోదీ ప్రభుత్వం పూర్తి నిజాయితీతో పనిచేస్తోంది'' అని చెప్పారు. పీఎన్‌బీ వ్యవహారంలో బ్యాంకింగ్ నిబంధనలన్నింటినీ ఏమార్చరని పేర్కొన్నారు. అయితే ప్రజాధనాన్ని వృథా కానివ్వబోమని స్పష్టంచేశారు.

నీరవ్ కుంభకోణం వెలుగులోకి వచ్చిన వెంటనే సీబీఐ, ఈడీలు వేగంగా చర్యలు తీసుకున్నాయని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. రూ.1300 కోట్ల విలువైన సొమ్మును నిందితుల నుంచి సీజ్ చేశాయని తెలిపారు. నీరవ్‌ను తిరిగి భారత్‌కు రప్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం భారత పలుకుబడి పెరిగిందని, మన దేశ వాణిని విదేశాలు ఆలకిస్తున్నాయని తెలిపారు. "వేచి చూడండి.. మేం ఎలాంటి తీసుకోబోతున్నామో మీకే తెలుస్తుంది. విజయ్ మాల్యా వ్యవహారంలో మేం తీసుకున్న చర్యల్లో ఏమైనా అలసత్వం ఉందా'' అని ప్రశ్నించారు.

ప్రభుత్వ ఒత్తిడి వల్లే బయటపడింది

నీరవ్ మోదీ మోసం కేసులో సొమ్మును తిరిగి రాబడతామని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి వల్లే ఈ వ్యవహారం బయటకొచ్చిందన్నారు. దీనిపై ఆయన గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కలిసి ఈ కేసులో తాజా పరిణామాలను వివరించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ.. "ఈ దఫా కూడా నీరవ్ ఎల్‌వోయూల పొడిగింపును అనుమతించినట్లయితే మోసం ఇప్పటికీ బయటపడేది కాదు. ప్రక్షాళన కోసం వచ్చిన ఒత్తిడి వల్ల బ్యాంకు తనంతట తానే ఈ కుంభకోణాన్ని గుర్తించింది'' అని తెలిపారు. ఈ మోసం ఏడేళ్లపాటు నిరాటంకంగా ఎలా సాగిందన్న ప్రశ్నకు.. అది వ్యవస్థకు సంబంధించిందని, దానిపై నిశితంగా పరిశీలించాల్సి ఉందన్నారు. "ఈ వ్యవహారంలో ఎవరినీ వదిలేది లేదు. ఇది ఒక బ్యాంకు శాఖలో జరిగిన వ్యవహారం. ఇతర బ్యాంకులకు విస్తరించే అవకాశం లేదు. అన్ని బ్యాంకులనూ అప్రమత్తం చేశాం. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు సరిపడా నిధులు ఉన్నాయి'' అని పేర్కొన్నారు.

ఆడిట్ వైఫల్యం!

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో చోటు చేసుకున్న భారీ కుంభకోణం.. బ్యాంకుల ఆడిట్ వ్యవహారాల్లోని లొసుగులను బయటపెట్టింది. సాధారణంగా బ్యాంకుల్లో స్టాట్యుటరీ ఆడిట్ (బ్యాంకులు నియమించే ఆడిటర్లు చేపట్టే ఆడిట్), కాంకరెంట్ ఆడిట్ (బ్యాంకు శాఖల్లో బయటి ఆడిటర్లు చేపట్టే ఆడిట్), అంతర్గత ఆడిట్ (బ్యాంకు సిబ్బంది చేపట్టేది), ఆర్‌బీఐ తనిఖీలుంటాయి. ఇన్ని రకాల ఆడిట్‌లు ఉన్నా ఇంతటి భారీ కుంభకోణం జరగడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. పీఎన్‌బీ నుంచి భారీ ఎత్తున నిధులు రుణం రూపంలో మళ్లడంలో కీలక పాత్ర పోషించింది లెటర్ ఆఫ్ క్రెడిట్. సాధారణంగా లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను పూచీకత్తు పొందిన తర్వాతే జారీ చేయాలి. కానీ బ్యాంకుల్లో ఈ ప్రక్రియ సరిగా జరగడం లేదని నిపుణులు చెబుతున్నారు. పీఎన్‌బీ కేసులో ఒక బ్యాంకు, ఒక శాఖ వ్యవహారమే బయటకు వచ్చిందని, ఇలాంటి అవకతవకల లావాదేవీల్లో ఇంకెన్ని బ్యాంకులు, శాఖల ప్రమేయ ముందోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పీఎన్‌బీ కుంభకోణంలో ఆర్‌బీఐ.. ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అభిప్రాయపడుతున్నారు.

కుంభకోణం బయట పడడానికి ఏడేళ్లా?

నీరవ్ మోదీ కుంభకోణం కనుక్కోవడానికి పంజాబ్ నేషనల్ బ్యాంకుకు ఏడేళ్ల సమయం పట్టడం విజయ్‌మాల్యా కేసును తలపిస్తోంది. రెండు కేసుల స్వభావం వేరయినప్పటికీ కుంభకోణాన్ని సరైన సమయంలో బ్యాంకులు వెలుగులోకి తీసుకురాకపోవడమనేది ఉమ్మడిగా కనిపిస్తున్న అంశం. విజయ్‌మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ సంస్థ రుణాలను 2012లో నిరర్థక రుణాలుగా ప్రకటించారు. అప్పటికీ బ్యాంకు అధికారులు సీబీఐకి ఫిర్యాదు చేయలేదు. 2015 జులైలో సీబీఐనే సుమోటోగా కేసు నమోదు చేసింది. నీరవ్ మోదీ కుంభకోణం 2011లోనే మొదలయింది. అయినా ఆడిట్ నివేదికల్లో ఈ కుంభకోణం బయటపడకపోవడం అనుమానాలకు తావిచ్చే అంశమే. ఈ విషయమైన బ్యాంకు అధికారుల నుంచి స్పష్టమైన వివరణ లేదు.

నీరవ్‌మోదీకి సంబంధించి హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.వేల కోట్లకు మోసం చేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నీరవ్‌మోదీకి సంబంధించి దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు హైదరాబాద్‌లోనూ తనిఖీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ ఈడీ విభాగానికి చెందిన ప్రత్యేక బృందాలు నగరంలోని ఒక బంగారు దుకాణంలో సోదాలు చేపట్టారు. మోదీ వ్యాపార సంస్థలకు అనుబంధంగా ఈ దుకాణం నిర్వహిస్తున్నట్లు, డిల్లీలోనీ ఈడీ ప్రధాన కార్యాలయం ఆదేశాలకు అనుగుణంగానే ఈ దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పలు పత్రాలు, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన దస్త్రాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

భాజపా ప్రభుత్వ అండ లేదంటారా?

"ప్రధాని కార్యాలయంతో సంబంధాలుండటం వల్లే నీరవ్ మోదీ విదేశాలకు ఎగిరి పోగలిగాడు. భాజపా ప్రభుత్వం అండ లేకుండానే అతను గానీ, విజయ్‌మాల్యాగానీ దేశాన్ని విడిచివెళ్లడం సాధ్యమైందంటే నమ్మగలమా? 2016 జులై 16 నుంచి నీరవ్‌పై నమోదైన 42 ఎఫ్ఐఆర్‌లు పీఎంఓ దృష్టికి వెళ్లినా.. ఎందుకు చర్యలు తీసుకోలేదు? విదేశాలకు ఎలా వెళ్లిపోనిచ్చారు? ఇన్ని తెలిసినా దావోస్ సదస్సులో ఫొటోకు అతనికి ఎందుకు అనుమతిచ్చారు?''

– అరవింద్ కేజ్రీవాల్, అశుతోష్ (ఆప్ నేతలు)

పేదలు పన్నులు కడుతుంటే.. సంపన్నులు దోచేస్తున్నారు!

"పేద, మధ్య తరగతి ప్రజలు పన్నులు చెల్లిస్తుంటే.. సంపన్నులు ప్రజాధనాన్ని దోచుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. దావోస్ బృందచిత్రంలోకి నీరవ్ ఎలా వచ్చాడో మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి.

– సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

అదెంత పెద్ద మొత్తమో తెలుసా!

"రూ. 11వేల కోట్లు.. ఎంత పెద్ద మొత్తమంటే.. తాజా బడ్జెట్‌లో కొత్త ఆరోగ్య, విద్య సెస్‌ద్వారా పన్నుచెల్లింపుదారుల నుంచి వసూలు చేయాల్సినంత..''

– డెరెక్ ఓబ్రెయిన్, తృణమూల్ కాంగ్రెస్

రెండో అతిపెద్ద మోసం..

"ఇప్పుడు బయటపడింది రెండో అతిపెద్ద బ్యాంకు మోసం. సంవత్సరాల తరబడి సాగుతున్నా సీబీఐ ఎందుకు ఇంత సమయం తీసుకుంది? తన హయాంలో ఇలాంటి మోసం వెలుగు చూసినందున దీనిపై ప్రధాని మోదీ దేశానికి జవాబు చెప్పాలి.''

– డి.రాజా, సీపీఐ

అతిపెద్ద మోసాన్ని అడ్డుకోలేకపోయారు!

- నీరవ్ విదేశాలకు ఎలా ఎగిరిపోయాడు?
- ఇది రూ. 30 వేల కోట్ల కుంభకోణం
- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు

దిల్లీ: భారత్‌లో అతిపెద్ద బ్యాంకు మోసాన్ని ముందే తెలిసినా.. మోదీ ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని కాంగ్రెస్ విమర్శించింది. విజయ్ మాల్యా, లలిత్ మోదీలతో పాటు వ్యాపారవేత్త రిషీ అగర్వాల్‌లతో నీరవ్ మోదీని పోలుస్తూ.. వీరంతా కోట్లాది రూపాయలకు మోసంచేసి విదేశాలకు ఎగిరిపోతున్నారని విమర్శించింది. రెండు డజన్ల ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించి దాదాపు రూ. 30 వేల కోట్ల లావాదేవీలతో ఈ కుంభకోణం ముడిపడి ఉందని ఆరోపించింది. నీరవ్ మోదీ ప్రధాని వద్ద తన పలుకుబడిని ఉపయోగించి తప్పించుకుపోతుంటే ఎన్డీయే ప్రభుత్వం వేరే వైపు చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశాన్ని దోచుకోవడానికి నీరవ్ మోదీకి అవకాశమిచ్చారని.. దావోస్‌లో అతను ప్రధాని మోదీ కలిశారని విమర్శించారు.

దావోస్‌లో నీరవ్ చిత్రం విడుదల..: గత నెలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రధాని, వాణిజ్య ప్రతినిధులతో కలిపి నీరవ్ ఉన్న చిత్రాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ విడుదల చేసింది. నీరవ్ మోదీని 'చోటా మోదీ-2' గాను.. లలిత్ మోదీని 'చోటా మోదీ-1' గాను కాంగ్రెస్ కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా ఎద్దేవా చేశారు. తమ పార్టీ ఆరోపణలకు ఆధారాలను చూపుతూ - బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి నీరవ్ మోదీ, అతని భాగస్వామి మెహుల్ చోక్సీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గతంలో చేసిన ఫిర్యాదు ప్రతిని విడుదల చేశారు. ఈ లేఖను 2016 జులై 26న ప్రధాని కార్యాలయం గుర్తించినట్లు విలేకరుల సమావేశంలో సుర్జేవాలా తెలిపారు. ఈమేరకు మోసం వ్యవహారం ముందే ప్రధాని దృష్టికి వచ్చిందని.. నీరవ్‌పై మరో 42 ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు కూడా ప్రధానికి తెలుసునని ఆరోపించారు. మొత్తం వ్యవస్థ గాడి తప్పిందని.. నియంత్రణ వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని ఆరోపించారు. ప్రజాధనంతో ఇలా ఎగిరిపోవడం సాధారణమైపోయిందా? దీనికి బాధ్యులెవరు? నీరవ్‌ను ఎవరు కాపాడుతున్నారు? అని ప్రశ్నించారు. ఈ అంశంపై ఇంతవరకు ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలు మాట్లాడలేదని.. అనేక ప్రశ్నలకు వారు జవాబులు చెప్పాల్సి ఉందన్నారు. దీనికి బాధ్యత వహించాలని.. నగదును తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు. 2011లో యూపీఏ హయాంలోనే ఈ మోసం కనుగొన్నట్లు భాజపా చేస్తున్న ఆరోపణలపై ప్రశ్నించగా - అధికార పార్టీ రెండు నాల్కల ధోరణిలో వ్యవహరిస్తోందని.. ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

పురుషోత్తంరెడ్డి వియ్యంకుని కార్యాలయంలో సోదాలు

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో హెచ్ఎండీఏ సంచాలకుడు పురుషోత్తంరెడ్డికి చెందిన ఓ లాకర్ తాళం చెవిని అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులు తాజాగా గుర్తించారు. ఆయన వియ్యంకుడు రాధాచరణ్‌రెడ్డి ఇంట్లోంచి దానిని తీసుకున్నారు. కోటక్ మహీంద్రా బ్యాంకులో ఉన్న ఆ లాకర్‌ను శుక్రవారం తెరవనున్నామని ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. సోదాలు జరగొచ్చన్న సమాచారంతో పురుషోత్తంరెడ్డి భార్య, బావమరిది శ్రీనివాస్‌రెడ్డి పరారయ్యారు. అజ్ఞాతంలో ఉన్న పురుషోత్తంరెడ్డిని రప్పించేందుకు అతని బంధువులు, స్నేహితుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఆధారాల కోసం వారి ఇళ్లలో సోదాలు చేపడుతున్నారు.

కస్టడీకి బినామీలు: పురుషోత్తంరెడ్డి బినామీలు యాదవ్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డిలను అనిశా అధికారులు నాలుగు రోజులు విచారించనున్నారు. వీరిద్దరి నుంచి మరిన్ని వివరాలను సేకరించాల్సి ఉందని అనిశా న్యాయస్థానాన్ని అభ్యర్థించగా- కస్టడీకి అనుమతినిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో ఉంటున్న వీరిద్దరి శుక్రవారం అనిశా అధికారులు తమ అదుపులోకి తీసుకోనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ విచారించి, మళ్లీ జైలుకు తరలిస్తారు. యాదవ్‌రెడ్డి స్థిరాస్తి సంస్థలోకి పెట్టుబడులెలా వచ్చాయి? ఎవరు పెట్టారు? అన్న అంశాలతో పాటు నిషాంత్‌రెడ్డి ప్రారంభించిన గోల్డెన్ రిడ్జ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థను రిజిస్టర్ చేయించారా? ఆర్థిక జిల్లా (మంచిరేవుల)లో విల్లాల నిర్మాణంలో రూ.15 కోట్ల పెట్టుబడులు ఎలా సమీకరించారన్న అంశాలపై సమాచారం సేకరించనున్నట్లు తెలిసింది.

అనిశా తీరుపై హైకోర్టుకు పురుషోత్తంరెడ్డి అత్త

అనిశా అధికారుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పురుషోత్తంరెడ్డి అత్త సుదేష్ణ హైకోర్టును ఆశ్రయించారు. తన వ్యాపారం, వ్యక్తిగత జీవితంలో వారు జోక్యం చేసుకుంటున్నారన్నారు. పురుషోత్తంరెడ్డి ఆస్తులకు బినామీలుగా అంగీకరించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. శేషసాయి... పిటిషనర్ వ్యవహారంలో చట్ట నిబంధనలను అనుసరించాలని, విచారించదలిస్తే సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)కింద నోటీసులివ్వాలని అనిశాకు స్పష్టం చేశారు. ఇంటికి వేసిన సీలును తొలగించి, జీవించడానికి ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు.



గగన్‌పహాడ్‌లోని సత్యంశివంసుందరం గోశాలలో జరిగిన కార్యక్రమంలో తులాభారం వేసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం. చిత్రంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులు

సమర యోధుల సంక్షేమానికి పెద్దపీట

కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్

షేక్‌పేట, శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యమిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల (సెంట్రల్ సమ్మాన్ పెన్షనర్స్) సంక్షేమం కోసం కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గత ఏడాది 8మంది సాతంత్ర్య యోధులతో కమిటీని నియమించారు. దానికి హన్స్‌రాజ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కమిటీ తొలి సమావేశం హైదరాబాద్‌లోని డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గురువారం నిర్వహించారు. పోరాట యోధులు, వారి కుటుంబాల స్థితి గతులు, అందించాల్సిన సహాయంపై చర్చించారు. పింఛను నెలకు రూ.50వేలకు పెంచాలని, సమరయోధుల తదనంతరం వారసులైన కుమార్తె, కుమారులకు పింఛను వర్తింపజేయడం సహా పలు ఇతర ప్రతిపాదనలను కమిటీ సభ్యులు మంత్రి ముందుంచారు. గురువారం శంషాబాద్ పరిధిలోని గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో ధరమ్‌రాజ్‌రాంఖా ఆధ్వర్యంలో కొనసాగుతున్న సత్యం శివం సుందరం గోశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన తులాభారం కార్యక్రమానికి హాజరయ్యారు. బెల్లంతో మంత్రిని తులాభారం వేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ పాల్గొన్నారు.

ఖాళీగా ఏటీఎంలు.. నగదు పంపండి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ వ్యాప్తంగా ఏటీఎంలు ఖాళీ బోర్డులతో దర్శనమిస్తున్నందున తక్షణమే నగదు సరఫరా చేయాలని కరీంనగర్ ఎంపీ బి.వినోద్‌కుమార్ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి గురువారం లేఖ రాశారు. ఏటీఎంలన్నీ ఖాళీ కావడంవల్ల రోజువారీ అవసరాలకోసం వేతనజీవులు, పింఛనుదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. మౌలిక వసతుల లేమి కారణంగా ప్రత్యామ్నాయ చెల్లింపు మార్గాలు లేక ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఒక్కోసారి ఏటీఎంలలో చాలా తక్కువ మొత్తంలో డబ్బు నింపుతుండటంవల్ల అవి క్షణాల్లో ఖాళీ అవుతున్నాయని, గంటల తరబడి వరుసల్లో నిల్చున్న వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారని వినోద్‌కుమార్ తన లేఖలో పేర్కొన్నారు.



అమ్మకానికి మగ శిశువు

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘటన

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో మగ శిశువును అమ్మకానికి పెట్టింది ఓ తల్లి.. నాలుగు రోజుల కిందట జన్మించిన బిడ్డను రూ.30 వేలకు ఇస్తామంటూ గురువారం ఆసుపత్రికి వచ్చివెళ్లేవారిని పలకరించడంతో 108 అంబులెన్స్ డ్రైవర్ గమనించి మాతా శిశు సంరక్షణ విభాగం అధికారులకు చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమ మేనేజర్ ఆసుపత్రికొచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులను చూసి ఇద్దరు మహిళలు(శిశువును తీసుకొచ్చిన) పారిపోయేందుకు యత్నించగా, వారిని పట్టుకుని విచారించారు. వివాహేతర సంబంధం వల్ల శిశువు జన్మించిందని తేలడంతో మహిళలను విడిచి పెట్టి శిశువును ఆసుపత్రికి తరలించారు.

అభినందనలేనా.. ఆర్థికసాయమేదీ?

- నాబార్డు నిధులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయించండి
- 11 ప్రాజెక్టులకు రూ.వేయి కోట్లు ఇవ్వండి
- దేవాదులకు రూ.450 కోట్లు, బీమాకు రూ.35 కోట్లు ఇవ్వాలి
- పీఎంకేఎస్‌వై సమావేశంలో మంత్రి హరీశ్‌రావు
- బీమా, సీతారామ ఎత్తిపోతలకు అనుమతులివ్వండి
- కేంద్రమంత్రి హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి
- పట్టిసీమలో 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాల్సిందేనన్న రాష్ట్ర మంత్రి



దిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీ అధ్యక్షతన జరిగిన జలవనరుల సమావేశంలో రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, దిల్లీ : తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు వేగవంతంగా ముందుకెళ్తున్నాయని కేంద్రం పదే పదే అభినందిస్తోందని, తదనుగుణంగా ఆర్థికసాయం మాత్రం లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్థిక బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ(ఎఫ్ఆర్‌బీఎం) పరిధిలోకి రాకుండా నాబార్డు నిధులిచ్చినప్పుడే కేంద్రం లక్ష్యాన్ని సాధించగలుగుతుందని ఆయన తెలిపారు. గురువారమిక్కడ కేంద్ర జలవనరుల మంత్రి నితిన్‌గడ్కరీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకానికి(పీఎంకేఎస్‌వై) సంబంధించి సమావేశం నిర్వహించారు. తెలంగాణ, ఏపీ మంత్రులు హరీశ్‌రావు, దేవినేని ఉమ సహా 18 రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీకి వారంతా పలు సూచనలు, విజ్ఞప్తులు చేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (కాడ్వామ్) ప్రాజెక్టులపై కేంద్రమంత్రి సమావేశం నిర్వహించారు. తెలంగాణకు సంబంధించి వేగంగా నిర్మించే సాగునీటి ప్రాజెక్టుల లబ్ధి కార్యక్రమం(ఏఐబీపీ)లో 11 ప్రాజెక్టులున్నాయి. రెండింటిని పూర్తిచేశాం. జూన్ 2018కి ఆరు పూర్తిచేస్తాం. మార్చి 2019కి మిగతావి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పాం. కాడ్వామ్ కింద దేవాదుల ప్రాజెక్టుకి రూ.450 కోట్లు, బీమాకు రూ.35 కోట్ల విడుదల చేయాలని కోరాం. పీఎంకేఎస్‌వైలో 99 ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయి కేంద్ర లక్ష్యం నెరవేరాలంటే అవుటాఫ్ ఎఫ్ఆర్‌బీఎం కింద నాబార్డు నుంచి నిధులు రాష్ట్రాలకివ్వాలని కోరాం. దీనికి కేంద్రమంత్రి గడ్కరీ అంగీకరించారు. ప్రధాని దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామన్నారు. ప్రాజెక్టుల నమూనాలు, ప్రణాళిక పరంగా కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేదు. గ్రాంటూ ఇవ్వడం లేదు. ఇచ్చే అప్పులైనా దీర్ఘకాలికంగా అవుటాఫ్ ఎఫ్ఆర్‌బీఎం కింద ఇవ్వగలిగినప్పుడు రాష్ట్రాలు వేగంగా ప్రాజెక్టులు పూర్తిచేస్తాయి. కాడ్వామ్ కింద తెలంగాణ నుంచి 11 ప్రాజెక్టులకు రాష్ట్రం రూ.వేయి కోట్లు కేటాయించింది. కేంద్రం మరో రూ.వేయి కోట్లు ఇచ్చి సహకరించాలని కోరాం. నిధులిస్తామని కేంద్రమంత్రి హామీఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు చూడడానికి రావాలని కోరగా వస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్రం తీసుకుంటున్న శ్రద్ధను కేంద్రమంత్రి అభినందించారు' అని హరీశ్‌రావు తెలిపారు.

పాలమూరుకు అటవీ అనుమతులివ్వండి: కేంద్ర పర్యావరణ అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిసి పాలమూరు ఎత్తిపోతలకు తొలి దశ అటవీ అనుమతులివ్వాలని కోరినట్లు హరీశ్‌రావు తెలిపారు. త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారన్నారు. బీమా, సీతారామ ఎత్తిపోతల పథకాలకు వన్యప్రాణి అటవీ అనుమతుల పెండింగ్‌లో ఉన్న విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే అనుమతులు ఇస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి ఒకసారి ప్రాజెక్టు ప్రాంతానికి రావాలని కోరినట్లు హరీశ్ వివరించారు.

జలవనరుల శాఖ సమావేశం అసంపూర్తిగా ముగిసింది: కృష్ణా, గోదావరి బోర్డులకు సంబంధించి కేంద్ర జలవనరుల శాఖ నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ముగిసిందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు పెండింగ్‌లో ఉండగా ప్రాజెక్టులను కృష్ణా బోర్డు పరిధిలోకి తీసుకురావడం సరికాదని తెలంగాణ అధికారులు సమావేశంలో చెప్పారన్నారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాల మళ్లింపుతో కృష్ణా జలాల్లో ఎగువ రాష్ట్రాలకు 45టీఎంసీల హక్కు ఉంటుందని ఈ ఏడాది కేటాయింపుల్లో తెలంగాణకు ఇవ్వాలని అధికారులు కోరారని హరీశ్ తెలిపారు.

కాళేశ్వరం, పట్టిసీమ తేడా ఉంది : కాళేశ్వరం, పట్టిసీమ ప్రాజెక్టుకు తేడా ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఆంధ్రా వాదన సరికాదని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 'ఒక నది నుంచి ఇంకో నదికి నీరు మళ్లించినప్పుడు మాత్రమే ఎగువ రాష్ట్రాలకు హక్కులు వస్తాయి. కానీ రాష్ట్ర పరిధిలో నదీ పరివాహక ప్రాంతంలో అది వర్తించదు. అవగాహన రాహిత్యంతో ఆంధ్రావారు మాట్లాడుతున్నారు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

టీవీ పెడితే పోలవరం జిందాబాద్

- సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న తెలుగు రాష్ట్రాలు
- మహారాష్ట్ర కంటే మూడురెట్లు ఎక్కువ ఖర్చుపెడుతున్న తెలంగాణ
- పీఎంకేఎస్‌వై సమావేశంలో నితిన్ గడ్కరీ

ఈనాడు, దిల్లీ: సాగునీటి రంగానికి తెలుగు రాష్ట్రాలు ఇస్తున్న ప్రాధాన్యాన్ని కేంద్ర జలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. మిగతా రాష్ట్రాలు వాటిని చూసి నేర్చుకోవాలని సూచించారు. గురువారం సాయంత్రం ఇక్కడి తన కార్యాలయంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పురోగతిపై 18 రాష్ట్రాల ప్రతినిధులతో సమీక్షించారు. ఇందులో ఏపీ, తెలంగాణ తరుపున జలవనరులశాఖ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, టి.హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిహార్ రాష్ట్రంలోని పరిస్థితులను సమీక్షిస్తున్నప్పుడు ప్రాజెక్టుల పురోగతి విషయంలో అక్కడి అధికారులు అనుసరిస్తున్న తీరును సున్నితంగా తప్పుబట్టారు. మీరు ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోండి అక్కడ టీవీ పెడితే చాలు పోలవరం జిందాబాద్... పోలవరానికి నిధులివ్వాలని మారుమోగుతుంటుంది. నీటిపారుదల రంగానికి ఆ రాష్ట్రం ఎంత ప్రాధాన్యం ఇస్తుందో దాన్ని బట్టి తెలుస్తోందన్నారు. మీరు కూడా ఆ రంగంపట్ల ప్రాధాన్యత చూపాలని సూచించారు. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరినీ ప్రస్తావించారు. మహారాష్ట్ర భూభాగంలో తెలంగాణ మూడో వంతు ఉంటుందని, కానీ మహారాష్ట్ర సాగునీటి రంగానికి రూ.7వేల కోట్లు కేటాయిస్తే, అంతకు మూడు రెట్లు ఎక్కువగా తెలంగాణ రూ.26వేల కోట్లు ఖర్చుపెడుతోందని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కూడా అదే పంథాలో వెళ్తోందని పేర్కొన్నారు. సాగునీటి రంగానికి దేశంలో మరే రాష్ట్రాలు ఇవ్వనంత ప్రాధాన్యం, బడ్జెట్‌లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఇస్తున్నాయని, దాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

నలుగురి గుప్పిట్లో రాష్ట్రం: ఎల్.రమణ

భువనగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలను నలుగురి గుప్పిట్లో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంకుశంగా కుటుంబ పాలన సాగిస్తున్నారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ విమర్శించారు. గురువారం భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ దేశంలోనే ధనిక రాష్ట్రమని ప్రకటించుకున్న కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని ఎద్దేవా చేశారు. మూడు నెలలుగా ఆసరా పింఛన్లు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. గత బడ్జెట్లలోని రూ.5లక్షల కోట్లలో ఇప్పటికే రూ.4.50 లక్షల కోట్లు అభివృద్ధి పేరిట ఖర్చు చేశామని చెబుతున్న సీఎం కేసీఆర్ అభివృద్ధి ఎక్కడని, ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలన్నారు.

వైద్య విధాన పరిషత్తులో స్పెషాలిటీ వైద్యుల విలీనం

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: కుటుంబ వైద్య, ఆరోగ్య సంచాలకుల పరిధిలో నియమితులై ఫారిన్ సర్వీసెస్ ప్రాతిపదికన సేవలు అందిస్తున్న, పదేళ్ల పైబడి సర్వీసు ఉన్న స్పెషలిస్టు వైద్యులు, కొత్త వాళ్లను తెలంగాణ వైద్య విధాన పరిషత్తు(టీవీవీపీ)లో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విధాన పరిషత్తులో స్పెషలిస్టు వైద్యుల విలీనం 2008లో చివరిసారిగా జరిగింది. దీనిపైవినతులు అందటంతో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి చొరవతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం తెలిపారు. వైద్య చరిత్రలో మొదటిసారిగా సూపర్ స్పెషాలిటీ సేవల విలీనానికి అంగీకారం కుదిరింది. దీనివల్ల కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఈ నిర్ణయం చరిత్రాత్మకమని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అభినందించింది. సంఘం అధ్యక్షుడు పల్లం ప్రవీణ్, ఉపాధ్యక్షుడు నరహరి, కోశాధికారి లాలూ ప్రసాద్ రాథోడ్ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి యాదగిరీశుని బ్రహ్మోత్సవాలు

24న కల్యాణానికి హాజరుకానున్న సీఎం దంపతులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11రోజుల పాటు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు 27న ముగుస్తాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి గీత వెల్లడించారు. 24న జరిగే కల్యాణోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు పాల్గొని ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలను అందజేస్తారు.

రూ.20వేల కోట్లతో ఉప ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి కోసం రూ.20వేల కోట్లతో ఉప ప్రణాళిక పెట్టాలని, దీనికి చట్టబద్ధత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ.2వేల కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. గురువారమిక్కడ సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 4 చొప్పున గురుకులాలు, 100 బీసీ జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు చేయాలని కోరారు. బీసీ స్టడీసర్కిల్ బడ్జెట్‌ను రూ.250కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కిన డీఈఈ

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా చేర్యాల పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) కె.చంద్రప్రకాశ్...రూ.85 వేల లంచం తీసుకుంటూ గురువారం అవినీతి నిరోధకశాఖకు చిక్కారు. చేర్యాలకు చెందిన రహీం ఉపగుత్తేదారుగా రూ.74 లక్షల విలువైన స్థానిక రహదారి పనులు చేస్తున్నారు. చేసిన పనుల నమోదుకు డీఈఈ లంచం డిమాండ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు అధికారులు గుత్తేదారు ద్వారా నగదు పంపించి డీఈఈని పట్టుకున్నారు. అనిశా డీఎస్పీ ప్రతాప్‌కుమార్ ఈ వివరాలు తెలిపారు.

70 శాతానికి ఆంక్షలు.. 30 శాతానికి కోతలు

- పంచాయతీల్లో నిధు విడుదల పరిస్థితి
- ఖజానాపై రోజుల తరబడి ఆంక్షలు
- ఇప్పుడు బ్యాంకుల్లోనూ అదే పరిస్థితి
- చేసిన పనులకు బిల్లులు అందక సర్పంచుల దిగాలు

ఈనాడు– హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులున్నా ఖర్చు పెట్టుకోలేని దుస్థితి నెలకొంది. నిధులున్నాయనే ధీమాతో సొంత సొమ్ముతో బోర్ల మరమ్మతులు వంటి పనులు చేయించిన సర్పంచులు.. రోజుల తరబడి ఖజానా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మంజూరవడం లేదని ఆవేదన చెందుతున్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు వస్తున్నా రాష్ట్ర ఆర్థిక శాఖ ఆంక్షలతో వాటిని వాడుకోలేకపోతున్నారు. పలు పంచాయతీల్లో సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు కూడా అందలేదని సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం మరో రూ.464 కోట్లు పంచాయతీల వారీగా వాటి ఖాతాల్లో జమయ్యాయి. ఆంక్షలు వైదొలగినా నిధుల్లో 30 శాతాన్ని విద్యుత్ బిల్లుల బకాయిల కోసంటూ పంచాయతీరాజ్ శాఖ తిరిగి తీసేసుకోనుండడంతో వాటికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

గ్రామ పంచాయతీల ఆస్తి పన్ను తదితర రాబడులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులన్నీ ఎప్పటికప్పుడు ఖజానా కార్యాలయాల్లో జమవుతుంటాయి. సర్పంచులు గ్రామాల్లో పని పూర్తి చేయగానే బిల్లులు అందజేసి ఖజానా అనుమతి పొందితే బ్యాంకులు ఆ మొత్తాలను చెల్లిస్తుంటాయి. పంచాయతీల్లోని సిబ్బంది వేతనాలనూ ఇదే పద్ధతిలో రాబట్టుకోవాలి. ఆర్థిక అవసరాలను సర్దుబాటు చేసుకోవడం కోసం ఈ నిధులపై తెలంగాణ ఆర్థిక శాఖ కొన్ని నెలలుగా తీవ్రమైన ఆంక్షలు విధిస్తోంది. అప్పుడప్పుడు కాస్త సడలింపు ఇచ్చినా మళ్లీ వాటిని అమల్లోకి తెస్తోంది. దీంతో పంచాయతీల్లో చేసిన పనులకు సొమ్ము ఇవ్వాలని సర్పంచులు ఇస్తున్న బిల్లులకు అనుమతి లభించటం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 14వ ఆర్థిక సంఘం ద్వారా రూ.928 కోట్ల స్థూల నిధులు, మరో రూ.119 కోట్ల పనితీరు ఆధార నిధులు అందాలి. స్థూల నిధుల్లో మొదటి విడత కింద రూ.464 కోట్లు 2017 జూన్‌లో మంజూరయ్యాయి. వాటిని పొందటానికే పలు పంచాయతీలు ఇంకా ప్రయత్నిస్తున్నాయి. కేంద్రం రెండో విడతగా గత నెలలో అందజేసిన రూ.464 కోట్లు పంచాయతీల ఖజానా ఖాతాల్లో గురువారం జమయ్యాయి. ఆర్థిక శాఖ ఆంక్షలు అమల్లో ఉన్నందున వీటిని పొందలేని పరిస్థితి కొనసాగుతోంది. కొన్ని బిల్లులను తాము ఆమోదించినా సొమ్ము అందకుండా బ్యాంకుల కేంద్రీయ సర్వర్‌లో ఏర్పాట్లు చేస్తున్నారని, ఇలాంటి పోకడలు తాము ఇప్పుడే చూస్తున్నామని ఖజానా అధికారి ఒకరు చెప్పడం గమనార్హం.

వెంటాడుతున్న విద్యుత్ బకాయిలు

ఖజానాపై ఆంక్షలు వైదొలగినప్పటికీ ప్రతి పంచాయతీకి చెందిన నిధుల్లో 30 శాతం పాత విద్యుత్ బిల్లుల కోసమంటూ పంచాయతీరాజ్ శాఖ తిరిగి తీసేసుకోనుంది. పంచాయతీలు తమ వీధిలైట్లు, తాగునీరు కోసం విద్యుత్‌ను వాడుతుంటాయి. బిల్లుల్ని తానే చెల్లిస్తానంటూ 2010లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బిల్లుల భారం తమకు లేదు కాబట్టి కొన్ని పంచాయతీలు నిర్లక్ష్యంగా పగలు కూడా వీధిలైట్లను ఆర్పేవి కావు. దీంతో పంచాయతీలే బిల్లుల్ని చెల్లించుకోవాలని తెలంగాణ సర్కారు 2016లో ప్రకటించింది. అప్పటికి ఏడేళ్ల బకాయిలు రూ.1,475 కోట్లు పేరుకుపోయాయి. పాత బకాయిలు వసూలు చేయబోమన్న పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ కార్యరూపం దాల్చలేదు. కనీసం 30 శాతానికి బదులు 10 శాతాన్ని తీసుకోవాలనే విజ్ఞప్తినీ పంచాయతీరాజ్ శాఖ పట్టించుకోలేదు. దీంతో ఇప్పుడు ఒక చిన్న పంచాయతీకి రూ.లక్ష నిధులు వచ్చాయనుకొంటే అందులో రూ.30వేలు తిరిగి విద్యుత్ బకాయిల కింద ప్రభుత్వానికే వెళ్లిపోతున్నాయి. బకాయిలు తీరేవరకు నిధులు అందే ప్రతిసారీ ఇదే తరహా కోతలు ఉండనున్నాయి.

ఆంధ్రా ఉద్యోగుల్ని తీసుకోవద్దు

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ అయిన ఉద్యోగుల్ని ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి ఇక్కడ తీసుకోవద్దని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ సంయుక్త కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. పది సంఘాలతో కూడిన ఐకాస గురువారం మధ్యాహ్నం విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహించింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ఉద్యోగులు మహాధర్నాలో పాల్గొన్నారు. వివిధ సంఘాలకు చెందిన ఐకాస ప్రతినిధులు రత్నాకర్‌రావు, బీసీ రెడ్డి, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, శ్యామ్‌మనోహర్, కుమారస్వామి, సుధాకర్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన మహాధర్నాకు తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి సంఘీభావం తెలిపారు. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రిలీవ్ చేసిన ఆంధ్రా ఉద్యోగుల విషయంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సలహా తీసుకుని ముందుకు వెళతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రితోనూ ప్రస్తావించి తగిన నిర్ణయం తీసుంటామని, తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు. అంతకు ముందు ఉద్యోగుల సంఘాల నేతలు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంలో హైకోర్టు తీర్పుపై తెలంగాణ యాజమాన్యం సుప్రీంకోర్టుకు అప్పీల్ చేయాలని లేదా హైకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని అన్నారు. రిలీవ్ అయిన ఆంధ్రా ఉద్యోగులను ఇక్కడే తీసుకోవాల్సివస్తే సూపర్ న్యూమరీ పోస్టుల్లో కొనసాగించాలే తప్ప పదోన్నతులు ఇవ్వరాదని కోరారు. మూడేళ్లుగా ఉచిత వేతనాలు తీసుకుంటూ, కోర్టుకెళుతూ, తెలంగాణ ఉద్యోగుల పదోన్నతులను ఆపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

మానవత్వాన్ని మరిచి.. గర్భిణి కడుపులో తన్ని..!

- కేరళలో దారుణం
- ఏడుగురు సీపీఎం మద్దతుదారుల అరెస్టు

కోజికోడ్: కేరళలో ఓ గర్భిణిపై అమానుషం.. మానవత్వాన్ని మరిచిపోయిన కొందరు వ్యక్తులు ఆమె కడుపులో తన్నడంతో గర్భస్రావమైంది. కట్టుకున్న భర్తపై కళ్లెదుటే దాడిచేస్తుంటే.. అడ్డుకోవడమే ఆమె చేసిన నేరమై పోయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో నిందితులను వామపక్ష మద్దతుదారులుగా భావిస్తున్నారు. అధికార సీపీఎంకు చెందిన స్థానిక నేత సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కోజికోడ్‌లో ఓ భూవివాదం నేపథ్యంలో.. గత నెల 28న ఏడుగురు వ్యక్తులు జోసనా సిబ్బి అనే మహిళ ఇంటిలోకి బలవంతంగా ప్రవేశించారు. ఆమె భర్తను తీవ్రంగా కొడుతుండటంతో నాలుగు నెలల గర్భిణి అయిన జోసనా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఆమెపై కూడా దాడిచేయడంతో రక్తస్రావమైంది. ప్రమాదకర పరిస్థితుల్లో ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు గర్భస్థశిశువును తొలగించాల్సి వచ్చింది. ఈ ఘటనను ఇరుగు-పొరుగు భూ తగాదాగా పోలీసులు తెలిపారు. దాడి జరగడానికి 15 నిముషాలు ముందే ఆమె పోలీసులకు ఫోన్ చేసి తమకు రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా కేసును ఉపసంహరించు కోవాలంటూ తమపై ఒత్తిళ్లు వస్తున్నట్లు బాధితురాలు తెలిపారు. లేనట్లయితే తన భర్త కాళ్లు నరికేస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ ఘటనతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదంటూ సీపీఎం ఖండించింది.

చరవాణికి ఛార్జింగ్ పెడుతూ యువకుడి మృతి



సతీశ్ మృతదేహం

వెల్గటూరు, న్యూస్‌టుడే: చరవాణికి ఛార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం ఎండపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం పొట్యాలకు చెందిన ఉప్పులేటి సతీశ్(22) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయిదు రోజుల కిందట ఎండపల్లిలోని సోదరి ఇంటికి వచ్చాడు. మహాశివరాత్రి పండుగ రావడంతో ఇక్కడే ఉండిపోయాడు. బుధవారం రాత్రి తన చరవాణికి ఛార్జింగ్ పెడుతుండగా సతీశ్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లడానికి 108కు ఫోన్ చేయగా అంబులెన్సు సిబ్బంది వచ్చి సతీశ్ మృతి చెందినట్లు నిర్ధరించారు.

ఇంధన పొదుపులో ప్రథమస్థానంలో నిలవాలి

- పురస్కారాల ప్రదానంలో ఆర్టీసీ ఎండీ రమణారావు



పురస్కారాలను ప్రదానం చేస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు. చిత్రంలో ఈడీ రవీందర్‌రావు, హెచ్‌పీసీఎల్ జీఎం సురేంద్రగుప్త తదితరులు

బాగ్‌లింగంపల్లి(హైదరాబాద్), న్యూస్‌టుడే: దేశంలోనే ఇంధన పొదుపులో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ప్రథమ స్థానంలో నిలవాలని సంస్థ ఎండీ జీవీ రమణారావు ఆకాంక్షించారు. ఈ దిశగా డ్రైవర్లు, మెకానిక్‌లు కృషి చేయాలని కోరారు. ఇంధన పొదుపులో రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచిన సిబ్బందికి గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 21 డిపోలే ఇంధన పొదుపులో లాభాల బాటలో సాగుతున్నాయని, ఇదే స్ఫూర్తితో మిగతా డిపోలు ముందుకు సాగాలని కోరారు. పలు డిపోలలో లీటరుకు 4.5 కిలోమీటర్లు వస్తోందని ఇక ముందు 6 కి.మీ.మేర సాధించాలని సూచించారు. ఆర్టీసీ సేవారంగమని దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారన్నారు. యాదిరెడ్డి(మియాపూర్ డిపో-2), బి.శ్రీనివాస్ (నిజామాబాద్-2 డిపో), ఆర్.నర్సింహ(నల్గొండ), ఎ.వెంకన్న (వరంగల్ డిపో-1), ఎస్.జనార్దన్‌రెడ్డి(సిద్దిపేట), పి.సుబ్బారావు(ముషీరాబాద్ -2 డిపో), టి.బాబయ్య(నాగర్‌కర్నూల్), కేపీసీ రావు(మధుర), కేవీఎస్ రెడ్డి(కరీంనగర్ డిపో-1), ఎస్.రవీందర్‌రావు(మంచిర్యాల) తదితరులు ఎండీ చేతుల మీదుగా ఉత్తమ కేఎంపీఎల్ పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ రవీందర్‌రావు, హెచ్‌పీసీఎల్ జీఎం సురేంద్రగుప్త, డిప్యూటీ జీఎం చంద్రమౌళి, పాల్గొన్నారు.

మా చిరునామా: విహారి
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

పర్యాటకానికి సంబంధించి మీ అనుభవాలు, సందేహాలు పంపించండి
vihari@eenadu.in

విహారి

చటుక్కున చెట్లెక్కే ఉడుతలు..
గబుక్కున పొదల్లోకి దూరిపోయే కుందేళ్లు..
అప్పుడప్పుడూ గాండ్రించే పులులు..
ఆ శబ్దాలకు బిత్తర పోయే హరిణాలు..
ఈ అద్భుతాలను ఆస్వాదించాలని అనుకుంటున్నారా! అయితే నల్లమల అడవిలోకి వెళ్దాం. కృష్ణానదికి ఇరువైపులా విస్తరించిన ఈ దట్టమైన అరణ్యాన్ని 'ఎకో-టూరిజం'తో పర్యాటకులకు చేరువ చేసింది ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ. ఇక్కడికి వెళ్తే.. కొమ్మల్లో పక్షుల కుకూలు వినొచ్చు. పచ్చికలో పరుగులు తీయొచ్చు. కరుకు కొండలపై ట్రెక్కింగ్ చేయొచ్చు. జీపులో అడవంతా తిరిగేయొచ్చు. ప్రకృతి ఒడిలో రెండు రోజులు ఉల్లాసంగా గడిపేయొచ్చు. వన విహారం మిగిల్చిన అనుభూతులు కొండల్లో ఎకోల్లా.. మీ మనసులో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.



కొమ్మల్లో కుకూలు.. కొండల్లో ఎకోలు..

కర్నూలు జిల్లాలోని పచ్చర్ల, బైర్లూటి, తుమ్మలబయలు నల్లమల ఎకో టూరిజానికి ఇప్పుడు కేరాఫ్. వారాంతాల్లో వందల్లో వాహనాలు ఇక్కడి వస్తాయి. అడవి దాగిన అందాలను ఆస్వాదించాలని పెద్దలు వస్తుంటే.. వన్యమృగాలను చూడాలని పిల్లలు ఆరాటపడుతుంటారు. వన విహారంలో యువత ట్రెక్కింగ్ విన్యాసాలతో అదరగొడుతుంటుంది. 'జంగిల్ క్యాంప్'లో విహారాన్ని రెండు రకాలుగా ప్రణాళిక చేసుకోవచ్చు. మొదటిది ఆయా కేంద్రాల్లోని కాటేజీల్లో బస చేసి తీరికగా అడవంతా చూడొచ్చు. లేదూ ఉదయాన్నే వెళ్లిపోయి.. సఫారీ చేసి, పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ.. స్వచ్ఛమైన గాలి పీల్చుకోవచ్చు. ఒత్తిళ్లన్నీ మరచి ఎంచక్కా సేదతీరి సాయంత్రానికి తిరుగు ప్రయాణం అవ్వొచ్చు. అందుకే వారాంతాల్లో హైదరాబాద్, విజయవాడ, కర్నూలు తదితర నగరాల నుంచి పర్యాటకులు నల్లమలకు భారీ సంఖ్యలో విచ్చేస్తుంటారు. రోజంతా హాయిగా గడుపుతారు. ఇక్కడి సౌందర్యాన్ని చూడడానికి విదేశాల నుంచి కూడా పర్యాటకులు వస్తుండటం విశేషం.

పులి కంటపడితే..


ఎకో టూరిజంలో అందరినీ ఆకర్షిస్తున్నది 'సఫారి ట్రాక్'. పచ్చర్ల జంగిల్ క్యాంప్‌లో ఈ ట్రాక్ 10-15 కిలోమీటర్లు ఉంది. ఒక్కో జీపులో ఆరుగురిని తీసుకెళ్తారు. దాదాపు రెండు గంటలుండే సఫారీ యాత్ర.. భారీ వృక్షాలు, దట్టమైన పొదల గుండా సాగిపోతుంది. ఎండ కన్నెరగకుండా గొడుగు పట్టే చెట్ల కొమ్మలు. వాటికి చిందర వందరగా అల్లుకున్న తీగలు. ఆ లతల సౌందర్యాన్ని రెట్టింపు చేసే పూలు, ఆ పూలలోని మకరందాన్ని ఆస్వాదించే తేనెటీగలు. ఆ పక్కనే పంచెవన్నెలున్న సీతకోకచిలుకలు, రంగు రంగుల పక్షులు..! వీటి అందాలు చూస్తూ మురిసిపోతుండగానే.. అల్లంత దూరాన గుబురులో ఎలుగుబంటి. దానిని చూసి భయంతో పారిపోయే దుప్పులు, జింకలు. ఇంకాస్త ముందుకెళ్తే జీపు వేగం మందగిస్తుంది. అప్పటి దాకా చెట్ల మీద ఉండి కీచులాడిన కోతిమూకలు గమ్మునుండిపోతాయి. నాలుగు దిక్కులూ దీక్షగా చూస్తే..



అద్భుతం కనిపిస్తుంది. బోనులో పులి కోపంగా ఉంటుంది. సర్కస్‌లో పులి క్రమశిక్షణతో ఉంటుంది. అడవిలో పులి రాజసంగా ఉంటుంది. రీవీగా నడుస్తుంది. అడుగులో అడుగేస్తూ.. వస్తుంది. ఆకలేసిందా చిన్న జంతువని కూడా చూడదు. లిప్తపాటులో పంజా విసురుతుంది. అలాంటి పులిని దగ్గరగా చూస్తే భలేగా ఉంటుంది కదా! ఏదో అదృష్టం ఉంటే గానీ అడవిలో పులి కంటపడదంటారు అటవీ శాఖ అధికారులు. సఫారీ ట్రాక్ మధ్యలో ఉల్లెడ అనే క్షేత్రం వస్తుంది. ఇక్కడ పురాతనమైన శివాలయం ఉంది. చుట్టూ లోయలతో ఈ ప్రాంతం మనోహరంగా ఉంటుంది.

జంగిల్ సఫారీ ధర: రూ.800 (ఆరుగురికి).

ఎక్కడ: కర్నూలు జిల్లా నంద్యాల నుంచి పచ్చర్ల 25 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ప్రకాశం గిద్దలూరుకు 35 కిలోమీటర్ల దూరం. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు.



వన నివాసం..

పచ్చర్ల జంగిల్ క్యాంప్‌లో 4 కాటేజీలు, 2 టెంట్ హౌజ్‌లు, బైర్లూటి క్యాంప్‌లో 4 కాటేజీలు, 6 టెంట్ హౌజ్‌లో పాటు డార్మెటరీలు అందుబాటులో ఉన్నాయి. టెంట్ హౌజ్ అద్దె రూ.5,000, కాటేజీ అద్దె రూ.4,000 (ఇద్దరికి) అరేళ్లు దాటిన పిల్లలకు రూ.1,000 అదనం. డార్మెటరీలో ఒక్కో బెడ్‌కు రూ.2,000 వసూలు చేస్తారు. బస చేసిన వారికి రెండు పూటలా భోజనంతో పాటు ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ అందిస్తారు. జంగిల్ సఫారీ ఉచితం.

కాటేజీలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు.
nallamalaijunglecamps.com

ట్రెక్కింగ్ స్పాట్

బైర్లూటి ఎకో టూరిజం నుంచి 10 కిలోమీటర్ల మేర సఫారీ ట్రాక్ ఉంది. ఇక్కడి నుంచి మూడున్నర కిలోమీటర్లు ముందుకు వెళ్తే.. టైగర్ జోన్ ఉంటుంది. అవకాశం ఉంటే పులిని చూడొచ్చు. అలాగే మరింత ముందుకు వెళ్తే శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిందని చెప్పే.. 'వీరభద్రస్వామి దేవాలయం' కనిపిస్తుంది. శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయానికి ఎదురుగా రెండు కోనేర్లు ఉంటాయి. మండు వేసవిలోనూ ఇవి జలకళతో కనువిందు చేస్తాయి. ఆలయానికి సమీపంలో ఓ జలపాతం కూడా ఉంది. అడవి మార్గాన కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు వీరభద్రుడిని తప్పకుండా దర్శించుకుంటారు. సఫారీ ధర రూ.800 (ఆరుగురికి). బైర్లూటిలో సఫారీ ట్రాక్‌తో పాటు హెరిటేజ్ వాక్, ట్రెక్కింగ్ అవకాశాలూ ఉన్నాయి. దట్టమైన అడవిలో ట్రెక్కింగ్ చేయాలంటే సాహసం కావాలి. ఐదుగురు సభ్యుల బృందానికి రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వారాంతాల్లో హైదరాబాద్, కర్నూలు నగరాల నుంచి యువతీయువకులు ట్రెక్కింగ్ కోసం బైర్లూటి ఎకో సెంటర్‌కి వెళ్తుంటారు. రోజంతా సాహస క్రీడల్లో పాల్గొని.. రాత్రయ్యాక అడవితల్లి ఒడిలో సేదతీరి.. మర్నాడు తిరుగు ప్రయాణం అవుతారు.

ఎక్కడ: కర్నూలు, దోర్నాల, నంద్యాల నుంచి బైర్లూటి క్యాంప్ వెళ్లొచ్చు. కర్నూలు నుంచి 85 కి.మీ, దోర్నాల నుంచి 45 కి.మీ, నంద్యాల నుంచి 60 కి.మీ దూరం ఉంటుంది. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు.

పి.సుబ్రహ్మణ్యం, ఈనాడు పాత్రికేయ పాఠశాల విద్యార్థి
ఫొటోలు: మురళి, ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే



మరిన్ని

పచ్చర్ల, బైర్లూటి, తుమ్మలబయలు క్యాంపుల్లో జంగిల్ సఫారీతో పాటు ఉన్న మరో ఆకర్షణ ఎకో వాక్. ఐదు నుంచి పది మంది సభ్యులు అడవిలో వాహ్యాళికి వెళ్లొచ్చు. తోడుగా గైడ్ ఉంటాడు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతిస్తారు. 200 పక్షి జాతులను చూడొచ్చు. 90 రకాల సీతకోకచిలుకల సయ్యాటలను తిలకించవచ్చు. విల్లు ఎక్కుపెట్టి గురి చూసి కొట్టడంలో మీరు ఎంతటి నేర్పరులో కూడా ఇక్కడ తెలుసుకోవచ్చు. పిల్లలు రకరకాల ఆటలు ఆడుకోవచ్చు.



శ్రీశైలం చెంతనే..

తుమ్మలబయలు ఇప్పుడిప్పుడే ఎకో టూరిజానికి వేదికగా నిలుస్తోంది. శ్రీశైల క్షేత్రానికి సమీపంలో ఉన్న ఈ కేంద్రానికి పర్యాటకుల తాకిడి ఎక్కువే. ఇక్కడి జంగిల్ క్యాంప్‌లో సఫారీతో పాటు, ఎకోవాక్, బర్డ్/బటర్ ఫ్లై స్పాట్, ఆర్చరీ విన్యాసాలకు అవకాశం ఉంది. సఫారీ ధర రూ.800 (ఆరుగురికి). దట్టమైన అడవిలో విహారం పర్యాటకులకు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేస్తుంది.

ఎక్కడ: తుమ్మలబయలు శ్రీశైలం నుంచి దోర్నాల వెళ్లే దారిలో 27 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

మన్ననూరులో టైగర్ సఫారీ

నల్లమల అడవికి మహబూబ్‌నగర్ నుంచి కూడా వెళ్లొచ్చు. ఇక్కడి నుంచి శ్రీశైలం వెళ్లే దారిలో మన్ననూరు ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఉంటుంది. ఇక్కడా సఫారీ రైడ్ ఉంది. ఆ దారిలో ఫర్హాబాద్ వ్యూ పాయింట్ చూడదగిన ప్రదేశం. మన్ననూరులో వనమాలి గెస్ట్‌హౌజ్ విడిదికి అనుకూలం. ఇక్కడికి సమీపంలో మల్లెలతీర్థం (17 కి.మీ), లొద్ది మల్లన్న ఆలయం (7 కి.మీ), ఉమామహేశ్వరం (32 కి.మీ), శ్రీశైలం (57 కి.మీ) ఉన్నాయి.

శుద్ధజలం మీ చేతుల్లో..



కొత్తప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి నీళ్లు తాగితే సమస్యలు వస్తాయి. కొందరికైతే హఠాత్తుగా జలుబు పట్టుకుంటుంది. మంచినీళ్లు తాగుదామంటే..

అన్ని చోట్లా శుద్ధజలం లభించదు. కొండప్రాంతాలు, మారుమూల ప్రదేశాలకు వెళ్లినప్పుడు తాగునీటి సమస్య ఎదురవుతుంది. ఇలాంటి వాళ్లకు చక్కగా పనికొస్తాయి లైఫ్‌స్ట్రా ఉత్పత్తి చేస్తున్న వాటర్ ఫిల్టర్ బాటిళ్లు. వీటిని సులువుగా బ్యాక్‌ప్యాక్‌లో అమర్చుకోవచ్చు. ముప్పావు లీటరు నుంచి మరిన్ని నీళ్లు పట్టే బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. బాటిల్‌లో నీళ్లు పోసిన 30 సెకన్లలోనే వడగట్టేస్తుంది. ఆ నీళ్లు హాయిగా తాగొచ్చు. వడగట్టే ఫిల్టర్లలో ఎలాంటి రసాయనాలు ఉండవు. ఫిల్టర్ పనిచేసేందుకు విద్యుత్, బ్యాటరీల అవసరం లేదు. అమెరికాలోని ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఉత్పత్తులను తయారుచేశారు. నాలుగువేల లీటర్ల నీటిని వాడుకున్న తరువాత ఫిల్టర్లను మార్చుకోవచ్చు. ఈ ఫిల్టర్ బాటిళ్లు ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. పర్యాటకులకు అనువైనవి.

రాజధాని రుచులు

దిల్లీ గల్లీల్లో...

'సాపాటు ఎటూ లేదు' అంటూ అప్పట్లో పాటందుకున్నారు కొందరు యువకులు. రాజధాని నగరంలో వీధి వీధి తిరిగితే వాళ్లు ఆ మాట అనుండేవాళ్లు కాదేమో! చారిత్రక నగరమైన హస్తినలో ఓ చోట వేడి వేడిగా పరాటాలు అమ్ముడవుతుంటాయి. ఇంకో చోట కారంగా చాట్ పిలుస్తుంటుంది. మరోచోట కుల్ఫీలు తియ్యంగా రమ్మంటాయి. ఇలా రకరకాల రుచులు పలకరిస్తుంటాయి. ఏ ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడి రుచులు ఓ పట్టు పట్టాలన్నది పర్యాటక ప్రియుల నియమం. దిల్లీవాసులు ఇష్టంగా ఆరగించే కొన్ని ఉపహారాలు.. అవి దొరికే స్థలాల వివరాలు ఇక్కడిస్తున్నాం. ఈసారి హస్తినకేగినప్పుడు.. అవేమిటో మీరూ రుచి చూసేయండి.

వీధంతా పరాటాలే..



పాతదిల్లీలో ఓ గల్లీ మొత్తం పరాటాలే పలకరిస్తాయి. చాందినీ చౌక్ సమీపంలో ఉండే ఆ వీధి వెంట వెళ్లే వారెవ్వరూ.. పరాటాల రుచి చూడకుండా బయటకు రాలేరు. అంత రుచిగా ఉంటాయవి మరి. 1870లో 'పరాటే వాలీ గలీ'కి పునాది పడింది. అప్పట్లో ఐదారుగురు ఇక్కడ పరాటాలు అమ్మే చిన్న హోటళ్లు మొదలుపెట్టారు. ఇప్పటికీ వారి వారసులే ఇక్కడ పరాటా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. యాభైకిపైగా పరాటా కేంద్రాలు ఉన్నాయిప్పుడు. పరాటాలోకి కేవలం శాకాహార కూరలనే వండుతారు. అందులోనూ ఉల్లిపాయ, వెల్లుల్లి వేయకుండా చేయడం వీరి ప్రత్యేకత. ఎర్రకోటకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది 'పరాటే వాలీ గలీ'.

కురేమాల్ కుల్ఫీ



దిల్లీ నగరంలో కుల్ఫీలు చాలా చోట్ల దొరుకుతాయి. సీతారామ్ బజార్‌లోని కురేమాల్ కుల్ఫీ సెంటర్‌లో రుచి మాత్రం మరెక్కడా దొరకదు. 1900 తొలినాళ్లలో కురేమాల్ కుటుంబం ఈ కుల్ఫీ సెంటర్‌ను ప్రారంభించింది. ఆనాటి నుంచి రకరకాల కుల్ఫీలతో దిల్లీవాసుల మనసులు గెలుచుకుంటున్నారు కురేమాల్ వారసులు. కాలానుగుణంగా వెరైటీ రుచులను పరిచయం చేస్తున్నారు. మామిడి, ఆరెంజ్, దానిమ్మ పళ్లతో రూపొందించిన కుల్ఫీలు నిమిషాల్లో అమ్ముడవుతాయిక్కడ. చాందినీ చౌక్ నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉండే కురేమాల్ కుల్ఫీ సెంటర్ ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు తెరిచి ఉంటుంది.


మున్నీలాల్ చాట్



హైదరాబాద్‌లో గోకుల్‌చాట్‌కు ఎంత పేరుందో దిల్లీలో మున్నీలాల్ చాట్‌కు అంత పేరుంది. దిల్లీ గోల్‌మార్కెట్‌లో 'మున్నీలాల్ హల్వాయి' గురించి అక్కడ తెలియని వారుండరు. సమోసాలు, కచోరీలు, చాట్, బేల్ పూరి ఇలాంటి స్నాక్స్‌కు ఇది పెట్టింది పేరు. 1940లో ప్రారంభమైన మున్నీలాల్ చాట్ ఒక్కసారి తింటే ఫిదా అవ్వాల్సిందే. ఇప్పటికీ సాయంత్రం అయితే చాలు మున్నీలాల్ కొట్టు ముందు జనాలు క్యూ కడతారు. 'మున్నీలాల్ హల్వాయి' ఇండియా గేట్ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆటోల్లో వెళ్లొచ్చు.

దిక్సూచి

చిటికెలో..



ట్రిప్‌గేటర్ (Tripigator) యాప్ భారత పర్యాటక మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. దేశంలోని దాదాపు 350 ప్రాంతాల వివరాలు ఇందులో దొరుకుతాయి. సాహస యాత్రలు చేయదగ్గ ప్రాంతాల వివరాలు మరో అదనపు సౌకర్యం. ప్రాంతాలు, కాలాల వారీగా పర్యాటక ప్రాంతాలను సూచిస్తుంది. అంతర్జాలంలో దొరికే అన్ని రకాల సమాచారాన్ని శోధించి మీ ముందు ఉంచుతుంది ట్రిప్‌గేటర్. హోటల్స్ వివరాలు చిటికెలో ముందుంటాయి. బడ్జెట్ ప్లానింగ్‌కు కూడా సాయపడుతుంది. పర్యాటకుల రివ్యూలు ప్రయాణంలో ఉన్నవారికి ఎంతగానో ఉపకరిస్తాయి.

పారాహుషార్

'బిర్' బిరా గాల్లో తేలిపోదాం

సముద్ర మట్టానికి 4,230 మీటర్ల ఎత్తున్న పర్వతం. అక్కడ వీచే గాలికి ముంగురులే కాదు.. మనుషులూ ఊగాల్సిందే. కొండ నుంచి కిందికి చూస్తే.. పెద్ద లోయ. కళ్లు మూసుకొని దూకేయడమే.. భూమి ఆకర్షణ శక్తి లిప్తపాటు కిందికి లాగుతుంది. ఆ తర్వాత గాలివాటు ఎటో తీసుకెళ్లిపోతుంది. ఆకాశవీధిల్లో చక్కర్లు కొట్టిస్తుంది. విహంగాలను మరిపించే హంగామా జరుగుతుంది. పారాగ్లైడింగ్ అందించే ఆనందమిది. ఈ సాహస క్రీడకు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఎన్నో ప్రదేశాల్లో అవకాశం ఉన్నా.. హిమాచల్‌ప్రదేశ్‌లోని బిర్ బిల్లింగ్ ప్రత్యేకతే వేరు.

హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో చిన్న గ్రామం బిర్. బౌద్ధ మఠాలు, హిందూ దేవాలయాలతో సంప్రదాయబద్ధంగా ఉంటుంది. టిబెట్ సంస్కృతి తొంగి చూస్తుంటుంది. చుట్టూ మంచు పర్వతాలు.. మధ్యలో తీర్చిదిద్దినట్టున్న ఊరు. శీతాకాలంలో మంచుకౌగిట బందీ అయిన బిర్.. ఫిబ్రవరి మాసాంతం నుంచి పర్యాటకుల రాకతో సందడిగా మారిపోతుంది. ఇక్కడికి 15 కిలోమీటర్ల దూరంలో పర్వత పంక్తులపై బిల్లింగ్ అనే ప్రదేశం ఉంటుంది. పారాగ్లైడింగ్ వేదిక ఇది. బిర్ సౌందర్యం, బిల్లింగ్ సాహసం కలగలసిన ఈ ప్రాంతం బిర్ బిల్లింగ్‌గా పేరుగాంచింది. దేశవిదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వచ్చి గాల్లో విహరిస్తుంటారు. పారాగ్లైడింగ్ ఛాంపియన్‌షిప్‌లు, వరల్డ్‌కప్ పోటీలూ జరుగుతాయిక్కడ.

అందరికీ అన్నీ..

పారాగ్లైడింగ్‌లో దొరికే ఆనందం మరెందులోనూ ఉండదంటారు సాహస యాత్రికులు. పక్షిలా విహరిస్తూ.. హిమగిరుల అందాలు చూస్తుంటే ఎందుకు అందంగా ఉండదు. దాదాపు 5000 మీటర్ల ఎత్తులో ఎగురుతుంటే.. అగ్గిపెట్టెల్లా ఇళ్లు కనిపిస్తుంటే.. అడ్డొచ్చే మంచుతెరలు చలిగింతలు పెడుతుంటే ఎందుకు సంతోషంగా ఉండదు. ఈ ఆనందం సొంతం చేసుకోవాలంటే సాహసం చేయాలంటారు వాళ్లు. బిర్‌లో పారాగ్లైడింగ్‌తో పాటు మరెన్నో ఆటలాడొచ్చు. రాక్‌క్లైంబింగ్‌తో గుట్టలు ఎక్కేయొచ్చు. ర్యాపెలింగ్‌లో కొండలు అధిరోహించవచ్చు, మౌంటెయిన్ బైక్‌లపై దూసుకుపోవచ్చు. ఈ సాహసాలు మన ఒంటికి సరిపోవనుకుంటే... బిర్ వ్యాలీలో టెంట్ హౌసుల్లో హాయిగా సేదతీరవచ్చు, వేడి వేడి కాఫీ తాగుతూ హిమాలయాల సౌందర్యాన్ని చూడొచ్చు. లోయలో పారే ఏరుల్లో ఫిషింగ్ చేయొచ్చు, ధర్మశాలలోని బౌద్ధ మఠాలు, కాంగ్రాకు వలసొచ్చిన పక్షులను చూడొచ్చు.



ఆరు మాసాలు..

అక్టోబర్-నవంబర్, మార్చి-జూన్ మొత్తంగా ఆరుమాసాలు పారాగ్లైడింగ్‌కు అనుకూలం. శీతాకాలంలో పారాగ్లైడింగ్ పోటీలు ఎక్కువగా సాగుతుంటాయి. వేసవిలో ఇక్కడ వాతావరణం బాగుంటుంది. జనవరి-ఫిబ్రవరి మంచు తీవ్రత ఉంటుంది. పొగమంచు కారణంగా పారాగ్లైడింగ్ కష్టం అవుతుంది. వర్షాకాలంలో (జులై-సెప్టెంబర్) వాతావరణం అనుకూలంగా ఉండదు.

ఎలా వెళ్లాలి?

బిర్ బిల్లింగ్ చేరుకోవాలంటే ముందుగా దిల్లీ, చండీగఢ్, అమృత్‌సర్, పఠాన్‌కోట్ చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ధర్మశాల లేదా పాలంపూర్‌కు హిమాచల్‌ప్రదేశ్ రవాణ సంస్థ బస్సులు అందుబాటులో ఉంటాయి. బిర్ వెళ్లే బస్సులు కూడా దొరుకుతాయి.

ధర్మశాల నుంచి బిర్ 65 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పాలంపూర్ నుంచి 30 కిలోమీటర్లు. పఠాన్‌కోట్ నుంచి ధర్మశాల, పాలంపూర్‌కు రైలు సౌకర్యం కూడా ఉంది. అక్కడి నుంచి బస్సులో గానీ, ప్రైవేట్ ట్యాక్సీలో గానీ బిర్ చేరుకోవచ్చు.

ఈనాడు సినిమా

లోపల ఆనందం బయట అందం

రాశీఖన్నా ఈమధ్య మరింత అందంగా, నాజూగ్గా తయారైంది. ఇటీవల విడుదలైన 'తొలిప్రేమ'లో రాశీ ఇదివరకటి కంటే అందంగా కనిపించింది. ఇంత మార్పుకి కారణమేంటి? అని అడిగితే... "మనసులోపల ఆనందంగా ఉంటే.. అదే బయటకు అందం రూపంలో కనిపిస్తుంది. ముఖం ప్రకాశవంతంగా ఉందంటే, మనం ఏదో విషయంలో ఆనందంగా ఉన్నట్టే లెక్క. నా అందానికి రహస్యం కూడా అదే" అంటోంది. మరి అమ్మాయిలకు ఏమైనా చిట్కా చెబుతారా? అని అడిగితే.. "డైటింగ్ పేరుతో కడుపు మాడ్చుకోవద్దు. తిండి తగ్గిస్తే.. మనం ఎంత నాజూగ్గా తయారైనా సరే, మొహం పీక్కుపోతుంది. కావల్సినంత తినండి. కానీ వ్యాయామం చేయండి. వ్యాయామానికి సమయం ఉండదన్నది చాలా మంది చెప్పే మాట. మనం అనుకోవాలే గానీ, దేనికైనా సమయం కేటాయించవచ్చు. ఏ విషయంలోనైనా తక్షణ ఫలితాన్ని ఆశించొద్దు. నేను ఇంత నాజూగ్గా తయారవ్వడానికి పద్దెనిమిది నెలల సమయం పట్టింది. వేచి చూస్తేనే ఫలితాలు వస్తాయి" అంటోంది రాశీ ఖన్నా.



రాశీ ఖన్నా



మోహన్‌బాబు

నిర్మాతగా నా హృదయం ఏడుస్తోంది

"'గాయత్రి' కోసం తొమ్మిది నెలలు కష్టపడ్డాను. నా శరీరం సహకరించకపోయినా సరే, రిస్క్ తీసుకుని పోరాట దృశ్యాల్లో పాల్గొన్నాను. ఈ వయసులో నన్ను నేను నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. అయినా కష్టపడ్డాం. అయితే పైరసీ వల్ల ఆ కష్టమంతా వృథా అవుతోంద"ని ఆవేదన వ్యక్తం చేశారు నటుడు మోహన్‌బాబు. ఆయన నటిస్తూ నిర్మించిన చిత్రం 'గాయత్రి'. విష్ణు, శ్రియ ప్రధాన పాత్రలు పోషించారు. మదన్ దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది. మోహన్‌బాబు మాట్లాడుతూ "నిర్మాతగా నా హృదయం ఏడుస్తోంది. నాలాంటి పరిస్థితి చిత్రసీమలో చాలా మందికి ఉంది. కానీ నాబోటి వాడు చెబితే కొంతమందికైనా ఆవేదన అర్థం అవుతుందనిపిస్తుంది. 'గాయత్రి' విడుదలైన రోజునే ఆన్‌లైన్‌లో పైరసీ కాపీ పెట్టేశారు. మాలాగే వాళ్లకు కుటుంబాలున్నాయి, భార్యాబిడ్డలుంటారు. ఇప్పుడు వాళ్లు తాత్కాలికంగా సంతోషపడొచ్చు. కానీ దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. పైరసీ సీడీ చూసేటప్పుడు కూడా ఒక్కసారి ఆలోచించండి. 'గాయత్రి' వసూళ్లు బాగుండొచ్చు, లేకపోవొచ్చు. కానీ ఓ మంచి చిత్రాన్ని అందించానన్న తృప్తి ఉంది. మా అబ్బాయి విష్ణు నటనకు మంచి పేరొచ్చింది. ఓ కూతురి కోసం తండ్రి పడే ఆవేదన ఈ చిత్రం. దర్శకుడు బాగా తెరకెక్కించాడు. డైమండ్ రత్నబాబు అందించిన సంభాషణలు బాగున్నాయి. ఈ చిత్రంలో కొన్ని రాజకీయపరమైన సంభాషణలున్నాయి. నేనెప్పుడూ వ్యక్తిగతంగా ఎవరినీ దూషించలేదు. ప్రస్తుతానికి ఏపార్టీకీ చెందిన వాడిని కాద"న్నారు. దర్శకుడు మదన్ మాట్లాడుతూ "సినిమాలో 24 విభాగాలుంటాయి. 25వ విభాగమూ అవసరమే. అది ఆత్మ విమర్శ విభాగం. మా సినిమాలో లోటుపాట్లు మేమే వేలెత్తి చూపించుకుంటూ, ఓ మంచి స్క్రిప్టుని తయారు చేశాం. ఈ వయసులో మోహన్ బాబు చాలా కష్టపడ్డార"న్నారు. "దేశం మొత్తంలో రెండు వర్గాలు బాధపడుతున్నాయి. రైతులు, సినిమా తీసేవాళ్లు. సినిమా విడుదల రోజునే పైరసీకి గురికావడం దారుణ"మని డైమండ్ రత్నబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో పృథ్వీ, గీతాసింగ్, రాజా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాట గురూ!

చిత్రం: రంగస్థలం
రచన: చంద్రబోస్
సంగీతం, గానం: దేవిశ్రీప్రసాద్

పల్లవి 1:
యేరుశనగా కోసం మట్టిని తవ్వితే
ఏకంగ తగిలిన లంకె బిందెలాగా
ఎంత సక్కగున్నవే లచ్చిమి ఎంత సక్కగున్నవే
సింతసెట్టు ఎక్కి సిగురు కొయ్యబోతే
సేతికి అందిన సందమామ లాగా ఎంత సక్కగున్నవే
మల్లెపూల మద్దె ముద్ద బంతిలాగ ఎంత సక్కగున్నవే
ముత్తైదువ మెళ్లో పసుపు కొమ్ములాగ ఎంత సక్కగున్నవే
సుక్కల సీర కట్టుకున్న ఎన్నెలలాగ ఎంత సక్కగున్నవే

చరణం 1:
రెండు కాళ్ల సినుకువి నువ్వు
గుండె సెర్లో దూకేసినావు
అలలమూటలిప్పేసినావు ఎంత సక్కగున్నవే
మబ్బులేని మెరుపువి నువ్వు
నేలమీద నడిసేసినావు
నన్ను నింగి చేసేసినావు ఎంత సక్కగున్నవే
సెరుకు ముక్క నువ్వు కొరికి తింటా ఉంటే ఎంత సక్కగున్నవే
సెరుకు గెడకి తీపి రుసి తెలిపినావే ఎంత సక్కగున్నవే

పల్లవి 2:
తిరునాళ్లలో తప్పి ఏడ్చేటి బిడ్డకు
ఎదురొచ్చిన తల్లి సిరునవ్వులాగ
ఎంత సక్కగున్నవే
గాలి పల్లకిలో ఎంకి పాటలాగా
ఎంకి పాటలోని తెలుగు మాటలాగా ఎంత సక్కగున్నవే

చరణం: 2
కడవ నువ్వు నడుమున బెట్టి
కట్టమీద నడిసొస్తా ఉంటే
సంద్రం నీ సంకెక్కినట్టు ఎంత సక్కగున్నవే
కట్టెల మోపు తలకెత్తుకొని
అడుగులో అడుగేత్తా వుంటే
అడవి నీకు గొడుగట్టినట్టు ఎంత సక్కగున్నవే
బురద చేలో వరి నాటు వేత్తా ఉంటె ఎంత సక్కగున్నవే
భూమి బొమ్మకు నువ్వు ప్రాణం పోస్తున్నట్టు ఎంత సక్కగున్నవే



రామ్‌చరణ్

సింత సెట్టు ఎక్కి సిగురు కొయ్యబోతే
సేతికి అందిన సందమామలాగా!

ఆకర్షణే నిజమైన భావోద్వేగం అంటారు దర్శకుడు సుకుమార్. ప్రేమని వ్యక్తం చేసుకొని దగ్గరైన తర్వాత... ఆ రెండు మనసుల మధ్య రకరకాల సమీకరణాలు మొదలవుతాయని చెబుతారు. అందుకే ఆయన చిత్రాల్లో ప్రేమతో పాటు... ఆకర్షణ నేపథ్యంలో సన్నివేశాలు కూడా చక్కటి వినోదాన్ని పంచుతుంటాయి. మరి 'రంగస్థలం'లో చిట్టిబాబు ప్రేమలో పడ్డాడో లేదంటే, రామలక్ష్మి అందం ఆకర్షించేసరికే పాట అందుకొన్నాడో తెలియదు కానీ... 'ఎంత సక్కగున్నవే' అంటూ ఆమెని ఆరాధించడం మొదలుపెట్టాడు. చిట్టిగాడి గుండెకాయని రామలక్ష్మి గోలెట్టించగానే... చంద్రబోస్ కలం పరుగులు పెట్టేసింది. చిట్టిబాబు మనసునీ, పడుచుపిల్ల సొగసునీ, పల్లెటూరినీ, అక్కడి శ్రమ జీవనాన్ని ఎంకి పాటలాగా అందంగా ఆవిష్కరించింది. దేవిశ్రీప్రసాద్ బాణీ మరిన్ని సొగసులతో ముస్తాబైంది. రామ్‌చరణ్, సమంత జంటగా నటించిన 'రంగస్థలం' చిత్రంలోని 'ఎంత సక్కగున్నవే' పాటను ప్రేమికుల రోజును పురస్కరించుకొని మంగళవారం విడుదల చేశారు. ఇప్పటికే సందడి చేస్తున్న ఆ పాట ప్రయాణం గురించి చంద్రబోస్ చెప్పిన విషయాలివీ...



"పల్లె పదాల్లో మాధుర్యం, సౌందర్యం ఈ పాటలో ఉంది. 1985 నేపథ్యంలోని పల్లెటూరి పాట కాబట్టి నేను ఆ కాలంలోకి వెళ్లిపోయా. మా ఊరి జ్ఞాపకాల్లోకి తొంగిచూశా. అప్పుడు నేను పదో తరగతి చదివేవాణ్ని. ఆ నేపథ్యాన్ని, ఆ వాతావరణాన్ని గుర్తుకు తెచ్చుకొని, ఆ జ్ఞాపకాల్ని తిరగతోడి, లోతుగా, భావాత్మకంగా ఆలోచించి ఈ పాట రాశా. 'గుర్తుకొస్తున్నాయి...', 'ఎక్కడో పుట్టి...' పాటలు రాసేటప్పుడు ఎలాగైతే బాల్యస్మృతుల్లోకి వెళ్లి పాట రాశానో.. అలా ఈ పాట కోసం గ్రామీణ జీవితాన్ని మనోఫలకంపై చదువుకొని ఈ పాట రాశా. ఇందులో శ్రమైక జీవన సౌందర్యం కనిపిస్తుంది, వినిపిస్తుంది. పల్లెటూరి పడుచుపిల్ల అందంతో పాటు, ఆమె పనిలోని అందం కూడా ఉట్టిపడుతుంది ఈ పాటలో.

'ప్రేమ లేనప్పుడు చేసే పనంతా డొల్ల అవుతుంది. పని లేనప్పుడు జ్ఞానం వృథా అవుతుంది. జ్ఞానం లేనప్పుడు కోరికలు అర్థ రహితమవుతాయి. కోరిక లేనప్పుడు జీవితం అంధకారం అవుతుంది. ప్రేమతో పనిచేస్తే జీవితం ప్రకాశమవుతుంద'నేది పల్లెటూరి సిద్ధాంతం. పల్లెటూళ్లు అనేవి ప్రపంచ దేహానికి జీవనాడులు. ఆ జీవనాడిలోని స్పందనని.. ఆ స్పందనలోని సంగీతాన్ని... ఆ సంగీతంలోని సౌందర్యాన్ని చెప్పే పాటలాగా ఉండాలనుకొన్నాం. దర్శకుడు సందర్భం చెప్పగానే పల్లెటూరి వాతావరణం, అక్కడి వస్తువులు, అక్కడి ఉపమానాలే గుర్తుకొచ్చాయి. మన సాహిత్యంలో అమూల్యమైన ఎంకి పాటలున్నాయి. చక్కటి పదాలతో, పల్లెటూరి పాటలతో.. ఎంకి పదాలు గుర్తుకొచ్చేలాగా ఈ పాట ఉంటే బాగుంటుందనుకొన్నా. 'గాలిపల్లకిలో ఎంకి పాటలాగా...' అంటూ ఎంకి ప్రస్తావన కూడా తీసుకొచ్చా పాటలో!

మనం ఒకటి అనుకొన్నప్పుడు ఆ పనిలో అంతకు మించిన ఆనందం లభించిందంటే ఎంత అద్వితీయమైన అనుభూతి కలుగుతుందో అదే వర్ణిస్తూ 'యేరుశెనగా కోసం మట్టిని తవ్వితే... ఏకంగ తగిలిన లంకె బిందెలాగా' అంటూ పాట మొదలుపెట్టా. చింత చిగురు కొయ్యబోతే చందమామే చేతికిందనట్టు... మల్లెపూల మధ్యలో ముద్ద బంతిలాగా... సుక్కల సీర కట్టుకొన్న ఎన్నెలలాగా అంటూ అమ్మాయి అందాన్ని, ఆ అందంలోని ఆనందాన్ని పల్లవిలో వర్ణించే ప్రయత్నం చేశా. ఒకటో చరణంలో 'రెండుకాళ్ల సినుకువు నువ్వు... గుండె సెర్లో దూకేసినావు.. అలలమూట లిప్పేసినావు... మబ్బులేని మెరుపువు నువ్వు... నేలమీద నడిసేసినావు... ' అంటూ అమ్మాయి రేపిన అలజడిని వర్ణించా. 'శ్రమించడం అంటే జీవితాన్ని ప్రేమించడమే. జీవితాన్ని శ్రమ ద్వారా ప్రేమించడం, జీవితపు లోతైన రహస్యాలతో సాన్నిహిత్యం పెంచుకోవడమే' అని ఒక కవి చెబుతాడు. అందుకు తగ్గట్టుగానే ఈ పాట సాగుతుంది. పని చేయడం ద్వారా ప్రతి క్షణం జీవితాన్ని అనుభవిస్తారు పల్లెటూరి జనం. ఈ పాటకి కూడా మొదటి పొర అందం అయితే, రెండో పొరగా శ్రమ కనిపిస్తుంది. రెండో చరణంలో 'కడవ నువ్వు నడుమున బెట్టి, కట్టమీద నడిసొస్తా ఉంటే... సంద్రం నీ సంకకెక్కినట్టు', 'కట్టెల మోపు తలకెత్తుకొని... అడుగులో అడుగేత్తా వుంటే... అడవి నీకు గొడుగట్టినట్టు' అన్న పంక్తుల్లో శ్రమలోని సౌందర్యం స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సులభంగా కేవలం నలభై నిమిషాల్లో పూర్తయిన పాట ఇది. నేను, దర్శకుడు సుకుమార్ కలిసి చెన్నైలోని దేవిశ్రీప్రసాద్ స్టూడియో ఆవరణలో వాకింగ్ చేస్తుండగానే ఈ పాట పూర్తయింది. ఇందులోని ప్రతి పదం కూడా నాకెంతో సంతృప్తినిచ్చింది. పాట రాసిన తర్వాతే దేవిశ్రీప్రసాద్ బాణీ సమకూర్చారు. దేవిశ్రీప్రసాద్ ఒక మధురమైన మెలోడీ బాణీని సిద్ధం చేయడంతో పాటు, ఆయనే స్వయంగా ఈ పాటని పాడారు. వింటున్నప్పుడు ప్రతి ఒక్కరికీ రెట్టింపు ఆనందం కలుగుతుంది".

- చంద్రబోస్



వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు నాని. తన కోసం నిర్మాతలు క్యూ కడుతున్నారు. హాయిగా అడ్వాన్సులు అందుకుంటూ... ఏడాదికి మూడు సినిమాలు చేసుకునే నాని 'నిర్మాత'గా కొత్త బాధ్యత తన భుజాన వేసుకున్నాడు. ఆ ప్రయత్నంలో చేసిన తొలి చిత్రం 'అ'. శుక్రవారం 'అ' విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నాని చెప్పిన కబుర్లు

అందుకే ఆ సాహసం నేనే చేశా!

సినిమా విడుదల అవుతోందంటే నిర్మాతగా ఒత్తిడికి గురవుతున్నారా?

'అష్టాచమ్మా' సమయంలో ఓ కథానాయకుడిగా ఎంత ఉద్వేగానికి, ఉత్కంఠకూ గురయ్యానో... ఈరోజు, ఇప్పుడు అలానే అనిపిస్తోంది. ఎన్ని సినిమాలు చేసినా సరే, రిలీజ్ డే... టెన్షన్ ఎప్పుడూ ఉంటుంది. అది ఎప్పటికీ అలవాటు అవ్వదు.

కథానాయకుడిగా హాయిగా బండి సాగిపోతోంది కదా... నిర్మాతగా ఎందుకీ రిస్కు అనిపించలేదా?

చాలామంది ఇలానే అడిగారు. కొత్త దారిలో వెళ్లాలనుకున్నప్పుడు అలాంటి భయాలు ఉండడం సహజం. కానీ.. వెళ్తేనే కదా, ఆ దారి ఎలా ఉంటుందో, ఎంత వరకూ సరైందో తెలుస్తుంది.

ఓవైపు మీ సినిమాలు, మరోవైపు నిర్మాణ బాధ్యత.. కష్టం అనిపించడం లేదా?

నిజంగా అటు నా సినిమాలు చేసుకుంటూ, ఇటు నిర్మాతగా అన్ని పనులూ దగ్గరుండి చూసుకోవడం ఒక విధంగా కష్టమే. నాకు సినిమా తప్ప ఇంకేం తెలీదు. ఎంత కష్టపడినా ఇందులోనే. కానీ ఆ కష్టం ఇచ్చే కిక్ వేరేలా ఉంటుంది.

కాజల్, నిత్యమేనన్, రెజీనా.. వీళ్లందరూ కథ నచ్చి చేశారా, లేదంటే నాని సినిమా కదా అని ఓకే చేశారా?

కథ నచ్చే చేశారు. నా సినిమా కదా అని వాళ్లేం పారితోషికాలూ తగ్గించుకోలేదు. స్వతహాగా ఇన్ని రోజుల పాత్రకు ఎంత తీసుకుంటారో అంతే తీసుకున్నారు. నేనో నిర్మాత... వాళ్లు నా టీమ్. అంతా పద్ధతి ప్రకారం, లెక్కల ప్రకారమే జరిగిపోయింది.

నిర్మాతగా ఈ అడుగు వేయడానికి కారణమేంటి?

'అ' కథలో ఓ చేపకి వాయిస్ ఓవర్ కావాలి. అందుకోసం దర్శకుడు నా దగ్గరకు వచ్చాడు. కథ మొత్తం విన్న తరవాత.. షాక్ తిన్నాను. ఇప్పటి వరకూ నేను విన్న, చూసిన సినిమాల ఛాయలేం ఇందులో లేవు. అప్పటికి ఆ సినిమాకి నిర్మాత ఎవరో తేలలేదు. ఇంత మంచి కథకు మంచి నిర్మాత అవసరం అనిపించింది. ఆ కథ విలువ తెలిసిన వాళ్లయితే న్యాయం చేస్తారనుకున్నాను. అప్పుడు 'నేనే ఎందుకు చేయకూడదు' అని ప్రశ్నించుకున్నా. ఈ కథని అంతగా నమ్ముతున్నప్పుడు నిర్మాతగానూ బాధ్యత తీసుకోవడం సరైన ఆలోచన అనిపించింది. అందుకే ఈ సాహసం నేనే చేశా. 'సినిమా బాగుంటే మీరు ఉంచేసుకోండి. రిస్క్ అనిపిస్తే ఇంకొకరికి అమ్మేయండి' అని కొంతమంది నాకు సలహా ఇచ్చారు. అది కూడా న్యాయం కాదనిపించింది. రిస్క్ అనుకున్నప్పుడు అదేదో నేనే తీసుకోవడం న్యాయం అనుకున్నా. అందుకే సొంతంగా విడుదల చేస్తున్నా.

భవిష్యత్తులోనూ ఇలాంటి ప్రయత్నాలు చేస్తారా?

మా వాల్ పోస్టర్ సంస్థ నుంచి వచ్చే చిత్రాలన్నీ మామూలు మూస కథలకు భిన్నంగా ఉండాలి. ఇక మీదట వరుసగా సినిమాలు చేయొచ్చు, మూడేళ్ల వరకూ మరో సినిమా చేయకపోవొచ్చు. కానీ మంచి కథలు, కొత్త కథలతోనే సినిమాలు చేస్తా. నేను చిత్రసీమలో అడుగుపెట్టే సమయానికి నాతో పాటు నాలోని నిర్మాత నాకు తోడుగా లేడు. నన్ను నమ్మి సినిమాలు తీశారు నిర్మాతలు. ఇప్పుడు నేనూ వాళ్లకు అండుబాటులో ఉండాలి. నా సినిమాలు నేనే తీసుకోవాలన్న స్వార్థం నాకు లేదు.

గురుశిష్యుల వేటలో గెలుపెవరిది?

బాలీవుడ్ దర్శకుడు నీరజ్ పాండే పేరు చెప్పగానే 'ఎ వెడ్నస్ డే', 'స్పెషల్ చబ్బీస్', 'బేబీ' లాంటి థ్రిల్లర్ చిత్రాలు గుర్తొస్తాయి. వాటితో పాటు ధోనీ జీవిత కథతో వచ్చిన 'ఎమ్ఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రంతోనూ తన ప్రతిభ చాటుకున్నాడు నీరజ్ పాండే. ఆయన ఈసారి రాజకీయ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రాన్ని తెరకెక్కించాడు. అదే 'అయ్యారీ'. యువ కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రలో నటించాడు. రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా కనిపించనుంది. మనోజ్ బాజ్‌పాయ్, నషీరుద్దీన్ షా కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ. బాలీవుడ్‌లో థ్రిల్లర్ చిత్రాలు తెరకెక్కించడంలో ప్రత్యేకమైన శైలి ఉన్న దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు నీరజ్ పాండే. ఉత్కంఠతో కథనాన్ని రక్తికట్టించడంలో సిద్ధహస్తుడిగా పేరు తెచ్చుకున్నాడాయన. అతి తక్కువ బడ్జెట్‌తో, నసీరుద్దీన్ షా లాంటి సీనియర్ నటుడు ప్రధాన పాత్రలో నీరజ్ తెరకెక్కించిన 'ఎ వెడ్నస్ డే' చిత్రమే అందుకు నిదర్శనం. ఆ సినిమా బాలీవుడ్‌లోనే కాదు.. తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో రీమేక్‌గా వచ్చి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో వచ్చిన 'బేబీ'లో తన దర్శకత్వ ప్రతిభతో ఆశ్చర్యపరిచాడు నీరజ్. ఇప్పుడాయన రాజకీయం, దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కించిన మరో థ్రిల్లర్ చిత్రం 'అయ్యారీ'పై ఆసక్తి నెలకొంది.



'అయ్యారీ'లో సిద్ధార్థ్ మల్హోత్రా, రకుల్ ప్రీత్ సింగ్

కథేంటి: భారత ఆర్మీలో పనిచేసే కల్నల్ అభయ్ సింగ్(మనోజ్ బాజ్‌పాయ్), మేజర్ జై బక్షి(సిద్ధార్థ్ మల్హోత్రా) గురుశిష్యుల్లా మెలుగుతుంటారు. వారిద్దరికీ గుండెల నిండా దేశభక్తి, మనసులో నిఖార్సైన నిజాయతీ. ఇద్దరూ నిఘా విభాగంలో పనిచేస్తుంటారు. విధి నిర్వహణలో జైకి ఓ దేశద్రోహ చర్య గురించి సమాచారం తెలుస్తుంది. మరింత కూపీ లాగితే అందులో ఉన్నత హోదాలో ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో దేశంలోని వ్యవస్థల మీదే నమ్మకం కోల్పోతాడు జై. దేశద్రోహుల పనిపట్టడానికి యూనిఫామ్‌నే వదిలేస్తాడు. వ్యవస్థల మీద అపార విశ్వాసంతో ఉన్న అభయ్‌కి జై ఎంచుకున్న బాట నచ్చదు. ఈక్రమంలో గురుశిష్యులు విరోధులుగా మారుతారు. విద్రోహ చర్యను ఆపడానికి శిష్యుడు, విధ్యుక్త ధర్మం కోసం శిష్యుణ్ని పట్టుకోవడానికి గురువు వేట మొదలెడతారు. వారి వేట ఎలా సాగింది? చివరకు గెలిచిందెవరన్నది 'అయ్యారీ'లో చూడాలి.

పంచ్ డైలాగ్

ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డలకు ఇచ్చే నిజమైన ఆస్తి.. ఏ రోగంలేని ఆరోగ్యకరమైన శరీరం, తెలివితేటలు.

- చిత్రం : అరుణాచలం

- పంపినవారు: సిరిపురపు వెంకటవంశీకృష్ణ, రాజమండ్రి

వినోదాల విందు వడ్డిస్తాం



సత్య సింధూజ

మానస్, నిత్య నరేష్, కారుణ్య ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'సోడా గోలీసోడా'. మల్లూరి హరిబాబు దర్శకుడు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత భువనగిరి సత్య సింధూజ మాట్లాడుతూ "వినోదాల విందు వడ్డించే చిత్రమిది. చిత్రసీమలోని ప్రధాన హాస్యనటులంతా ఈ చిత్రంలో ఉన్నారు. వినోదంతో పాటు సందేశం ఉంటుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రానికీ మంచి స్పందన వస్తోంద"న్నారు.

ప్రతిభావంతులైన యువ కథానాయకులలో సందీప్‌కిషన్ ఒకరు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'బీరువా'లాంటి కమర్షియల్ విజయాలతో పాటు 'ప్రస్థానం' లాంటి మంచి చిత్రాలూ ఆయన ఖాతాలో ఉన్నాయి. మంజుల దర్శకత్వంలో సందీప్ నటించిన తాజా చిత్రం 'మనసుకు నచ్చింది'. శుక్రవారం విడుదల అవుతోన్న సందర్భంగా సందీప్ ఏం చెప్పాడంటే...



సినిమా బాగుండాలంటే అవి ఒక్కటే సరిపోవు!

■ "సూరజ్ అనే కుర్రాడి పాత్రలో నటించా. నా మనస్తత్వానికీ, స్వభావానికీ దూరంగా ఉండే పాత్ర అది. ఈమధ్య నా చిత్రాల్లో వినోదం డోసు కాస్త తగ్గింది. సీరియస్ పాత్రలు ఎక్కువగా చేస్తున్నా. వాటి మధ్య 'మనసుకు నచ్చింది' కొత్తగా అనిపిస్తుంది."

■ "భావోద్వేగాలు, చిన్ని చిన్ని సంఘటనలే ఈ కథకు మూలం. ప్రకృతిని ప్రేమించండి అనే ఓ మంచి మాట అంతర్లీనంగా చెబుతున్నాం. మనం సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు ఆస్వాదించి చాలా కాలం అయ్యింది. ఈ సినిమాతో నేను నేర్చుకున్న ప్రధాన అంశం ఏంటంటే జీవితంలోని ప్రతి చిన్న విజయాన్ని ఆస్వాదించడం మొదలెట్టా. ప్రచార చిత్రాలు చూసిన చాలామంది 'నువ్వే కావాలి'లా ఉంటుందా? అని అడుగుతున్నారు. ఏ ప్రేమ కథలో అయినా ప్రేమించడం, విడిపోవడం, మళ్లీ కలుసుకోవడమే ఉంటుంది. ఇందులోనూ అంతే. కానీ వాటిమధ్య ఉన్న భావోద్వేగాల్ని చాలా అందంగా చూపించారు. చెప్పింది చెప్పినట్టు తెరపైకి తీసుకొచ్చారు మంజుల"

■ "ఈమధ్య నా సినిమాలు కొన్ని ఆడలేదు. కానీ ఆయా చిత్రాలు చేసినందుకు నేనేం బాధపడడం లేదు. నా వయసుకి తగిన పాత్రలు చేయట్లేదేమో అని ఈమధ్య బాగా అనిపిస్తోంది. కాలేజీ ప్రేమకథలు, వినోదాత్మక చిత్రాలు ఎంచుకోవాలనిపిస్తోంది. ప్రతి దర్శకుడూ నాలోని నటుణ్ని వంద శాతం బయటకు తీసుకురావాలనుకున్నవాళ్లే. కాకపోతే నా పాత్ర, నా నటన మాత్రమే సరిపోవు. సినిమా బాగుండాలంటే అన్నీ కలసి రావాల్సిందే"

■ "'ప్రాజెక్ట్ జెడ్' విషయంలో నిర్మాత ఎస్. కె. బషీద్‌తో వివాదం నడిచింది. 'నా సినిమాకి సందీప్ సహకరించలేదు' అని ఆయన మీడియా ముందుకొచ్చారు. అసలు నేనెందుకు సహకరించాలి? తమిళ నిర్మాతలకు ఆయన కట్టాల్సిన డబ్బులు కట్టలేదు. వాళ్లేమో కాపీ పంపలేదు. దాంతో సెన్సార్ కాపీనే రిలీజ్ చేశారు బషీద్. పది రూపాయలు విలువ ఉన్న వస్తువుకి అయిదు రూపాయలే ఇచ్చి, మిగిలినది ఇవ్వను, ఆ వస్తువు నాకే ఇచ్చేయండి అని అడగడం అన్యాయం. సినిమా విషయంలోనూ ఇదే జరిగింది. మా అనుమతి లేకుండానే సినిమా సెన్సార్ అయిపోయింది. విడుదల కూడా అయిపోయింది. ఆ నిర్మాత చేతిలో పడడం వల్ల నేనే ఎక్కువగా నష్టపోయాను. ఓ మంచి సినిమాని తెలుగులో సరిగా విడుదల చేసుకోలేకపోయా"

ప్రేమ పావురం



అతుల్య, కెజి

తమిళంలో విజయం అందుకున్న చిత్రం 'కాదల్ కన్ కట్టుదే'. కెజి, అతుల్య జంటగా నటించారు. శివరాజ్ దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులో 'ప్రేమ పావురాలు' పేరుతో విడుదల చేస్తున్నారు. నిర్మాత శ్రీరామ్ మాట్లాడుతూ "తమిళంలో సంచలనం సృష్టించిన చిత్రమిది. తెలుగులో రీమేక్ చేద్దామనుకున్నాం. కానీ ఆ ఫీల్ మళ్లీ తీసుకురావడం కష్టమనిపించి అనువాదం చేస్తున్నామ"న్నారు.

పట్టు కట్టి చూడు!

సంప్రదాయ వేడుకలో కంచిపట్టు చీరలే ప్రత్యేకం. అన్నివయసులవారికి తగినట్లుగా అలా అందుబాటులోకి వచ్చినవే ఈ కంచి ఆరణి పట్టుచీరలు. ఆకట్టుకునే రంగుల్లో... ఆహా అనిపించే డిజైన్లలో అద్భుతం చేస్తున్నాయివి.






ఫ్యాషన్ ఫ్యాషన్

ఆధునిక సొబగులతో.. ముచ్చటైన మోటిఫ్‌లను మేళవించి రూపొందిన నారింజ రంగు కంచి చీరిది.

చిలకాకుపచ్చ పట్టు చీరకు ఇకత్ మెరుపులూ, హాయినిచ్చే రంగుల కలబోత అదనపు ఆకర్షణ.

నిండుగా ఆకట్టుకునే డిజైన్‌తో పరచుకున్న కంచిపట్టు చీరకు హుందాగా తీర్చిదిద్దిన అంచు వర్ణించతరమా!

పసుపు రంగు ఆరణి పట్టు చీరకు నెమలి మోటిఫ్‌లతో మెప్పించే అంచు.. కొంగు ప్రత్యేకం!

మోడల్: అమీక్షా పవార్

ఫొటోలు: దండాశ్రీనివాసరావు

వీడ్కోలు గుర్తుండేలా...

విద్యా సంవత్సరం ముగుస్తోందంటే గుర్తొస్తాయి వీడ్కోలు వేడుకలు. అవి మీ స్నేహ బృందానికి చిరకాలం గుర్తుండిపోవాలంటే... ఈ సందర్భాన్ని ప్రత్యేకంగా జరుపుకోవాల్సిందే. అందుకోసం ఈ చిట్కాలూ ఉపయోగపడొచ్చు.

- తరగతిలో ఎంతమంది ఉన్నప్పటికీ మనకంటూ ఓ బృందం ఉంటుంది. అక్కడ మీ ప్రత్యేకత కనిపించాలి కదా... అంతా కలిసి ఒకే రంగూ, ఒకే తరహా దుస్తుల్ని ఎంచుకోండి. ఒకే రకమైన టాటూల్ని వేయించుకోవడం, మీ బృందం కలకాలం గుర్తుండిపోయేలా ఇంకేదైనా పనిచేయడం వంటివాటితో ఆ గుర్తింపుని సాధించొచ్చు.



- ఫొటో ప్రతి ఒక్కరికీ మధుర జ్ఞాపకమే. మీ ఏడాది, రెండేళ్ల చదువుల కాలంలో మీ స్నేహితులతో కలిసి తీయించుకున్న ఫొటోలు, సెల్ఫీలను అన్నింటినీ కలిపి ఓ కొలాజ్‌లా తయారు చేయండి. దాన్ని చక్కటి కవితతో బ్యానర్‌లుగా కట్టించి మీ వేడుకలో వేలాడదీయండి.
- ఆ తరగతి అక్కడితో పూర్తయి కొందరు ఉద్యోగాలకు వెళితే, మరి కొంతమంది ఉన్నత చదువుల బాట పడతారు. ఏది ఏమైనా ప్రతి ఒక్కరి దగ్గర్నుంచీ ఆటోగ్రాఫ్ తీసుకోండి. ఫోనునెంబరు ఉండటం తప్పనిసరి. కుదిరితే మీరంతా కలిసి ఓ వాట్సాప్ గ్రూప్‌ని పెట్టుకోండి.

ఆ రెండుకోట్ల ఆదాయం... పచ్చళ్లతోనే!

ఆమె తయారు చేసేది పచ్చళ్లూ, రకరకాల కారం పొడులు. వాటితోనే ఏడాదికి రెండు కోట్ల రూపాయల టర్నోవరు సాధించింది. అంతేనా... ఆమె విజయాన్ని డీఆర్‌డీఏ ఏకంగా ఓ లఘుచిత్రంగా రూపొందించింది. కర్నూలు జిల్లా నంద్యాల పరిధిలోని పాండురంగాపురానికి చెందిన ఆరిమండ పద్మావతి విజయ గాథ ఇది.



ఆ రోజు నాకు ఇప్పటికీ గుర్తే. కొందరం మహిళలం కలిసి రూ.10 వేల అప్పుతో పచ్చళ్ల తయారీ ప్రారంభించాలనుకున్నాం. వాళ్లేమో చివరి నిమిషంలో 'భాగస్వామ్యం వద్దు కూలీ ఇస్తే చాలు' అనేశారు. ఒక్కక్షణం భయం వేసినా... ధైర్యంగానే ఒక్కదాన్నే పచ్చళ్ల తయారీ మొదలుపెట్టా. ప్రస్తుతం ఏడాదికి రెండుకోట్ల రూపాయల టర్నోవరు సాధిస్తున్నా. విదేశాలకూ పంపిస్తున్నాం.

వాస్తవానికి మేం తొలిసారి 1997లో బ్యాంకు నుంచి 'కల్కి భగవాన్ పొదుపు లక్ష్మి గ్రూప్' పేరిట రూ.10 వేలు రుణం తీసుకున్నప్పుడు.. అప్పటి కలెక్టర్ అజయ్‌జైన్, డీఆర్‌డీఏ పీడీ శంకర్‌నాయక్ 'మీ గ్రామంలో మిరప ఎక్కువగా పండిస్తారు కదా! పచ్చళ్ల యూనిట్ పెట్టకూడదూ' అంటూ సలహా ఇచ్చారు. ఆ సలహా, మా శ్రమా రెండు కలిసొచ్చాయి. అప్పుడు అవసరాన్ని బట్టి కాస్త బంగారాన్ని కూడా తాకట్టుపెట్టి ఈ వ్యాపారం మొదలుపెట్టా.



అదే సమస్య అయ్యింది...

మా వారు సాంబిరెడ్డి మొదటి నుంచి సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసేవారు. తన సహకారంతో ఉన్న పది ఎకరాల్లో మిర్చి పండించి ఆ పంటతో కారం, పచ్చళ్లు పెట్టడం మొదలుపెట్టా. అప్పట్లో నాలుగు రకాల పచ్చళ్లు పెట్టాం. కానీ అవి ఎక్కడ అమ్మాలో తెలియలేదు. నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికే తీసుకెళ్లాం. డీఆర్‌డీఏ ద్వారా అమ్మించారు. మంచి పేరొచ్చింది. మళ్లీ డీఆర్‌డీఏ, కలెక్టరేట్ నుంచి లక్ష రూపాయల రుణం తీసుకున్నాం. దీనికి తోడు డ్వాక్రా ప్రదర్శనలు ఎక్కడ జరిగినా మా పచ్చళ్లను ఉంచేవాళ్లం. ఇలా ప్రభుత్వం సూచించిన ప్రతి జిల్లా, ప్రతి రాష్ట్రం చివరకు ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో సైతం స్టాల్ పెట్టేవాళ్లం. పోలీస్ బెటాలియన్ సూపర్‌మార్కెట్‌లో ఏటా రూ. మూడు లక్షల వ్యాపారం పచ్చళ్ల ద్వారా చేస్తుంటాం.

విదేశాలకు సైతం...

ప్రస్తుతం 12 రకాల పచ్చళ్లూ, 10 రకాల కారంపొడులు తయారు చేస్తున్నా. మా పొలంలో పండే మిర్చిపంటతోపాటు ఇతర రైతుల నుంచీ అదనంగా మిర్చి కొంటున్నాం. అన్ని కారంపొడుల్లో కరివేపాకు వాడతాం. వడియాలూ, లడ్డూలూ, అరిసెలూ... ఇలా ఇరవై రకాల చిరుతిళ్లు కూడా తయారు చేసి అమ్ముతున్నాం. ప్రతిఏటా విదేశాలకు సైతం పచ్చళ్లు ఎగుమతి చేస్తాం.

కుటుంబ సభ్యులు చేదోడుగా...

వ్యాపారం బాగా ఊపందుకుని ఏ ఇబ్బందీ లేదనుకుంటోన్న సమయంలో మా వారు క్యాన్సర్ బారిన పడ్డారు. నన్ను ఆ స్థితిలో చూసిన మా అబ్బాయి, కోడలు వాళ్ల ఉద్యోగాలు మానేసి నాకు తోడుగా వచ్చేశారు. ప్రభుత్వ సహకారంతో ఆన్‌లైన్ బిజినెస్ చేయాలనుకుంటున్నారు. ఇప్పటికే 'స్టార్టప్ ఇండియా - మేకిన్ ఇండియా'లో భాగంగా మా నందిని స్వగృహ ఫుడ్స్ ఎంపికైంది. ఇరవై ఏళ్లుగా ఏటా గ్రామంలోని 30 మంది మహిళలకు ఉపాధి అందిస్తున్నాం. అలాగే అవకాశం వచ్చినప్పుడల్లా ఆశ్రమాలూ, ఆసుపత్రులూ, దేవస్థానాలూ, అన్నదానాలకు ఉచితంగా పచ్చళ్లు అందిస్తుంటా. నా శ్రమను గుర్తించిన డీఆర్‌డీఏ నా వంటల విశేషాలను షార్ట్‌ఫిలిం తీశారు. రుణమిచ్చిన బ్యాంకు ప్రతినిధులు కూడా ఓ డాక్యుమెంటరీని తీశారు. వ్యవసాయ శాఖ, డ్వాక్రా, మహిళా దినోత్సవాల సమయంలో అవార్డులతో సత్కరించారు.

- యడ్లపాటి బసవ సురేంద్ర, ఈనాడు డిజిటల్ - కర్నూలు.

మొక్క కూడా కానుకే...



ఎవరింట్లో ఏ చిన్నపాటి వేడుక ఉన్నా... మొదట మనకి గుర్తొచ్చే విషయం...వారికి ఏ కానుక ఇవ్వాలి అని? ఇలాంటప్పుడు ఏం కొన్నా సరే! వారి వయసు, అభిరుచి, సందర్భాన్ని తెలుసుకోవాలి. దానికి తగ్గట్లే అదివారికి ఉపయోగపడేలా చూసుకోవాలి.

- సందర్భం ఏదైనా సరే! వారి మనస్తత్వాన్ని, ఆసక్తులని దృష్టిలో ఉంచుకొని అందం, ఆరోగ్యాన్ని పెంచే రకరకాల మొక్కలని కూడా కానుకలుగా ఇవ్వొచ్చు. వాటిల్లో అదృష్టాన్ని పంచే జేడ్, కళాఖండంలా కనిపించే మాండ్‌విల్లా, అల్లుకుపోయే మనీప్లాంట్ వంటివెన్నో ఉంటాయి.
- పాతికేళ్లు దాటినవారికి ఫిట్‌నెస్‌కి సంబంధించిన వస్తువులను కానుకగా ఇవ్వొచ్చు. అంటే తాడు, టెన్నికాయిట్ రింగ్, చిన్నచిన్న డంబెల్స్, బరువు తూచే యంత్రం... వంటివెన్నో ఉంటాయి. అలానే టీనేజీ వయసున్న అమ్మాయిలయితే పోషకాహారానికి సంబంధించిన పుస్తకాలు, ఆహారం వంటివాటిని అందివ్వొచ్చు.
- అప్పుడే పుట్టిన పిల్లలు నుంచి ఐదేళ్ల లోపు వారికి బొమ్మలూ, దుస్తులు వంటివే కాదు వారి నిత్యావసరాలైన న్యాపీలూ, బేబీ ఆయిల్స్, పౌడర్ వంటివీ ఇవ్వొచ్చు. ఇంకాస్త విలువైనవి ఇవ్వాలంటే వెండి పట్టీలూ, వారి పేరుతో కొంత డబ్బు పొదుపు చేసి.. ఆ గిఫ్ట్ బాండ్‌గా కూడా ఇచ్చే ప్రయత్నం చేయొచ్చు.

నజరానా

తెలుపు రంగు బూట్లు ఉతకడానికి సమయం లేదా... కప్పు నీళ్లలో రెండు చెంచాల వంటసోడా కలిపి... అందులో ఓ వస్త్రాన్ని ముంచి.. తుడిచి చూడండి.

బంగారం వెండి

15న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,925	2,889
వెండి (గ్రా)	41.80	41.30



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,060	-------	31,500	31,200	31,450	31,150	31,250	30,890	31,450	31,140
ఆర్నమెంట్	29,055	-------	29,250	29,000	29,000	28,850	29,250	28,890	29,250	28,960
వెండి(కిలో)	39,900	-------	40,000	39,600	40,000	39,500	39,200	38,700	39,900	39,900

అది వాడితే కళ్లు మంట పుట్టాయి...

- నాకు ఇరవై రెండేళ్లు.. నేను కాస్త రంగు తక్కువగా ఉంటాను. ఈ మధ్య ఒకసారి సూపర్‌మార్కెట్‌కి వెళితే అక్కడ 'ఇది వాడితే తెల్లబడతారు' అంటూ వాళ్లు ఒక సబ్బు ఇచ్చారు. అది వాడితే కళ్లు మంట పుట్టడమే కాదు, నీళ్లు కూడా కారాయి. ఆ రోజంతా ఇదే సమస్య. దాంతో ఆ సబ్బు వాడటం మానేశా. కానీ చర్మం బరకగా, కళావిహీనంగా మారింది. మళ్లీ మునుపటిలా నా చర్మం మృదువుగా మారాలంటే ఏం చేయాలి?

- శిల్ప, వరంగల్

- ఏవి పడితే అవి రాసుకుంటే ఉన్నట్టుండి చర్మం రంగు మారదు. బయట అలాంటి మాటలు నమ్మి ఖరీదు పెట్టి సబ్బులు కొనడం మానేయండి. ఇలాంటి సబ్బుల్లో రసాయనాలుంటాయి. అయితే మీకిచ్చిన సబ్బులో రసాయనాలతోపాటు బ్లీచ్ కూడా ఉండి ఉంటుంది. అందుకే కళ్లు మండాయి. చర్మమూ నల్లగా మారింది. ఒక్కోసారి ఇలాంటి సబ్బులు వాడితే దద్దుర్లు కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అంతేకాదు చాలా సబ్బుల్లో శాలిసిలిక్ యాసిడ్, గ్లైకాలిక్ యాసిడ్ ఉండటం వల్ల కూడా నీళ్లు కారతాయి. కొన్నిట్లో స్టెరాయిడ్లు కూడా కలిసే అవకాశం ఉంటుంది. అవి ఉంటే ఇంకా ప్రమాదకరం. ఇక తెలిసో తెలియకో ఇలాంటి సబ్బుల వల్ల కళ్లు మండితే వెంటనే చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. కళ్లపై కాసేపు ఐస్ పెట్టుకోవాలి. అలాగే కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనెను ముఖానికి రాసుకుని మర్దన చేసుకోవాలి. మెడికల్ షాపుల్లో లాక్టోకాలమైన్ లోషన్ దొరుకుతుంది. దాన్ని ఉదయం సాయంత్రం రాసుకుంటే చర్మం నునుపుగా మారుతుంది. అలాగే చర్మం మృదువుగా రావడానికి కొబ్బరినూనెలో పాలమీగడ కలిపి మర్దన చేసుకోవాలి. చెంచా పాలపొడిలో ఒకటిన్నర చెంచా కలబంద గుజ్జు కలిపి ముఖానికి రాసి మర్దన చేసుకోవాలి. కాసేపయ్యాక చల్లటి నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల క్రమంగా చర్మం మృదువుగా మారుతుంది. తాజాగానూ కనిపిస్తుంది.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

కిక్‌బాక్సింగ్‌లో తీర్చిదిద్దుతున్నారు!



అది చిత్తూరు జిల్లాలోని పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లె గ్రామం. ఆ గ్రామంలో ఉన్న బళ్లో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదువు చెబుతారు. చుట్టుపక్కల ముప్పై పల్లెలోని పిల్లలు అక్కడికి వస్తారు. అక్కడ కేవలం చదువే కాదు... అమ్మాయిలకు ప్రత్యేకంగా కిక్‌బాక్సింగ్ కూడా నేర్పిస్తారు.

మొదట ఆ అమ్మాయిల తల్లిదండ్రులు తమ పిల్లలకు కిక్‌బాక్సింగ్ నేర్పించడానికి ఒప్పుకోలేదు. కానీ అక్కడ శిక్షణ తీసుకున్న నలుగురు అమ్మాయిలు రాష్ట్రస్థాయిలో రజత, కాంస్య పతకాలు తేవడంతో ప్రోత్సహించడం మొదలుపెట్టారు. ఆ తరవాత జాతీయ స్థాయిలోనూ ఇద్దరు అమ్మాయిలు గుర్తింపు తెచ్చుకున్నారు. వారిలో సానియా అనే అమ్మాయి డిగ్రీ పూర్తి చేసి క్రీడా కోటాలో టీచర్ ట్రైనింగ్ కోర్సు చేస్తోంది. అదే బాటలో మరికొందరు అమ్మాయిలు నడుస్తున్నారు. కేవలం కిక్‌బాక్సింగ్ ఒక్కటనే కాదు.. ఆ అమ్మాయిలకోసం ఆ బడి ప్రధానోపాధ్యాయురాలూ, పీఈటీ సొంత డబ్బులతో ప్రత్యేక పోషకాహారాన్ని కూడా అందిస్తున్నారు. నిజంగా మారుమూల గ్రామంలో అమ్మాయిల్ని కిక్‌బాక్సర్లుగా తయారు చేయడం అభినందించదగిన విషయమే కదా!

– ఈనాడు, తిరుపతి

■ autopage@eenadu.in
మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512


లెక్కలేనన్ని కొత్త మోడళ్లు చక్కగా ముస్తాబై కనువిందు చేశాయి... మేటి బైకులు, మెప్పించే కార్లు ప్రదర్శనలో మనసు గెలిచాయి... ఈ సంబరానికి బాలీవుడ్ తారల సొగసులూ తోడయ్యాయి...
వారం రోజుల ఆటో ఎక్స్‌పో-2018 సందడిగా ముగిసింది... అయినా వాహనప్రియుల మనసుల్లోంచి మాత్రం కొన్ని మోడళ్లు కనుమరుగవడం లేదు... కాన్సెప్ట్ కార్లు.. హైబ్రిడ్ వాహనాలు.. ఎలక్ట్రిక్ బైకులు.. పేర్లేవైతేనేం... వీటిపై చర్చలింకా కొనసాగుతూనే ఉన్నాయి...
అంతగా వారిని ఆకట్టుకున్న కొన్ని మేటి వాహనాలేంటో చూసొద్దాం రండి.

ఏం మాయ చేశావే!

ఆటో ఎక్స్‌పోలో అదిరేటి వాహనాలు

ఓ కొత్త కారో, బైకో మార్కెట్లోకి వస్తుందంటే ఆటోమొబైల్ ఔత్సాహికులకు తెగ ఆసక్తి ఉంటుంది. మరి వందల్లో దేశీయ, విదేశీ కంపెనీలు కొత్త మోడళ్లతో కొలువుదీరుతుంటే ఆ ఉత్సాహం ఏ రేంజ్‌లో ఉండాలి? దిల్లీలో ముగిసిన పద్నాలుగో ఆటో ఎక్స్‌పోలో అదే జరిగింది. సూపర్‌హిట్ కొట్టిన ఆ వాహన ప్రదర్శనలో అందరిలో ఆసక్తి రేపిన కొన్ని వాహనాలివి.





ఫార్ములా ఈ-కారు

కంపెనీ: రెనాల్ట్
మోడల్: ట్రెజర్
ప్రత్యేకతలు: 2016 పారిస్ మోటార్ షోలో తొలిసారి తళుక్కుమంది. కార్బన్, ఫైబర్‌లతో బాడీ రూపొందించారు. మెటాలిక్‌తో ఫినిష్ చేశారు. పొడవాటి బానెట్, వెనక చిన్న టెయిల్‌తో డిజైన్ తీర్చిదిద్దారు. క్యాబిన్‌నే కాక్‌పిట్ అంటున్నారు. చెక్క, లెదర్ సీట్లను పూర్తిగా చేతితో ఫినిష్ చేశారు. స్టీరింగ్ అన్ని కార్ల కన్నా భిన్నంగా దీర్ఘచతురస్రాకారంలో ఉంది. డ్యాష్‌బోర్డ్, స్టీరింగ్‌లపై ఎలాంటి మీటలు లేవు. ప్రతీదీ టచ్‌స్క్రీన్‌తోనే రూపొందించారు. నాలుగు సెకన్లలో వంద కిమీల వేగం అందుకుంటుంది. బ్రేక్ వేసినపుడు ఉత్పత్తి అయ్యే శక్తిని ఉపయోగించుకునేలా రీఛార్జబుల్ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (ఆర్ఈఎస్ఎస్) బిగించారు. సీతాకోకచిలుక రెక్కల్లా కారు డోర్లు పైకి తెరుచుకుంటాయి.
అత్యధిక వేగం: 250కిమీలు/గం
విడుదల: 2020



యూఎం మొదటి విద్యుత్తు బైక్


మోడల్: రెనెగేడ్ థార్
విడుదల: 2018 సంవత్సరాంతం, ధర రూ.4.9లక్షలు
ప్రత్యేకతలు: యూఎం మోటార్‌సైకిల్స్ నుంచి వస్తున్న మొదటి విద్యుత్తు బైక్. థార్ 30కిలోవాట్ల లిథియం పాలిమర్ బ్యాటరీతో పని చేస్తుంది. ఐదు గేర్లు ఉన్న మొదటి ద్విచక్రవాహనం ఇదే. హైడ్రాలిక్ క్లచ్.. గంటకి నూటా ఎనభై కిమీల అత్యధిక వేగంతో వెళ్తుంది. రెనెగేడ్ డ్యూటీ 223సీసీ సింగిల్ సిలిండర్‌తో పనిచేస్తుంది. 180కిమీల అత్యధిక వేగం.

మరిన్ని

- బీఎండబ్ల్యూ మోటోరాడ్: జీరో కర్బన ఉద్గారాల బైక్
- హ్యుందాయ్ అయోనిక్ ఈవీ: లిథియం, అయాన్, పాలిమర్ బ్యాటరీ కారు.
- మారుతిసుజుకీ కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్: కాంపాక్ట్ విభాగంలో ఎస్‌యూవీ ఫీచర్లతో వస్తున్న కారు.
- 45ఎక్స్ కాన్సెప్ట్: టాటాల ఏఎంపీ ప్లాట్‌ఫాం నుంచి తయారైన మొదటి కారు.
- రెనాల్ట్ ది కాన్సెప్ట్: తొలి మేడ్ ఇన్ ఇండియా కారు.
- జెయింట్ ప్రొపెల్ టీసీఆర్, మాగ్లియా రోసా: ప్రపంచంలోనే వేగవంతమైన సైకిల్.

రెండు గంటల్లో ఫుల్ ఛార్జింగ్

కంపెనీ: ఒకినావా ఆటోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, మోడల్: ఓకి 100 ఈ
ప్రత్యేకతలు: ఒకినావా రిడ్జ్ స్కూటర్ హిట్ కొట్టడంతో ఆ ఊపులో తీసుకొచ్చిన సూపర్‌బైక్ ఓకి 100 ఈ. వంద కిమీలు అత్యధిక వేగం. రెండుగంటలు ఛార్జ్ చేస్తే ఫుల్ ఛార్జింగ్ అవుతుంది. సింగిల్ ఛార్జ్‌తో 150 కిలోమీటర్లు వెళ్తుంది. రిమోట్ అలారం, డిజిటల్ తెర ప్రత్యేకతలు.
విడుదల: మార్చి 2018



నాలుగున్నర సెకన్లలో వంద

మోడల్: బీఎండబ్ల్యూ ఐ8 రోడ్‌స్టర్
ప్రత్యేకతలు: బీఎండబ్ల్యూ కంపెనీ తయారు చేసిన మొదటి ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనం. కాపర్ మెటాలిక్‌తో డిజైన్ చేసిన ఈ కారు నాలుగున్నర సెకన్లలో వంద కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. 20అంగుళాల బైకలర్ అలాయ్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణ.
విడుదల: 2019 జనవరి-ఫిబ్రవరి
అత్యధిక వేగం: 248కిమీ/గంటకి
ధర: రూ.3కోట్లు



ఒక్క ఛార్జ్‌తో 500కిమీలు

కంపెనీ: మెర్సిడెస్ బెంజ్
మోడల్: ఈక్యూ కాన్సెప్ట్
ప్రత్యేకతలు: మెర్సిడెస్ బెంజ్ తయారు చేసిన పూర్తిగా విద్యుత్తుతో నడిచే కారు. ముందు గ్రిల్ ప్యానెల్ భాగంలో కంపెనీ లోగో మెరిసిపోవడం ఓ ప్రత్యేకత. కంపెనీ చెబుతున్న దాని ప్రకారం ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకధాటిగా ఐదువందల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. లిథియం-అయాన్ బ్యాటరీ యాక్సిల్స్ మధ్యలో సెట్ చేయడంతో సమతూకంగా ఉంటోంది. ఐదు సెకన్లలో వందకిలోమీటర్ల వేగం అందుకుంటుంది.
విడుదల: 2019 ఆగస్టు, ధర: రూ.3.5కోట్లు



కృత్రిమ మేధస్సు స్కూటర్

మోడల్: ట్వంటీ టూ మోటార్స్.. ఫ్లో
ప్రత్యేకతలు: కృత్రిమ మేధస్సుతో పనిచేసే స్కూటర్. రిమోట్ కంట్రోల్‌తో ఆన్/ఆఫ్ చేస్తూ అదుపు చేయవచ్చు. జియో ఫెన్సింగ్ ఉండటంతో ఎప్పుడైనా చోరీకి గురైతే యజమానిని అలర్ట్ చేస్తుంది. తాకే తెర, వందశాతం ఎల్ఈడీ లైట్లు, జంట డిస్క్ బ్రేకులు, వైర్‌లెస్ బ్యాటరీ, డిజిటల్ స్పీడోమీటర్, క్రూయిజ్ కంట్రోల్.. ఇలా ఎన్నో ప్రత్యేకతలున్నాయి.
విడుదల: బుకింగ్‌లు మొదలయ్యాయి. ధర: రూ74,740



స్టీరింగ్ లేని కారు

కంపెనీ: యునిటీ, మోడల్: యునిటీ వన్ ఎలక్ట్రిక్ కారు
ప్రత్యేకతలు: స్వీడన్ కంపెనీ తయారీ. ఏరోడైనమిక్ డిజైన్. 22కిలోవాట్ల లిథియం-అయాన్ బ్యాటరీతో పరుగులు తీస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే రెండువందల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇరవై నిమిషాల్లో బ్యాటరీ తొంభైశాతం ఛార్జ్ అవుతుంది. దీనికి స్టీరింగ్ వీల్ ఉండదు. రెండు జాయ్‌స్టిక్స్‌తో కారును యాక్సిలరేట్ చేయొచ్చు. అదే విధంగా వేగం తగ్గించుకోవచ్చు. రెండుసీట్ల చిన్న కారు. వినోదం పంచడానికి ఈ బుల్లికారులో ఏడంగుళాల తాకే తెర ఉంది.
విడుదల: 2020 మార్చి, ధర: రూ.7.14లక్షలు



ఆధునిక ఎస్‌యూవీ

కంపెనీ: సుజుకీ మోడల్: సుజుకీ ఈ-సర్వైవర్
ప్రత్యేకతలు: 2017 టోక్యో మోటార్‌షోలో మొదటిసారి కనపడిన ఈ మోడల్ మళ్లీ దిల్లీ ఆటో షోలో తళుక్కుమంది. ఇది విద్యుత్తు బ్యాటరీతో నడిచే రెండు సీట్ల రూఫ్‌టాప్‌లేని కారు. ఫ్యూచరిస్టిక్ మినీ ఎస్‌యూవీ డిజైన్. నాలుగు విద్యుత్తు మోటార్లు, వీల్ డ్రైవ్ సిస్టమ్, అతిపెద్ద వీల్ ఆర్చ్స్, ఎక్కువ గ్రౌండ్‌క్లియరెన్స్, ల్యాడర్ ఫ్రేమ్ ఛాసిస్, గ్రిల్స్‌కి ఎల్ఈడీ లైట్లు.. చెప్పుకొంటూ పోతే ప్రత్యేకతలకు కొదవే లేదు. త్రీడీ లేఅవుట్ ఇన్ఫోటైన్‌మెంట్ తెర అదనపు ఆకర్షణ.
విడుదల: 2020



వాహన సురక్ష

బీమా బదిలీ ఇలా!

వాహన బీమా ఒక యజమాని నుంచి మరొకరికి బదిలీ చేయడం ఎలా?

వాహన బీమా ఎప్పుడూ వాహనంతోపాటే ఉంటుంది. ఆ వాహనాన్ని అమ్మినప్పుడు కొన్నవారి పేరు మీద వాహనాన్ని బదిలీ చేసినట్టే బీమాని కూడా బదిలీ చేయాలి. దీనికి చట్టప్రకారం కొన్ని నిబంధనలు ఉంటాయి. బీమా కంపెనీ నిర్దేశించినట్టు తగిన రుసుములు చెల్లించి 14 రోజుల్లో బీమా సర్టిఫికెట్‌ని కొత్త యజమాని పేరు మీద మార్చుకోవాలి. కొత్త యజమాని తన పేరున మార్చుకున్న ఆర్‌సీ బుక్ (రిజిస్ట్రేషన్ పుస్తకం) తీసుకొని బీమా కంపెనీ వారికి ప్రపోజల్ ఫామ్‌తోపాటు సమర్పించినట్లయితే బీమా సర్టిఫికేట్ పాత యజమాని పేరు మీద నుంచి కొత్త యజమాని పేరు మీదకు మార్చుతారు. ఇది తేలికైన ప్రక్రియ. నిర్ణీత సమయంలో పూర్తిచేసుకోకపోతే బీమా క్లెయిం చేసుకోవడం కష్టం. ప్రక్రియ సాఫీగా జరిగినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే నష్టపోయినవారు థర్డ్‌పార్టీ అయితే పరిహారం అందుతుంది. కానీ యజమాని సొంత వాహనానికి నష్టం జరిగితే ఏ కారణంతో అయినా బీమా సర్టిఫికేట్ మార్చకుండా ఉన్నట్టయితే కొత్త యజమాని బీమా కంపెనీ నుంచి పరిహారం పొందలేరు. గుర్తుంచుకోవలసిన విషయం ఏంటంటే వాహనం ఎవరి పేరున ఉంటుందో బీమా కూడా అదే వ్యక్తి యజమానిగా చూపిస్తూ అదే పేరున ఉంటే చట్టరీత్యా రక్షణ ఉంటుంది.



– నరేశ్ బైరపనేని, అడ్వొకేట్

ప్రత్యేకం

గాల్లేని టైరు

బస్సు, ట్రక్, కారు.. వాహనం ఏదైనా టైర్లలో ఉండాల్సినదానికన్నా ఎక్కువైనా, తక్కువైనా కష్టమే. ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా టైరు ఆయుష్షు తగ్గిపోవడమో, ప్రమాదాలు సంభవించడమో ఖాయం. ఈ బాధ తప్పాలంటే టైర్లలో గాలి తరచూ చెక్ చేయడం తప్పనిసరి. అసలు ఈ అవసరమే లేకుండా గాలి అవసరమే లేని టైర్లు తయారు చేస్తే ఎలా ఉంటుంది? ఈ ఐడియా పొలారిస్ కంపెనీకి వచ్చింది. కంపెనీ ఇంజినీర్లంతా రెండేళ్లు తమ రీసెర్చ్‌సెంటర్లలో కష్టపడి 'ఎయిర్‌లెస్ టైర్' రూపొందించారు. తేనెగూడులాంటి స్పోక్స్ ఇరుసుగా ఉంటుంది. పెద్దపెద్ద గుంతలు, ఎగుడుదిగుడులు.. ఎలాంటి రోడ్లపై అయినా దూసుకెళ్లొచ్చు. విపరీతమైన వేడిని తట్టుకుంటుంది. పైగా ఇది షాక్ రెసిస్టెన్స్, బుల్లెట్‌ప్రూఫ్. భవిష్యత్తులో ఈ గాల్లేని టైర్ల హవా పెరుగుతుందంటున్నారు నిపుణులు.



తొలి సవారీ

నా రేంజ్ లాండ్‌రోవర్



అసలే దిల్లీలో పుట్టిపెరిగిన అమ్మాయిని. హైస్కూల్ రోజుల నుంచే కార్లలో షికార్లు కొట్టడం అంటే నాకిష్టం. ఇంట్లో రెండు, మూడు వాహనాలుండేవి. అయితే ఓ స్థాయికి చేరుకున్నాక సొంతంగా ఓ కారు కొనుక్కోవాలని ఉండేది. అదీ అందరికన్నా భిన్నంగా. అనుకున్నట్టే రెండో సినిమా షూటింగ్ మొదలైన రోజే లాండ్‌రోవర్ ఫ్రీలాండర్ 2 బుక్ చేశాను. అది విని అంతా షాక్‌కి గురయ్యారు. అమ్మాయేంటి అంత పెద్ద కారు నడుపుతుందా అని చాలామంది ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా మా అమ్మ అయితే ఆ కారుని ఇంటికి తెచ్చినరోజు నుంచి తిడుతూనే ఉంది. నాన్న మాత్రం ఏమనకుండా నావైపు గర్వంగా చూశారు. అన్నట్టు నా కారు నెంబర్ 1400 నెంబరు. నాన్న కారుకి కూడా 14 ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే అది మా ఇంట్లో అందరికీ లక్కీ నెంబర్. సొంతంగా కారు కొనుక్కొని తొలిసవారీ చేసింది లాండ్‌రోవర్‌లోనే.

– హుమా ఖురేషీ, బాలీవుడ్ నటి

మెకానిక్ గురూ

ఇంజిన్ వేడెక్కుతోంది

● రెణ్నెళ్ల కొత్త బైక్ కొన్నాను. ఇంకా వెయ్యి కిలోమీటర్లు కూడా తిరగలేదు. బండి స్టార్ట్ చేసి కిలోమీటరు వెళ్లగానే ఇంజిన్ బాగా వేడెక్కుతోంది. సర్వీస్‌సెంటర్‌లో చూపించినా సమస్య తీరలేదు. ఎందుకిలా జరుగుతోంది?

– వి.వెంకటేశ్వరరావు, ఈమెయిల్

ఇంజిన్ వేడెక్కడం చాలా పెద్ద సమస్య. ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌లోనే ఈ సమస్యను పరిష్కరించాలి. బైక్ ఇంజిన్, ఇతర విడిభాగాలు పూర్తిగా చెక్ చేయడానికి అవసరమైతే ఒకట్రెండురోజులు సర్వీస్ సెంటర్‌లోనే ఉంచండి. బండిని అలాగే నడుపుతుంటే ఇంజిన్, దానికి అనుసంధానమై ఉండే ఇతర విడిభాగాలు తొందరగా చెడిపోయే ప్రమాదం ఉంది.

● నా టాటా ఇండిగో కారు 98వేల కిలోమీటర్లు తిరిగింది. ఈమధ్య కంపెనీ సర్వీస్‌సెంటర్‌కి తీసుకెళ్తే టైమింగ్ కిట్, వాటర్ పంపు మార్చాలన్నాడు మెకానిక్. రూ.పదిహేనువేలు బిల్లు అవుతుందన్నాడు. అయినా వాటికి గ్యారెంటీ ఇవ్వలేం అంటున్నాడు. బయట మరో మెకానిక్ రూ.12వేలకే చేసిస్తానన్నాడు. అయినా వాళ్లు సరిగ్గా పని చేయగలరో, లేదో అని నా అనుమానం. విజయవాడ లేదా హైదరాబాద్ వెళ్లమంటారా?

– భీమరాజు, ఈమెయిల్




వాహనం ఏదైనా కంపెనీ ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌కి వెళ్తేనే బాగుంటుందని నేను సలహా ఇస్తాను. అక్కడ అయితేనే నాణ్యమైన వస్తువులు దొరుకుతాయి. వేసిన విడిభాగాలు పాడైనా ఉచితంగా మరమ్మతులు చేయడమో, మళ్లీ కొత్తవి వేయడమో జరుగుతుంది. కొంతమొత్తం మిగులుతుందనే ఉద్దేశంతో బయటి మెకానిక్‌ల దగ్గరికి వెళ్లొద్దు. తర్వాత తలనొప్పులు తెచ్చుకోవద్దు.

– సాయిభరత్ బొప్పరాజు,
www.motofix.in

(ఇలాంటి సందేహాలుంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలిప్పిస్తాం.)

రాజీనామా 'జగన్నా'టకం

- భాజపాతో పొత్తుకు వైకాపా తహతహ
- కేసుల మాఫీకే ఈ ఎత్తుగడలు
- న్యాయం జరిగేదాకా మన పోరు ఆగదు
- ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఒకపక్క ఎంపీల రాజీనామాలని నాటకాలాడుతూ, మరోపక్క భాజపాకు దగ్గరయ్యేందుకు మంతనాలు జరుపుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేసుల నుంచి బయటపడేందుకు భాజపాకు ఎంత త్వరగా దగ్గరవుదామా అన్న తొందరలో ఆయన ఉన్నారని వ్యాఖ్యానించారు. జగన్ భాజపాతో జట్టు కట్టబోతున్నారంటూ ఓ ఆంగ్లపత్రిక దిల్లీ ఎడిషన్‌లో వచ్చిన కథనాన్ని ముఖ్యమంత్రి గురువారం తెదేపా రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశంలో చదివి వినిపించారు. 'రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తున్నారని మనకు తెలియక ముందే వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి వెళ్లి ఫొటో దిగారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతిస్తున్నామని ఎవరూ అడగకుండానే ప్రకటించారు. మనం ఏది చేసినా రాష్ట్ర ప్రయోజనాల కోసం. జగన్ ఏది చేసినా కేంద్రంతో లాలూచీపడి కేసులు మాఫీ చేయించుకోవడం కోసం' అని చంద్రబాబు పేర్కొన్నారు. తెదేపా సమావేశం ఉండవల్లిలో ముఖ్యమంత్రి నివాసం పక్కనే ఉన్న ప్రజాదర్బారు హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మూడున్నర గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. మంత్రులు, జిల్లాల అధ్యక్షులు, నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. 'సాక్షి' పత్రిక, ఛానల్‌లో అన్నీ వక్రీకరించి రాస్తున్నారని, ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ రాష్ట్రం బాగు కోసమే పని చేస్తున్నారని ఆ సమావేశంలో తానంటే వాళ్ల ఛానల్‌లో 'పవన్ మనవాడే' అని అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కేంద్రం సరిదిద్దుతుందేమోనని మార్చి ఐదో తేదీ వరకూ వేచి చూద్దామని, అప్పటికీ న్యాయం చేయకపోతే పార్లమెంటులో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేయడం ముఖ్యం కాదని, ఆ నిర్ణయం ఎప్పుడైనా తీసుకోవచ్చని, జగన్‌లా తమకు వ్యక్తిగత అవసరాలేమీ లేవని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వంపైనా, పార్టీపైనా పదే పదే అసత్యాలు ప్రచారం చేస్తూ కథనాలు ప్రచురిస్తే 'సాక్షి'పై కేసులు పెట్టాలని సూచించారు.

ప్యాకేజీ కాదు ప్రత్యేక సాయం..

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక సహాయం చేస్తామని ప్రకటించిందని, దీన్ని కొందరు 'ప్యాకేజీ' అంటున్నారని, అది సరికాదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'ప్రత్యేక హోదా, ప్రత్యేక సాయం రెండూ ఒకటే. పేరే మారింది. ప్రత్యేక హోదాతో వచ్చే ప్రయోజనాలన్నీ ఇస్తామని చెప్పారు కాబట్టి ప్రత్యేక సాయానికి అంగీకరించాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

అన్యాయం చేసిన వాళ్లను పిలిస్తే ఏం ఉపయోగం?

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిజనిర్ధారణ కమిటీ వేయడంలో అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆ భేటీకి కాంగ్రెస్ నాయకుల్నీ పిలవడంపై అభ్యంతరం తెలియజేశారు. విభజన విషయంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ అయితే, రెండో ముద్దాయి భాజపా అని, కాంగ్రెస్ నాయకుల్ని పిలిస్తే మేం అన్నీ పెట్టాం.. ఈ ప్రభుత్వం అమలు చేయడం లేదని చెప్పుకోవడానికి పనికొస్తుందని సీఎం పేర్కొన్నారు. 'పవన్ కల్యాణ్ ఆయన బాటలో ఆయన.. సమర్థించే విధంగానూ, పోరాడే విధంగానూ ముందుకు వెళుతున్నారు. మనకేమీ ఇబ్బంది లేదు' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారుల కోసం రూ.లక్ష కోట్లు ఇచ్చామని భాజపా చెబుతోందని, కానీ ఇచ్చింది రూ.6వేల కోట్లేనని ఆయన తెలిపారు.

■ కాపుల రిజర్వేషన్లకు సంబంధించి కమిషన్‌ను నియమించి, సర్వే జరిపించి అంతా శాస్త్రీయంగా చేశామని, అయినా ఓబీసీల నుంచి అభ్యంతరం రావడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని షెడ్యూల్ 9లో పెట్టి చేయాలన్నారు.

సీఎం ప్రసంగంలోని ఇతర ముఖ్యాంశాలు..

■ రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుకు అమరావతిలో సిటీ సివిల్ కోర్టు భవనం కడతామని చెప్పాం. ఈ లోగా వారు కోరితే ఏ భవనమైనా ఇస్తాం.

■ ఏడీఆర్ నివేదిక గురించి ప్రస్తావిస్తూ... 'నేను వ్యాపారం చేయడం లేదు. 25ఏళ్ల నుంచి నా కుటుంబం పారదర్శకంగా వ్యాపారం చేస్తోంది. నా పేరు మీద ఒక్క పేరు కూడా లేదు. ఏటా ఆస్తులు ప్రకటిస్తున్న ఏకైక రాజకీయ నాయకుడిని నేను. అలాంటి నన్ను సంపన్న ముఖ్యమంత్రిగా చిత్రించడం సబబుగా లేదు'

ఉద్యోగాల్లో 80శాతం స్థానికులకే..

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమల్లో 80శాతం ఉద్యోగాలను స్థానికులకే కేటాయించేలా నిబంధన విధించి, పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. అనంతపురం నుంచి కృష్ణపట్నం వరకూ తమిళనాడు తరహా అతి పెద్ద పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు కాబోతోందని చెప్పారు. చిత్తూరు జిల్లాలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్ మొదలు అనంతపురం జిల్లాలోని ఆటోమొబైల్ పరిశ్రమ వరకూ అతి పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా అవతరిస్తుందని వెల్లడించారు. గురువారం మంత్రులు కళా వెంకట్రావు, నారాయణ, లోకేష్, పితాని సత్యనారాయణతో కలిసి రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) అధికారులతో సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి వచ్చిన ప్రముఖ సంస్థలు, వాటివల్ల కలిగిన ఉద్యోగావకాశాల వివరాలను ముఖ్యమంత్రి వివరించారు.

ప్రజాసమస్యలపై పోరాటం చేయాలి

తెదేపా తెలంగాణ నేతలకు చంద్రబాబు సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో తెదేపా ముందు ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూచించారు. పార్టీని బలోపేతం చేసేందుకు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టి, స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. గురువారమిక్కడ తెదేపా తెలంగాణ పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులతో టెలీకాన్ఫరెన్సులో చంద్రబాబు మాట్లాడారు. ఈనెల 28న హైదరాబాద్ రానున్నట్లు, ఈ సందర్భంగా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చిస్తానని తెలిపారు. తెలంగాణలో పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం, శిక్షణ శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ తెలిపారు. ప్రజలు, కార్యకర్తల నుంచి మంచి స్పందన వస్తోందని వివరించారు. రైతుల సమస్యలపై స్పీకర్, తెలంగాణ మంత్రులను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు.

మూడు చోట్ల సర్పంచ్‌ల సమ్మేళనాలు

- పన్ను వసూళ్లతో పాటు పలు అంశాలపై చర్చ

ఈనాడు-హైదరాబాద్ : నూతన పోకడల పట్ల పంచాయతీలకు దిశానిర్దేశం చేయటం లక్ష్యంగా రాష్ట్రంలో సర్పంచ్‌ల సమ్మేళనాలను నిర్వహించాలని తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వీటిని మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్‌లో వరసగా. . ఈ నెల 23, 27, మార్చి 5వ తేదీల్లో ఏర్పాటు చేస్తారు. ఒక్కో సమ్మేళనానికి ఒక్కో జిల్లా నుంచి 100 మంది చొప్పున సర్పంచ్‌లను ఆహ్వానిస్తారు. పంచాయతీని ఆరు బయలు మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దటం, నూరు శాతం పన్నుల వసూళ్లు, ఎల్ఈడీ లైట్ల వినియోగం, జల సంరక్షణ, ఉపాధి హామీ తదితరాలపై ఇక్కడ చర్చిస్తారు. ఉత్తమ పంచాయతీల అనుభవాలనూ ఆయా సర్పంచ్‌లు వెల్లడిస్తారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర ప్రతినిధులు పాల్గొంటారు. మరో వైపు.. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న టీశాట్ ఛానల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యక్రమాల ప్రసారాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 24న ప్రారంభిస్తారు. ప్రతివారంలో ఒకరోజు గంట సేపు ఈ కార్యక్రమం ప్రసారమవుతుంది.

సమ్మేళన ప్రాంతం	తేదీ	హాజరయ్యే జిల్లాల సర్పంచ్‌లు
మహబూబ్‌నగర్	ఫిబ్రవరి23	మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి.
వరంగల్	ఫిబ్రవరి27	భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రి భువనగిరి
నిజామాబాద్	మార్చి 5	అదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి.

కావేరీ వివాదంపై తీర్పు నేడు!

దిల్లీ: దశాబ్దాలపాటు సాగిన కావేరీ జల వివాదంపై సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు వెలువడించే అవకాశముంది. నీటి పంపకంపై 2007నాటి కావేరీ జల వివాద పరిష్కార ట్రైబ్యునల్ (సీడబ్ల్యూడీటీ) తీర్పును వ్యతిరేకిస్తూ కర్ణాటక, తమిళనాడు, కేరళ విడివిడిగా సుప్రీం తలుపుతట్టిన సంగతి తెలిసిందే. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు సభ్యులుగాగల ధర్మాసనం ఈ అప్పీళ్లపై విచారణ చేపట్టింది. అనంతరం గత ఏడాది సెప్టెంబరు 20న తీర్పును రిజర్వుచేసింది. మరో నెల రోజుల్లో తీర్పును వెలువడిస్తామని జనవరిలోనే స్పష్టీకరించింది. కేసు విచారణ సమయంలో తమిళనాడుకు నీటిని విడుదల చేయాలంటూ కర్ణాటకకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీటిని పలుమార్లు ధిక్కరించిన కర్ణాటకు చీవాట్లూ పెట్టింది. అయితే ఈ ఆదేశాలను సమీక్షించాలని కర్ణాటక సమీక్షా పిటిషన్‌నూ దాఖలుచేసింది. ట్రైబ్యునల్ కేటాయింపుల కంటే కేరళ కూడా అదనంగా నీటిని తీసుకుంటోందని తమిళనాడు ఆరోపిస్తోంది. 2007లో కావేరీ జలాలను 740 శత కోటి ఘనపు అడుగులు (టీఎంసీ)గా లెక్కించిన సీడబ్ల్యూడీటీ.. తమిళనాడుకు 419 టీఎంసీలు, కర్ణాటకకు 270 టీఎంసీలు, కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి 7 టీఎంసీలు కేటాయించింది.

15ఏళ్ల పాత వాహనాలపై త్వరలో కొత్త విధానం: గడ్కరీ

దిల్లీ: దేశంలో వాహనకాలుష్యాన్ని తగ్గించేందుకు 15 ఏళ్ల, అంతకుమించిన పాత వాహనాలను రహదారులపై రాకుండా తొలగించేందుకు ఉద్దేశించిన కొత్త విధానం రూపకల్పన చివరి దశకు చేరుకుంది. నీతి ఆయోగ్‌తో కలిసి చేస్తున్న ఈ కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చిందని కేంద్ర రహదారి,రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే స్వచ్ఛంద వాహన శ్రేణి ఆధునీకరణ కార్యక్రమం (వీ-వీఎంపీ) ద్వారా దాదాపు 2.80 కోట్ల పాత వాహనాలను వినియోగించకుండా చేసే అవకాశం ఉంటుంది. యజమానులు 15ఏళ్ల, అంతకుమించిన పాతబడిన వాహనాలు అప్పగించి కొత్తవాటిని కొనుగోలు చేసే సమయంలో రాయితీ కల్పించాలన్నది ప్రతిపాదిత కొత్త విధానం లక్ష్యం. భారీ వాహనాల మార్పిడితో ఒక్కోదానికి గరిష్ఠంగా రూ.8లక్షల వరకూ రాయితీ లభించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఈడీ ఎదుట మరోసారి హాజరైన కార్తీ చిదంబరం

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా అక్రమ నగదు చలామణి కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. గత నెల 18న మొదటిసారిగా ఆయన్ను ఈడీ ప్రశ్నించింది. ఈ నెల 2న హాజరుకావాలని తొలుత సమన్లు జారీ కాగా ఇదే కేసులో సుప్రీంకోర్టులో మధ్యంతర దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నందున రాలేనని ఆయన అశక్తత వ్యక్తం చేయడంతో తేదీని మార్చారు. నిరసన తెలుపుతూనే తాను హాజరైనట్లు విచారణాధికారి ఎదుట కార్తీ చెప్పినట్లు సమాచారం.

'అత్యాచారానికి మీరు కట్టిన వెల రూ.6500'

- మధ్యప్రదేశ్ ప్రభుత్వ వైఖరిపై 'సుప్రీం' దిగ్భ్రాంతి

దిల్లీ: కేంద్రం నుంచి రూ.కోట్ల నిర్భయ నిధులు పొందుతున్నా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మహిళల రక్షణ చిత్తశుద్ధితో పనిచేయడం లేదని సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. అత్యాచార బాధితులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం సగటున రూ.6500 నష్టపరిహారం చెల్లిస్తుండటంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. లైంగిక వేధింపులకు గురైనవారికి ధర్మభిక్షం ఏమైనా వేస్తున్నారా? అని ప్రశ్నించింది. కేంద్రం నుంచి అధికమొత్తంలో నిర్భయ నిధులు పొందుతున్నా ఇదేం పని? అని జస్టిస్ ఎం.బి.లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. మధ్యప్రదేశ్‌లో 1951 మంది అత్యాచార బాధితులుండటం అద్భుతమని వ్యంగ్యంగా పేర్కొంది. నిర్భయనిధిని దేశంలోని ఆయా రాష్ట్రాలు ఎలా వ్యయం చేస్తున్నాయో, అత్యాచార బాధితులకు ఎంతమేరకు నష్టపరిహారం చెల్లించాయనే విషయమై వివరాలివ్వాలన్న వ్యాజ్యంపై గురువారం విచారించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు(యూటీలు) ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని గత నెలలో ఆదేశించినా 24 రాష్ట్రాలు సహా ఒక్క యూటీ కూడా స్పందించలేదు. మేఘాలయలో 48 మంది బాధితులకు సగటున రూ.63,645 చొప్పున పరిహారం చెల్లించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

చనిపోయి సాధించింది!



కోయంబత్తూరు: ప్రాణప్రదంగా ప్రేమించిన ప్రియుడితో పెళ్లికి ఇంట్లోని పెద్దలు నిరాకరించడాన్ని తట్టుకోలేని ఓ యువతి ప్రాణాలు తీసుకుంది. బతికుండగా తన ప్రేమని అర్థంచేసుకోలేని తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు చనిపోయే ముందు చివరి కోరికను వెల్లడించింది. కనీసం తాను మరణించిన తర్వాతైన ప్రియుడితో తాళి కట్టించాలని ఆత్మహత్య లేఖలో పేర్కొంది. దీంతో ఆమె తల్లిదండ్రులు ప్రియుడిని తీసుకువచ్చి మృతదేహానికి తాళికట్టించారు. ఇదేపని బతికుండగా చేస్తే. . బంగారం లాంటి అమ్మాయి ప్రాణాలు దక్కేవని అక్కడకు వచ్చినవారు మాట్లాడుకోవడం కనిపించింది. తమిళనాడులో కోయంబత్తూరులో చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.

5న భాజపాతో తెగదెంపులన్న మంత్రి!

ఆ వెంటనే వ్యక్తిగత వ్యాఖ్యలని స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే మార్చి ఐదో తేదీన తెదేపాకు చెందిన కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారని, భాజపాతో తెగదెంపులు చేసుకుంటామని మార్కెటింగ్, గిడ్డంగులశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అమరావతిలోని సచివాలయంలో గురువారం ఆయన మొదట మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన 19 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయకపోయినా 2019 ఎన్నికలకు భాజపాతో పొత్తు లేకుండా వెళ్తామని వెల్లడించారు. తమ మంత్రులూ రాజీనామా చేస్తారని వెల్లడించారు. అయితే ఆ వెంటనే రాజీనామా చేస్తారని చెప్పిన విషయం తన వ్యక్తిగతమని, బడ్జెట్ మలివిడత సమావేశాలు ప్రారంభమయ్యేలోగా 19 అంశాలు కొలిక్కి వస్తాయనే అభిప్రాయం తమందరిలో ఉందని వెల్లడించారు.

9వ షెడ్యూల్ సంస్థల విభజనపై సమీక్ష

- 36 సంస్థలపై జీవోలిచ్చినట్లు చెప్పిన ఏపీ
- హెడ్ క్వార్టర్స్‌పై వివరణ కోరిన తెలంగాణ

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలోని 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న 89 సంస్థల విభజన తాజా పరిస్థితిపై కేంద్ర హోంశాఖ గురువారం సమీక్షించింది. ఆ శాఖ అదనపు కార్యదర్శి టీవీఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో నిపుణుల కమిటీ ఛైర్మన్ షీలాబిడే, ఏపీ ప్రభుత్వ విభజన వ్యవహారాల ముఖ్యకార్యదర్శి ప్రేమచంద్రారెడ్డి, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్, తెలంగాణ ప్రభుత్వ విభజన వ్యవహారాల ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. ప్రధానంగా 89 సంస్థల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన ఎంతవరకు వచ్చిందన్న అంశంపై హోంశాఖ అదనపు కార్యదర్శి వివరాలు కోరారు. అందులో 71 సంస్థల ఆస్తులు, అప్పులు విభజనను ఖరారు చేసినట్లు షీలాబిడే తెలిపారు. ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన మాత్రం 49 సంస్థల వరకే పరిమితమైనట్లు తెలిపారు. మరికొన్ని సంస్థలకు సంబంధించిన విభజన సిఫార్సులు సిద్ధమయ్యాయని, త్వరలో వాటిని అందిస్తామని పేర్కొన్నారు. మొత్తం సంస్థల వ్యవహారాలు పూర్తికావడానికి సమయంపడుతుందని, అందువల్ల కమిటీ కాలపరిమితి పొడిగించాల్సి ఉంటుందని షీలాబిడే హోంశాఖ అదనపు కార్యదర్శి దృష్టికి తెచ్చారు.

నాలుగింటిలో తప్పులున్నాయన్న ఏపీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనవైపు చేపట్టిన కార్యాచరణను వివరించింది. మొత్తం 49 సంస్థల సిఫార్సుల్లో నాలుగింటికి సంబంధించిన వివరాల్లో కొన్ని తప్పులు ఉన్నాయి, సరిదిద్దమని కోరుతూ కమిటీకి తిప్పి పంపినట్లు పేర్కొంది. మిగిలిన 45 సంస్థలకు గాను 36 సంస్థల విభజనపై ఇప్పటికే జీవోలు కూడా జారీచేసినట్లు తెలిపింది. ఈ అంశంలో తెలంగాణకు లేఖలు రాశామని, ఇంతవరకూ తమకు ఎలాంటి స్పందన చెప్పలేదని తెలిపింది. ఇందులోని వివరాలను ఈ నెల 21న హోంశాఖ కార్యదర్శితో జరిగే సమావేశంలో చర్చించనున్నారు. తాజా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం 'హెడ్ క్వార్టర్స్' నిర్వచనంపై నెలకొన్న సందిగ్ధతను మరోసారి ప్రస్తావించింది. దీనిపై వివరణ కోరుతూ లేఖ రాసినట్లు చెప్పింది. అయితే తమకు ఇంతవరకూ ఎలాంటి లేఖారాలేదని హోంశాఖ అధికారులు చెప్పారు.

జగన్‌కు ఈడీ కోర్టు సమన్లు

- సాయిరెడ్డి, నిమ్మగడ్డ, సబిత, శ్యాంప్రసాద్‌రెడ్డి, బి.పి.ఆచార్య తదితరులకూ..
- ఇందూ టెక్ జోన్ వ్యవహారంలో ఫిర్యాదు దాఖలు చేసిన ఈడీ
- రూ.70 కోట్ల పెట్టుబడుల్లో మనీలాండరింగ్

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల వ్యవహారంలో ఇందూ టెక్ జోన్ లావాదేవీలకు సంబంధించి మనీలాండరింగ్ వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఫిర్యాదును ఈడీ ప్రత్యేక కోర్టు హోదా ఉన్న సీబీఐ కోర్టు విచారణ నిమిత్తం (కాగ్నిజెన్స్) పరిగణనలోకి తీసుకుంది. ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సమన్లు జారీ చేసింది. జగన్‌తోపాటు ఇతర నిందితులైన విజయసాయిరెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎస్‌పీఆర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, వాల్డెన్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, భూమి రియల్ ఎస్టేట్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, కార్మెల్ ఏసియా హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిమ్మగడ్డ ప్రసాద్, జీ2 కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఐఏఎస్ అధికారి బి.పి. ఆచార్య, దామెర పార్థసారథిరావు, ఆడిటర్ సి.వి.కోటేశ్వరరావు, నిమ్మగడ్డకు చెందిన వీన్ ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బేటా అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు కోర్టు సమన్లు జారీ చేసింది. మార్చి 16న నిందితులు, కంపెనీల ప్రతినిధులు హాజరుకావాలని ఆదేశాలిచ్చింది. ఈడీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.మన్మథరావు ఫిర్యాదు దాఖలు చేశారు. సీబీఐ అభియోగ పత్రం ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు జరిగినట్లు తేల్చింది. ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలోని ఇందూటెక్‌కు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లిలో 250 ఎకరాలను అప్పటి వై.ఎస్.ప్రభుత్వం కట్టబెట్టింది. ఇందూ కన్సార్టియానికి అర్హత లేకున్నా సెజ్ ప్రాజెక్టును అప్పగించడానికి అప్పటి ఏపీఐఐసీ వైస్‌ఛైర్మన్, ఎండీగా ఉన్న బి.పి. ఆచార్య సిఫార్సు చేశారు. కన్సార్టియంలో పేర్కొన్న కంపెనీల ప్రస్తావన లేకుండా ఇందూతో ఒప్పందం కుదిరింది. సెజ్ పేరుతో పొందిన 250 ఎకరాల్లో మరో 100 ఎకరాలను శ్యాంప్రసాద్‌రెడ్డి కుమారుడు దయాకర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఎస్పీఆర్ ప్రాపర్టీస్‌కు అప్పగించేశారు. ఇందూటెక్ సెజ్‌కు అనుమతినిస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే శ్యాంప్రసాద్‌రెడ్డి సొమ్ము చేసుకోవడం ప్రారంభించారు. అదేసమయంలో వైఎస్ జమానా నుంచి పొందిన లబ్ధికి ప్రతిఫలంగా శ్యాంప్రసాద్‌రెడ్డి రూ.70 కోట్లను జగన్ కంపెనీల్లోకి పెట్టుబడిగా ముడుపులు చెల్లించారు. జగన్‌కు చెందిన జగతిలో రూ.50 కోట్లు, కార్మెల్ ఏసియా హోల్డింగ్స్‌లో రూ.20 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఈ వ్యవహారంపై దర్యాప్తుచేసిన ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని 3, 4 సెక్షన్ల కింద నిందితులను శిక్షించాలని కోరింది.



పేక మేడలా కుప్పకూలిన భవంతి

- ముగ్గురు దుర్మరణం.. బెంగళూరులో ఘటన

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరు శివారు కసవనహళ్లిలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవంతి గురువారం మధ్యాహ్నం కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వారందరినీ స్థానిక సెయింట్ జాన్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాద సమయంలో భవంతిలో 25 మంది కార్మికులున్నారు. ఘటన అనంతరం భవన శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పునాదుల్లో బలం లేకపోవటం, నిర్మాణానికి ఫిల్టర్ ఇసుక వాడటం తదితరాలే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. రంగులు, విద్యుత్తు పనులు చేపడుతున్న సమయంలో ఇది కుప్పకూలిపోయిందని ప్రమాదం నుంచి తప్పించుకున్న రఘువీర్ అనే కార్మికుడు 'న్యూస్‌టుడే'కి తెలిపాడు.

పొర్లుదండాలతో కైలాసగిరి ప్రదక్షిణ



సుధాకర్‌ను అభినందిస్తున్న సినీనటుడు సత్యప్రకాష్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎక్కడైనా పొర్లుదండాలు ఆలయాల్లో చేస్తుంటారు. తిరుపతికి చెందిన భక్తుడు సుధాకర్ ఏకంగా శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించారు. 21 కిలో మీటర్ల దూరం కల్గిన రోడ్డు మార్గం గుండా సోమవారం ఆయన పొర్లుదండాలు ప్రారంభించారు. రోజుల పాటు పొర్లుదండాలు చేసి గురువారం సాయంత్రంతో ముగించారు. మార్గమధ్యలో.. అటు వైపుగా వెళ్తున్న సినీనటుడు సత్యప్రకాష్ ఆయన మొక్కును చూసి అభినందించారు. రాళ్లు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సుధాకర్ వెంట వచ్చిన వాళ్లు దుప్పట్లుపరస్తూ సహకరించారు. పొర్లుదండాలతో గిరిప్రదక్షిణ చేసిన మొదటి వ్యక్తి సుధాకరేనని స్థానికులు చెబుతున్నారు.

'బచావత్'కు కట్టుబడి ఉన్నారా?

- అయితే ప్రమాణపత్రం దాఖలు చేయండి
- 6 రాష్ట్రాలకు, కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం
- పోలవరంపై ఒడిశా పిటిషన్ విచారణ ఏప్రిల్ 17కు వాయిదా

ఈనాడు, దిల్లీ: గోదావరి జలాలపై 1980 నాటి బచావత్ అవార్డుకు కట్టుబడి ఉంటే అదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటూ ప్రత్యేక ప్రమాణ పత్రాలను (అఫిడవిట్) దాఖలు చేయాలని ఆరు రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ఆరు వారాల (మార్చి 31లోగా) గడువిచ్చింది. కేంద్రంతో పాటు ప్రమాణ పత్రం దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కర్ణాటక ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఒడిశా దాఖలు చేసిన ఒరిజినల్ సూట్‌పై గురువారం విచారణ సందర్భంగా జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణనుఏప్రిల్ 17కు వాయిదా వేసింది.

మీ ఎంపీలతో రాజీనామాలు చేయిస్తారా?

ట్విట్టర్ వేదికగా ముఖ్యమంత్రికి జగన్ ప్రశ్న

ఈనాడు అమరావతి: "రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం పార్టీ ఎంపీలు రాజీనామా చేయాలన్న వైకాపా నిర్ణయాన్ని అనుసరించి మీ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తారా? లేదా ప్రత్యేక ప్యాకేజీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టడాన్ని కొనసాగిస్తారా?"అని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ట్వీట్ చేశారు. "పక్షపాతం..నిర్లిప్తతంగా ఉండేందుకు ఇది సమయం కాదు..అందరం కలిసికట్టుగా ఒక విధానం తీసుకుని ఏపీని మొదటిస్థానంలో నిలబెట్టుకోవాలి. ప్రత్యేకహోదా అనే మన హక్కును సాధించుకునేందుకు రాష్ట్రంలోని ప్రతి ఎంపీ కచ్చితంగా రాజీనామా చేయాలి"అని పేర్కొన్నారు.

మోసం విలువ రూ.11,400 కోట్లను పీఎన్‌బీ గణాంకాలతో పోలిస్తే..

మూడో వంతు — పీఎన్‌బీ మార్కెట్ విలువ రూ.30,841 కోట్లలో మూడో వంతు.

13 రెట్లు — అక్టోబరు-డిసెంబరులో పీఎన్‌బీకి వచ్చిన రూ.800 కోట్ల వడ్డీతో పోలిస్తే దాదాపు 13 రెట్లు ఎక్కువ.

ఖర్చులకు సమానంగా — అక్టోబరు-డిసెంబరులో పీఎన్‌బీ వ్యయాలైన రూ.11,012.31 కోట్లకు ఇంచుమించు ఇది సమానం.

రూ.10000 కోట్లు ఎక్కువ — 2016-17 ఆర్థిక సంవత్సరంలో పీఎన్‌బీ ఆర్జించిన రూ.1,324 కోట్ల లాభంతో పోలిస్తే రూ.10,000 కోట్లు ఎక్కువ.

నాలుగో వంతు — డిసెంబరు చివరినాటికి పీఎన్‌బీ వద్ద ఉన్న నిల్వలు, మిగులు రూ.48,511 కోట్లలో నాలుగో వంతు.

రూ.5000 కోట్లు ఎక్కువ — డిసెంబరు చివరినాటికి పీఎన్‌బీ వద్ద ఆస్తుల మొత్తం విలువ రూ.6377 కోట్లతో పోలిస్తే రూ.5000 కోట్లు ఎక్కువ.



ఒక బ్యాంకు వ్యథ

ఓ వైపు మొండి బకాయిల సమస్య పరిష్కారానికి సమతమవుతున్న బ్యాంకింగ్ రంగంలో ఒక్కసారిగా కుదుపు.

నీరవ్ మోదీ అనే ఆభరణాల వర్తకుడు పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో భారీ మోసానికి పాల్పడ్డారన్న వార్తల మధ్య పీఎన్‌బీ షేర్లు కుదేలయ్యాయి.

1.77 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.11,400 కోట్లు) వరకు మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు ఆ బ్యాంకే ఎక్స్ఛేంజీలకు వివరాలందించడం ఇందుకు నేపథ్యం.

మోసం జరిగింది సరే.. ఆ తర్వాత జరిగే దర్యాప్తు సరే.. ఏళ్ల తరబడి కొనసాగే కేసుల సంగతీ సరే.. ఇవన్నీ కాసేపు పక్కనపెడితే.. ఈ మోసం వల్ల కలిగిన నష్టం ఎవరిపై భారం పడుతుంది.. ఆ బ్యాంకు భవిష్యత్ ఏమిటి అన్నది ఇపుడు అసలు ప్రశ్న.

పీఎన్‌బీలో జరిగిన కుంభకోణం వల్ల ఎవరి నష్టం అనేది ఇపుడు విస్తృతంగా జరుతున్న చర్చ. ప్రాథమికంగా తెలిసిన సమాచారం ప్రకారం. . నీరవ్‌తో పాటు పలు కంపెనీలు, బ్యాంకు అధికారులు(భారత్‌కు చెందిన బ్యాంకుల విదేశీ శాఖల్లోనివారు) కలిసి ఈ కుంభకోణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. పీఎన్‌బీ జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్‌ఓయూ) ఆధారంగా యూనియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ విదేశీ శాఖలు, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్ తదితరాలు ఆ కంపెనీలకు రుణాలిచ్చాయి. ఇపుడు ఇవన్నీ కూడా దర్యాప్తు కిందకు వస్తాయి. అయితే మోసం జరిగింది పీఎన్‌బీ ఇచ్చిన ఎల్‌ఓయూ వల్లే కాబట్టి కేసు పీఎన్‌బీ చుట్టూనే తిరగనుంది. ఈ నేపథ్యంలో ఆ బ్యాంకు భవితవ్యంపైనా ప్రశ్నలు రాకమానవు.

ఓ వైపు ఎన్‌పీఏలు.. మరో వైపు కుంభకోణం

అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లాగే పీఎన్‌బీని సైతం మొండి బకాయిలు వేధిస్తున్నాయి. బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు 12.11

పీఎన్‌బీ.. కింకర్తవ్యం..?

శాతం(రూ.57,519 కోట్లు), నికర ఎన్‌పీఏలు 7.55%(రూ.34,076 కోట్లు)గా ఉన్నాయి. బ్యాంకు మొత్తం ఒత్తిడిలో ఉన్న ఆస్తులు 15 శాతంగా ఉన్నాయి. ఇందులో 12.1 శాతం స్థూల ఎన్‌పీఏలు, 2.1 శాతం ప్రామాణిక పునర్నిర్మిత రుణాలున్నాయి. తాజాగా ఆర్‌బీఐ జారీ చేసిన నిబంధనల నేపథ్యంలో స్థూల ఎన్‌పీఏలు 15 శాతానికి పెరుగుతాయి. ఇప్పటికే మొండి బకాయిలకు కేటాయింపుల రూపంలో భారం పడుతోంది. ప్రభుత్వం నుంచి మూలధన పునర్నిర్మాణ పథకం ద్వారా రూ.5473 కోట్ల వరకు రావొచ్చని అంచనా వేస్తున్నారు. మరో వైపు రూ.5,000 కోట్ల వరకు క్యూఐపీ పద్ధతిలో నిధులను సమీకరించింది. ఇవన్నీ కలిపినా తాజా రూ.11,300 కోట్ల మోసంతో పోలిస్తే తక్కువే.

మార్గం అన్వేషించాల్సిందే..

ఈ మోసం భారాన్ని పూర్తిగా మోయాల్సివస్తే.. బ్యాంకు పరిస్థితి మూలధన పునర్నిర్మాణానికి ముందు కంటే అధ్వానంగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు. కింగ్‌ఫిషర్ మాల్యా కేసే ఇప్పటికీ తేలలేదు. ఆ లెక్కన పీఎన్‌బీ కుంభకోణం ఎప్పటికి తెములుతుంది. ఎప్పటికి పీఎన్‌బీ ఊపిరిపీల్చుకుంటుంది. అందుకే పీఎన్‌బీని గట్టెక్కించి ఆ బ్యాంకు ఖాతాదార్లు, మదుపర్లు ఆందోళన గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అదే విధంగా దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన పీఎన్‌బీని.. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థనూ కాపాడాల్సిన అవసరమూ ఉంది.

ఎల్‌ఓయూ అంటే

ఒక బ్యాంకు ఇతర బ్యాంకులకు చెందిన విదేశీ శాఖలకు జారీ చేసే అనుమతి పత్రం. దీని ద్వారా ఆ విదేశీ శాఖల్లో సదరు ఎగుమతిదారు రుణాలను పొందడానికి వీలు కల్పిస్తుంది. గీతాంజలి జెమ్స్, నీరవ్ మోదీ గ్రూప్ సంస్థలు పీఎన్‌బీ ఇచ్చిన ఎల్‌ఓయూ ఆధారంగానే రుణాలు పొందాయి.

పీఎన్‌బీయే చెల్లించాలి: ఆర్‌బీఐ

నీరవ్ మోదీకి జారీ చేసిన ఎల్‌ఓయూల కారణంగా, నష్టపోయిన బ్యాంకులకు రూ.11,400 కోట్లను పీఎన్‌బీనే తిరిగి చెల్లించాలని ఆర్‌బీఐ ఆదేశించిందని సమాచారం. ఇద్దరు బ్యాంకర్లు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మొత్తాన్ని కనుక పీఎన్‌బీ చెల్లించకపోతే, రెట్టింపు మొత్తాలను కేటాయించాల్సి వస్తుంది. పీఎన్‌బీతో పాటు మరో 30 బ్యాంకులు కూడా భారీ నష్టాలకు కేటాయింపులు జరపాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. దీనివల్ల ఆర్థిక మార్కెట్లలో సంక్షోభం తలెత్తుతుందని, బ్యాంకింగ్ పరిశ్రమ పనితీరులో కీలకమైన 'నమ్మకం'పై విశ్వాసం పోతుందని పేర్కొంది. ఇతర బ్యాంకులకు కనుక ఈ మొత్తాన్ని పీఎన్‌బీ చెల్లిస్తే, దాని బ్యాలన్స్ షీట్ ఒక్కటే నష్టాల పాలవుతుందని, మిగిలిన బ్యాంకులు కూడా కేటాయింపులు జరపాల్సిన ఇబ్బంది తప్పుతుందని వివరించింది. ఇప్పటికే నిధుల లేమిని ఎదుర్కొంటున్న పీఎన్‌బీ, ఈ విషయంలో జోక్యం చేసుకోమని ప్రభుత్వాన్ని కోరిందని సమాచారం. పీఎన్‌బీ నుంచి చెల్లింపులు ఆలస్యం అవుతాయనే ఇతర బ్యాంకర్లు కూడా అభిప్రాయ పడ్డారు. అందువల్ల ఆర్థిక శాఖ జోక్యం చేసుకోవాలని వారు కూడా అభ్యర్థించారు.

రూ.8,000 కోట్లు పోయాయ్

రూ.11,400 కోట్ల కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేరు రెండో రోజూ కుదేలైంది. గురువారం 12 శాతం కోల్పోయిన షేరు రూ.128.35 వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.8,076.59 కోట్లు తగ్గి రూ.31,132.41 కోట్లకు చేరింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ ఆర్జించిన రూ.1,324 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 6 రెట్లు అధికం కావడం గమనార్హం. అదే సమయంలో కంపెనీ వార్షిక లాభంతో పోలిస్తే ఈ మోసం విలువ 8 రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి దర్యాప్తు సంస్థలు సోదాలు నిర్వహించడంతో గీతాంజలి జెమ్స్ 20 శాతం కోల్పోయి.. 52 వారాల కనిష్ఠమైన రూ.46.90 వద్ద ముగిసింది. ఇతర ఆభరణాల కంపెనీల్లో పీసీ జువెలర్ 5.31%, టీబీజడ్ 2.64%, తంగమాయిల్ జువెలరీ 5%, రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ 2.10% చొప్పున డీలాపడ్డాయి.

అన్ని తనిఖీలు చేసినా బయటపడలేదా

పీఎన్‌బీలో చోటుచేసుకున్న రూ.11,400 కోట్ల కుంభకోణాన్ని, నిఘా వ్యవస్థలు ఎలా గుర్తించలేదనే విషయమై పలు సందేహాలున్నాయి. బ్యాంక్ సాఫ్ట్‌వేర్‌ను తమకనుకూలంగా మార్చుకుని, కేవలం ఇద్దరు ఉద్యోగులు ఇంత భారీమొత్తాన్ని తరలించలరా అంటే సమాధానం లేదు. బ్యాంకుల్లో జరిగే భిన్న రకాల ఆడిట్‌లతో పాటు ఆర్‌బీఐ తనిఖీల్లోనూ బయటపడకపోవడాన్ని సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్లు ప్రస్తావిస్తున్నారు. ఈ కుంభకోణంపై ఆర్‌బీఐ నిశిత పరిశోధన జరిపించడంతో పాటు, సంబంధిత పద్దులపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపితే వాస్తవాలు వెలుగు చూడొచ్చని, బ్యాంకులన్నీ ఫోరెన్సిక్ ఆడిట్ తప్పనిసరిగా జరిపించాలని చార్టర్డ్ అకౌంటెన్సీ సంస్థలు సూచిస్తున్నాయి.

ఆర్‌బీఐ తనిఖీలతో పాటు బ్యాంకుల్లో ఆడిట్లు ఇలా..

- ✦ **స్టాట్యుటరీ ఆడిట్:** బ్యాంకులు నియమించే ఆడిటర్లు చేసేది. ఇందులో లావాదేవీలను యాదృచ్ఛికంగా తనిఖీ చేస్తారు.
- ✦ **కాంకరెంట్ ఆడిట్:** బయటి ఆడిటర్లు బ్యాంక్ శాఖల్లో నిర్వహించేది
- ✦ **అంతర్గత ఆడిట్:** బ్యాంక్ శాఖ సిబ్బంది జరిపేది.

ఇన్ని ఆడిట్లు, తనిఖీల్లో పాల్గొన్న ఆడిటర్లతో పాటు నియంత్రణ సంస్థ వైఫల్యమిది.

బ్యాంకులకు హెచ్చరిక లేఖలు

నీరవ్ మోదీ రూ.11,400 కోట్ల మోసం కేసులో 10 మంది తమ అధికారుల పాత్రను అనుమానిస్తున్న పీఎన్‌బీ, ఇతర బ్యాంకులకూ హెచ్చరిక లేఖలు పంపింది. విదేశాల్లోని కొంతమంది ఖాతాదార్లకు, ముంబయిలోని ఒక శాఖ నుంచే ఇంత భారీ మొత్తం చట్టవిరుద్ధ ఎల్‌ఓయూల ద్వారా తరలిపోవడాన్ని వెల్లడించింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, ఎగ్జిమ్ బ్యాంక్, కెనరాబ్యాంక్‌లకు ఈ లేఖలు అందాయి. తమ నుంచి నిధులు పొందిన ఖాతాదారుల్లోనే కొందరికి, ఆయా బ్యాంకులు కూడా ముందస్తుగా నిధులు అందించినట్లు పీఎన్‌బీ గుర్తించింది.

ఈ త్రైమాసికంపై ప్రభావం

తాజాగా బయటపడ్డ కుంభకోణం వల్ల ఈ మోసం వల్ల కలిగిన మొత్తం నష్టాన్ని ఒకేసారి కలిగిన నష్టం(వన్ టైం లాస్)గా జనవరి-మార్చి త్రైమాసిక ఫలితాల్లో చూపించే అవకాశం ఉంది.

అప్పుడు కేపీ.. ఇప్పుడు నీరవ్!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో చోటుచేసుకున్న తాజా కుంభకోణానికి, 2001లో కేతన్ పరేఖ్ జరిపిన బ్యాంక్ కుంభకోణానికి అత్యధిక సారూప్యతలున్నాయి. అప్పట్లో పే ఆర్డరు (డీడీ తరహా)ను కేతన్ వాడుకుంటే, ఇప్పుడు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ)ను నీరవ్ మోదీ వినియోగించుకున్నారు. అప్పట్లో ఒక బ్యాంకులో నగదు జమచేసి, కావాల్సిన వారు/సంస్థ, ప్రాంతం పేరిట డిమాండ్‌డ్రాఫ్ట్ (డీడీ) పొందేవారు. ఇతర శాఖలకు అయితే డీడీ ఇచ్చినా, తమ శాఖలోనే జమవ్వాలంటే పే ఆర్డరు జారీ చేసేవారు. ఇప్పుడు ఏ శాఖకయినా డీడీనే జారీ చేస్తున్నారు. ఎల్‌ఓయూ అంటే, సంబంధిత ఖాతాదారు కనుక చెల్లించలేకపోతే, తాము జమచేస్తామని బ్యాంక్ ఇచ్చే హామీ పత్రం. ఈ ఎల్‌ఓయూల ఆధారంగా విదేశాల్లోని బ్యాంక్ శాఖలు, ఖాతాదార్లకు నగదు జారీచేస్తుంటాయి.

☛ అప్పట్లో.. స్టాక్ మార్కెట్లలో చిర పరిచితుడైన కేతన్ పరేఖ్ ఒక బ్యాంక్ ఇచ్చిన పే ఆర్డరును ఇతర బ్యాంకుల్లో జమచేయడం ద్వారా పెద్దఎత్తున నగదు పొంది, ఆ మొత్తాన్ని షేర్ల ట్రేడింగ్‌కు వినియోగించారు. స్టాక్‌మార్కెట్లు శరవేగంతో దూసుకెళ్తున్న తరుణంలో, గుజరాత్‌కు చెందిన మాధవపుర మర్కెంటైల్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఎంఎంసీబీ) కేతన్ పరేఖ్ (కేపీ) సంస్థలకు తరచుగా పే ఆర్డర్లు జారీ చేసింది. రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్‌ల రూపేణ జారీ చేసిన మొత్తానికి తగినంత నగదు/సెక్యూరిటీలు లేకున్నా జారీ చేసింది. ఈ పే ఆర్డర్లను బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వద్ద కేపీ సంస్థలు జమ (డిస్కౌంట్) చేసి, నగదు పొంది, ఈ నగదుతో షేర్ల ట్రేడింగ్ చేసేవారు. ముంబయి స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లోని బీఓఐ శాఖ, ఈ పే ఆర్డర్లను క్లియరింగ్ శాఖకు పంపేది. అప్పుడు మాత్రం తగినంత

ఒకే తరహా కుంభకోణాలు

నగదు లేదంటూ ఎంఎంసీబీ చేతులెత్తేసింది. అప్పుడు కేపీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ తరహాలో 2000 ఫిబ్రవరి 8 నుంచి 2001 మార్చి 9 మధ్య రూ.137 కోట్ల విలువైన పే ఆర్డర్లను కేపీ సంస్థలకు ఎంఎంసీబీ జారీ చేసిందని పార్లమెంటరీ సంయుక్త సంఘం 2002లో నివేదించింది. ఈ మొత్తాన్ని వెంటనే బీఓఐ నుంచి పొందిన కేపీ సంస్థలు స్టాక్‌మార్కెట్లలో ట్రేడింగ్‌కు వాడేశాయి.

☛ ఇప్పుడు.. ఆభరణాల డిజైనర్ అయిన నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఇచ్చిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ)ను అదే విధంగా వాడుకున్నారు. మోదీ, ఆయన అనుచరులు పీఎన్‌బీ ఇచ్చిన ఎల్‌ఓయూలను ప్రభుత్వరంగ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల్లో జమ చేసుకుని, రూ.11,400 కోట్ల (1.77 బిలియన్ డాలర్లు)కు పైగా పొందారు. నీరవ్ మోదీ అనుచరుడిగా, ఈ కుంభకోణంలో ప్రస్తావనకు వచ్చిన మెహుల్ చోక్సే కూడా స్టాక్‌మార్కెట్లో ట్రేడింగ్ నిర్వహిస్తుంటారు. తన కంపెనీ అయిన గీతాంజలి జెమ్స్‌కు సంబంధించి మార్జిన్ చెల్లింపుల అంశాల్లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ)తో చట్టపరమైన వివాదాల్లో కూడా చోక్సే ఉన్నారు.



బ్యాంకులపై విశ్వాసం పోతోందా..

బ్యాంకు..అందులోనూ ప్రభుత్వ బ్యాంకు.. అంటే ఓ నమ్మకం..
అందులో డబ్బు దాచుకోవడం అంటే.. మన ఇంట్లో ఉన్నట్లే...
ఇప్పుడు ఈ నమ్మకానికి బీటలు వారుతోందా?
గతంలో జరిగిన పరిణామాలు.. ఇప్పుడు తాజాగా వెలుగు చూసిన మోసం.. ఈ వ్యవస్థపై ఇన్నేళ్లదాకా ఉన్న ఓ విశ్వాసాన్ని దెబ్బతీస్తోందా?

బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టి అప్పు తీసుకుంటాం.. మన బంగారం బ్యాంకులో సురక్షితంగానే ఉందని భావిస్తాం. కానీ, అది ఆ బ్యాంకు శాఖలో ఉండే ఇద్దరు వ్యక్తులు, వారు మాత్రమే ఉపయోగించగలిగే అధికారం ఉన్న రెండు తాళం చెవుల భద్రతతో ఉందని అనుకోం. ఒకవేళ ఆ ఇద్దరు వ్యక్తులు మోసపూరితంగా వ్యవహరించి, బంగారం స్థానంలో ఇత్తడి ఉంచితే? ఆ బ్యాంకుపైనే నమ్మకం పోతోంది. అవునా?
తాజాగా పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన మోసాన్ని కూడా ఇలాగే పోల్చవచ్చు. కొంతమంది కుమ్మక్కై బ్యాంకింగ్ వ్యవస్థలోకే సమాచారం రాకుండా చూసుకొని, అవసరమైన పత్రాలను సృష్టించి ఇచ్చేశారు. ఒక వ్యక్తి సమాచారాన్ని పూర్తి చేయాలి.. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు దాన్ని ధ్రువీకరించాలి అనే ప్రాథమిక (స్విఫ్ట్) సూత్రం ఇక్కడ వారు పట్టించుకోలేదనే అనుకోవచ్చు. కోర్ బ్యాంకింగ్ సర్వర్‌లో ఎక్కడా అవసరమైన సమాచారం నమోదు కాకుండానే.. బ్యాంకు నుంచి లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయూ) జారీ అయ్యింది. దీని ఆధారంగా పలు బ్యాంకులు అవసరమైన రుణాలను ఇచ్చేశాయి. సాంకేతికంగా చాలా పెద్ద స్థాయిలో జరిగిన మోసంగా దీన్ని బ్యాంకింగ్ నిపుణులు భావిస్తున్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని, చెల్లించకుండా ఎగవేతదారుల మోసం కన్నా ఇది.. ఎంతో ప్రమాదకరమైన మోసం. బ్యాంకింగ్ వ్యవస్థలో అత్యంత కీలకమైన భద్రతా వలయంలోని లోపాన్ని ఎత్తి చూపిస్తోంది. కొంతమంది వ్యక్తులు చేసిన మోసం.. 70-80ఏళ్లుగా బ్యాంకు నిర్మించుకున్న ఖాతాదారుల విశ్వాసాన్ని కోల్పోయేలా చేసింది.
పారు బాకీల నుంచి బ్యాంకులను రక్షించేందుకు, ప్రభుత్వ బ్యాంకులను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం దాదాపు రూ.2లక్షల కోట్ల మూలధన నిధులను సమకూర్చేందుకు ప్రతిపాదించింది. బ్యాంకులు అనుసరిస్తున్న పలు చర్యలతో మొండి బాకీల వసూలు కూడా పెరుగుతోంది. ఇన్ని సంస్కరణలు చేపడుతున్న సమయంలో ఇలాంటి మోసాలు వెలుగు చూడటంతో ఖాతాదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.
ఇప్పటికే బ్యాంకుల్లో డబ్బు దాచుకోవాలనుకునే వారికి ఇప్పటికే ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు భయం వెన్నాడుతోంది. పెద్ద ఎత్తున డిపాజిట్ చేసేందుకు వారు వెనకడుగు వేస్తున్నారు. ఇలాంటి మోసాలు బయటపడితే. . ఆయా బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్ చేస్తే వెనక్కి వస్తుందా? అనే ఆలోచన కూడా ఇప్పుడు ఖాతాదారుల్లో పెరిగిపోతోంది.



✦ మనం చేస్తే తప్పేంటి?

బ్యాంకుల నుంచి రుణం తీసుకొని, పెద్ద పెద్ద వారే ఎగవేస్తున్నారు.. మనం చేస్తే తప్పేంటి? అనే ధోరణి చిన్న రుణగ్రహీతల్లో కూడా పెరిగే ప్రమాదం లేకపోలేదు. లక్షా లక్షా కలిస్తే కోట్లవుతాయి.. ఇవే బ్యాంకుకు పెనుముప్పుగా మారే అవకాశం లేకపోలేదని బ్యాంకింగ్ నిపుణుల మాట. ఈ పరిస్థితులను తమకు అనుగుణంగా మార్చుకొని, డబ్బు కట్టకుండా, బ్యాంకుల నోటీసులకు ప్రతిస్పందించకుండా ఉంటే.. అప్పుడు బ్యాంకుల మనుగడ ప్రశ్నార్థకమేనని ఆందోళన వ్యక్తం అవుతోంది.

✦ నష్టం.. భర్తీ ఎలా?

నీరవ్ మోదీ కేసులో అన్ని బ్యాంకులూ నష్టపోకుండా.. కేవలం పంజాబ్ నేషనల్ బ్యాంకే దాన్ని భరించాలనీ, మిగతా బ్యాంకులకు సంబంధం లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఫలితం.. పీఎన్‌బీకి రూ.11,400 కోట్ల మేరకు నష్టం వచ్చినట్లు. అయితే, ఇందులో ఇప్పటికే నీరవ్‌కు చెందిన రూ.5,100 కోట్ల మేరకు చరాస్తులను ఈడీ స్వాధీనం చేసుకుంది. అంటే, ఆ బ్యాంకు నష్టం దాదాపు 50శాతం మేరకు భర్తీ అయినట్లే. ఇక స్థిరాస్తుల విలువ ఎంత ఉందో? అంటే బ్యాంకుకు ఏ నష్టం లేదు...కానీ..

ఈ బ్యాంకుపై ఉన్న నమ్మకంతో ఈ బ్యాంకు షేర్లలో పెట్టుబడి పెట్టిన మదుపరుల సంగతేమిటి? మోసం బయటపడటంతో.. గురువారం ఈ బ్యాంకు షేరు 52 వారాల కనిష్ఠ ధర రూ.125.25కు చేరింది. మార్కెట్ ముగిసేటప్పటికి ఎన్ఎస్ఈలో 12.89శాతం తగ్గి, రూ.127.05కు చేరింది. అంటే, ఒక్క రోజులోనే ఈ షేరు రూ.18.80 నష్టపోయింది. మొత్తంగా చూస్తే ఈ విలువ రూ.4వేల కోట్ల వరకూ ఉండొచ్చు. ఇదంతా మదుపరుల సంపదే. బ్యాంకుల మోసాలు బయటకు వస్తున్న కొద్దీ.. వాటి షేర్లలో మదుపు చేయాలనుకుంటున్న మదుపరుల నమ్మకం కూడా కోల్పోయినట్లే! అటు ఖాతాదారుల నమ్మకం, ఇటు మదుపరుల విశ్వాసాన్ని కోల్పోతే.. బ్యాంకుల పరిస్థితి ఎలా ఉంటుంది? ఈ విపత్కర పరిస్థితుల నుంచి బ్యాంకులు ఎలా బయటపడతాయి? మిలియన్ డాలర్ల ప్రశ్నే.

– ఈనాడు, హైదరాబాద్

సంవత్సరం	పేరు	మొత్తం	వివరణ
1992	హర్షద్ మెహతా	రూ.5000కోట్లు	కుంభకోణం విలువ
2001	కేతన్ పరేఖ్	రూ.2000కోట్లు	మదుపర్లు నష్టపోయిన సొమ్ము
2009	సత్యం రాజు	రూ.9500కోట్లు	ఖాతాల్లో ఎక్కువ చేసి చూపించిన సొమ్ము
1996	సుబ్రతారాయ్	రూ.24000కోట్లు	సహారా గ్రూప్ చట్ట వ్యతిరేకంగా సమీకరణ
2013	జిగ్నేశ్ షా	రూ.5600కోట్లు	కమొడిటీ లావాదేవీల్లో మోసం

సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి	బంగారం	వెండి	ముడి చమురు
34297 ▲142	10546 ▲45	63.91 ▲18 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	30725 ▲ రూ.లలో 365 (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	38655 ▲ రూ.లలో 470 (ముంబయిలో కిలో)	64.11 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	25,001	+107
నాస్‌డాక్	7,207	+64
నిక్కీ 225 (జపాన్)	21,465	+311
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	31,115	+600
షాంఘై(చైనా)	----	----
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,234	+21
డాక్స్ (జర్మనీ)	12,346	+07


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.21	67.49
పౌండ్ స్టెర్లింగ్	81.52	94.56
యూరో	72.48	84.07
జపనీస్ యెన్/100	54.57	63.31
ఆస్ట్రేలియా డాలరు	46.15	53.39
సింగపూర్ డాలరు	81.52	94.56
థాయ్ బాత్/100	185.84	222.26
బహ్రెయిన్ దీనార్	157.62	180.63
కువైట్ దీనార్	176.30	219.61
ఒమన్ రియాల్	154.35	176.59
సౌదీ రియాల్	15.51	18.39
యూఏఈ దిర్హమ్	15.84	18.52





ఎగుమతులు పైపైకే..

జనవరిలో 9% వృద్ధి ● 3 ఏళ్ల గరిష్ఠానికి వాణిజ్య లోటు



దిల్లీ: దేశీయ ఎగుమతుల జోరు కొనసాగుతోంది. రసాయనాలు, ఇంజినీరింగ్ పరికరాలు, పెట్రోలియం ఉత్పత్తుల విభాగాలు దన్నుగా నిలవడంతో జనవరిలో ఎగుమతులు 9 శాతం వృద్ధి చెంది 24.38 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.60 లక్షల కోట్లు)కు చేరాయి. రసాయనాలు 33 శాతం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు 15.77 శాతం, పెట్రోలియం ఉత్పత్తులు 39.5 శాతం చొప్పున పెరగడం వృద్ధికి దోహదపడ్డాయి. ఇక ఇదే సమయంలో దిగుమతులు సైతం 26.1 శాతం పెరిగి 40.68 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు)కు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 16.3 బిలియన్ డాలర్లు (సుమారు 1.05 లక్షల కోట్లు)కు చేరాయి. ఇది మూడేళ్ల గరిష్ఠస్థాయి కావడం గమనార్హం. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. 2014 నవంబరులో వాణిజ్య లోటు 16.86 బిలియన్ డాలర్లకు చేరింది. గతేడాది జనవరిలో ఇది 9.90 బిలియన్ డాలర్లుగా ఉంది. 2016 ఆగస్టు నుంచి ఎగుమతులు సానుకూలంగానే ఉన్నాయని, ఒక్క 2017 అక్టోబరులో మాత్రమే 1.1 శాతం తగ్గాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. దిగుమతులు చూస్తే. . పసిడి 22 శాతం తగ్గి 2.04 బిలియన్ డాలర్ల నుంచి 1.59 బిలియన్ డాలర్లకు చేరాయి. చమురు 42.64 శాతం పెరిగి 11.65 బిలియన్ డాలర్లకు, ఇంధనేతరాలు 20.49 శాతం పెరిగి 29 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎగుమతులు పెంచేందుకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు.


ఏప్రిల్-జనవరికి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి మధ్య కాలంలో ఎగుమతులు 11.75 శాతం వృద్ధితో 221.82 బిలియన్ డాలర్ల నుంచి 247.89 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతులు 22.21 శాతం అధికమై 310 బి.డాలర్ల నుంచి 379 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 131.15 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ద్రవ్యోల్బణం దిగువకే

జనవరిలో 2.84% ● ఆహార వస్తువులు చౌక

దిల్లీ: టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఆరు నెలల కనిష్ఠానికి చేరింది. ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో జనవరిలో 2.84 శాతంగా నమోదైంది. గత ఆరు నెలల్లో ఇదే కనిష్ఠం అయినప్పటికీ కూరగాయలు ధరలు దూసుకెళ్లాయి. డిసెంబరులో 3.58 శాతంగా నమోదైన ద్రవ్యోల్బణం, 2017 డిసెంబరులో 4.26 శాతంగా నమోదుకావడం గమనార్హం. అంతకు ముందు జులైలో కనిష్ఠంగా 1.88 శాతంగా నమోదైంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం 4.72 శాతం నుంచి 3 శాతానికి తగ్గింది. ఇక నవంబరు ద్రవ్యోల్బణ గణాంకాలను 3.93 శాతం నుంచి 4.02 శాతానికి సవరించారు.

- కూరగాయల ద్రవ్యోల్బణం డిసెంబరులో 56.46 శాతం పెరగ్గా.. గత నెలలో 40.77 శాతానికి తగ్గాయి. ఉల్లి ధరలు ఏకంగా 193.89 శాతం ప్రియమయ్యాయి.
- పప్పుధాన్యాల ధరలు 30.43 శాతం చౌకయ్యాయి. గోధుమ, తృణధాన్యాలు వరుసగా 6.94 శాతం, 1.98 శాతం తగ్గాయి.
- డిసెంబరుతోతో పోలిస్తే గుడ్లు, మాంసం, చేపల ధరలు 0.37 శాతం తగ్గగా, పళ్ల ధరల్లో 8.49 శాతం పెరుగుదల నమోదైంది.
- ఇంధనం, విద్యుత్ విభాగంలో ధరలు 4.08% పెరిగాయి. తయారీ ఉత్పత్తులు కూడా 2.78% అధికమయ్యాయి.



పారదర్శకతతో పాలసీల జారీ

- డిజిటల్‌పై ప్రత్యేక శ్రద్ధ
- టాటా ఏఐఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రిషి శ్రీవాస్తవ

ఈనాడు, హైదరాబాద్: జీవిత బీమా అవసరానికీ, వాస్తవంగా ఉంటోన్న పాలసీ విలువ మధ్య అంతరం అధికంగా ఉందని, ఈ విషయంలో పాలసీదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ప్రొప్రైటరీ ఛానెల్స్ హెడ్ రిషి శ్రీవాస్తవ అన్నారు. డిజిటలీకరణ పెరుగుతోండటంతో 'ఈకేవైసీ'లాంటివి ప్రవేశ పెట్టామని, దీనివల్ల పాలసీదారులకు సులభంగా పాలసీలు జారీ చేసేందుకు వీలవుతోందని పేర్కొన్నారు. పాలసీదారులు పూర్తి అవగాహనతో పాలసీలను తీసుకోవాల్సిన అవసరం ఉందనీ, ఈ నేపథ్యంలో వారికి వీడియో ద్వారా, అప్పటికప్పుడే పాలసీలకు సంబంధించిన అన్ని వివరాలూ అర్థమయ్యేలా వివరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పాలసీలను మోసపూరితంగా అంటగట్టకుండా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. గురువారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ. . ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జీవిత బీమా పాలసీల్లో మంచి వృద్ధి కనిపిస్తోందని, ముఖ్యంగా ప్రొటెక్షన్ పాలసీల వైపు పాలసీదారులు మొగ్గు చూపిస్తున్నారన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా పాలసీలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం 34 పాలసీలు, 6 రైడర్లను అందిస్తున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో కలిపి 1,800 మంది ప్రీమియం ఏజెంట్లు ఉన్నారనీ, వీరి సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

ఏపీలో ఏసీల తయారీ యూనిట్!

రూ.1,300 కోట్ల పెట్టుబడులు ● ఏడాదికి 10 లక్షల యూనిట్ల సామర్థ్యం
50 ఎకరాల స్థలంలో ఏర్పాటు ● 'ఈనాడు'తో ఈజీపీఎల్ సీఈఓ ఇజాజుద్దీన్

ఈనాడు - హైదరాబాద్

జపాన్‌కు చెందిన ఫుజిత్సు జనరల్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్ కండీషనర్ల (ఏసీ) తయారీకి భారీ ప్లాంటును ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ప్రీమియం ఏసీలను విక్రయిస్తున్న ఫుజిత్సు జనరల్ దేశీయ మార్కెట్‌కు సరఫరా చేయడానికే కాక మధ్య ప్రాచ్యం, ఐరోపా దేశాలకు ఎగుమతి చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లో యూనిట్‌ను ఏర్పాటు చేయడం అనుకూలంగా ఉంటుందని, రవాణా వ్యయాలు తగ్గుతాయని భావిస్తోంది. సాధారణంగా ఏసీల తయారీ యూనిట్‌కు రూ.100-120 కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయని.. అంతర్జాతీయ, దేశీయ ఏసీల మార్కెట్ వృద్ధిని పరిగణనలోకి తీసుకుని దాదాపు 20 కోట్ల డాలర్లతో (రూ.1,300 కోట్లు) భారత్‌లో యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కంపెనీ భావిస్తోందని భారత్ ఫుజిత్సు జనరల్ అనుబంధ కంపెనీ ఈటీపీ జనరల్ (ఈజీపీఎల్) ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ), డైరెక్టర్ ఎం.ఇజాజుద్దీన్ తెలిపారు. 'భారత్‌లో దక్షిణాదిలోనే యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం. ఎగుమతులకు వీలుగా ఓడరేవు ఉంటే వ్యయాలు తగ్గుతాయి. దీన్ని పరిగణనలోకి తీసుకుని చెన్నై సమీపంలో ఆంధ్రప్రదేశ్‌లో యూనిట్ ఏర్పాటు చేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. కంపెనీ ఉత్పత్తి చేసే అన్ని రకాల ఏసీలను ఇక్కడ ఉత్పత్తి చేస్తాం. ఏడాదికి దాదాపు 10 లక్షల యూనిట్ల సామర్థ్యంతో దశ వారీగా ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేస్తాం. ఈ యూనిట్ వల్ల దాదాపు 750 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. 50 ఎకరాల స్థలం అవసరమవుతుంది. భారత మార్కెట్ స్థిరత్వం, స్థితిగతులను వచ్చే రెండేళ్ల అధ్యయనం చేసి నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటాం. ఆ తర్వాత ఏడాదిలో యూనిట్‌ను సిద్ధమవుతుందని' ఇజాజుద్దీన్ 'ఈనాడు'కు తెలిపారు. బ్లూస్టార్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ఏసీల యూనిట్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉంది.



కొత్త ఏసీలను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

థాయ్‌లాండ్ నుంచి దిగుమతి..

ప్రస్తుతం ఫుజిత్సు జనరల్‌కు థాయ్‌లాండ్, చైనాల్లో ఏసీలను తయారు చేసే యూనిట్లు ఉన్నాయి. థాయ్‌లాండ్‌లో తయారైన ఏసీలను దిగుమతి చేసుకుని భారత్‌లో విక్రయిస్తున్నామని ఫుజిత్సు జనరల్ ప్రెసిడెంట్ ఇత్సురో సైతో తెలిపారు. చైనాలో ఉత్పత్తి వ్యయాలు పెరుగుతున్నాయని ప్రపంచ వ్యాప్తంగా కంపెనీ వచ్చే రెండు, మూడేళ్లలో 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనుందని, ఇందులో 20 కోట్ల డాలర్లను భారత్‌లో తయారీ యూనిట్‌పై పెట్టాలని భావిస్తున్నామని వివరించారు. పెట్టుబడులకు భారత్‌కు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఐరోపా, అమెరికా తదితర దేశాల్లో ఫుజిత్సు జనరల్ ఏడాదికి 35 లక్షల ఏసీలను విక్రయిస్తోందని, ఇందులో దాదాపు 10 శాతం వాటా భారత్‌కు ఉంటుందని సైతో అన్నారు.

విపణిలోకి 26 రకాల ఏసీలు విడుదల

రానున్న వేసవి కాలంలో ఏసీల అమ్మకాలను పెంచుకోవడానికి ఈజీపీఎల్ దేశీయ విపణిలోకి 26 కొత్త ఏసీలను విడుదల చేసింది. ఇందులో ఇన్వర్టర్ స్ప్లిట్ ఏసీలు, క్యాసెట్ ఏసీలు మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా ఏసీని తరచూ కొనుగోలు చేయరని.. శబ్దరహిత, ఇంధన ఆదా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వినియోగదారులు ఏసీలను కొనుగోలు చేస్తారని ఇజాజుద్దీన్ వివరించారు. సాధారణంగా సగటు ఏసీ ధర రూ.30,000 ఉంటుందని, ఫుజిత్సు జనరల్ విక్రయిస్తున్న 'జనరల్' ఏసీల ధర 50 శాతం అధికంగా ఉంటుందన్నారు. రూ.50,000 పైన ధర ఉన్న ఏసీలు ప్రీమియం విభాగం కిందకు వస్తాయి. 2000లో భారత మార్కెట్‌లోకి ఫుజిత్సు జనరల్ అడుగుపెట్టింది. ప్రస్తుతం రూమ్, వాణిజ్య విభాగాల్లో దాదాపు 40 రకాల ఏసీలను విక్రయిస్తోంది. రూమ్ ఏసీల విభాగంలో ఏడాదికి 60 లక్షల ఏసీలు విక్రయం అవుతుంటే.. కంపెనీ వాటా 4 శాతం. ప్రస్తుతం దేశంలో ప్రీమియం ఏసీలకు తక్కువ మార్కెట్ ఉంది. మొత్తం ఏసీల విక్రయాల్లో ఇన్వర్టర్ ఏసీల వాటా 20 శాతం ఉందని.. త్వరలోనే సగానికి సగం వాటాకు చేరగలదన్నారు. దేశీయ ఏసీల మార్కెట్ ఏడాదికి 15% వృద్ధి చెందుతోందని ఇజాజుద్దీన్ వివరించారు.

ఫిన్‌టెక్ అంకురాలకు ప్రోత్సాహం

హెచ్ఎస్‌బీసీ, టి-హబ్‌ల ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగ్, ఆర్థిక సేవల్లో ఉన్న ఫిన్‌టెక్ అంకురాలకు ప్రోత్సహించేందుకు అంకుర సంస్థల ఇన్‌క్యుబేటర్ టి-హబ్, హెచ్ఎస్‌బీసీ బ్యాంకు ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. గత ఐదేళ్ల కాలంలో ఫిన్‌టెక్ అంకురాల్లో దాదాపు 169శాతం వృద్ధి కనిపించింది. ఇందులో వినూత్న ఆలోచనలతో ఉన్న ఉత్పత్తులను, సేవలను బ్యాంకింగ్ రంగంలో ఉపయోగించుకునేందుకు ఈ యాక్సిలరేటర్ కార్యక్రమం ఉపయోగపడుతుందని హెచ్ఎస్‌బీసీ ఆపరేషన్స్ హెడ్ పాల్ రాడాన్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా ఫిన్‌టెక్ రంగంలో ఉన్న అంకురాల నుంచి వచ్చే నెలలో టి-హబ్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి వినూత్న ఆలోచనలతో ఉన్న 10 అంకురాలను ఈ హెచ్ఎస్‌బీసీ యాక్సిలరేటర్ 2030 కార్యక్రమానికి ఎంపిక చేస్తుంది. ఆ తర్వాత హెచ్ఎస్‌బీసీ తన అవసరాలకు తగ్గట్టు ఈ సంస్థల నుంచి సేవలను స్వీకరిస్తుంది. ఈ సందర్భంగా టి-హబ్ సీఈఓ జయ్ కృష్ణన్ మాట్లాడుతూ.. దేశంలో నగదు రహిత లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో వినూత్న ఆలోచనలతో వస్తున్న ఫిన్‌టెక్ సంస్థలకు మంచి అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎస్‌బీసీతో ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల టి-హబ్ ద్వారా ఫిన్‌టెక్ సంస్థలకు అవసరమైన సహాయ, సహకారాలను అందించేందుకు వీలవుతుందని తెలిపారు.

జీడీపీ, ఐఐపీ గణాంకాలకు ఆధార సంవత్సరం 2017-18!

దిల్లీ: స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) గణాంకాలకు ఆధార సంవత్సరాన్ని (బేస్ ఇయర్) 2017-18గా ప్రభుత్వం మార్చనుంది. అలాగే రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) గణాంకాలకు ఆధార సంవత్సరాన్ని కూడా 2018గా సవరించనున్నట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రి డి.వి.సదానంద గౌడ తెలిపారు. 'జీడీపీ, ఐఐపీ, సీపీఐ గణాంకాల ఆధార సంవత్సరాలను 2018-19లో సవరించాలని మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రంపై ప్రభావం చూపుతాయ'ని బడ్జెట్ ప్రతిపాదనలపై ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మంత్రి అభిప్రాయపడ్డారు. దేశీయ సాంఘిక, ఆర్థిక విభాగాల్లో చోటుచేసుకునే మార్పులకు అనుగుణంగా అవసరమైన గణాంకాలను అందజేసేందుకు గణాంకాల వ్యవస్థను మెరుగుపర్చేలా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ మంత్రిత్వ శాఖ వివిధ చర్యలను చేపట్టనుందని తెలిపారు. 2018-19 బడ్జెట్లో గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖకు రూ.4,859 కోట్లు కేటాయించారు.

మళ్లీ కొనుగోళ్ల మద్దతు

రాణించిన లోహ, చమురు షేర్లు ● సెన్సెక్స్‌కు 140 పాయింట్ల లాభం

సమీక్ష

ఒక రోజు నష్టాల తర్వాత సూచీలు మళ్లీ కోలుకున్నాయి. తక్కువ స్థాయిలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం కలిసొచ్చింది. కొన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు సైతం మెప్పించాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు దన్నుగా నిలవడంతో లోహ, చమురు, వాహన, ప్రైవేట్ బ్యాంక్ షేర్లు రాణించాయి. టోకు ధరల ద్రవ్యోల్బణం ఆరు నెలల కనిష్ఠానికి చేరడం సైతం మార్కెట్ సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు రాణించగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34207.57 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజులో అధిక భాగం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 34,535.08 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం లాభాల స్వీకరణ ఎదుర్కొన్న సెన్సెక్స్, చివరకు 141.52 పాయింట్ల లాభంతో 34,297.47 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 44.60 పాయింట్లు పెరిగి 10,545.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,511.05- 10,618. 10 పాయింట్ల మధ్య కదలాడింది.

నెస్లే దూకుడు: ఆకర్షణీయమైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎఫ్ఎమ్‌సీజీ సంస్థ నెస్లే ఇండియా షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో రూ.7,640 వద్ద గరిష్ఠానికి చేరిన షేరు.. చివరకు 4.28 శాతం లాభంతో రూ.7,571.10 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,998.52 కోట్లు పెరిగి రూ.72,997.30 కోట్లకు చేరింది.

- కాల్ అంతరాయాల విషయంలో టెలికాం ఆపరేటర్లపై కఠిన జరిమానాలు విధించేందుకు ట్రాయ్ యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో టెలికాం షేర్లు నీరసపడ్డాయి. ఆర్‌కాం 5.41%, ఎంటీఎన్ఎల్ 2.38%, ఐడియా 2.18%, భారతీ ఎయిర్‌టెల్ 1.36%, టాటా కమ్యూనికేషన్స్ 1.28% చొప్పున నష్టాలు నమోదు చేశాయి.


సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 3.15%, ఇన్ఫోసిస్ 1.47%, పవర్‌గ్రిడ్ 1.46%, ఓఎన్‌జీసీ 1.37%, బజాజ్ ఆటో 0.96%, హెచ్‌డీఎఫ్‌సీ 0.89%, ఎస్‌బీఐ 0.74%, హిందుస్థాన్ యునిలీవర్ 0.70% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. హీరో మోటోకార్ప్ (1.85%), టాటా స్టీల్ (1.20%), భారతీ ఎయిర్‌టెల్ (1.15%), ఎల్ అండ్ టీ (0.78%), విప్రో (0.49%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో చమురు- గ్యాస్ 0.96% లాభపడింది. లోహ 0.72%, ఐటీ 0.44%, బ్యాంకింగ్ 0.43% మేర రాణించాయి. టెలికాం, మన్నికైన వినిమయ వస్తువులు, స్థిరాస్తి, యంత్ర పరికరాల షేర్లు డీలాపడ్డాయి.

ఏప్రిల్ 1 నుంచి ఆధార్, పాన్ ఇవ్వాల్సిందే

- ఫండ్ కొత్త ఖాతాలకు గడువు పొడిగించిన బీఎస్ఈ

దిల్లీ: ఏప్రిల్ 1 నుంచి మ్యూచువల్ ఫండ్ ఖాతా తెరవాలంటే పాన్, ఆధార్‌ను అప్పటికప్పుడు సమర్పించాలి. లేకుంటే కొత్త ఖాతా తెరిచే వీలుండదని బీఎస్ఈ తెలిపింది. వాస్తవానికి ఈ రోజు నుంచే ఈ విధానం అమల్లోకి రావాల్సి ఉంది. అయితే దీనిని ఏప్రిల్ 1 నుంచి వర్తింపచేయాలని బీఎస్ఈ నిర్ణయించింది. ప్రస్తుత ఖాతాదార్లు లేదంటే ఫిబ్రవరి 14 లోపు కొత్తగా ఖాతా తెరిచిన వాళ్లు పాన్, ఆధార్ పత్రాలు ఇవ్వకుంటే, మార్చి 31లోపు వాటిని సమర్పించాల్సి ఉంటుంది. లేకుంటే వారి ఖాతా సంఖ్య (ఫోలియోలు) రద్దు అవుతుందని బీఎస్ఈ తెలిపింది. వినియోగదారుల నుంచి ఆధార్ వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలంటూ గత జూన్‌లో మనీ లాండరింగ్ నియంత్రణ నిబంధనల్లో ప్రభుత్వం చేసిన సవరణ మేరకు బీఎస్ఈ ఈ చర్యలు చేపట్టింది.

15వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	391	వరంగల్	393
చిల్లరగా (ఒక గుడ్డు)	4.50	విశాఖపట్నం	400
బెంగళూరు	400	చెన్నై	415
16వ తేదీకి...		చిత్తూరు	408
విజయవాడ/గోదావరి	395	నమక్కల్	395

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 411.70 (413.00) 3293138
AMBUJA CEMEN 253.40 (254.15) 1620357
ASIAN PAINTS 1135.45 (1139.15) 471072
AUROBIND PHA 592.55 (602.10) 2192642
AXIS BANK LT 543.70 (543.90) 11593643
BAJAJ AUTO L 3143.50 (3109.75) 148715
BAJAJ FINANC 1677.05 (1669.95) 1177116
BHARTI AIRTE 428.95 (434.80) 4130548
BHARTI INFRA 331.05 (327.40) 3526872
BOSCH LTD 19502.45 (19515.10) 6087
BPCL 475.05 (460.10) 4723739
CIPLA 605.85 (616.15) 1391858
COAL INDIA L 308.10 (306.95) 5219503
DR. REDDYS 2195.80 (2183.30) 345185
EICHER MOTOR 28340.45 (28027.60) 30232
GAIL 475.90 (466.90) 2110245
HCL TECH 939.70 (937.80) 1140921
HDFC 1829.50 (1814.00) 3382968
HDFC BANK 1881.90 (1883.15) 1228806
HERO MOTOCOR 3527.25 (3596.05) 221710
HINDALCO IND 251.50 (243.25) 10053559
HINDUSTAN UN 1358.15 (1349.40) 844856
HPCL 390.90 (382.65) 2695010
ICICI BANK 328.65 (318.95) 23779772
INDIABULLS H 1312.30 (1348.20) 1189964
INDIAN OIL 376.80 (377.35) 3819270
INDUSINDBANK 1686.15 (1694.45) 872147
INFOSYS LTD 1114.45 (1097.75) 3993368
ITC 268.10 (266.50) 11736246
KOTAK MAHIND 1042.15 (1042.45) 908706
LARSEN & TOU 1350.35 (1361.20) 1861841
LUPIN 822.30 (827.60) 872676
M&M 749.35 (746.95) 1652980
MARUTI SUZIK 9020.25 (9001.60) 250781
NTPC LTD 163.20 (162.95) 2151637
ONGC 188.30 (185.75) 5046557
POWER GRID C 197.90 (195.45) 4968912
RELIANCE IND 935.65 (933.65) 6109454
SBI 278.70 (276.20) 26058237
SUN PHARMA 575.75 (574.80) 10715444
TATA CONSULT 2925.85 (2911.80) 1232618
TATA MOTORS 375.80 (376.85) 10225880
TATA STEEL L 700.55 (708.00) 5131245
TECH MAHINDR 605.65 (611.50) 1676641
ULTRATECH 4187.85 (4175.50) 122433
UPL LIMITED 716.10 (721.90) 845055
VEDANTA LIMI 324.40 (315.75) 11559723
WIPRO 292.50 (293.45) 1655650
YES BANK LTD 319.80 (320.35) 15482667
ZEE ENTERTAI 570.90 (576.60) 1621559

నిఫ్టీ నెక్ట్స్ 50

ABB 1550.50 (1572.10) 34965
ACC 1621.30 (1629.70) 543661
ASHOK LEYLAN 137.25 (137.40) 14544353
AVENUE SUPER 1183.95 (1201.40) 269802
BAJAJ FINSER 5130.35 (5189.00) 104197
BANK OFBAROD 159.05 (165.80) 17565094
BEL 156.95 (160.60) 3653340
BHEL 94.65 (97.85) 5627414
BRITANNIA 4755.75 (4764.15) 82826
CADILA HEALT 417.10 (419.60) 630169
COLGATE PALM 1088.85 (1096.35) 106464
CONTAINER 1326.00 (1325.10) 276499
CUMMINS INDI 842.10 (840.45) 310692
DABUR INDIA 339.60 (340.75) 366437
DLF LIMITED 231.15 (230.95) 5417282
EMAMI LIMITE 1090.30 (1079.85) 367184
GLAXOSMI CON 6405.30 (6432.10) 26390
GLAXOSMI PHA 2448.60 (2459.05) 10015
GLENMARK PHA 529.65 (530.45) 1012891
GODREJ CONSU 1026.25 (1027.50) 597152
HAVELLS INDI 516.25 (514.40) 1296081
HINDUSTAN ZI 313.40 (309.10) 2255264
ICICI PRU LI 406.70 (409.85) 474769
IDEA CELLULR 83.10 (84.80) 8270464
INTERGLOBE A 1262.00 (1274.95) 565530
JSW STEEL LT 307.80 (309.55) 3695342
LIC HOUS.FIN 528.50 (525.05) 1466887
MARICO LIMIT 309.95 (315.60) 1559501
MCDOWELL 3313.20 (3214.70) 652860
MOTHERSON 341.20 (357.25) 5807693
MRF 72156.25 (72329.20) 7756
NHPC LTD 28.65 (28.65) 4333135
NMDC LTD 134.90 (133.65) 2582992
OIL INDIA 362.00 (359.25) 710275
ORACLE FIN S 4033.90 (4014.35) 16673
P&G HYG&HEAL 9300.65 (9296.15) 1925
PETRONET LNG 249.65 (252.05) 2903140
PIDILITE IND 888.30 (894.85) 247512
PIRAMAL ENTE 2711.00 (2733.30) 87098
PNB 128.25 (145.85) 177112217
POWER FIN CO 108.85 (111.25) 4075392
RURAL ELEC C 143.25 (154.75) 6464116
SAIL 92.30 (93.55) 15883683
SHREE CEMENT 17356.70 (16813.15) 17940
SHRIRAM TRAN 1360.15 (1348.25) 565015
SIEMENS 1259.00 (1275.50) 138350
SUN TV LTD 979.55 (998.40) 929208
TATA POWER 86.25 (87.10) 4726842
TITAN IND 814.85 (813.70) 2225089
TORRENT PHAR 1420.95 (1429.25) 68486

ఘనం (+)

నిఫ్టీ	15న	మార్పు%
HINDALCO IND	251.50	3.39
BPCL	475.05	3.25
ICICI BANK	328.65	3.04
VEDANTA LIM	324.40	2.74
HPC	390.90	2.16
GAIL (INDIA)	475.90	1.93
INFOSYS LIM	1114.45	1.52

గ్రహణం (-)

నిఫ్టీ	15న	మార్పు%
INDIABULLS HSG	1312.30	-2.66
HERO MOTO	3527.25	-1.91
CIPLA	605.85	-1.67
AUROBINDO PHA	592.55	-1.59
BHARTI AIRTEL	428.95	-1.35
TATA STEEL	700.55	-1.05
ZEE ENTER ENT	570.90	-0.99

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 7.16 (7.49) 18889
AMAR RAJA BA 826.65 (839.35) 39756
ANDHRA BANK 47 (46.90) 251558
ANDHRA CEMEN 11.61 (11.76) 15359
ANDHRA PETRO 59 (60.85) 108262
ASTRA MICROW 106.50 (107.40) 61265
AUROBINDO PH 593.45 (601.85) 150442
AVANTI FEEDS 2371.50 (2411.60) 9847
AVON ORG 13.30 (12.70) 10693
BALAJI AMIN 654.20 (672.20) 5533
BARTRONICS 13.34 (13.81) 14896
BHAGIRA CHEM 304.90 (317.20) 2503
BHAGYA NAG 48.30 (50.55) 24099
BRILLIANT SE 12.85 (13.50) 249694
COMBAT DRUGS 27.40 (27.40) 12714
CYBERMATE 3.52 (3.53) 44151
CYIENT LIMIT 617.95 (623.70) 15110
DIVI'S LAB 1048 (1050.30) 23637
DR REDDY 2194.45 (2183.10) 30129
FOUR SOFT 98.20 (93.55) 11353
GATI CORPN 114.55 (115.45) 118550
GAYATRI PROJ 223.35 (223.85) 70834
GMR INFRASTR 18.70 (19.70) 9075250
GOLDST INFRA 197.25 (213.80) 117100
GOLDSTONE EN 15.20 (16) 8689
GRANULES (I) 117.65 (122.25) 181894
GSS AMERICA 43.65 (36.40) 374389
GVK POWER 18.75 (19.60) 1328756
HBL NIFE POW 57.55 (61.25) 134953
IKF SOFT 0.83 (0.87) 55602
ILFS ENGINEE 48.15 (50.65) 25687
INNAREDY COM 3.80 (4) 31386
IVRCL INFRAS 4.77 (4.98) 81380
KAKATIYA CEM 300.40 (306.90) 6685
KALLAM SPG 27.30 (28.75) 96383
KAVERI SEED 472.45 (473.60) 26452
KCP LTD 131.70 (139.75) 11602
KNR CONSTRUC 321.10 (321.25) 18395
KREBS BIO 161.50 (154) 6960
LANCO INDUS 374.40 (372.60) 16957
LANCO INFRAT 1.32 (1.36) 3000259
LOKESH MACH 67.75 (70.45) 22832
MADHUCON PRO 28.55 (29.30) 16834
MEGA SOFT 14.93 (15.12) 61144
MIC ELECTRON 7.58 (7.94) 49146
MSR INDIA LT 45.50 (46.65) 11916
NAGARJAGRICH 47.10 (48.20) 15044
NATCO PHARMA 787.05 (782.75) 60181
NAVA BH VENT 152.45 (150) 39277
NCC 123.40 (126.50) 953811
NCL IND 243.45 (243.90) 21415
NEHA INTER 7.51 (8.04) 12506
NEULAND LAB 711.70 (708.30) 2360
NIHAR INFO 14.89 (14.45) 564
OIL COUNTRY 43.90 (44.30) 27934
PANYAM CEMEN 51.20 (51.35) 16092
PENNER IND 62.40 (66.10) 130689
PHYTOCHEM I 64.15 (66.20) 8544
PITTI LAMIN 93 (98.20) 43803
PRAJAY ENGS 14.15 (14.85) 38257
PRISM CEMENT 125.50 (137.95) 216065
PRUDENTL PHA 4.59 (4.90) 764984
RAIN INDUSTR 376.75 (383.55) 374707
RAM INFORMAT 41.15 (34.30) 40457
SAGAR CEM 993.55 (1012.10) 1100
SATVAH. ISPA 23.50 (24) 9774
SPHERE GLOBA 37.35 (38.60) 42867
SREE RAYAL A 61.60 (64.60) 212055
SRINIVASA SH 64.45 (65.20) 15544
STEEL EXCHAN 33.50 (33.65) 49266
SUJANA METAL 1.43 (1.45) 29525
SUJANA UNIVE 0.95 (1) 30200
SURANA TELE 5.31 (5.45) 83457
SURYALAKSH.C 81.35 (84.45) 17958
SUVEN PHARMA 197.30 (199.90) 99671
TAJ GVK HOTE 176.45 (178.20) 10643
TANLA 32.35 (32.95) 65191
TRANS BIOTEK 2.22 (2.13) 8523
TRENDY KNIT 0.24 (0.23) 12702
VICEROY HOTE 15.90 (17.05) 87961
VISAKA IND 716.05 (717.05) 19829
VISTA PHARMA 42.90 (44.20) 12457
VIVIMED LABS 84.60 (87.05) 138402
XL TELENE 2.92 (3.07) 11739
YBRANT DIGIT 5.59 (5.83) 1367841
ZENOTECH LAB 44.70 (44.40) 9762
ZENTECH 122 (123.10) 17005

చాంపియన్



రాణించినా తప్పించారు

దిల్లీ: టీమ్‌ఇండియా తరఫున రాణించినా తనను జట్టు నుంచి తప్పించడం బాధించిందని సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా ఆవేదన వ్యక్తం చేశాడు. తానేంటో నిరూపించుకునే అవకాశం ఇప్పుడు మళ్లీ లభించిందని, ఈ అవకాశాన్ని వదులుకోనని అన్నాడు. "బాగా ఆడినా జట్టు నుంచి తప్పించడం బాధ కలిగించింది. ఇప్పుడు నేను యోయో పరీక్షలో పాసయ్యాను. ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నా. ఇన్ని నెలల శిక్షణ తర్వాత.. భారత్ తరఫున మళ్లీ ఆడాలన్న కాంక్ష మరింత బలపడింది. నా పోరాటాన్ని ఇక్కడితో వదిలేయను. వీలైనంత ఎక్కువ కాలం టీమ్‌ఇండియాకు ఆడేందుకు ప్రయత్నిస్తా. 2019 ప్రపంచకప్‌లో నేను ఆడాలనుకుంటున్నా. ఎందుకంటే ఇంగ్లాండ్‌లో బాగా ఆడతానని తెలుసు. నాలో ఇంకా ఎంతో సత్తా ఉంది. దక్షిణాఫ్రికాతో మూడు టీ20ల సిరీస్‌లో రాణిస్తానన్న నమ్మకం ఉంది" అని రైనా తెలిపాడు. 31 ఏళ్ల రైనా టీమ్‌ఇండియా తరఫున 223 వన్డేలు, 65 టీ20లు ఆడాడు. అయినా ఇప్పటికీ అరంగేట్రం చేస్తున్నట్లే అనిపిస్తోందని చెప్పాడు. "నా వయసు 31. ఐతే వయసు అనేది కేవలం అంకె మాత్రమే. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం టీమ్‌ఇండియా జెర్సీ అందుకోగానే. . అరంగేట్రంలో ఎలాంటి భావన కలిగిందో.. అలాంటి భావనే కలిగింది. అది చాలా ప్రత్యేకమైంది" అని అన్నాడు. రైనా చివరిసారిగా గతేడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో టీ20 మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో రైనా 63 పరుగులు చేశాడు. ఆ తర్వాత యోయో పరీక్షలో విఫలం కావడంతో జట్టులో చోటు కోల్పోయాడు. "జట్టుకు దూరంగా ఉన్న ఈ కాలంలో నా కుటుంబమే కొండంత బలాన్నిచ్చింది. జాతీయ క్రికెట్ అకాడమీలో కఠోరంగా శ్రమించా. నా కెరీర్‌లో నేనెప్పుడూ ఫిట్‌గానే ఉన్నా. కానీ యోయో పరీక్ష సమయంలో గాయాలు బాధించాయి" అని రైనా వివరించాడు. వన్డేల్లో 4, 5 స్థానాలు తన బ్యాటింగ్ శైలికి నప్పుతాయని రైనా చెప్పాడు.



ఐపీఎల్ వద్దంది.. కౌంటీ రమ్మంది!

ససెక్స్‌కు ఆడనున్న ఇషాంత్

లండన్: టీమ్‌ఇండియా పేసర్ ఇషాంత్ శర్మ కూడా పుజారా బాట పట్టాడు. ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోని ఇషాంత్ ఇంగ్లాండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. ఈ సీజన్‌లో ససెక్స్ తరఫున ఆడేందుకు ఇప్పటికే ఒప్పందం కుదిరింది. బీసీసీఐ అనుమతి రావడమే తరువాయి. ఏప్రిల్ 4 నుంచి జూన్ 4 వరకు ఇషాంత్ అందుబాటులో ఉంటాడని ససెక్స్ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ మధ్య కాలంలో ఐదు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లతో పాటు 8 వన్డేల్లో అతడు ఆడే అవకాశముంది. ఐపీఎల్ ఆడే అవకాశం లేకపోవడంతో ఇషాంత్ కౌంటీ బాట పట్టాడు. ఐతే ససెక్స్ అతడితో ఒప్పందం చేసుకోవడానికి ప్రధాన కారణం కూడా ఐపీఎలే. పేసర్లు జోఫ్రా ఆర్చర్, క్రిస్ జోర్డాన్‌లు ఐపీఎల్ ఆడేందుకు జట్టును వీడనుండటంతో ససెక్స్.. ఇషాంత్‌ను ఎంపిక చేసుకుంది. అతడు కౌంటీ క్రికెట్ ఆడనుండటం ఇదే తొలిసారి. ఇప్పటికే పుజారా యార్క్‌షైర్ తరఫున ఆడుతున్న సంగతి తెలిసిందే.

సిరీస్ ఫలితం తేలిపోయింది.. సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమ్‌ఇండియా మరో వన్డే మిగిలుండగానే చారిత్రక సిరీస్ విజయాన్ని అందుకుంది. నం.1 ర్యాంకు ఖాతాలో చేరిపోయింది.. చివరి వన్డేలో ఓడినా భారత ర్యాంకులో ఎలాంటి మార్పు ఉండదు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో ఇక సాధించాల్సిందేం లేదు! శుక్రవారం సెంచూరియన్‌లో జరిగే చివరి వన్డే నామమాత్రమే. అందుకే ప్రయోగాలకు సిద్ధమవుతోంది టీమ్‌ఇండియా. ఆఖరి మ్యాచ్‌లో జట్టు కొత్తగా కనిపిస్తే ఆశ్చర్యమేం లేదు. ఏదేమైనా విజయాన్ని మాత్రం వదలకూడదని పట్టుదలగా ఉంది కోహ్లిసేన!

సాయంత్రం 4.30 నుంచి సోనీటెన్-1,3లో



ప్రయోగాల వేళ..!

బెంచ్ ఆటగాళ్లకు భారత్ అవకాశం ● దక్షిణాఫ్రికాతో ఆరో వన్డే నేడు

సెంచూరియన్

ఏకపక్షంగా సాగిన వన్డే సిరీస్‌లో ఆఖరి సమరం. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి మ్యాచ్ శుక్రవారమే. ఇప్పటికే సిరీస్ గెలుచుకున్న భారత్ 5-1తో ముగించాలని పట్టుదలగా ఉండగా.. దక్షిణాఫ్రికా గెలుపుతో ఊరట పొందాలని చూస్తోంది. మూడు టీ20ల సిరీస్ ఆదివారం ఆరంభంకానున్న నేపథ్యంలో రెండు జట్లు విజయంతో సిరీస్‌ను ముగించాలని కోరుకుంటున్నాయి. జోరుమీదున్న భారత్‌కే మ్యాచ్‌లో విజయావకాశాలు ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఓపెనర్ ధావన్, కోహ్లి అద్భుత ఫామ్‌లో ఉన్నారు. రోహిత్ కూడా ఐదో వన్డేలో సెంచరీ సాధించాడు. ఇక బౌలింగ్‌లో పేసర్లు, స్పిన్నర్లు సమష్టిగా రాణిస్తున్నారు. మణికట్టు మాయగాళ్లు కుల్‌దీప్ యాదవ్, చాహల్‌ను ఎదుర్కోవడం దక్షిణాఫ్రికాకు కత్తిమీద సాములా తయారైంది. ఆఖరి వన్డేలో పరిస్థితి భిన్నంగా ఏం ఉండకపోవచ్చు. ఐతే.. భారత్‌కూ పరిష్కరించుకోవాల్సిన సమస్యలున్నాయి. జట్టులో మిడిలార్డర్ నిలకడగా విఫలమవుతోంది. మరోవైపు పేస్ దళంలో భువనేశ్వర్, బుమ్రా కొంత కాలంగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. అందుకే ఈ రెండు విభాగాల్లో ప్రయోగాలకు సిద్ధమవుతోంది టీమ్‌ఇండియా!

వాళ్లకు విశ్రాంతి: నిరుడు శ్రీలంక పర్యటన మొదలు భువనేశ్వర్ 19 వన్డేలు, 6 టీ20లు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. మరోవైపు బుమ్రా కూడా 20 వన్డేలు, 8 టీ20ల్లో తుది జట్టులో ఉన్నాడు. తాజాగా దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్టు మ్యాచ్‌ల్లోనూ అతడికి అవకాశం లభించింది. సుదీర్ఘ సఫారీ పర్యటనలో టీ20 సిరీస్ మరికొన్ని రోజుల్లోనే ఆరంభంకానున్న నేపథ్యంలో వీరిద్దరికి టీమ్‌ఇండియా విశ్రాంతి ఇచ్చే అవకాశముంది. కొన్ని రోజులుగా బెంచ్‌కే పరిమితమైన మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్‌లు తుది జట్టులో ఉండొచ్చు. 2019 ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేసే పనిలో ఉన్న భారత్ అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకోవడం ముఖ్యం. ఇక భారత మిడిలార్డర్ కూడా ఇబ్బందిపడుతోంది. లైనప్‌లో 4 నుంచి ఏడో నంబర్ బ్యాట్స్‌మన్ ఈ సిరీస్‌లో సాధించింది ఒకే అర్ధసెంచరీ. రహానె ఆ ఘనత సాధించాడు. జాదవ్ స్థానంలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ పెద్దగా ఆకట్టుకోలేదు. ఆరో వన్డేలో మనీష్ పాండే, దినేశ్ కార్తీక్‌లు బరిలో దిగొచ్చు. కనీసం ఒక్కరికైనా అవకాశం దక్కొచ్చు. బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇస్తామని కెప్టెన్ కోహ్లి ఇప్పటికే స్పష్టం చేసిన నేపథ్యంలో జట్టులో మార్పులు తథ్యం. స్పిన్నర్లు కుల్‌దీప్, చాహల్ జోడీని విడదీసి అక్షర్ పటేల్‌కు అవకాశం ఇస్తారా అన్నది ఆసక్తికరం. మరోవైపు దక్షిణాఫ్రికా పూర్తి స్థాయి జట్టుతో దిగనుంది. ఆస్ట్రేలియా పర్యటన నేపథ్యంలో తమ ప్రధాన బౌలర్లు రబాడ, మోర్నీ, తాహిర్, ఎంగిడిలకు టీ20 జట్టు నుంచి విశ్రాంతినిచ్చింది. ఈ నేపథ్యంలో భారత్‌తో సిరీస్‌లో ఆఖరి మ్యాచ్‌లోనైనా వీరంతా సత్తాచాటాలని దక్షిణాఫ్రికా కోరుకుంటోంది.


ఈసారి తిప్పేస్తారా..: సెంచూరియన్‌లో జరిగిన రెండో వన్డేలో టీమ్‌ఇండియా 9 వికెట్ల తేడాతో సఫారీ జట్టును చిత్తు చేసింది. కుల్‌దీప్, చాహల్‌లు విజృంభించి 8 వికెట్లు పడగొట్టడంతో ఆ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 118 పరుగులకే కుప్పకూలింది. ఆ మ్యాచ్‌లో పిచ్ పూర్తిగా స్పిన్‌కు అనుకూలించింది. అది పూర్తిగా పేస్ పిచ్‌గా మారిపోయే అవకాశమైతే లేదు. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించొచ్చు.

1 టెస్టు, వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ సాధించిన సెంచరీలు. భారత్ ఖాతాలో ఐదున్నాయి. కోహ్లి మూడు బాదగా, రోహిత్, ధావన్ తలో శతకం కొట్టారు.

2 ఐదు అంతకంటే ఎక్కువ వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికాను దక్షిణాఫ్రికాలో ఓడించిన రెండో జట్టు టీమ్‌ఇండియా. ఆస్ట్రేలియా ముందుంది.

22.65 భారత్‌తో ప్రస్తుత వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ సగటు. స్వదేశంలో ద్వైపాక్షిక సిరీస్‌లో ఇదే అత్యల్పం. బౌలింగ్ సగటు (50.2)లో కూడా ఇప్పటిదే చెత్త రికార్డు.

ఇలాంటి స్థితిలో ఎప్పుడూ లేం



దక్షిణాఫ్రికా జట్టు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి స్థితిలో లేమని ఆ జట్టు ఓపెనర్ హషీమ్ ఆమ్లా అన్నాడు. భారత్‌తో సిరీస్ తమకో పాఠమని చెప్పాడు. "వన్డేల్లో ఇలాంటి కఠిన స్థితిని గతంలో ఎదుర్కొన్నామని అనుకోవట్లేదు. 2008లో ఇంగ్లాండ్‌లో విఫలమయ్యాం కానీ.. ఈ స్థాయిలో కాదు. ఐతే ప్రతి వైఫల్యం నుంచి ఓ పాఠం నేర్చుకోవాలి. జట్టులో యువ క్రికెటర్లు ఆలోచించాల్సిన సమయమిది. వన్డే ప్రపంచకప్ ముందు భారత్‌తో సిరీస్ ఓటమి మాకు మేలుకొలుపు. ఈ సిరీస్ నుంచి సానుకూలాంశాలు తీసుకుని ముందుకు సాగుతాం. వరుస వైఫల్యాలు చాలా పాఠాలు నేర్పుతాయి. ఇన్నింగ్స్ మధ్యలో పరుగులు సాధించడంలో మేం ఘోరంగా విఫలమవుతున్నామని ఈ సిరీస్‌లో తెలిసొచ్చింది. భారత స్పిన్నర్లు మమ్మల్ని కోలుకోలేని దెబ్బ తీశారు" అని ఆమ్లా వివరించాడు.

స్వర్ణ శ్యామ్

ఆసియా క్రీడల బాక్సింగ్‌లో పసిడి



జకర్తా: తెలుగుతేజం కాకర శ్యామ్‌కుమార్ మరోసారి సత్తా చాటాడు. ఆసియా క్రీడల టెస్టు ఈవెంట్ బాక్సింగ్ పోటీల్లో ఈ విశాఖ కుర్రాడు స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. గురువారం 49 కేజీల విభాగం ఫైనల్లో అతను 4-1తో మారియో బ్లాసిస్‌ను ఓడించాడు. ఫైనల్లో పంచ్‌లతో విరుచుకుపడిన శ్యామ్.. సులభంగా విజయాన్ని సొంతం చేసుకున్నాడు. మనీష్ కౌశిక్ (60 కేజీలు), షేక్ సల్మాన్ అన్వర్ (52 కేజీలు), ఆశిష్ (64 కేజీలు), పవిత్ర (60 కేజీలు) కూడా స్వర్ణాలు సాధించారు. సల్మాన్ 5-0తో ఫిలిపినో రొగెన్‌ను ఓడించగా.. రెంటారొ కిముర (జపాన్)పై మనీష్ గెలిచాడు. స్థానిక ఆటగాడు సగర్ రేను ఓడించిన ఆశిష్ మరో స్వర్ణాన్ని భారత ఖాతాలో చేర్చాడు. మహిళల 60 కేజీల విభాగంలో పవిత్ర 5-0తో నిలావాన్ (థాయ్‌లాండ్)ను చిత్తు చేసి పసిడి గెలిచింది. శశి చోప్రా (57 కేజీలు) రజతం గెలవగా.. ఎతేష్‌ఖాన్ (56 కేజీలు) రీతు గెర్వాల్ (51 కేజీలు), పవన్‌కుమార్ (69 కేజీలు), ఆశిష్‌కుమార్ (75 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

జోరు కొనసాగనీ..

● ఆత్మవిశ్వాసంతో భారత మహిళల జట్టు ● నేడు దక్షిణాఫ్రికాతో రెండో టీ20




ఈస్ట్ లండన్: దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్ గెలిచి.. టీ20 సిరీస్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు మరో సమరానికి సిద్ధమైంది. రెండు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండో టీ20 శుక్రవారమే. జోరు కొనసాగించి 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాలని హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు పట్టుదలగా ఉంది. తొలి మ్యాచ్‌లో మిథాలీ రాజ్ అర్ధసెంచరీతో చెలరేగగా.. 17 ఏళ్ల అమ్మాయి జెమీమా అరంగేట్రంలోనే ఆకట్టుకుంది. వేదా కృష్ణమూర్తి కూడా రాణించింది. వీరికి తోడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన కూడా పరుగులు సాధిస్తే భారత్‌కు తిరుగులేనట్లే. బౌలింగ్‌లో అనూజ పాటిల్, పూనమ్ యాదవ్, రాధా యాదవ్ మంచి ఫామ్‌లో ఉన్నారు.



భారత హాకీ జట్టుకు స్పాన్సర్‌గా ఒడిశా ప్రభుత్వం

దిల్లీ: భారత హాకీ జట్టుకు ఊహించని స్పాన్సర్! గతంలో ఎప్పుడూ లేనట్లుగా ఒక రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. వచ్చే ఐదేళ్ల పాటు భారత జట్టుకు స్పాన్సర్‌గా ఉండేందుకు ఒడిశా ప్రభుత్వం ముందుకొచ్చింది. గురువారం ఒక కార్యక్రమంలో ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. భారత జట్టు ధరించబోయే జెర్సీని కూడా ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. "ఒడిశాలో హాకీకి మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా స్థానిక గిరిజన తెగలకు హాకీయే జీవితం. అందుకే ఒడిశా నుంచి అద్భుతమైన ఆటగాళ్లు భారత్‌కు ఆడారు. ఈ నేపథ్యంలోనే జాతీయ హాకీ జట్టుకు స్పాన్సర్‌గా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాం" అని నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు. ఒడిశా నుంచి దిలీప్ టిర్కీ, ఇగ్నేస్ టిర్కీ, లాజరస్ బార్లా లాంటి ఆటగాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు.

ఫించ్ పెళ్లి కోసం...



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా స్టార్ ఆటగాళ్లు ఆరోన్ ఫించ్, మ్యాక్స్‌వెల్‌లు ఐపీఎల్‌లో తమ జట్లు తలపడే తొలి మ్యాచ్‌కు దూరం కానున్నారు. ఐపీఎల్‌లో ఫించ్.. పంజాబ్‌కు, మ్యాక్స్‌వెల్ దిల్లీకి ఆడనున్నారు. ఈ రెండు జట్లు ఏప్రిల్ 8న తలపడనున్నాయి. సరిగ్గా అదే రోజున ఫించ్ వివాహం. మ్యాక్స్‌వెల్ కూడా ఫించ్ పెళ్లి కోసమే ఆగిపోతున్నాడు. ఎందుకంటే ఫించ్ పెళ్లి పనులను మ్యాక్స్‌వెల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు. "ఐపీఎల్ షెడ్యూల్ ఈరోజే చూశాను. తొలి మ్యాచ్ ఆడడం సాధ్యం కాదు. ఏప్రిల్ 7న నా పెళ్లి రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాను" అని ఫించ్ చెప్పాడు.

బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో శ్రీలంక విజయం

ఢాకా: బంగ్లాదేశ్‌తో గురువారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో శ్రీలంక 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ముష్ఫికర్ రహీమ్ (66 నాటౌట్; 44 బంతుల్లో 7×4, 1×6), సౌమ్య సర్కార్ (51; 32 బంతుల్లో 6×4, 2×6), మహ్మదుల్లా (43; 31 బంతుల్లో 2×4, 2×6) మెరవడంతో మొదట బంగ్లాదేశ్ 5 వికెట్లకు 193 పరుగులు చేసింది. ధాటిగా ఆడిన ముష్ఫికర్.. సర్కార్‌తో రెండో వికెట్‌కు 51, మహ్మదుల్లాతో నాలుగో వికెట్‌కు 73 పరుగులు జోడించాడు. జీవన్ మెండిస్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో శ్రీలంక చెలరేగిపోయింది. కుశాల్ మెండిస్ (53; 27 బంతుల్లో 8×4, 2×6), శనక (42 నాటౌట్; 24 బంతుల్లో 3×4, 3×6), తిసార పెరీరా (39 నాటౌట్; 18 బంతుల్లో 4×4, 3×6) విరుచుకుపడడంతో లక్ష్యాన్ని శ్రీలంక 16.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.. నజ్ముల్ ఇస్లామ్ రెండు వికెట్లు పడగొట్టాడు. టీ20ల్లో లంకకు ఇదే అత్యధిక ఛేదన. చివరిదైన రెండో టీ20 ఆదివారం జరుగుతుంది.



అలాంటి జగదీష్..

ప్యాంగ్‌చాంగ్: రెండు నెలల క్రితం అతను ఒలింపిక్స్‌కే అర్హత సాధించలేదు.. రెండు వారాల క్రితం పోటీల కోసం ఎక్కాల్సిన విమానాన్నీ అందుకోలేకపోయాడు.. రెండు రోజుల ముందు వరకు రేసులో పాల్గొనేందుకు సూటే లేదు.. ఇన్ని అడ్డంకులున్నా అతను మాత్రం ఎట్టకేలకు ఒక మెగా ఈవెంట్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అతనే జగ్‌దీష్‌సింగ్.. వింటర్ ఒలింపిక్స్‌లో క్రాస్‌కంట్రీ స్కీయింగ్‌లో పోటీపడుతున్న అథ్లెట్. శుక్రవారమే అతను తన పోటీ ప్రారంభించనున్నాడు. ఈ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ఇద్దరు భారత అథ్లెట్లలో ఒకరు శివకేశవన్ అయితే మరొకరు జగ్‌దీష్. 15 కి.మీ క్రాస్‌కంట్రీ రేసులో దూసుకుపోవడానికి జగదీష్ సిద్ధంగా ఉన్నాడు. అయితే అతను ఈ రోజు ఆడుతున్నాడంటే అదో కలే. ఎందుకంటే అతను ప్యాంగ్‌చాంగ్ (వింటర్ ఒలింపిక్స్ వేదిక)కు రావడమే పెద్ద ఆశ్చర్యం. గుల్‌మార్గ్‌లోని ఆర్మీ వార్‌ఫేర్ స్కూల్‌లో 2011లో స్కీయింగ్ నేర్చుకున్న జగ్‌దీష్.. గతేడాది డిసెంబర్లో వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఇలా అర్హత సాధించడానికి కూడా ఎంతో కష్టపడ్డాడు. విదేశాల్లో శిక్షణ పొందేందుకు, పోటీల్లో పాల్గొనేందుకు భారత శీతాకాల క్రీడల సమాఖ్యను ఎంతో వేడుకోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఫిన్లాండ్‌లో జరిగిన స్కాండియన్ కప్‌లో పాల్గొన్న అతను అర్హత ప్రమాణాన్ని అందుకున్నాడు. శీతాకాల ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తర్వాత.. అతనితో పాటు ఎవరిని కోచ్‌గా పంపాలా అన్న విషయంలోనూ సమాఖ్యకు, అతనికి శిక్షణ ఇచ్చిన ఆర్మీ స్కూల్‌కు సయోధ్య కుదరలేదు. దీంతో చివరి నిమిషంలో పోటీలకు వెళ్లే విమానాన్ని అందుకోలేకపోయాడు. చివరికి నదీమ్ ఇక్బాల్‌ను కోచ్‌గా ఎంపిక చేసి ప్యాంగ్‌చాంగ్ పంపించారు. పోటీలకు ముందుగా వెళితేనే అక్కడ పరిస్థితులకు అలవాటు పడే అవకాశం ఉంటుంది. కానీ అతను తన రేసుకు ఆరు రోజుల ముందు మాత్రమే దక్షిణ కొరియాకు వచ్చాడు. అంతేకాదు పోటీపడేందుకు జగదీష్‌కు సరైన కిట్ కూడా లేదు. భారత ఒలింపిక్ సంఘం, శీతాకాల క్రీడల సంఘం ఎలాంటి కిట్ ఇవ్వలేదు. తాను సొంతంగా రూ.72 వేలు పెట్టి బూట్లు, రేసింగ్ సూట్, జాకెట్ కొనుక్కున్నాడు. సొంతగా కొనుక్కోవడంతో దానిపై కనీసం భారత జెండా లేదా.. పేరు లేదు. ఇక్కడున్న కఠినమైన వాతావరణ పరిస్థితులకు అతని దగ్గరున్న కిట్ నిలిచేలాగే లేదు. బలమైన గాలులు వీస్తుండడంతో ఇప్పటికే చాలామంది అథ్లెట్లు గాయాలపాలయ్యారు కూడా. మరి ఈ స్థితిలో చాలీచాలని కిట్‌తో జగ్‌దీష్ ఎలా పోటీపడతాడో చూడాలి.





కాల్పులు జరిగిన డగ్లస్ పాఠశాల నుంచి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న పోలీసులు ■ పాఠశాల వద్ద ఆందోళనతో రోదిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



కాల్పుల్లో మృతిచెందిన విద్యార్థులు


మళ్లీ గర్జించిన
ఉన్మాదం

వాషింగ్టన్: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం పార్క్‌లాండ్‌లో దాదాపు 3వేల మంది చదివే మేర్జొరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్‌లో మారణహోమం చోటు చేసుకుంది. 19 ఏళ్ల నికోలస్ క్రూజ్ తుపాకితో విద్యార్థులపై కాల్పులు జరపడంతో 17మంది మృత్యుఒడికి చేరారు. క్రమశిక్షణారాహిత్యం కారణంగా అతడిని గత ఏడాది పాఠశాల నుంచి ఉద్వాసన పలికారు. ఈ పాఠశాలలో పెద్ద సంఖ్యలో భారత-అమెరికన్ విద్యార్థులు చదువుతున్నారు. క్రూజ్‌ను పాఠశాలనుంచి పంపేయడానికి కారణాలు తెలియరాలేదు. అతడిమాజీ గర్ల్‌ఫ్రెండ్‌కు సంబంధించిన కొత్త బాయ్‌ఫ్రెండ్‌తో ఘర్షణ వల్ల స్కూల్ యాజమాన్యం ఈ చర్యను చేపట్టిందని వార్తలు వచ్చాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ముఖానికి ధరించే గ్యాస్‌మాస్క్, ఏఆర్-15 సెమీ ఆటోమేటిక్ తుపాకీ, పొగను వెలువరించే గ్రెనేడ్లు, భారీగా మందుగుండు సామగ్రితో పాఠశాలలోకి క్రూజ్ చొరబడ్డాడు. ఎక్కువ ప్రాణనష్టం జరిగేలా చూడటానికి అగ్నిప్రమాద అలారమ్‌ను మోగించాడు. ఆ రోజు ఉదయమే పాఠశాలలో అగ్ని ప్రమాద సన్నాహక డ్రిల్ జరిగింది. దీంతో క్రజ్ మోగించిన అలారమ్‌ను కొందరు యాంత్రిక లోపంతో తలెత్తిందిగా భావించారు. మరికొందరు పరుగులు తీస్తూ బయటకు వచ్చారు. కాల్పులు తొలుత పాఠశాల వెలుపల, తర్వాత లోపల చోటు చేసుకున్నాయి. కాల్పుల ధాటికి భీతిల్లిన వందల మంది విద్యార్థులు, టీచర్లు వీధుల్లోకి పరుగులు తీశారు. కొందరు తరగతి గదిలో బెంచీల కింద దాగారు. తూటాలు తగిలిన వారు పిట్టల్లా నేలకూలారు. పాఠశాల ఆర్తనాదాలతో మారుమోగింది. వెంటనే పోలీసులు, అత్యవసర ప్రతిస్పందన దళం 'స్వాట్' బృందాలు రంగంలోకి దిగి విద్యార్థులను రక్షించారు. మారణహోమం జరిగిన గంట తర్వాత. . ఘటన స్థలానికి ఒక నివాస సముదాయంవద్ద క్రూజ్‌ను అరెస్టు చేశారు. క్రూజ్ మానసికస్థితి సరిగాలేదని బ్రోవార్డ్ కౌంటీ షెరీఫ్ స్కాట్ ఇజ్రాయెల్ స్కాట్ ఇజ్రాయెల్ తెలిపారు. కాల్పుల ఘటనకు ముందు అతడు సామాజిక మాధ్యమాల్లో భీతావహ అంశాలను పెట్టాడని వివరించారు. "అతడి వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల్లో కొన్ని అంశాలు చాలా భయానకంగా ఉన్నాయి" అని తెలిపారు.

ప్రశాంత స్థలిలో..: పార్క్‌లాండ్‌లో 31వేల మంది ఉంటున్నారు. గతఏడాది ఇది ఫ్లోరిడాలోని అత్యంత సురక్షితమైన నగరంగా గుర్తింపుపొందింది. 2012లో 26 మంది ప్రాణాలను హరించిన కనెక్టికట్ పాఠశాల కాల్పుల ఘటన తర్వాత అమెరికాలో చోటుచేసుకున్న అత్యంత ఎక్కువ మంది ప్రాణాలను హరించిన ఘటన ఇదే. ఈ ఘటనలో తన స్నేహితుడి కుమారుడు కూడా గాయపడ్డాడని తెలుగు మూలాలున్న భారత అమెరికన్ శేఖర్ రెడ్డి చెప్పారు.

ఇలా జరగకూడదు..: ఈ ఊచకోతలో బలైన వారి కుటుంబ సభ్యులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతాపం తెలిపారు. "అమెరికాలోని పాఠశాలల్లో ఇక ఏ విద్యార్థి, అధ్యాపకుడు అభద్రతకు లోనుకాకూడదు" అని ట్విటర్‌లో పేర్కొన్నారు.

మళ్లీ చర్చ: తాజా ఘటనతో అమెరికాలోని తుపాకీ సంస్కృతిపై నియంత్రణ విధించాల్సిన అవసరంపై మళ్లీ చర్చ మొదలైంది. ఇలాంటి కాల్పుల ఘటన జరగడం ఈ ఏడాది ఇది 18వసారి అని ఫ్లోరిడా సెనేటర్ క్రిస్ మర్ఫీ పేర్కొన్నారు. దేశంలో నిత్యం 46మంది చిన్నారులు కాల్పివేతకు గురవుతున్నారని, ఏడుగురు చనిపోతున్నారని కాంగ్రెస్ సభ్యుడు డొనాల్డ్ ఎంపేన్ పేర్కొన్నారు. అందువల్ల అమెరికా కాంగ్రెస్ తన అధికారాలను ఉపయోగించి, చిన్నారులు సురక్షితంగా ఉండేలా చూడాలన్నారు.



- విచ్చల విడిగా తుపాకుల వినియోగం
- ప్రపంచంలో 48 శాతం 'ప్రైవేటు తుపాకులు' అమెరికన్ల వద్దే

అమ్మోరికా!



తాజా కాల్పుల నేపథ్యంలో తుపాకీ సంస్కృతిపై మరోసారి చర్చ

తుపాకీ సంస్కృతి అమెరికాలో విశృంఖలంగా ఉంది. దేశంలో నిత్యం ఏదో ఒక మూలన కాల్పుల ధనాధన్‌లు వినిపిస్తూనే ఉంటాయి. అమెరికాలో ఎందరికి తుపాకులున్నాయి? వాటిని వారు ఎంత విచ్చలవిడిగా వాడుతున్నారు? ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు ఎన్ని? ఇత్యాది వివరాల్ని, ప్యూ పరిశోధన కేంద్రం అధ్యయాన్ని విశ్లేషిస్తే.. విస్తుబోయే వాస్తవాలు కళ్లకు కడతాయి.

- అమెరికాలో ప్రతి **100** మంది దగ్గరున్న తుపాకులు- **89**
- ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటు వ్యక్తుల దగ్గరున్న తుపాకుల్లో అమెరికన్ల వద్ద ఉన్నది- **48%** (దాదాపు **29** కోట్లు)
- గత 45 రోజుల్లో తుపాకీ కాల్పులు జరిగిన పాఠశాలలు- **18**
- 2017లో తుపాకులకు బలైన వారు- **12000** మంది.
- ఇంటిలో తుపాకుల మధ్యే పెరిగిన వారు- **48%** మంది
- ఏదో ఒకసారి తుపాకులున్న ఇంట్లో జీవించిన వారు- మూడింట రెండొంతుల మంది
- జీవితంలో ఏదో ఒక సమయంలో తుపాకుల్ని పేల్చిన వారు- **70%** మంది
- దేశంలో జరిగే హింసాత్మక ఘటనల్లో కాల్పుల్లో చనిపోయేవారు- **64%** మంది.
- కాల్పులకు కారణం- **70%** చేతి తుపాకులు

అతిపెద్ద కాల్పుల ఘటనలు

ప్రదేశం	సంవత్సరం	మృతులు
లాస్‌వేగాస్(నెవడా)	2017	58
ఓర్లాండో (ఫ్లోరిడా)	2016	49
వర్జీనియా టెక్(వర్జీనియా)	2007	32
శాండీహుక్(కనెక్టికట్)	2012	27
సదర్లాండ్ స్ప్రింగ్స్(టెక్సాస్)	2017	26
కిలీన్(టెక్సాస్)	1991	23
పార్క్‌లాండ్(ఫ్లోరిడా)	2018	17
శాన్ బెర్నార్డినో(కాలిఫోర్నియా)	2015	14



ఎంత ధరకు లభ్యం?

అసాల్ట్ రైఫిళ్లు
సుమారు **1500** డాలర్లు (రూ.**95,800**)

హ్యాండ్ గన్స్
సుమారు **200** డాలర్లు (రూ.**12,780**)

ఇక్కడ నిషేధాలు...

- బహిరంగంగా తుపాకులు పట్టుకుని తిరగడాన్ని నిషేధించిన రాష్ట్రాలు- *కాలిఫోర్నియా, ఫ్లోరిడా, ఇల్లినాయిస్, డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా*
- హ్యాండ్‌గన్స్(చేతి తుపాకులు) బహిరంగంగా పట్టుకుని తిరగకుండా నిషేధించిన రాష్ట్రాలు- *న్యూయార్క్, దక్షిణ కరొలినా*
- పెద్ద తుపాకుల్ని బహిరంగంగా పట్టుకుని తిరగకుండా నిషేధించిన రాష్ట్రాలు - మసాచుసెట్స్, మిన్నెసోట, న్యూజెర్సీ.

- ఒకటికి మించి ఆయుధాలున్న వారు- **66%**
- ఐదుకు మించి ఆయుధాలున్న వారు- **29%**
- హ్యాండ్ గన్‌లున్న వారు- **62%** మంది
- రైఫిళ్లున్నవారు- **22%** మంది
- షాట్‌గన్‌లున్న వారు- **16%** మంది

తుపాకీ చట్టాలపై జనాభిప్రాయం

సంతృప్తికరం......	39%
సంతృప్తిగా లేము, కఠిన చట్టాలుండాలి....	46%
చట్టాలు కఠినంగా ఉండొద్దు....	8%

- *దేశంలో తుపాకులుండాలని.. అవి దేశాన్ని సురక్షితంగా ఉంచుతాయని వాదిస్తున్నది – నేషనల్ రైఫిల్ అసోసియేషన్*

తుపాకులు కలిగి ఉండటానికి కారణాలు చెప్పిన వారు...



స్వీయ భద్రత- **67%** మంది
వేట కోసం- **38%** మంది
క్రీడా షూటింగ్‌ల కోసం- **30%** మంది

- ఈనాడు ప్రత్యేక విభాగం

విహారంలో పెను విషాదం

గో-కార్ట్ గొలుసులో జుట్టు ఇరుక్కోవడంతో మహిళ దుర్మరణం

పంచకుల: విహారయాత్ర ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సరదాగా సేదదీరేందుకు గో-కార్ట్ ఎక్కిన 28 ఏళ్ల మహిళ.. ఊహించనిరీతిలో ప్రాణాలు కోల్పోయింది. హరియాణాలోని పంచకుల జిల్లా పింజోర్ సమీపంలోని ఓ పార్కులో బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. పంజాబ్‌లోని బఠిండా జిల్లా రాంపుర ఫూల్‌కు చెందిన అమర్‌దీప్ సింగ్ తన భార్య పునీత్ కౌర్, రెండేళ్ల కుమారుడితో కలిసి పింజోర్ సమీపంలోని పార్కుకు వెళ్లారు. అక్కడ అమర్‌దీప్, పునీత్ సరదాగా గో-కార్ట్ ఎక్కారు. పునీత్ శిరస్త్రాణం ధరించినప్పటికీ.. ఆమె జుట్టు గో-కార్ట్ గొలుసులో ఇరుక్కుంది. గో-కార్ట్ వేగంగా ముందుకెళ్లడంతో భర్త, కుటుంబసభ్యులు, ఇతర సందర్శకులు చూస్తుండగానే పునీత్ జుట్టుతో పాటు తల పైభాగం ఊడిపోయింది. గాయపడ్డ ఆమెను ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు.

పెరుగుతున్న రాహుల్ ప్రభ

- **తదుపరి ప్రధానిగా ఆయనకే ఎక్కువమంది దక్షిణాదివాసుల మద్దతు**
- **సీఎస్‌డీఎస్ అధ్యయనంలో వెల్లడి**

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ప్రజాదరణ పెరుగుతోందని తాజా అధ్యయనం తెలిపింది. ప్రధాని మోదీ ప్రభ తగ్గుతోందని వెల్లడించింది. తదుపరి ప్రధానిగా రాహుల్‌కే ఎక్కువ మంది దక్షిణాదివాసులు మద్దతు పలుకుతున్నట్లు పేర్కొంది. లోక్‌నీతి సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) దీన్ని చేపట్టింది. 19 రాష్ట్రాల్లోని 175 నియోజకవర్గాలకు చెందిన 14,336 మంది దీనిలో పాల్గొన్నారు. దీనిలో అంశాల ప్రకారం..

- ముందస్తు ఎన్నికలు జరిగితే 34 శాతం ఓట్లు భాజపా కైవసం చేసుకునే అవకాశముంది.



ఇది 2014లో సంపాదించిన దానికంటే మూడు శాతం అదనం. అయితే 2017 మే అంచనాల కంటే ఐదు శాతం తక్కువ.

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ప్రతి నాలుగు ఓట్లలో ఒకదాన్ని కాంగ్రెస్ ఒడిసిపట్టే వీలుంది.
- ఎన్డీయే ప్రభుత్వానికి ప్రజాదరణ క్రమంగా తగ్గుతోంది. పశ్చిమ, మధ్య, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ప్రభావం కనిపిస్తోంది.
- గుజరాత్ ఎన్నికల ఫలితాల్లో వెల్లడైనట్లే.. గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ ముందంజలో ఉంది. నగరాల్లో మాత్రం భాజపా హవా కొనసాగుతోంది. రైతులు, వ్యాపారులు.. భాజపాపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. అంతేకాదు తమ సమస్యలను యూపీఏ మెరుగ్గా పరిష్కరించగలదని వారు భావిస్తున్నారు.
- భాజపా వెనుక నిలబడుతున్నవారిలో ఎక్కువ మంది యువతే (18 నుంచి 25ఏళ్ల వయసువారు) ఉన్నారు. గత ఎనిమిది నెలలుగా వీరి సంఖ్యా తగ్గుతూ వస్తోంది. ఉద్యోగాల కొరతే దీనికి ప్రధాన కారణం.
- దక్షిణాదిలో తదుపరి ప్రధాని రేసులో మోదీ (24 శాతం) వెనకబడ్డారు. ఇక్కడ 27 శాతం మంది రాహుల్‌కు మద్దతు పలుకుతున్నారు. మోదీ ప్రజాదరణ 2017 మేలో పతాకస్థాయికి చేరింది. ప్రస్తుతం ఇది 2014 మే స్థాయికి పడిపోయింది. మరోవైపు రాహుల్ ప్రభ రెట్టింపయ్యింది.

'ఇ-పాలన సదస్సు'కు వేయి మంది!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే ఇ-పాలన (ఇ-గవర్నెన్స్) జాతీయ సదస్సుకు దేశ నలుమూలల నుంచి వేయి మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన నగరంలోని హెచ్ఐసీసీలో జరిగే ఈ సదస్సుకు... రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిస్తోంది. ఇందుకు భారీగా ఏర్పాట్లు చేస్తోంది. జాతీయ సదస్సు చివరిసారిగా హైదరాబాద్‌లో 1997లో జరిగింది. తెలంగాణ ఆవిర్భవించాక జరుగుతున్న సదస్సు ఇదే. దీనికి కేంద్ర మంత్రులు, అన్ని రాష్ట్రాల ఐటీ మంత్రులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. సదస్సులో తెలంగాణ ముద్రను చాటేలా ఏర్పాట్లు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో అమలుచేస్తున్న పాలనా విధానాలు, సంస్కరణలు, మీసేవ, టీవాలెట్, టీహబ్, టాస్క్, హాక్ఐ, ఈపోస్ తదితరాలపై ప్రదర్శనలు ఇవ్వనున్నారు. సదస్సుకు హాజరయ్యే అన్ని రాష్ట్రాల ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం విందు ఇవ్వనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇతర మంత్రులు ఇందులో పాల్గొంటారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ విద్యార్థులకు ఊరట

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీల్లో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ రాయనున్న విద్యార్థులకు శుభవార్త. దరఖాస్తు రుసుంపై జీఎస్‌టీ ఉండదని అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యత తీసుకున్న ఐఐటీ కాన్పూర్ గురువారం ప్రకటించింది. మే 20న జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. దీనివల్ల గతేడాది జనరల్ విద్యార్థులకు రూ.2400 ఉన్న దరఖాస్తు రుసుం ఈసారి రూ.2,600కు పెరిగింది. బాలికలకు, ఇతరులకు రూ.1200 నుంచి రూ.1300లకు పెంచారు. దీనిపై జీఎస్‌టీ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలోని ప్రవేశ పరీక్షలకూ 18 శాతం జీఎస్‌టీ విధిస్తున్నారు. దానివల్ల అడ్వాన్స్‌డ్‌కూ 18 శాతం ఉంటుందని అంచనా వేశారు. ఇటీవల దిల్లీలో జరిగిన జీఎస్‌టీ మండలి సమావేశంలో అడ్వాన్స్‌డ్ పరీక్షకు జీఎస్‌టీ విధించరాదని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

చేవెళ్ల నుంచి కాంగ్రెస్ బస్సుయాత్ర

- **ఈనెల 26న ప్రారంభం**
- **బడ్జెట్ సమావేశాల ముందురోజు వరకు తొలి విడత పూర్తి**

హైదరాబాద్, న్యూస్‌టుడే : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్రకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ఈనెల 26 నుంచి తొలి విడత యాత్రను ప్రారంభించేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్‌కు సెంటిమెంట్ అయిన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచే మొదలుపెట్టాలని నిర్ణయించింది. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కూడా ప్రజాప్రస్థానం పాదయాత్రను చేవెళ్ల నుంచే ప్రారంభించిన విషయం విదితమే. ఈనెల 26 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఒకరోజు ముందు వరకు తొలి విడత బస్సు యాత్ర నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రతి రోజు రెండు నియోజకవర్గాలు: చేవెళ్లలో యాత్రను ప్రారంభించి..ప్రతి రోజు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున పర్యటించాలని, ప్రతి నియోజకవర్గంలో ఒక బహిరంగ సభ ఉండేలా మార్గ సూచి(రూట్ మ్యాప్) తయారు చేసే పనిలో టీపీసీసీ నేతలు నిమగ్నమయ్యారు. ఇందుకు సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీలో ముఖ్యనేతలు, బస్సు యాత్ర జరిగే తొలి విడత జిల్లాల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. బస్సు యాత్రలో రాష్ట్రస్థాయి ముఖ్యనేతలతో పాటు ఆయా జిల్లాల ముఖ్యనాయకులు, నియోజకవర్గాల నాయకులు విధిగా పాల్గొనేలా ప్రణాళికలు రచిస్తున్నారు. దీని ద్వారా కాంగ్రెస్‌లో వర్గాలు లేవని, నాయకుల మధ్య ఐక్యత ఉందని చాటే ప్రయత్నం చేయనున్నారు. బస్సుయాత్రలో ప్రధానంగా... మూడున్నరేళ్లలో తెరాస ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేస్తున్నారు.. దళితులు, రైతులపై పోలీసు దాడులు, అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టడం తదితర అంశాలను ఉదాహరణలతో సహా ప్రజలకు వివరించేందుకు ప్రాధాన్యమివ్వనున్నారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే అంశాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేయనున్నారు. బస్సుయాత్ర ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు నాయకుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా చిన్న పొరపాటు జరిగినా దాన్ని అధికార పార్టీ భూతద్దంలో చూపించే ప్రమాదం ఉంటుందని, అది పార్టీకి పెద్ద నష్టం కలిగిస్తుందనే భయం టీపీసీసీ నేతల్లో ఉంది. ఇలాంటి ఘటనలకు అవకాశమివ్వకుండా ఉండేందుకు టీపీసీసీ అధ్యక్షుడు ఇప్పటి నుంచే అన్ని జిల్లాల నేతలతో మాట్లాడుతున్నారు. బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మిగతా జిల్లాల్లో రెండో విడత బస్సుయాత్రను ప్రారంభిస్తారు.

మరణించిన తనయుడి శుక్రకణాలతో నాన్నమ్మగా మారిన మహిళ

పుణె: రెండేళ్ల క్రితమే మరణించిన తనయుడి శుక్రకణాల సాయంతో ఓ మహిళ నాన్నమ్మ అయ్యారు. కుమారుడి మృతితో కుంగుబాటుకు గురైన ఆమె ప్రస్తుతం ఆనంద సంద్రంలో మునిగితేలుతున్నారు. పుణెకు చెందిన రాజశ్రీ పాటిల్ కుమారుడు ప్రథమేశ్ పాటిల్. ఆయనకు 2010లో మెదడు క్యాన్సర్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో ఆయన రేడియేషన్, కీమోథెరపీ చికిత్సలను ఆశ్రయించారు. చికిత్స దుష్ప్రభావాల వల్ల శుక్రకణాలు దెబ్బతినే ముప్పుంది. దీంతో వైద్యుల సూచనల మేరకు ఆయన శుక్రకణాలను శీతలీకరించి భద్రపరుచుకున్నారు. 2016లో ఆయన మరణించారు. అనంతరం ఆయన శుక్రకణాలను దాత అండాలతో కలిపి ఫలదీకరణం చెందించారు. వీటిని వేరొక మహిళ గర్భాశయంలో ప్రవేశపెట్టారు. సరోగసీ విధానంలో సదరు మహిళ గత సోమవారం కవలలు (పాప, బాబు)కు జన్మనిచ్చింది. శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని రాజశ్రీ పాటిల్ తెలిపారు.

బీటీ వి'పత్తి'

- **పర్యావరణానికి పెనుముప్పుగా బీటీ-3**
- **కేంద్రం నిషేధించినా యథేచ్ఛగా దందా**
- **గద్వాల జిల్లాలో ఏటా రూ.వెయ్యి కోట్ల వ్యాపారం**

ఈనాడు డిజిటల్, మహబూబ్‌నగర్: విషతుల్యమని కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన బీటీ-3 విత్తనపత్తి దందా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో యథేచ్ఛగా సాగుతోంది. ఫౌండేషన్ విత్తనంగా కొన్ని కంపెనీలు స్థానిక రైతులకు అందిస్తున్నదీ బీటీ-3 రకమేనని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి అందించిన నివేదిక తేల్చిచెప్పింది. సోమవారం 'ఈనాడు' ప్రధాన సంచికలో దీనిపై కథనం వెలువడడంతో విత్తన కంపెనీలవారు, ఆర్గనైజర్లు చిక్కుల్లో పడ్డారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విత్తన పత్తి సాగుకు గద్వాల ప్రాంతం అనుకూలం. ఈ ప్రాంత విత్తన పత్తికి, దాని నాణ్యతకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. మూడు దశాబ్దాలుగా ఏటా ఈ ప్రాంతంలో దీని సాగు విస్తీర్ణం పెరుగుతూ వచ్చింది. దీంతో కొందరు బడా వ్యక్తులు అడ్డగోలు సంపాదనే ధ్యేయంగా విషతుల్యమైన బీటీ-3 ఫౌండేషన్ విత్తనాన్ని ఆర్గనైజర్ల ద్వారా రైతులకు అందించి సాగు చేయిస్తున్నారు. ఫౌండేషన్ సీడ్‌లో బీటీ-3 విత్తనాలున్నాయని తెలియకపోవడంతో రైతులు వాటిని సాగు చేస్తున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు: గద్వాల కేంద్రంగా ఏటా సుమారు 40 వేల ఎకరాల్లో విత్తన పత్తి సాగవుతోంది. వచ్చిన దిగుబడి నుంచి సుమారు కోటీ 20 లక్షల విత్తన ప్యాకెట్లు తయారు చేస్తారు. ఒక్కో ప్యాకెట్‌లో 750 నుంచి 1000 గ్రాముల వరకు విత్తనాలు ఉంటాయి. ఏటా సుమారు రూ.1,000 కోట్ల విత్తన పత్తి వ్యాపారం గద్వాల కేంద్రంగా జరుగుతోంది. నిబంధనల ప్రకారం బీటీ-3 అని గుర్తిస్తే ఆ విత్తనాలను కాల్చివేయాలి. ఇదే జరిగితే కంపెనీలు పెద్ద మొత్తంలో నష్టపోతాయి. అప్పుడు సాగు చేస్తున్న రైతులకు కూడా మొండి చేయి చూపే అవకాశముంది.



జనవరిలో గద్వాల జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న బీటీ 3 విత్తనపత్తి

సాగు చేయడం నేరం: నిషేధిత బీటీ-3 విత్తన పత్తి సాగును కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోంది. బీటీ-3 విత్తన సాగు చేస్తున్న కంపెనీలపై పర్యావరణ వ్యతిరేకం, ప్రభుత్వాన్ని మోసం చేయడం తదితర అభియోగాలతో చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులకు బెయిలు కూడా మంజూరు కాదు.

క్యాన్సర్ కారకాలు: బీటీ-3 విత్తనపత్తి సాగుతో పొలాలు విషతుల్యమై భూసారం దెబ్బతింటుంది. దూదిని తొలగించిన తర్వాత విత్తనాల నుంచి నూనెను తీసి లేబుళ్లు అంటించి మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈ పత్తి గింజల్లో హెర్బిసైడ్ టాలరెంట్ గ్లైఫోసేట్ అనే క్యాన్సర్ కారకాలుంటాయి. బహుళజాతి కంపెనీలు గతంలో ఉన్న బీటీ-2 విత్తనాలకు హెర్బిసైడ్ టాలరెంట్ గ్లైఫోసేట్ జన్యువును జొప్పించి బీటీ-3 విత్తనాలను అభివృద్ధి చేశాయి. ఈ జన్యుమార్పిడి పంటల నుంచి తీసిన నూనెలు, ఇతర పిండి పదార్థాలు పశువుల దాణాగా వాడినప్పుడు మనుషులపై ఎలాంటి ప్రభావం పడుతుందన్న దానిపై అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ (ఐఏఆర్‌సీ) పరిశోధనలు చేసి దీనిని క్యాన్సర్ కారకంగా గుర్తించింది. ఇలాంటి దాణా తిన్న పశువులిచ్చే పాలను మనుషులు తాగడం వల్ల శారీరకంగా తీవ్ర అనారోగ్య పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసిన కార్మికులు, రైతుల రక్తం, మూత్ర నమూనాలు తీసి పరిక్షించగా వాటిలో అమైనో ఆల్ఫా ఫ్యూరిక్ యాసిడ్ అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఇది కణజాల క్షయాన్ని ప్రేరేపిస్తుందని ఐఏఆర్‌సీ నిర్ధారించింది. ఈ కారణాలతోనే మన దేశంలో విషతుల్యమైన బీటీ-3 సాగును ప్రభుత్వం నిషేధించింది.

టిష్యూ పేపర్ నుంచి సెన్సర్ అభివృద్ధి

వాషింగ్టన్: ధరించడానికి వీలైన(వేరబుల్) పరికరాల తయారీరంగంలో శాస్త్రవేత్తలు కీలక ముందంజ వేశారు. శరీర కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించే సరికొత్త వేరబుల్ సెన్సర్‌ను టిష్యూ పేపర్ నుంచి అభివృద్ధి చేశారు. అమెరికాలోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన ఈ సెన్సర్.. గాయాలపై ధరించే పట్టీ పరిమాణంలో, తేలికగా ఉంటుంది. తాజా సెన్సర్ తయారీ ప్రక్రియలో భాగంగా శాస్త్రవేత్తలు.. కార్బన్ నానోట్యూబులతో కూడిన నీటిలో టిష్యూ పేపర్‌ను ముంచారు. అనంతరం దాన్ని తగిన పరిమాణంలో ముక్కలుగా చేశారు. కార్బన్ నానోట్యూబులు పేపర్‌కు ఎలక్ట్రికల్ వాహకతను కలిగిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. హృదయ స్పందనలు, నాడి కొట్టుకోవడం, కళ్ల కదలికలు వంటి అన్ని ప్రక్రియలను ఈ సెన్సర్ ద్వారా గుర్తించవచ్చునని వివరించారు.

క్యాన్సర్ కణాలను మట్టుబెట్టే అణువులు

లండన్: క్యాన్సర్ చికిత్సారంగంలో సరికొత్త ముందడుగు! కణితి కణాలను మట్టుబెట్టగల అణువులను శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. 60 రకాల క్యాన్సర్లకు మెరుగైన చికిత్సలను రూపొందించడంలో అవి దోహదపడతాయని అంచనా. మానవులు ఆరోగ్యంగా ఉండాలంటే 'సెలీనియమ్' అనే మూలకం అవసరం. సెలీనియమ్‌తో కూడిన 'థియోరెడాక్సిన్ రిడక్టేస్ 1' ఎంజైమ్.. ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కణాలకు రక్షణ కల్పిస్తుంది. ఊపిరితిత్తులు-రొమ్ము-మెడ క్యాన్సర్లతో బాధపడుతున్నవారిలో ఈ ఎంజైమ్ స్థాయిలు మితిమీరి ఉంటున్నట్లు గుర్తించారు. దీంతో 'థియోరెడాక్సిన్ రిడక్టేస్ 1'ను నిరోధించగల అణువుల కోసం అన్వేషణ నిర్వహించారు. 4 లక్షల రకాల అణువులను విశ్లేషించారు. వాటిలో 3 అణువులు సదరు ఎంజైమ్‌ను నిలువరించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు గుర్తించారు.

మిమ్మల్ని కలవకుండా ఉండలేను

- అరుణాచల్ ప్రజలను ఉద్దేశించి ప్రధాన మంత్రి వ్యాఖ్య
- రాష్ట్ర ప్రజల దేశభక్తికి ప్రశంసలు
- ఇటానగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నరేంద్ర మోదీ



గురువారం ఇటానగర్‌లో జరిగిన దోర్జిఖండూ స్టేట్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ఇటానగర్: సరిహద్దుల ఆవల నుంచి చైనా నిరసనల ఉరుములు వినిపిస్తున్న వేళ... ప్రధాని నరేంద్ర మోదీ అరుణాచల్‌ప్రదేశ్ ప్రజలు గొప్ప దేశభక్తులంటూ కితాబునిచ్చారు. ఎదురుపడిన ప్రతి ఒక్కరూ 'జైహింద్' అంటూ పలకరించుకుంటారంటూ తెలియజేశారు. తాను వారిని కలవక ఉండలేనని, అందుకే ఇక్కడకు వచ్చానని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ గురువారం అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ఇటానగర్‌కు రావటం ఇది రెండోసారి. గత ఏడాది చైనాతో డోక్లాం ప్రతిష్టంభన నెలకొన్న తర్వాత ఇక్కడకు రావటం ఇదే ప్రథమం. మోదీ అరుణాచల్‌ప్రదేశ్ పర్యటనపై చైనా ఓ ప్రకటన చేస్తూ ఆయన రాక వల్ల సరిహద్దు సమస్య మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరించింది. అయితే, ఇవేమీ లక్ష్యపెట్టని మోదీ... సంప్రదాయ గిరిజన తలపాగాను ధరించి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర నూతన సచివాలయ భవనాన్ని ప్రజలకు అంకితం చేశారు. తోమో రిబా ఆరోగ్య, వైద్య విజ్ఞాన సంస్థ భవనానికి శంకుస్థాపన చేశారు. డోర్జీ ఖాండూ సమావేశ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. దిల్లీ-నహర్లాగన్ ఎక్స్‌ప్రెస్ పేరును అరుణాచల్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చుతున్నట్లు ప్రకటించారు. వారానికి ఒకసారి నడిచే రైలును ఇకపై రెండుసార్లు నడపనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి పేమా ఖండూ మంచి దార్శనికతను కలిగి ఉన్నారని ప్రశంసించారు.

అరుణాచల్‌లో మోదీ పర్యటనపై చైనా అభ్యంతరం

బీజింగ్: అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. దౌత్య మార్గాల్లో భారత్‌కు తమ నిరసన తెలుపుతామని పేర్కొంది. అరుణాచల్ దక్షిణ టిబెట్‌లో భాగమని చైనా వాదిస్తోన్న సంగతి తెలిసిందే. భారత నాయకులు రాష్ట్రంలో పర్యటించనప్పుడల్లా ఆ దేశం అభ్యంతరాలూ చెబుతూవస్తోంది. గురువారం మోదీ పర్యటనపైనా స్పందించింది. "అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ప్రభుత్వం ఎప్పుడూ గుర్తించలేదు. ఈ వివాదాస్పద ప్రాంతంలో మోదీ పర్యటించడాన్ని మా దేశం వ్యతిరేకిస్తోంది. సరిహద్దు వివాదాలను జటిలం చేసేలా ఏ చర్యలూ తీసుకోవద్దని భారత్‌ను కోరుతున్నాం" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ తెలిపారు.

దిల్లీలో దోస్తీ... అగర్తలాలో కుస్తీ

- కాంగ్రెస్, వామపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం

అగర్తల/శాంతిబజార్: పోలింగ్ తేదీ సమీపిస్తున్న త్రిపురలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. విజయమే లక్ష్యంగా దూసుకెళుతున్న భారతీయ జనతా పార్టీ...వామపక్ష పాలనను తూర్పారపడుతోంది. గురువారం అగర్తల, శాంతి బజార్‌లలో భాజపా నిర్వహించిన రెండు ఎన్నికల సభల్లో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. కాంగ్రెస్, వామపక్షాలపై విమర్శలు సంధించారు. త్రిపురలో పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తున్న ఈ పార్టీలు దిల్లీలో మిత్రపక్షాలుగా పనిచేస్తుంటాయని ధ్వజమెత్తారు. రెండున్నర దశాబ్దాలుగా కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న త్రిపురలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని, రాజకీయ హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత ఏడాది 10 మంది భాజపా కార్యకర్తలు హత్యకు గురయ్యారని తెలిపారు. సీపీఎం నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వ అరాచకాలను బహిర్గతం చేస్తున్నారనే కక్షతోనే పాత్రికేయులపై దాడులు జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రాగానే వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామన్నారు. త్రిపురలో సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించిన కాంగ్రెస్ పార్టీ...తన సీనియర్ నేతలను ప్రచారానికి ఎందుకు పంపించలేదని మోదీ ప్రశ్నించారు.

అసోంలో కుప్పకూలిన వాయుసేన విమానం

- మంటల్లో చిక్కుకుని ఇద్దరు పైలట్ల మృతి

మజులి: భారత వాయుసేన (ఐఏఎఫ్)కు చెందిన తేలికపాటి విమానం ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరు పైలెట్లు దుర్మరణం పాలయ్యారు. అసోంలో నదీ ద్వీప జిల్లా అయిన మజులీలోని దర్బార్ చపోరిలో గురువారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. మృతులను వింగ్ కమాండర్లు జైపాల్ జేమ్స్, డి వాట్స్‌గా గుర్తించారు. జొర్హాత్ వైమానిక స్థావరం నుంచి రోజువారి విధులకు బయలుదేరిన కొద్ది సమయానికే విమానం ప్రమాదానికి గురైందని రక్షణ శాఖ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ హర్షవర్ధన్ పాండే తెలిపారు. అత్యవసర ల్యాండింగ్‌కు పైలెట్లు ప్రయత్నించగా విమానం బ్రహ్మపుత్ర నది వెంట ఉన్న ఇసుక తిన్నెల్లో కూలిపోయిందని, ఆ వెంటనే మంటలు చెలరేగటంతో వారు తప్పించుకునేందుకు వీల్లేకపోయిందని వివరించారు. ఆ ప్రాంతంలో పొగ వ్యాపించటంతో సమీప గ్రామాల ప్రజలు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు పాండే వెల్లడించారు.

రాష్ట్రంలో అధునాతన గిరిజన విశ్వవిద్యాలయం

- దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ
- కడియం శ్రీహరి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో అధునాతన వసతులు, ఆధునిక సాంకేతి పరిజ్ఞానంతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలన్న ఆలోచనలో ఉందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. అందుకు ఇందిరాగాంధీ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం సహకారం అవసరమని ఆయన కోరారు. ఎంపీ సీతారాంనాయక్‌తో కలిసి ఆయన మధ్యప్రదేశ్‌లోని అమర్‌కాంతక్‌లో విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించారు. అక్కడ ఓ సమావేశంలో మాట్లాడుతూ దేశంలో అత్యంత వేగంగా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని, రాజధాని హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా గొప్ప 'హ్యాపెనింగ్ సిటీ'గా పేరొందిందని చెప్పారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, టీహబ్ వంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అందరి మన్ననలు పొందుతున్నాయన్నారు. విద్యారంగంలో రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి టీవీ కట్టిమణి విశ్వవిద్యాలయంలోని వసతులను వివరించారు.

రాష్ట్రంలో పౌర సేవలన్నీ ఇక చరవాణిలోనే

- 'టీయాప్ ఫోలియో' యాప్ త్వరలో విడుదల

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని సమస్త పౌర సేవలను చరవాణి ద్వారా అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమయింది. 'టీయాప్ ఫోలియో' పేరిట కొత్త మొబైల్ యాప్‌ను విడుదల చేయనుంది. త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి రానుంది. పౌర సేవలన్నింటినీ ఒకే యాప్‌కి అనుసంధానం చేయాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ మేరకు ఐటీ అధికారులు దీన్ని రూపొందించారు. మొదట్లో 150 సేవలతో దీన్ని ప్రారంభిస్తారు. తర్వాత 600 సేవల వరకు విస్తరిస్తారు. చెల్లింపులు, దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాల నమోదు సహా అన్ని సేవలు దీనిలో ఉంటాయి. ప్రస్తుతం కర్ణాటకలో 'బెంగళూరు 1' పేరిట ఇలాంటి యాప్ అమల్లో ఉంది. దాని కంటే మెరుగ్గా ఈ యాప్‌ను అధికారులు రూపొందించారు.

గోదావరిఖనిలో మహిళ ఆత్మహత్య

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖని సీఎస్పీ కాలనీలో నివసిస్తున్న తూటి స్వాతి(35) గురువారం రాత్రి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం స్వాతి కూతురును ఇటీవల కొందరు బెదిరించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. కాగా గతంలో బెదిరించిన వారు గురువారం మరోసారి బెదిరించడంతో స్వాతి మనస్తాపం చెందింది. రాత్రి ఇంట్లో ఉరి వేసుకొంది. ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు.

మైనింగ్ అనుమతుల్లో జాప్యాన్ని నివారించాలి

- ప్రభుత్వం, పరిశ్రమ కలిసికట్టుగా వెళితేనే ఖనిజరంగ వృద్ధి
- మైనింగ్‌టుడే-2018 సదస్సులో వక్తల స్పష్టీకరణ

ఈనాడు, హైదరాబాద్: మైనింగ్ రంగంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వంతో పాటు మైనింగ్ వ్యాపారం చేసేవారి బాధ్యతా ఉందని.. సమస్యల్ని పరిష్కరించుకుని, సవాళ్లను అధిగమించడం ద్వారా ఖనిజ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేయాలని మైనింగ్ రంగ ప్రతినిధులు, నిపుణులు అభిప్రాయపడ్డారు. గనుల అనుమతుల ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలని కోరారు. 'మైనింగ్‌టుడే-2018' అంతర్జాతీయ సదస్సు, ఎగ్జిబిషన్ రెండోరోజు హైటెక్స్‌లో గురువారం కొనసాగింది. కేంద్ర బొగ్గుగనుల శాఖ మాజీ సలహాదారు డి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయని.. డిమాండ్‌కు సరఫరాకు మధ్య అంతరం ఉందని పేర్కొన్నారు. నీతిఆయోగ్ అంచనాల ప్రకారం విద్యుత్తు డిమాండ్ 2040 నాటికి 2.7 నుంచి 3.2 రెట్లకు పెరుగుతుందన్నారు. ఉత్పత్తి పెంచడంతో పాటు పర్యావరణానికి ఇబ్బంది రాకుండా గనుల తవ్వకాలు జరపడం సవాళ్లను ఎదుర్కొని మైనింగ్ రంగం ముందుకు సాగాలన్నారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ బి.ఆర్.వి.సుశీల్‌కుమార్ మాట్లాడుతూ మైనింగ్‌ను పరిశ్రమగా గుర్తించాలని కోరారు. గనుల లీజులో అటవీ, పర్యావరణ అనుమతుల్లో ఆలస్యం అవుతోందని, నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించకపోతే అనుమతి ఇచ్చినట్లుగానే విధానపరంగా నిర్ణయం జరగాలని కోరారు. ఆస్ట్రేలియాలో ఖనిజరంగ అభివృద్ధికి పన్ను రాయితీలు ఇస్తున్నామని, నిబంధనల్ని సరళీకరించామని ఆ దేశ పారిశ్రామిక, నవకల్పన శాస్త్రవిభాగ ప్రతినిధి రిచర్డ్ శామ్యూల్ చెప్పారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ బెంగళూరు విభాగం కోఛైర్మన్ డాక్టర్ టి.ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ గనుల తవ్వకాల్లో నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు, అక్రమాల ఫలితంగానే కేంద్రం వేలం పద్ధతిలో కేటాయింపు విధానం తెచ్చిందన్నారు. తాము అవలంబిస్తున్న పర్యావరణ అనుకూల విధానాలు, నర్సరీల పెంపు, మొక్కల పెంపకం గురించి సింగరేణి కాలరీస్ సంస్థ వివరించింది. ఆధునిక పరిజ్ఞానం, వినూత్న పద్ధతుల ద్వారా ఉత్పత్తిని పెంపు, ఖర్చు తగ్గించుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

గిట్టుబాటు ధరలకోసం రైతులు సంఘటితం కావాలి

- స్వరాజ్ ఇండియా పార్టీ నేత యోగేంద్రయాదవ్
- రుణ విముక్తి చట్టం అవసరం: కోదండరాం



సదస్సులో కోదండరాంతో యోగేంద్రయాదవ్. చిత్రంలో ప్రకాశ్‌పోప్లే

లాలాపేట, న్యూస్‌టుడే: వ్యవసాయరంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితుల్లో గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని స్వరాజ్ ఇండియా పార్టీ నాయకుడు, అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి (ఏఐకేఎస్‌సీసీ) జాతీయ కార్యవర్గ సభ్యుడు యోగేంద్రయాదవ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏఐకేఎస్‌సీసీ ఆధ్వర్యంలో 'కిసాన్ ముక్తి' సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన యోగేంద్రయాదవ్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర కోసం రైతులు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఐకాస ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. దేశంలో రుణ విముక్తి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పంటల ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నా, గిట్టుబాటు ధర మాత్రం లభించడం లేదనే విషయం ఐకాస అధ్యయనంలో తేలిందన్నారు. ఉద్యోగుల మాదిరిగానే రైతులు సంఘాలుగా ఏర్పడి జాతీయ స్థాయిలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఎన్డీఏ రైతు వ్యతిరేక విధానాలతోనే తాము ప్రభుత్వం నుంచి బయటకు వచ్చామని స్వాభిమానీ శేత్కారీ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.ప్రకాష్ పోప్లే తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కిసాన్ సంఘర్ష్ సమితి నాయకులు డా.సునీలం, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, రైతు స్వరాజ్ వేదిక నాయకుడు కిరణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో సంచలన తీర్పు

- ఎదురుకాల్పుల్లో పాల్గొన్న పోలీసులు న్యాయవిచారణకు హాజరుకావాలి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆదేశం



ఆజాద్ (పాతచిత్రం)

ఆదిలాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులంతా న్యాయవిచారణకు హాజరుకావాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి గురువారం ఆదేశించారు. సీబీఐ నివేదిక ఆధారంగా చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్‌ది బూటకపు ఎన్‌కౌంటర్ కాదంటూ గతంలో కిందికోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. 2010లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వాంకిడి మండలం సర్కేపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్, జర్నలిస్టు హేమచంద్రపాండేల ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు ప్రకటించారు. అది బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ ఆజాద్ సతీమణి పద్మ, హేమచంద్రపాండే భార్య బబిత తొలుత ఆదిలాబాద్ మున్సిఫ్ కోర్టును ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తు దస్త్రాలను పరిశీలించిన మున్సిఫ్ కోర్టు అది ముమ్మాటికీ ఎన్‌కౌంటరే అంటూ తీర్పు వెల్లడించింది. దీంతో పద్మ, బబితలు పై కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గురువారం వారితరపు న్యాయవాదుల వాదనలు విన్న కోర్టు ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన ఆధారాలను తిరిగి సేకరించాలని, 29 మంది పోలీసులను న్యాయవిచారణకు హాజరుపరచాలని స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో ఆసిఫాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ రఘునందన్‌ను ఏ1గా, తాండూర్ ఎస్సై రవీందర్‌ను ఏ2గా, ఆర్ఎస్సై మోహన్‌ను ఏ3గా నమోదు చేస్తూ, మరో 26 మంది పోలీసులు కాల్పులు జరిపినట్లు సీబీఐ గతంలోనే స్పష్టం చేసింది. ఇప్పుడు వీరంతా న్యాయవిచారణకు హాజరుకానున్నారు.

సీపీఎస్ రద్దుకు మార్చి 25న సకల ఉద్యోగుల మహాసభ

- తెలంగాణ ఉద్యోగ, అధికారుల సంఘాల ఐకాస నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని రద్దు చేసి, పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో మార్చి 25న సరూర్‌నగర్ స్టేడియంలో సకల ఉద్యోగుల మహాసభను నిర్వహించాలని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మిక సంఘాల ఐకాస నిర్ణయించింది. సమస్యల సాధనకు మరో పోరాటానికి సిద్ధమవ్వాలని తీర్మానించింది. గురువారం హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో ఉద్యోగ సంఘాల ఐకాస సమావేశం జరిగింది. దీనికి ఐకాస ఛైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి వి.మమత పాల్గొన్నారు. వీరిద్దరూ మాట్లాడుతూ.."కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఈ మహాసభ ద్వారా ఎండగడతాం. సీపీఎస్ రద్దుకు దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తూ రాష్ట్రప్రభుత్వ సహకారం కోరతాం. ఉద్యోగుల విభజన, తొమ్మిదో, పదో షెడ్యూళ్ల విభజన వంటి సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తాం. రాష్ట్రప్రభుత్వం మాకు ఇచ్చిన హామీల అమలును కోరతాం. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు నష్టపోయారు. వీటిని తీర్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నాం.' అని అన్నారు. నేతలు సత్యనారాయణ, మామిండ్ల రాజేందర్, మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, పద్మాచారి, మహిపాల్ రెడ్డి, రేచల్, ముజీబ్, కస్తూరి వెంకటేశ్వర్లు, కృష్ణయాదవ్, జూపల్లి రాజేందర్, జి.వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ సత్యనారాయణగౌడ్ హాజరయ్యారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00